# కథామంజరి


దీపావళి ప్రత్యేక సంచిక



నవంబర్ 2022

# కథామంజరి

## పది కథల సమాహారం



కథా మార్గదర్శి

జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకటరావు
ప్రచురణ కర్త

**నవంబర్ 2022**

సంపుటి : 3 ♦ సంచిక : 11



ఈ నెల కథామంజరి సంచిక,

**శ్రీ వి.వి.టి. నరసింహమూర్తి** గారు

తమ తండ్రి గారైన

కీ.శే. **వి. అన్నపూర్ణేశ్వరరావు** గారి

సంస్మరణార్ధం ఇచ్చిన విరాళంతో వెలువడినది.

వారికి మా హృదయపూర్వక

**కృతజ్ఞతలు**

# మా జట్టు

సంపాదకుడు
**జయంతి ప్రకాశ శర్మ**

ప్రచురణ కర్త
**అవసరాల వెంకటరావు**

సంపాదక సహకారం
**ఎం.ఏ. పద్మనాభరావు**
**కృపాకర్ పోతుల**

ప్రచురణా సహకారం
**ఎం.ఎల్. కాంతారావు**

సాంకేతిక సహకారం
**Harbinger Publishing**

బొమ్మలు
**కొయిలాడ రామ్మోహనరావు**
**కొచ్చెర్ల వి.ఆర్.**
**సూరంపూడి చలపతిరావు**



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి 'గళ' సహకారం అందించిన కళాకారులు

- శ్రీ పప్పు భోగారావు గారు
- శ్రీ వెంపటి కామేశ్వరరావు గారు
- శ్రీ భువనపల్లి రంగనాథం గారు
- శ్రీమతి కరవది సరస్వతి గారు
- శ్రీ బి.ఎస్. మూర్తి గారు
- శ్రీ అవసరాల రాఘవరావు గారు

**కథామంజరి నవంబర్ 2022 దీపావళి ప్రత్యేక శ్రావ్య సంచిక నవంబర్ 10వ తేదీన విడుదల అవుతుంది. గమనించ ప్రార్దన.**

కథ

# కథామంజరి దీపావళి కథల పోటీ 2022

కథామంజరి నిర్వహించిన దీపావళి కథల పోటీకి ఎప్పటిలాగే.. అనూహ్య స్పందన వచ్చింది. రెండు బృందాల వడపోత తర్వాత, ఎంపికైన కథలను న్యాయనిర్ణేతకి పంపడం జరిగింది. ఆయన పరిశీలన అనంతరం, ఏ కథా బహుమతి పొందే స్థాయిలో లేదనే వారి అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకుని, ఈ క్రింది కథలకు ప్రోత్సాహక బహుమతులు ప్రకటిస్తున్నాం.

1. అకాలం .. వెంకటమణి ఈశ్వర్
2. నీడ .. పెమ్మరాజు రామచంద్ర
3. అంతిమం .. స్ఫూర్తి
4. కనురెప్పలు .. సింగరాజు శ్రీనివాసరావు
5. ఆఖరి అంకె .. ఇరిగినేని హనుమంతరావు
6. అమ్మ జీతం .. డా. ఎమ్. సుగుణరావు
7. ప్రమోషన్ .. బి. నర్సన్
8. రైతు బిడ్డ.. కె. వి. మేఘనాథ్ రెడ్డి
9. అతుకుల బొంత .. చాగంటి ప్రసాద్
10. వసంతోపాఖ్యానం..ఉయ్యూరు అనసూయ
11. ఆ ఇద్దరు .. శరత్ చంద్ర
12. ధ్వంస రచన.. సింహప్రసాద్
13. తొంభై తొమ్మిది చుక్కలు.. గంటి రమాదేవి
14. మూడో కోరిక..కొయిలాడ రామ్మోహనరావు
15. సత్తెమ్మ చల్లకుండ.. జాస్తి రమాదేవి

## సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథలు

1. ఎంబాడిమెంట్ ఆఫ్ లవ్ (చిత్రా వెంకటేష్)
2. అంతస్తులు (పింగళి వెంకటరమణ రావు)
3. చీకటిలో.. కారు చీకటిలో (డా. చెల్లపిళ్ళ సూర్యలక్ష్మీ)
4. మా నాన్న నేరస్తుడు (కోనే ఎన్.వి. ఆంజనేయులు)
5. ప్రతిబింబం (పి. రాజేంద్ర ప్రసాద్)
6. తుమ్మల్లో వెలుగు (పి. వి. ఆర్. శివకుమార్)
7. తాండవం (తులసి బాలకృష్ణ)
8. జీవితాన్ని ప్రేమించే మనిషి (ఎన్. రాఘవేంద్రరావు)
9. క్షమ (తటవర్తి నాగేశ్వరి)
10. భారపు పగ్గాలు (పెనుమాక నాగేశ్వరరావు)
11. చట్టంతో కాపాడండి (ఓట్ర ప్రకాష్ రావు)
12. బొమ్మ బొరుసు (నామాని సుజనాదేవి)
13. ఆడ ఈడ (వసుంధర)
14. మాంగల్యం (భాగవతుల భారతీ)
15. గ్రీన్ స్పేస్ సొసైటీ (మణి వడ్లమాని)
16. అమ్మ ప్రేమ (లక్ష్మీ గాయత్రి)
17. అంకురార్పణ (వాణి శ్రీనివాస్ గొర్తి)
18. సంతోషానికి చిరునామా (కొత్తపల్లి రవికుమార్)
19. సహజ నటుడు (ఆదోని బాషా)
20. అనుకోకుండా ఈ రోజు.. (చామర్తి అరుణ)
21. పరువూ ప్రతిష్ట (శరత్ చంద్ర)
22. బంగారు తల్లి (నండూరి సుందరీ నాగమణి)
23. అమ్మకోసం (కొలిచిన జ్యోతిర్లత)
24. అర్ధాంగి (టి. గోపాలకృష్ణ)
25. ప్రేమార్ణవం (వాడపల్లి పూర్ణ కామేశ్వరి)
26. ఏనుగమ్మ ఏనుగు (వెంకట శివకుమార్ కాకు)
27. మేధావి (ఉగాది వసంత)
28. అపవాదు (ఘండికోట విశ్వనాధం)

**ప్రోత్సాహక బహుమతుల కథలతో దీపావళి ప్రత్యేక సంచిక నవంబర్ ఒకటో తేదీన విడుదల అవుతుంది**. సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథలను వీలు వెంబడి ప్రచురిస్తాం. పై కథలు తప్ప ఈ పోటీకి పంపిన మిగతా కథలు స్వీకరించడంలేదనే విషయాన్ని రచయితలు గమనించవలసిందిగా కోరుతున్నాం. ఈ విషయంలో ఎట్టి ఉత్తర ప్రత్యుత్తరములకు తావులేదనే విషయం గమనించవలసిందిగా కోరుతూ.. ఈ పోటీలో ఉత్సాహంగా పాల్గొన్న రచయితలకు, రచయిత్రిలకు ధన్యవాదాలు తెలుపుకుంటూ.. కథల ఎంపికలో సహకరించిన న్యాయనిర్ణేతలకు మా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం!

**కథామంజరి బృందం**

# ఇదీ వరస

## శీర్షికలు


| | | |
|---|---|---|
| కథాకీయం | | i |
| విశిష్ట అతిథి | | iii |
| కథా మార్గదర్శి | | v |


## కథలు, వ్యాసాలూ


| | | |
|---|---|---|
| అకాలం! | వెంకటమణి ఈశ్వర్ | 1 |
| ఆఖరి అంకె | ఇరిగినేని హనుమంతరావు | 5 |
| నీడ | పెమ్మరాజు విజయ రామచంద్ర | 14 |
| అంతిమం | విజయ కంఠస్ఫూర్తి | 20 |
| కనురెప్పలు | సింగరాజు శ్రీనివాసరావు | 25 |
| ప్రమోషన్ | బి. నర్సన్ | 30 |
| అమ్మ జీతం! | డా. ఎమ్. సుగుణరావు | 35 |
| రైతుబిడ్డ | కె. వి. మేఘనాథ్ రెడ్డి | 41 |
| అతుకుల బొంత | చాగంటి ప్రసాద్ | 46 |
| వసంతోపాఖ్యానం | ఉయ్యూరు అనసూయ | 51 |
| ఆ ఇద్దరూ... | శరత్ చంద్ర | 56 |
| ధ్వంస రచన | సింహ ప్రసాద్ | 63 |
| తొంభై తొమ్మిది చుక్కలు | గంటి రమాదేవి | 69 |
| మూడో కోరిక | కొయిలాడ రామ్మోహన రావు | 74 |
| సత్తెమ్మ చల్లకుండ | జాస్తి రమాదేవి | 79 |


ముఖచిత్రం : శ్రీ బాలి

# కథాకీయం

***సెప్టెంబర్ 17,18 మరియు అక్టోబర్ 2 వ తేదీలలో న్యూజిలాండ్‌లో జరిగిన 8 వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సులో మూడోరోజు ప్రారంభోపన్యాసంగా భవదీయుడు సమర్పించిన ఉపన్యాసం.. ఈ సంచిక "కథాకీయం".***

## తెలుగు కథకుడు

ఆధునిక తెలుగు కథ పుట్టిన తర్వాత.. నాటి నుండి నేటి వరకు కథా సాహిత్యంలో మార్పులు చేర్పుల మీద చాలా చర్చలు జరిగాయి. జరుగుతున్నాయి. అలాగే ఈ మార్పులు చేర్పుల మీద చాలా వ్యాసాలు, గ్రంధాలు వచ్చాయి. వస్తూనే ఉన్నాయి. అలాగే వీటి మీద పరిశోధనలు, పరిశీలనలు జరిగాయి, జరుగుతునే ఉన్నాయి. మారిన కాలమాన పరిస్థితులకు అనుగుణంగా తెలుగు కథా గమనం, కథా వస్తువు, భాష, శిల్పం. శైలి.. మొదలగు విషయాలలో మెరుగులు, తరుగులు చోటు చేసుకున్నాయి. ఈ నేపధ్యంలో తెలుగు కథని ముందు తరాలకి పదిలంగా ఎలా అందించాలి, మరో పది కాలాలు పాటు ఎలా బ్రతికించుకుని, బట్ట కట్టించాలనే విషయాలు తెలుగువారు ఆలోచించవలసిన సమయం వచ్చింది. అయితే మిగతా విషయాల జోలికి పోకుండా.. కథ సృష్టికర్త రచయిత.. అతని పాత్ర గురించే ఈనాటి నా వ్యాసంలో ప్రస్తావిస్తాను.

నాటి కథకుడి నుంచి, నేటి కథకుడి వరకు.. వారి ఆలోచనా రీతులు, వారి వారి మనోగతాలను పరిగణలోకి తీసుకుని మేధోమధనం జరగి, దిశ నిర్దేశం జరగాలని నేను ప్రగాఢంగా నమ్ముతూ, ఆ దిశలో పెద్దలందరూ ఆలోచించడానికి ఈ వేదిక కంటే మరో ఉత్తమమైన వేదిక దొరకదని భావిస్తున్నాను.

కథకుడు గురించి చెప్పుకునే ముందు, కథ గురించి సూక్ష్మంగా చెప్పుకోవాలి. ఏవేవో ఆలోచనలు మేధడులో చోటు చేసుకుని, కథా వస్తువుకి అంకురార్పణ జరిగి, కథగా అవతరించి, కథా రూపంలో అందించే ప్రక్రియతో కథకుడు పాత్ర మొదలవుతుంది. సమాజం పట్ల ఉండవలసిన బాధ్యతగానే భావించి, కథ ద్వారా సమాజంలో చైతన్యం తీసుకురావాలనే తపనతో రచయిత ముందడుగు వేసాడు. ఈ ఆలోచనలు చాలామందికే రావొచ్చు. అయితే వారి స్పందనలు వేరే రూపాంతరాలు దిద్దుకుంటాయి. అలా రూపాంతరాలలో అక్షరరూపం ఇవ్వగలిగే అదృష్టం కొందరినే వరిస్తుంది. అయితే అక్షరశిల్పి కావడానికి స్పందించే హృదయం ఉంటే సరిపోదు. తపన, భాషాపరిజ్ఞానం, సమాజ స్థితిగతుల మీద అవగాహన.. ఉండాలి. కొద్దో గొప్పో కృషి కూడా అవసరం ఉంది. వ్యవహారిక భాష జననం తర్వాత తెలుగు గెడ్డ మీద కొన్ని వందల మంది రచయితలు ఈ ఆలోచనలతోనే కలం పట్టారు. ఆధ్యాత్మిక కథలు నుంచి విప్లవపంథాలో నడిచే కథల వరకు.. అలనాటి కన్యాశుల్కం నుంచి సామాజిక అసమానతలు వరకు కనబడే ప్రతీ అంశం మీద రచయిత కలం ఝులిపించాడు. కాలానుగుణంగా వచ్చిన మార్పులలో మంచిచెడులను రచయిత బాహాటంగా కథారూపాల్లో సమాజానికి అందించాడు. రవి గాంచని చోటల్లా కథకుడు గాంచాడు. సమాజంలో మార్పుకు తనవంతు సేవలు అందించాడు. నవరసాలను అక్షరమాలలుగా అల్లి కథారూపాలలో అందించాడు. కాదేది కవితాకనర్హం అన్నట్టు కథాంశానికి అనర్హత అనేదే లేకుండా రచయిత కథల్లాడు. అలా.. అమితమైన ఇష్టంగా, అపురూపంగా కని, పెంచిన తన రచనను ఆ రచయిత మిక్కిలి గౌరవంగా చూసుకున్నాడు.

*బాలరసాల సాల నవపల్లవ కోమల కావ్యకన్యకన్*
*గూళలకిచ్చి యప్పడుపుఁగూడు భుజించుటకంటె*
*సత్కవుల్ హాలికులైన నేమి? గహనాంతర సీమలఁ గందమూల*
*కౌద్దాలికులైన నేమి నిజదారసుతోదర పోషణార్థమై.*

లేత చిగుళ్ళలా కోమలమైన కావ్యం అనే కన్యను అమ్ముకుని, నీచపు తిండి తినడం కంటే, నిజమైన కవి... తన భార్యాపిల్లల ఉదరపోషణ కోసం నాగలి పట్టిన వ్యవసాయదారుడైనప్పటికి తప్పులేదు, అడవీ ప్రాంతాలలో కంద దుంపలు, పుట్టతేనె లతో జీవించినా సరే తప్పులేదని పోతనగారు చెప్పినట్లు, మన రచయిత కూడా తన రచనలను పవిత్రంగానే ఉంచుకున్నాడు. ఇస్తే.. పారితోషకం తీసుకున్నాడే గాని, తన కథలను అమ్మకానికి పెట్టలేదు.

ఈ పరిస్థితి గతంలోనే కాదు, వర్తమానంలో కూడా ఉందనే చెప్పాలి. కొండకచో ఉదరపోషణార్థం అక్కడక్కడా రచయితలు ఘోస్ట్ రచయితలుగా అవతారం ఎత్తి, అక్షరమాలలను అమ్మకానికి పెట్టిన సందర్భాలు లేకపోలేదు. ముఖ్యంగా సినిమాలోకంలో ఈ పరిస్థితులు కనబడతాయి!

అలనాటి రచయితలు అప్పట్లో సమాజాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల మీద కలం ఝుళిపించి కథలు రాసారు. సమాజం పట్ల బాధ్యతగా కథలు రాసారు. అవి నచ్చని పాలకుల దగ్గర నుంచి ఇబ్బందులు ఎదురైన సరే, రచయితలు వెనుకడుగు వేయలేదు. కథ అంటే సమాజంలో ఉన్న న్యాయాన్యాయాలని ఎత్తి చూపడమేనా, ఒక 'ఇజం' మూసలోనే కథలు రావాలా, అవే కథలని గుర్తించాలా... అనే ప్రశ్నలు సహజంగానే వస్తాయి. అయితే ఏ రచయిత ఆ 'ఇజం' చట్రంలోనే కథలు రాయనక్కరలేదు. ఏ విషయం మీదనైనా నవరసభరితమైన కథలు రాయగలిగే సృజనాత్మకతను ఒడిసిపట్టుకుని కథలు రాయవచ్చు. ప్రకృతి నుంచి శృంగారం వరకు, పరిశోధనల నుంచి హాస్యం వరకు, రాజకీయ వ్యవస్థ నుంచి, కుటుంబ వ్యవస్థ వరకు, సాంప్రదాయాల్నుంచి సాయుధ పోరాటాల వరకు, మానవ సంబంధాల నుంచి దేశసమస్యల వరకు.. తెలుగు కథా రచయితలు ఏ విషయాన్నీ వదిలిపెట్టలేదు. నేటికీ ఈ ఒరవడి ఉందనే చెప్పాలి!

అయితే ఇప్పుడొచ్చిన సమస్య ఏమిటనేది ప్రశ్న!

పాతతరం రచయితలలో ప్రస్ఫుటంగా కనబడే 'చింతన', నేటి తరం రచయితలలో కనబడటం లేదని, లేదా ఆ చింతనలో మార్పు వచ్చిందనే వాదనలు వర్తమానంలో మనకి ఎక్కువగా వినబడుతున్నాయి.

ఈ సందర్భంలో మనం మన పూర్వికులలో కొంతమంది కథారచయితల మాటలను మరోసారి మననం చేసుకోవాలి.

"రచయిత తను రాస్తున్నది ఏ మంచికి హాని కలిగిస్తుందో, ఏ చెడ్డకు ఉపకారం చేస్తుందో అని ఆలోచించాలి. మంచికి హానీ, చెడుకు సహాయం చేయకూడదు!" అని రావిశాస్త్రిగారు చెప్పేవారు.

"కథ చెప్పడంలోనూ, పాత్రల చిత్రణలోనూ, పాత్రల స్వభావంలోనూ గుంభనకు ప్రముఖ స్థానం ఇవ్వాలి! అలాగే మనిషి తన చుట్టూ ఉన్న సమాజాన్ని అర్థం చేసుకోడానికి పరిశీలనాశక్తి ఒక్కటీ సరిపోదు. జనం పట్ల అమితమైన ప్రేమ ఉండాలి. వారి జీవిత ఆకాంక్షల పట్ల కూడా ప్రేమ ఉండాలి!" అనే విషయాలు కాళీపట్నం రామారావు మాష్టారి కథలు చదువుతుంటే తెలుస్తాయి.

"ఆయన కథల్లోని పాత్రలు ఘోరమైన కష్టాల్లో ఉండవు. మనసును కకావికలం చేసే విషాదాలూ కథల్లో ఉండవు. కథని

రమ్యంగా చెపుతారు. ఎంత కఠినమైన జీవితసత్యమైనా, అలగ్గా చులాగ్గా కథలో చెపుతారు. ఆయన వాక్యాలు చురుగ్గా, కరుగ్గా, నిష్కర్షగా, మొహమాటం లేకుండా ఉంటాయి గాని, అవి చెప్పేవి మాత్రం మృదువైన విషయాలు, ప్రియమైన సంగతులు!" అంటూ భమిడిపాటి రామగోపాలంగారి కథల గురించి నండూరి రామమోహనరావుగారు అంటారు.

"చెప్పదలుచుకున్న కథ, ఎంత తక్కువ మాటల్లో రాయగలిగితే అంత సామర్థ్యం ఉన్నట్టే.. అరటిపండు వలిచి చేతిలో పెట్టినట్లు విషయాన్ని అందించాలి. అప్పుడే కథ చదివేవారిని ఆకర్షిస్తుంది!" అంటూ ఇల్లిందల సరస్వతీదేవిగారు చెప్పేవారు.

"రచయిత ఒక 'దృష్టి'ని ఏర్పరచుకోవాలి. ఆ దృష్టి మనిషిని అసత్తు నుంచి సత్తులోకి, చీకటి నుంచి వెలుగులోకి తీసుకెళ్ళేదిగా వుండాలి. అందుకు సృజనాత్మక కృషి రచయితకి అవసరం. అవి సాధించినవాడు.. తప్పకుండా ప్రజల గుండెల్లో ఉన్నతంగా నిలుచిపోతారు!" అంటూ బలివాడ కాంతారావుగారు వర్ధమాన రచయితలకు హితవు చెప్పేవారు.

"కథల్లోనూ, నవలల్లోనూ కొన్ని విషయాలను తడమడానికి, సంక్షిప్తంగానైనా చర్చించడానికి సమయం సందర్భం ఉండాలి. లేకపోతే అవి కృత్రిమంగా బలవంతంగా లాక్కొచ్చి ప్రవేశపెట్టినట్టుగా ఉండి, పాఠకులకు అవగాహన బదులు విసుగు కలిగిస్తాయి. అలాకాకుండా సందర్భోచితంగా ఉంటే పాఠకుడి అవగాహన పెంచి, ఆశించిన ఫలితాన్ని ఇస్తాయి!" ఈ విషయాలు మునిపల్లె రాజుగారి కథల్లో కొట్టొచ్చినట్లు కనబడతాయి.

"మనం రాసే కథా వస్తువులో నిజాయితీ కనబడాలి. బాగా తెలిసిన జీవితం, బాగా మథనపెట్టిన ఆలోచనలే కథా వస్తువుగా ఉండాలి. మనకు తెలియని జీవితాలు, ఎవరో ప్రతిపాదించిన ఆలోచనలు.. కథలలో ఇమిడిస్తే, అవి పొరపాటున కూడా ప్రతిఫలించవు. రచయిత నిజాయితీకి ఇదే కొలమానం!" అనే అబ్బురపరిచే విషయాలు అబ్బూరి ఛాయాదేవిగారి కథలు చదివితే గోచరిస్తాయి.

ఇలా ఒకరేమిటి.. ఎందరో తెలుగు కథకులు ఎన్నో సూచనలు అందించారు. వారితో పాటు వారు సృష్టించిన పాత్రలు కూడా ఇప్పటికి చిరంజీవులుగా ఉన్నాయంటే, వారి కథలలో శైలి, గమనం, నిగూఢంగా కనబడే ఓ సందేశం.. ఇలా ఎన్నో లక్షణాలు కనబడతాయి. వాటి వెనుక ఆ రచయితల జ్ఞానసంపద మెరుస్తుంది. వాడుక భాష మీద ఉన్న పట్టుతో తాను నమ్మిన సిద్ధాంతాల మీద ఉన్న చిత్తశుద్ధి, నిబద్ధత కనబడుతాయి.

ఒకప్పటి రచయితలు ఆయా దేశ కాలమానా పరిస్థితులలో స్వయంగా అనుభవించిన ఆర్థిక, సాంఘిక సమస్యలు, చుట్టూ ఉన్న సమాజం, రాజకీయ సంక్షోభాలను స్వయంగా రుచి చూశారు. ముఖ్యంగా సమాజంలో జరిగే అన్యాయాలను, దురాచారాలను నిర్మూలించాలనుకోవడం వంటి విషయాలమీద, వారిలో మానసికంగా లోనైన ఆ అంతర్గత, బహిర్గత ఘర్షణల వలన మంచి కథలు రావడానికి ఒక కారణం అయింది. ఒకరకమైన ఆదర్శవాదం, దానికి కావలసిన చిత్తశుద్ధి ఉండేది. ఇప్పటి కాలంలో ఇవి కరువవుతున్నాయి. సమస్యలు లేవని కాదు. వాటి రూపురేఖలు, తీవ్రత తక్కువైంది.

అలాగే ఒకప్పుడు కొంత మంది రచయితలు డబ్బుకోసమే రాశారు. సినిమాల కోసం రాసే కథలు, నవలలు రాసేవారు. ఇప్పుడు కథలు విరివిగా ఉండడం వల్ల సినిమావాళ్ళే కథలు, మాటలు రాసుకుని, దర్శకత్వం కూడా చేస్తున్నారు.

అయితే ఇప్పటి రచయితలకు వచ్చే పారితోషికం పెద్దగా మమకారం లేదు, కానీ వాళ్ళకు కలిగేదల్లా స్వయం తృప్తీ. దాంతో తృప్తి చెంది, మంచి సాహిత్యం రాయాలనే దృష్టి వాళ్ళకు రావడం లేదు. చాలమందిలో రాసే శక్తి, ఆలోచన, చిత్తశుద్ధి కూడా ఉండటం లేదు.

అప్పట్లో కథావస్తువుపై పరిశీలన చేసి రాయగలిగే సమయం ఉండేది, లేకపోతే చేసుకునేవారు. ఇప్పుడు ఆ సమయం తీసుకోగలిగే ఆలోచన కరువైంది. ఆ అవసరం లేదని అనుకుంటున్నారు. 'మేం మనుషులను చదివి రాస్తున్నాం. అంతకంటే ఏం కావాలి?' అంటూ వాదించే ఈ తరం వారికి అర్థం కాని విషయం ఒకటే. మనుషులు మరణించినా, మరణం లేనిది కథే! వందేళ్ల తెలుగు కథ ఇప్పటికీ అజరామరంగా ఉందంటే, ఆ కథ వెనుక ఆ రచయితలు పడ్డ శ్రమ తెలియాలి. ఎన్ని పుస్తకాలు చదివారో, సమాజాన్ని ఎంతలా చదివారో తెలుసుకోవాలి!

దురదృష్టం ఏమిటంటే.. 'రాసిన ప్రతీ కథా బహుమతి కోసం రాసాం' అనే భావన నేటి రచయితలలో ఎక్కువగా నాటుకుపోయింది. ఈ తరం వారికి డబ్బు ప్రధానం కకాకపోవచ్చు.. అయితే ఏమిరాసినా ప్రచురించడానికి సాంఘిక, సాహిత్య మాధ్యమాలున్నాయి. అవికూడా ప్రచురించకపోతే స్వంత బ్లాగులున్నాయి. అంచేత సాహిత్యానికి విస్తృతి కలిగింది, ఏది కావాలంటే అది ప్రచురించే అవకాశం వచ్చింది. బహుమతి ఉన్నా లేకపోయినా, బహుమతి కేవలం స్వయం తృప్తే!

అయితే మరోవైపు పరిశీలిస్తే.. "కథల్లో నాణ్యత ఉన్నా, లేకపోయినా పోటీలకు పుంకాను పుంకానుగా కథలు వస్తుంటే, మిగతా సమయాల్లో అసలు కథలు రావడం లేదనే" పత్రికల వారి ఆవేదన కనబడుతున్నది. "నా కథ.. పోటిలో బహుమతికి ఎంపిక కాకపోతే సాధరణ ప్రచురణ చెయ్యొద్దనే" అనే ఆంక్షలు కనబడుతున్నాయి. రచయిత తన మీద తనకు ఎక్కువ నమ్మకం పెట్టుకోవచ్చు, కానీ కథకీ మిగతా ప్రపంచం ఉందనే విషయం గుర్తుపెట్టుకోవాలి.

ఈ సందర్భంలో కథ గురించి ఓ పెద్దాయన మాటలు గుర్తుకొచ్చాయి. అవి..

కథ.. మదిలో మెదిలినప్పుడే వ్రాయాలి.

కథ.. నమ్మిన సిద్ధాంతాలకు ప్రతీకగా ఉండాలి!

కథ.. పాఠకుల మదిలో గూడు కట్టుకోవాలి!

రాసి కంటే వాసి ముఖ్యమని తెలుసుకుని రచనలు చేసినప్పుడే, తెలుగు కథకి పూర్వ వైభవం వస్తుంది!


చివరిగా ముఖ్యమైన మరో విషయం చెప్పాలి! ఆటగాడు, పాటగాడు, నటుడు... వీరి కోవకు చెందిన వాడే రచయిత కూడా! అయితే వారికి దక్కుతున్న 'సెలెబ్రిటీ' గౌరవం రచయితకు దక్కడం లేదు. వారు ఎంత కృషి చేస్తారో, రచయిత కూడా అంత కృషి చేస్తాడు. ఇంకా సూటిగా చెప్పుకుంటే.. ఓ సినిమాకు మంచి కథ, సంభాషణలు అందించే రచయితకు.. ఆ సినిమా విజయంలో గుర్తింపు వుండదు. మంచి ఆదరణ పొందే పాటకి.. గాయకుడ్ని, సంగీత దర్శకుడ్ని మెచ్చుకుంటారు గాని ఆ పాట రచయితకి పేరు రాదు. ఈ దుస్థితికి కూడా 'మందు' కనిపెట్టాలి! రచయితని కూడా ముందు వరసలో నిలబెట్టిన నాడు... తెలుగు కథ మరింత వెలుగులను విరజిమ్ముంది!

అందుకు.. అందరూ తలో చెయ్యి వేయాలి!!

స్వస్తి!

**సంపాదకుడు**

# విశిష్ట అతిథి



## శ్రీ జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి

అక్షరాలను పొదిగి, పదాలుగా అమర్చి, రసాత్మకంగా వాక్యాలుగా మలిస్తే, అవి మంచి కవితలగానో కథలగానొ పాఠకులను అలరిస్తాయి. సేద్యం చేసినట్టో, క్రోటన్ మొక్కలను అందంగా కత్తిరించినట్టో.. ప్రతీ పదాన్ని అందంగా అమర్చి అందించే కథలు చదువుతున్నప్పుడు, మనసు అసంకల్పితంగా ఎక్కడో ఏదో భావనతో పయనిస్తుంది. అలా కథలు, కవితలు అందించే అతి కొద్దిమంది ఇప్పటి రచయితలలో చెప్పుకోదగ్గ రచయిత శ్రీ జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి గారు. చెప్పాలంటే ఆయన రాసినవి ఓ ఎనభై కథలు, ఓ నాలుగైదు నవలలే. రాసి తక్కువైనా వాసితో నిండైనవి రాసారు, రాస్తున్నారు. అయితేనేం రాసిన వాటిలో సగంపైన బహుమతులు అందుకున్నవే! "ఏ సాహిత్యప్రక్రియ అయినా సమాజానికి అద్దం పట్టాలని అంటారు. కానీ సాహిత్యం అంటే అద్దం కాదు, అది ప్రాథమిక అవగాహన మాత్రమే! సాహిత్యం అంటే సమాజానికి దారి చూపెట్టే దీపంలా ఉండాలి!" అని అంటారు రామచంద్రమూర్తి గారు. ఆ సిద్ధాంతాన్ని పూర్తిగా నమ్మి, ఆ దీపం దారిలో ఎక్కువ ఆలోచించి, తక్కువ రాసారు. బహుశా ఈ ఆలోచనలకు కారణం ఆయన పుట్టి పెరిగినప్పటి వాతావరణ స్థితిగతులనే చెప్పాలి. ఆయన గురించి తెలుసుకున్నప్పుడు చాలమంది మహనీయులు గుర్తుకువస్తారు. చిన్నతనంలో చిలిపి చేష్టలు, చిరు దొంగతనాలు.. జీవిత లక్ష్యాలను నిర్దేశించుకోవలసిన వయసులోనే ఇంట్లోంచి పారిపోవడం.., తర్వాత అంకంలో.. ఆ జీవితం నేర్పిన జీవిత పాఠాలతో చదువుకోకపోయినా చదువు చెప్పడం, సాహిత్య గంధం లేకుండానే సాహితీవేత్త కావడం, కోస్తాలో పుట్టి సీమ మాండలికంలో రాసి మెప్పించడం, కన్నడంలో కూడా రచయితగా గుర్తింపబడటం.. ఇలా అన్నీ రామచంద్రమూర్తి గారి ప్రత్యేకతలే అని చెప్పాలి. సంస్కృతాంధ్రాంగ్ల భాషలలో బహుముఖ ప్రజ్ఞాశాలి, ప్రముఖ సాహితీవేత్త శ్రీ జొన్నవిత్తుల రామకృష్ణ శర్మగారి నాలుగో సంతానంగా పుట్టిన రామచంద్రమూర్తి గారి పునాది చాలా గట్టిది. రెండేళ్ళ వయసులోనే మాటలతో పాటు పద్యాలనీ శ్లోకాల్నీ అవలీలగా అప్పచెప్పేవారుట. ఆ ప్రజ్ఞకి తోడు వారుండే ఇంటికి 'తెలకోవెల' అనే పేరు ఉండేది. అంటే జ్ఞానమందిరం అని అర్థం. ఆ ఆవాస వాసనలు బాగా శరీరానికి వంటబడ్డాయి. అందుకేమో.. చదువులో వెనుకబడ్డా, ఇంటికి దూరమయిన ఏడేళ్ల కాలంలో ఎన్నో జీవితసత్యాలు, అనుభవాలు.. ఒకటేమిటి అన్ని రససారాలు అనుభవంలోకి వచ్చాయి. అవే.. రామచంద్రమూర్తిగారిని ఓ మంచి రచయితగా తీర్చిదిద్దాయి! ఓ పాఠశాల పెట్టి, తాను చదువుకుంటూ పిల్లలకి పాఠాలు చెప్పడం, ఆ విద్యను(?) కూడా పిల్లలకి నేర్పడం.. ఇలాంటి ప్రయోగాలు సత్ఫలితాలు సాధించడం.. అవన్నీ తిరిగి

మంచి జ్ఞాపకాలుగా మిగిలిపోయిన తర్వాత రచనారంగప్రవేశం చేసారు.

రామచంద్రమూర్తిగారు.. విద్యకు సంబంధించి సాధించిన అవగాహనతో "విద్యారంగం" పేరిట వ్యాసాలు రాసి, సాహిత్యరంగంలో అడుగుపెట్టి, ఆ అనుభవంతో "భూమి గుండ్రంగా ఉండును" అనే కథ రాసి పత్రికకి పంపితే పేరుకి తగ్గట్టే, తిరిగొచ్చేసింది. దాదాపుగా పత్రికలన్ని అదే పని చేస్తే, చివరికి ఆ కథలో మార్పులు చేసి మొదటి పత్రికకే పంపారు. ఆ కథ "ఉదయం" ఆదివారం అనుబంధంలో ఉదయించింది. రాసిన మూడో కథ "వంజె" కథకి అప్పాజోస్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్ వారి కథల పోటీలో బహుమతి రావడం, అలాగే మొదటి నవల "వలసదేవర" కు అమెరికన్ తెలుగు అసోసియేషన్ వారి నవలల పోటీలో మొదటి బహుమతి రావడం.. ఇలా రాసుకుపోతే విజయాల గురించి మరో రెండు పేజీలు రాయొచ్చు! సినిమా రచనకు సంబందించి ఏం తెలియని వయసులో సినిమా రచయితగా చేరడం, అక్కడ సరిపడక కన్నడ బుల్లితెరకి మారారు. అప్పుడు కన్నడం మాట్లాడటం, చదవడం, రాయడం కూడా నేర్చుకుని, అక్కడ కథావిభాగంలో కొన్నివందల కార్యక్రమాలు నిర్వహించారు. ఆటవెలది, తెలుగు పతాకం, గుండెలలో నెలకొన్న..., చిల్లపెంకులు, పంచన్ నామా, వలసదేవర, సంచలనం, ఉత్తయ్య సింహాసనం, సిద్దుల మర్రి వంటి కథలతో ది డెత్ ఆఫ్ లాస్ట్ ఇండియన్, ఈ కథకు శిల్పం లేదు, జొన్నవిత్తుల చదువు కథలు.. వంటి కథాసంపుటలు వెలువడ్డాయి. వలసదేవర, జంగమదేవర, అంతర్యామి, సాక్షాత్కారం, రెండు కలల దేశం.. నవలలు, బహుబలి, భలే తాత మన బాపూజీ.. వంటి అనువాదాలు రామచంద్రమూర్తి గారి కలం నుంచి జాలువారాయి. శంకరాభరణం సినిమాని రెండు రోజుల్లో పదిసార్లు చూసిన రికార్డు ఆయనకుంది. తల్లిగారంటే చాల ఇష్టమని చెప్పే రామచంద్రమూర్తి గారు ఇల్లు కడితే దానికి "తెలకోవెల" అని పేరు పెట్టాలనే నిర్ణయం తీసుకున్నారంటే, ఆయన సాహితీ అభిరుచి గురించి వేరే చెప్పక్కర్లేదు. "మనం ఎన్ని భాషలైనా నేర్చుకోవచ్చు.. కాని సాహిత్యం విషయంలో మాత్రం మనం ఏ భాషలో రాస్తున్నామో, ఆ భాషలో ఆలోచించి రాయగలగాలి. అంతేగాని ఒక భాషలో ఆలోచించి, మరో భాషలో రాస్తే జవజీవాలుండవు!" అని ఖచ్చితంగా తన అనుభవాల గురించి చెప్పుకునే శ్రీ జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి గారు, కథామంజరి నిర్వహించిన దీపావళి కథల పోటీకి న్యాయనిర్ణేతగా వ్యవహరించి, తన అభిప్రాయాన్ని నిక్కచ్చిగా అందించారు. బహుమతి స్థాయిలో ఏ కథా మెప్పించలేదనే వారి అభిప్రాయాన్ని శిరసావహిస్తూ, మొదటి మూడు బహుమతులు లేకుండా, పదిహేను కథలకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తూ నిర్ణయం తీసుకున్నాం. ఈ నిర్ణయం వెనుక ఉన్నది.. నేటి తెలుగు కథ మీద ఆవేదన మాత్రమే! వారికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటూ, వారి కలం నుండి మరిన్ని కథలు, నవలలు రావాలనీ అభిలషిస్తూ.. నమస్సులతో

***కథామంజరి బృందం.***

# కథా మార్గదర్శి



**శ్రీమతి మాలతి చందూర్**

ఒకప్పుడు 'ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక' చేతిలో పడగానే, పాఠకులు గబగబా పేజీలు తిప్పి, "ప్రమదావనం" అనే శీర్షికను ముందుగా చదివేవారు. ఆ శీర్షికలో చరిత్ర, ఇతిహాసం, రాజకీయాలు, సైన్స్, సాహిత్యం, వంటా వార్పు, అల్లికలు, జీవితం.. ఒకటేమిటి.. అన్నింటి మీద ఆసక్తిదాయకమైన విషయాలను ప్రశ్న–జవాబులు రూపంలో విపులంగా హృదయాన్ని హత్తుకునేటట్టు ఉండేవి. సుమారు అర్ధశతాబ్ధి పాటు నిరాటంకంగా సాగిన ఈ శీర్షికను నిర్వహించిన విజ్ఞానగని శ్రీమతి మాలతీ చందూర్ గారు. వారానికి సుమారుగా రెండువేల ఉత్తరాలు చదివేవారుట.. ఒకే కుటుంబంలో మూడు తరాల వారితో పరిచయాలు ఈ శీర్షిక ద్వారానే జరిగిందిట. ఈ శీర్షికలో ప్రశ్న, జవాబుల చదివి, స్ఫూర్తితో చాలామంది సివిల్స్ పరీక్ష రాసి, ఎంపిక అయ్యారుట! అలా ఓ శీర్షిక ద్వారా గిన్నెస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు లో అడుగుపెట్టిన మాలతీ చందూర్ గారి మొట్టమొదటి కథ "రవ్వల దుద్దులు". ఆరుద్రగారు సంపాదకుడుగా ఉన్న 'ఆనందవాణి' వారపత్రికలో ఈ కథ వచ్చింది! చెప్పే కథా కథనంలో, ఇతివృత్తంలో ఓ ప్రత్యేకమైన శైలిని ఏర్పరుచుకున్న ఓ విశిష్ట రచయిత్రి మాలతీ చందూర్ గారు! వంద కథలు, ఏభై వరకు నవలలు, అనువాద నవలలు రాసిన మాలతీ చందూర్ గారి "వంటలు– పిండివంటలు" పుస్తకం.. ముప్ఫై సార్లు ముద్రణ జరిగింది. ప్రపంచ సాహిత్యాన్ని కాచివడబోసిన అనుభవంతో, తాను చూసిన ప్రపంచాన్ని అందంగా అక్షరరూపంలో ఆవిష్కరణ చేయగలిగే సత్తా ఉన్న రచయిత్రి మాలతీ చందూర్ గారే అని ఘంటపధంగా చెప్పవచ్చును.

"కొందరి జీవితాల్లో మైనస్సులు ప్లస్సులుగా తయారవుతాయి. నా విషయంలో అది ఋజువైంది కూడా! కాలేజీలకు, యూనివర్సిటీలకు వెళ్లి చదువుకునే పరిస్థితులు మా ఇంట్లో ఉండేవి కావు. కాని మా ఇంటికి దగ్గరగా "కథావీధి" అనే పత్రిక ఉండేది. అక్కడికి విశ్వనాథ సత్యనారాయణ, కృష్ణశాస్త్రి, కొనకళ్ల వెంకటరత్నంగారు, నండూరి సుబ్బారావు, వెంకటాచలం, కావలి లక్ష్మీనరసింహం, .. మొదలగు పెద్ద పెద్దవాళ్ళు వచ్చేవారు. ఆనందవాణి పత్రిక వచ్చేది. అక్కడ నిత్యం సాహిత్యగోష్ఠి ఉండేది.. అదిగో ఆ వాతవరణమే నన్ను తెలుగుసాహిత్యం మీద మక్కువ చూపించడానికి దోహదపడింది!" అంటూ తన సాహితీ ప్రస్థానం గురించి చెప్పేవారు. మాలతీ చందూర్ గారు మొదట్లో వ్యాసాలు రాసేవారు. 1950 దశకంలో ఆవిడ వ్రాసిన మొదటి కథ "రవ్వల దుద్దులు". ఆ రోజుల్లోనే స్త్రీల సమస్యల మీద బాహాటంగా కథలు వ్రాసారు. స్త్రీజాతి విద్య,

ఉద్యోగం, జీవితం, సంఘర్షణలు, కట్టుబాట్లు, స్వతంత్రంగా నిలబడాలన్న ఆకాంక్ష, ఆత్మగౌరవం.. మొదలగు ఇతివృత్తలలో కథలు, నవలలు వ్రాసారు. వారి రచనలు అందర్ని ఆకర్షించేవి. మాలతీ చందూర్ కథలలో గాని, నవలలో గాని విషయం సూటిగా స్పష్టంగా కనబడుతుంది. అనవసరమైన వర్ణనలు, అలంకారాలు, ఉపమానాలు, హాస్యోక్తులు, అడ్డుపడే పాత్రలు ఉండవు. ఎవరో ఒకరి పక్షం మీద కూడా కథ నడపకుండా.. ఉన్న విషయాన్ని వ్రాసి, పాఠకుడి మందు ఉంచుతారు. పాఠకుల సంస్కారం బట్టి ఆ విషయంలో మంచిచెడ్డలను గ్రహిస్తారు. *లజ్ కార్నర్, పాప, తనూ–నీరజా, శానమ్మ, జూలీ, ఏడుకొండలవాడా..* వంటి ఓ వంద కథలు, *శతాబ్ది సూరీడు, హృదయనేత్రి, శిశిర వసంతం, సద్యోగం, ఆలోచించు, కాంచన మృగం, కృష్ణవేణి, రెక్కలు చుక్కలు, కలల వెలుగు..* మొదలగు ఓ పాతిక నవలలు పాఠక లోకాన్ని అలరించాయి. సుమారు మూడు వందలకు పైగా, ఇంగ్లీషు నవలలను తెలుగులో "పాత కెరటాలు" శీర్షిక కింద చాలా కాలం పరిచయం చేసారు.. ఆ రోజుల్లో దీపావళీ ప్రత్యేక సంచికలలో మాలతీ చందూర్ గారి కథ లేకుండా విడుదలైన సందర్భం లేదనే చెప్పాలి. తెలుగు, ఇంగ్లీషు, తమిళం భాషల్లో రచనలు చేసిన మాలతి చందూర్ గారికి, తెలుగులో తొలి తరం మహిళా రచయిత్రిగా మంచి పేరు, గౌరవం ఉంది. ఎన్నో అవార్డులు, పురస్కారాలు అందుకున్న మాలతీ చందూర్ గారి "హృదయనేత్రి" నవలకి సాహిత్య అకాడమీ అవార్డు కూడా వచ్చింది.

26 డిసెంబరు1928 తేదిన కృష్ణా జిల్లా నూజివీడులో పుట్టిన మాలతీ చందూర్ గారు, ఏలూరులో హైస్కూల్ చదువు సాగించారు. తర్వాత మద్రాసు వెళ్ళడం, అక్కడ చందూర్ గారితో వివాహం జరగడం, తర్వాత యస్.యస్.యల్.సి. ప్రైవేట్ గా చదివి పాసయ్యారు. రేడియోలో తన రచనలు చదవడం, ఇష్టాగోష్టిలలో పాల్గోడం తరుచుగా ఉండేవి. మాలతి చందూర్ గారు కొంతకాలం కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యురాలిగా పనిచేసారు. మద్రాసులోనే స్థిరపడ్డ మాలతీ చందూర్ గారు 21 ఆగస్టు 2013 న తుది శ్వాస విడిచారు. తెలుగు సాహితీ జగత్తులో విదూషీమణి శ్రీమతి మాలతీ చందూర్ గారిని ఈ దీపావళి ప్రత్యేక సంచిక కథామార్గదర్శిగా తలచుకొని, వారికి ఘనమైన నివాళిని అర్పించుకుంటున్నాం!

**కథామంజరి బృందం**

# అకాలం!

వెంకటమణి ఈశ్వర్



✆ 9492244586

**కథామంజరి నిర్వహించిన దీపావళి కథల పోటీ 2022 లో ప్రోత్సాహక బహుమతి లభించిన కథ**

***పొగడమొక్క వేళ్ల గోళ్లతో మట్టిని గీరడం మళ్లీ మొదలుపెట్టింది. లేలేత వేళ్లు తీవ్రంగా నొప్పి పెడుతున్నాయి. అయినా భరిస్తూ మట్టిని దొలుస్తూ వుంది. అలా దొలుస్తూ వుండగా.. వుండగా... ఉన్నట్టుండి తన నెత్తిన ఓ యంత్ర పిడుగు వచ్చి పడింది. నేలపైన సరిగ్గా ఆ పొగడ మొక్క మొదలు స్థానంలో బోర్వెల్ రిగ్ హేమర్ ధణ..ధణమని పెద్ద శబ్దం చేసుకుంటూ, మట్టిని ఫెళఫెళమని పెళ్లగించుకుంటూ నేలలోకి బలంగా దిగింది. బతుకుపై ఆశతో మట్టి పొరలను తొలుస్తూ పోతున్న చిన్నారి పొగడమొక్క వేళ్లను అది చీల్చుకుంటూ క్షణకాలంలో జర్రున అడుక్కిపోయింది. పొగడమొక్క పీసుపీసు అయిపోయింది; నామరూపాలు లేకుండా పోయింది.***

ఎండలు మండుకుపోతున్న కాలమది!

మంచి ఎండలు ఇంకా ముందున్నాయనగా, పొగడ చెట్టు పూతకొచ్చింది. కొన్ని రోజుల వ్యవధిలోనే కమ్మని పరిమళాన్ని వెదజల్లే పువ్వులెన్నో కొమ్మకొమ్మకూ విరిసాయి. ఆ పూలతో, తలనిండా పూలచెండు తురుముకున్న పల్లె పడుచులా వుంది, కానీ పల్లె పడుచులో ఉండే తుళ్లింత మాత్రం ఆ చెట్టులో కనబడటంలేదు. నిత్యకళ్యాణం పచ్చతోరణం అన్నట్లు ఆ కాలం, ఈ కాలం అని లేకుండా ఎప్పుడు చూసినా పచ్చని ఆకులతో కళకళలాడే ఆ పొగడచెట్టు విచారమంతా తన నీడన మొలిచిన తన చిన్నారి పొన్నారి పొగడ మొక్క గురించే. నిన్నటి మార్చిలో అకాల వర్షానికి పుట్టింది అది. ఆ రోజుకు కాస్త అటు ఇటుగా తనతో పాటుగా పుట్టిన మరికొన్ని మొక్కలు నీటి కరువుకి బలైపోయాయి. తను మాత్రం నాలుగు ఆకులతో జీవచ్ఛవంలా ఇంకా బతికేవుంది. తన ముందే రెమ్మ విడిచిన ఆకుల్లా తన బిడ్డలు రాలిపోతుంటే పొగడచెట్టు కడుపు తరుక్కుపోతోంది. ఉన్న ఒక్కగానొక్క పొగడ మొక్కయినా బతికి రెమ్మలు వేయకపోతుందా అన్న ఆశతో ఆకాశం వైపు చూస్తూ వుంది. తను పూసిన పూలు కాయలవుతున్నాయి. ఆకాశం చినుకుపూలు పూసే సమయం రానేవచ్చింది. ఈ ఏడాదైనా నాలుగు చినుకులు రాలకపోతాయా అనుకుంది పొగడచెట్టు.

"భయపడకు తల్లీ.. తొలకరొచ్చిందిగా.. వానొస్తుంది!" తన చిన్నారి పొగడ మొక్కను ఓదార్చింది. ఎండబారిన పడి కమిలిపోయిన తన నాలుగు ఆకులూ గాలికి రెపరెపలాడుతుండగా, బేలగా తల్లి చెట్టు వైపు చూసింది ఆ పొన్నారి పొగడమొక్క.

తన బిడ్డ బేల చూపులకు పొగడచెట్టు గుండె కలుక్కుమంది. గభాలున వెళ్లి తన బిడ్డని చేతుల్లోకి తీసుకుని, ఆర్తిగా ఎత్తుకుని తన గుండెలకు హత్తుకోవాలనిపించింది. కాని ఎలా? తనకు కాళ్లూ చేతులూ లేవాయె! తన శారీరక దుర్బలత్వానికి తనని తానే నిందించుకుంటూ "లేదమ్మా.. లేదు. వర్షం వస్తుందిగా.. భయపడకు." అని ధైర్యం చెప్పింది.


రోజులు భారంగా దారి మళ్లుతుండగా, ఒకరోజు ఆ ప్రాంతానికి రయ్యిమని రెండు కార్లొచ్చాయి. అందులో వచ్చిన తెల్ల చొక్కా మనుషులు ఓ మూలకు వెళ్లి వేళ్లపై ఏవో లెక్కలు వేసుకుని వెళ్లారు.

వాళ్లు వెళ్లిన రెండు వారాలకు ఒకనాటి సాయంత్రం వేళ బోర్వెల్ రిగ్ వచ్చింది. ఆ బండిని పొగడ చెట్టుకు వారగా నిలిపారు.

ఓ తెల్లచొక్కా మనిషి రిగ్ ఓనర్ వద్దకు వచ్చాడు. ఆయనగారు ఏదో అడగ్గా, తన చూపుడువేలితో పొగడమొక్కను చూపిస్తూ ఆ రిగ్ ఓనర్ అతనికేదో చెప్పాడు. అతను అలాగేనన్నట్లు తలూపుకుంటూ అక్కడ్నుంచి వెళ్లిపోయాడు.

కొన్ని రోజులకి తొలకరీ వెళ్లిపోయింది. చినుకు రాలలేదు. చినుకు కోసం ఆకాశం వైపు దీనంగా చూస్తున్న రైతులా, వేయి నోళ్లు వెళ్లబెట్టుకుని చూస్తోంది నె(ర్రె)లిచ్చిన నేల! ఆ నేలను ఆవాసంగా చేసుకుని జీవితాలు వెళ్లదీస్తున్న ప్రతి పిట్ట చూపూ.. చెట్టు చూపూ ఆకాశం వైపే వున్నాయి. పొగడ చెట్టయితే కళ్లల్లో వత్తులు వేసుకుని మరీ చూస్తోంది. ఒకరోజు ఉత్తరం దిక్కుగా మేఘాలు కమ్ముకొచ్చాయి. ఉత్తర చూసి ఎత్తర గంప అన్నట్లు పొగడచెట్టు ఆశలు మోసులెత్తాయి.

ఎండకు ఎండి, అన్నపానాలు లేక ఒడిలిపోయిన తన చిన్నారి పొగడమొక్క వైపు లాలనగా చూసి "ఇక బెంగ లేదే తల్లీ.." అని తన కొమ్మల గాలితో దానిని ఆప్యాయంగా నిమిరింది.



అయితే ఆ సంబరం ఎంతోసేపు నిలువలేదు.. మబ్బులా తేలిపోయింది. ఉత్తర మేఘాలు ఉత్తచేతులు చూపెట్టి పోయాయి. మరి నాలుగు రోజులకు ఆకాశం మళ్లీ మేఘం పట్టింది. కానీ అవి కూడా పాతమేఘాల దారే పట్టిపోయాయి.

'మేఘం వెయ్యడమే కానీ చినుకులు రాలుస్తున్నది లేదు.. మేఘాలు ఎందుకిలా తేలిపోతున్నాయో.. కాలం ఎందుకిలా మారిపోయిందో.. ఏమీ అర్థం కాకుండా వుంది!' అని పొగడ చెట్టు ఉసూరుమంది.

"తల్లీ! భయపడకమ్మా.. కాస్త ఓపికపట్టు..' అని తన చిన్నారిని జోకొడుతోంది. కానీ చినుకు రాలక, విషమిస్తున్న నేలమీది పరిస్థితిని చూసి తను నిమ్మళంగా వుండలేకపోతోంది. పరిస్థితులు ఎంత దిగజారిపోతున్నా వాటికి లొంగిపోకూడదు. బతుకు పోరాటం చెయ్యాల్సిందే.. గుండెను దిటవు చేసుకుని బిడ్డకు భరోసా ఇవ్వాలనుకుంది పొగడచెట్టు. ఎలా భరోసా ఇవ్వాలి? ఆలోచించింది. ఆలోచించగా.. ఆలోచించగా ఒక ఉపాయం తట్టింది.

విశ్వాసం నిండిన గొంతుతో పొగడమొక్కని పిలిచి.. "తల్లీ! నువ్వు ఒక పని చెయ్యాలమ్మా.. ఆ పని చేస్తే నీ కష్టం తీరిపోతుంది.. బతికి బట్టకడతావు.." అని చెప్పింది.

పొగడ మొక్క సాలోచనగా ఏమి చేయాలన్నట్లు తల్లి కళ్లల్లోకి చూసింది.

"మూడడుగుల లోతులో కొద్దిగా నీటి తడి వుందమ్మా.. నీ వేళ్లను కాస్త లోతుకి పోనియ్యాలి." అని చెప్పింది.

"నావి లేత వేళ్లు కదా.. ఎలా పోనియ్యగలనమ్మా.." అని ఏడుపు మొఖం పెట్టింది.

"అలాగంటే ఎలాగమ్మా.. నా తల్లివి కదూ.. ఆ పని నువ్వు చెయ్యగలవు.. ప్రయత్నిస్తే సాధించలేనిది ఏదీ లేదు.."

పొగడమొక్క తన వేళ్లను భూమి లోపలికి జొరపడటానికి ప్రయత్నించింది. పై పొరల్లో తడి లేక నేల గిడసబారిపోయి వుందేమో.. మట్టిలోనికి వేళ్లను జొరపడటం తన వల్ల కావడంలేదు. "వేళ్లు నొప్పి పుడుతున్నాయమ్మా.." అంది ఏడుస్తూ.

"అలా అనకమ్మా.. భరించాలి.. ప్రయత్నించాలి.. ప్రయత్నే ఫలిః.."

పొగడమొక్క వేళ్ల గోళ్లతో మట్టిని గీరడం మళ్లీ మొదలుపెట్టింది. లేలేత వేళ్లు తీవ్రంగా నొప్పి పెడుతున్నాయి. అయినా భరిస్తూ మట్టిని దొలుస్తూ వుంది. అలా దొలుస్తూ వుండగా.. వుండగా... ఉన్నట్టుండి తన నెత్తిన ఓ యంత్ర పిడుగు వచ్చి పడింది. నేలపైన సరిగ్గా ఆ పొగడ మొక్క మొదలు స్థానంలో బోర్వెల్ రిగ్ హేమర్ ధణ..ధణమని పెద్ద శబ్దం చేసుకుంటూ, మట్టిని ఫెళఫెళమని పెళ్లగించుకుంటూ నేలలోకి బలంగా దిగింది. బతుకుపై ఆశతో మట్టి పొరలను తొలుస్తూ పోతున్న చిన్నారి పొగడమొక్క వేళ్లను అది చీల్చుకుంటూ క్షణకాలంలో జర్రున అదుక్కిపోయింది. పొగడమొక్క పీసుపీసు అయిపోయింది; నామరూపాలు లేకుండా పోయింది.

తన కళ్లముందే బిడ్డ బతుకు ఛిద్రమవ్వడంతో నిర్ఘాంతపోయింది పొగడచెట్టు! నిలువు గుడ్లు పడిపోయాయి! కొమ్మలు వేలాడిపోయాయి! ఆకు అల్లల్లాడితే ఒట్టు!

ఇంతలో అక్కడికి ఓ టయోటా కారొచ్చింది. అందులోనుండి ఒక జులపాల జుత్తుగల ఆసామి దిగాడు. తెల్లని ఖద్దరు ధరించివున్నాడు. ఆ చేతికి నాలుగు.. ఈ చేతికి నాలుగు బంగారు ఉంగరాలు ఉన్నాయి. బొటనవేలికి పెట్టుకుంటే బాగోదనో.. లేకపోతే నోట్ల కట్టలు లెక్కపెట్టేటప్పుడు అడ్డం పడుతుందనో ఆ వేలికి పెట్టుకోలేదు. మెడలో జెర్రిపోతులాంటి బంగారు గొలుసు కూడా వుంది. రాజకీయ నాయకుడి అవతారం దశవతారం అయితే, ఆ అవతారానికి ముందరి అవతారం అది. నోట్లో జరదా కిల్లీ నములుతూ రిగ్గు దగ్గరకు చేరుకున్నాడు ఆ అవతార పురుషుడు. తవ్వుతున్న బోరుని పరీక్షగా చూస్తూ "మంచిగ వాటర్ పడిందా?" అని అక్కడి పనివాళ్లను అడిగాడు.

"కొబ్బరి నీళ్లలా వున్నాయ్ సార్.." చెప్పారు వాళ్లు.

సంతోషంతో అతగాడు అక్కడ్నుంచి ఓ నాలుగడుగులు ముందుకు వేసి, తన కలల సామ్రాజ్యానికి వేదిక కాబోతున్న కనుచూపుమేర భూమిని కన్నులారా చూసి తరించాడు. "పెట్టిన పెట్టుబడికి కనీసం పదింతల రాబడి కూడా ఇవ్వని పంట భూమి ఇది ఒకప్పుడు.. ఇన్నాళ్లికి దీని దశ తిరిగింది.." అనుకుంటూ సైట్ సూపర్వైజర్ని పిలిచి "ఆ మూల చెరువును ఇంకా పూడ్చిపెట్టలేదు.. ఆ తాటి పెండెను నరికించలేదు.. టైము దగ్గర పడుతోంది కదా.. ఇంకా పనులు తెమలకపోతే ఎలా?.." అని హడావుడి చేశాడు.

"ఈ వారంలో చెరువు పని పూర్తయిపోతుంది.. పై వారానికల్లా తాటి పెండె పనీ పూర్తయిపోతుంది.. మనుషులతో అయ్యే పనేమీ కాదు కదా సార్.. మిషన్లే కదా చేసేది.. మీరేం వర్రీకాకండి.." అని చెప్పి ఆయన్ని సాగనంపాడు సైట్ సూపర్వైజర్.

ఆ రాత్రి నిర్జీవంగా తెల్లారింది పొగడచెట్టుకు.

తెలతెలవారుతుందనగా, శత్రుదేశం మీద యుద్ధానికి దండెత్తికొచ్చినట్లు నాలుగు జేసీబీలు దిగబడ్డాయి. పలుగూ పారలతో, పనివాళ్లతో నాలుగు ట్రాక్టర్లొచ్చాయి. ఆ వెనక నాలుగు కార్లొచ్చాయి. జేసీబీలు దిబ్బల్ని, చేలగట్లని తవ్వి మట్టి ఎత్తిపోయడం ప్రారంభించాయి. కత్తులూ కటార్లు చెట్టూ చేమపై పడ్డాయి. టేపులు అడ్డదిడ్డంగా భూమికి కొలతలు వేస్తూ పోయాయి.

కళ్లెదుట జరుగుతున్న తతంగం దేనికోసమో అర్థం కాలేదు పొగడచెట్టుకి. ''ఇంకా ఈ మనిషికి ఏం చాల్లేదనో.. ఈ చెట్లనూ పుట్లనూ ఇలా తవ్విపోస్తున్నాడు.. చచ్చాక మోసుకుపోవడానికి ఉన్న మేడలూ మిద్దెలూ చాలవు కాబోలు.. ప్రకృతిలో ఏ పురుక్కి, ఏ పిట్టకి సొంత ఆస్తి వుంది గనక.. మేమంతా సుఖంగా, స్వేచ్ఛగా బతకడంలేదూ.. వీడి సంపాదన యావకి భూమి దుంపనాశనమైపోతోంది.. ఓ పక్క పర్యావరణం దెబ్బతినిపోతున్నా వీడి ఆశకు అంతుండడం లేదే.. పోగాలం!..'' అని దీర్ఘంగా నిట్టూర్చింది.

చుట్టూ ఉన్న ప్రపంచం క్షణక్షణానికి రంగులు మార్చుకుంటూ పోతోంది. చిన్నారి పొగడమొక్క ఆనవాలే దొరక్కుండా పోయింది. దుఃఖం ఆగడంలేదు పొగడచెట్టుకి. అంతులేని బాధయితే కలుగుతోంది గానీ, కన్నీళ్లు రాల్చడానికి దానికి కళ్లు లేవాయె! తన మీద తనకే జాలేసింది. ''నా అన్నవాళ్లందరూ పోతూవుంటే నేను మాత్రం బతికుండడం దేనికి? చచ్చిపోతే బాగుండు''నని అనుకుంది. ఆత్మహత్య చేసుకుందామన్నా చేసుకోలేని అసహాయురాలాయె!

అలా పొగడచెట్టు చింతిస్తున్న సమయంలో సరిగ్గా ఆ చెట్టు మొదలుపై గొడ్డలి వేటు లోతుకంటా ఒకటి పడింది. ఆ పైన మరోటి పడింది.. ఆపైన మరోటి.. నాలుగంటే నాలుగే దెబ్బలకు పొగడ చెట్టు నేలకొరిగింది. దాని గొంతు శాశ్వతంగా మూగబోయింది.

ఆ భూమిలో మిగిలిన మొక్కా మోడును కొట్టి, ఎక్కలాగి ఒక మూల కుప్పగా పోగేశారు. ఇక, ఆ విశాల భూభాగంలో చెట్టన్నది లేకుండా పోయింది, చెరువు లేకుండా పోయింది, ఆ చెట్లనూ పుట్లనూ ఆవాసం చేసుకుని ఇన్నాళ్లూ జీవించిన జీవులన్నీ పత్తా లేకుండా పోయాయి! గోతులు గొప్పులు పోయి అంతా సమతలమైపోయిన ఆ నేలలో ఆఘమేఘాల మీద రోడ్లు వేసి కాలువలు కట్టించారు. మొత్తంగా ఆ నేలను గడులు గడులుగా విభజించి అచ్చం చదరంగం బోర్డులా తీర్చిదిద్దారు.

ఒక మంచిరోజున 'న్యూ బంగరుభూమి రియల్ ఎస్టేట్ ప్రై లిమిటెడ్' కంపెనీ బోర్డు ఆ స్థలంలో అట్టహాసంగా వెలిసింది. పట్నం నుండి మంత్రొచ్చాడు ఆ ప్రోగ్రాంకి. తెగ ముచ్చట పడిపోయారు తెల్లచొక్కా మనుషులు!

ఆ రోజు మధ్యాహ్నమే మేఘం గుక్కపెట్టి రోదిస్తున్నట్లుగా.. బోరున వర్షం కురిసింది.

''కార్యక్రమం తలపెట్టాం.. చినుకులు పడ్డాయి.. చల్లదనం..'' అనుకున్నారు రియల్ వ్యాపారులు.

★★★★★

# ఆఖరి అంకె

ఇరిగినేని హనుమంతరావు



✆ 9676123876

**కథామంజరి నిర్వహించిన దీపావళి కథల పోటీ 2022 లో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ**

***"నమ్ముకున్న మనుషుల్ని లెక్క చేయకుండా, డబ్బుల్ని మాత్రమే లెక్కబెట్టుకుంటూ బతికిన మనిషికి, చివరి క్షణాల్ని లెక్కబెట్టుకోవడం కన్నా పెద్ద శిక్షేమీ ఉండదు. అనుభవించనీ... !" అక్కసు వెళ్ళగక్కి బయటకు నడిచాడు శేషాద్రి.***

ఒకటి .. రెండు .. మూడు .. నాలుగు .. ఐదు .. ఆరు .. ఏడు .. ఎనిమిది .. తొమ్మిది ..

"ఏంటి బావా.. ఆఖరి రోజులంటగా... బాగా లెక్కపెట్టు. అంకెకు రాని రోగంతో నీ బతుకు ఇంత చండాలమై పోయిందని విని, చూసి పోదామనొచ్చాను!" దూరంగా ఉన్న కుర్చీని జరుపుకుని మంచానికి దగ్గరగా కూర్చున్నాడు శేషాద్రి. సుందర్రాజుని కొన్ని క్షణాల పాటు తేరిపార చూసి, పెదవి విరిచాడు.

ఆ ఇంట్లో ఉన్న నిశ్శబ్ద వాతావరణం, మంచానికి అతుక్కుపోయిన బక్కచిక్కిన దేహం, ఆహారం పంపేందుకు పొట్టకు అమర్చిన ట్యూబు, మంచం చివరన వేలాడుతున్న యూరిన్ సంచి, ఇవేవీ శేషాద్రిని కదిలించలేక పోయాయి.

"ఈ వార్త విన్న వెంటనే మొదట బాధేసింది బావా! పిల్లలిద్దరికీ విదేశాల్లో వ్యాపారాలు కదా ... అసలే డాలర్లలో లెక్కలు. అంత ఈజీగా తెమలవు. అందుకే త్వరగా రాలేక పోయాను. కానీ నేను నీ వల్ల అనుభవించిన వ్యధను తలచుకొంటే దేవుడున్నాడని మొదటిసారి అనిపించింది!"

సుందర్రాజులో ఏ చలనమూ లేదు. కనీసం కళ్ళు కూడా తెరవలేదు. అతని స్థితిని గమనించే స్పృహలో లేడు శేషాద్రి.

"ఎన్నేళ్ళు బావా... ఓ పాతికేళ్ళైనా నిన్ను అంటి పెట్టుకు తిరిగానా...! నేనేదో చెడిపోయానని, నా బతుకు గాడిన పడుతుందని, మా నాన్న నీ దగ్గరికి పంపితే... నన్నరగదీసి మరీ పని చేయించావ్.. జీతం కాకుండా వాటాలు ఇవ్వాల్సి వచ్చే సమయానికి, సెనగలు తిని చేతులు కడుక్కున్నట్లుగా ముగించేసావ్. నన్ను ఉద్ధరించే పనిలో ఉన్నానని నువ్వనుకున్నావ్. కానీ బావా...! నీకు ఊడిగం చేశానని ఊరంతా ఉమ్మేస్తే కానీ నాకర్థం కాలేదు!" ఆక్రోశించాడు శేషాద్రి.

ఒక్కసారి కళ్ళు తెరిచి చుట్టూ చూసి, మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు సుందర్రాజు.

"ఓ...! నేను చెప్పేది అర్థం అవుతోందన్నమాట. సంతోషం. నా మాటలు ఆ యూరిన్ సంచిలోకి ఇంకి పోతున్నాయేమోనని తెగ భయపడ్డాననుకో...!" నవ్వాడు శేషాద్రి.


"నా చెల్లెలు పోయింది. పిల్లల్లేరు. కొండంత ఆస్తి. అదంతా నా పిల్లల పరమౌతుందనే ఆశతోనే కదా... బానిసలాగా పని చేసింది. కానీ... దారిన పోయేదాని కోసం నన్ను బజార్న పడేశావ్. నువ్వు కనే పని లేకుండా ఓ కూతుర్ని బోనస్సుగా కొట్టేశావ్ చూడు... అందుకు నిన్నభినందించాలి!" మనిషి రూపాన్ని వదిలేసి నవ్వుతున్నాడు శేషాద్రి.

"పలకరించింది చాలు శేషాద్రీ... ఇక దయ చేస్తే మంచిది!" విసురుగా గది లోపలికొచ్చింది మహాలక్ష్మి.

"ఓ... వింటున్నావన్న మాట. ఈ గూఢచర్యమే కదా నా కొంప ముంచేసి, నా కళ్ళ ముందున్న బంగారు పళ్లాన్ని నాక్కాకుండా చేసింది. కానీ నాదో సందేహం. ఇప్పటికీ నీలో అదే చురుకుంది కదా. మా బావ మంచాన పడి ఏడాది పైబడ్డా ఇంకా ఆస్తిని చక్కబెట్టే పనులేమీ మొదలు పెట్టినట్లు లేదు. ఇంట్లో వైద్యురాలుండగా ఉపాయాలకు లోటా?" విషం చిమ్మాడు శేషాద్రి.

"అందరూ నీలాంటి వారే అనుకోవడం నీ భ్రమ. నమ్మిన వాళ్ళ వెనుక గోతులు తీయడం నీకే చెల్లింది. వంకర మాటలు మాని దయచేస్తే సంతోషం." చేతిని గుమ్మం వైపు చూపిస్తూ కోపంగా చెప్పింది.

"నమ్ముకున్న మనుషుల్ని లెక్క చేయకుండా, డబ్బుల్ని మాత్రమే లెక్కబెట్టుకుంటూ బతికిన మనిషికి, చివరి క్షణాల్ని లెక్కబెట్టుకోవడం కన్నా పెద్ద శిక్షేమీ ఉండదు. అనుభవించనీ...!" అక్కసు వెళ్ళగక్కి బయటకు నడిచాడు శేషాద్రి.



ఒక్క క్షణం తనేం విందో అర్థం కాలేదు. 'ఆ స్థితిలోని' మనిషిని చూసి కూడా అంతటి శాపనార్థాలా...? కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. వెంటనే తమాయించుకుని, వేగంగా గది నుండి బయటకు నడిచింది.

"ఒక్క నిమిషం శేషాద్రీ!" అంటూ.

గేటు దాటబోతూ ఆగి, వెనుతిరిగి అక్కడే నిలబడిపోయాడు.

"ఏమైనా సాయం కావాలా...?" వెటకారంగా నవ్వాడు.

"అవును." స్థిరంగా అంది.

"ఆహా...! ఏంటో అది...!" చేతులు కట్టుకున్నాడు.

"లెక్కల్లోనే బతికిన మీ బావ కూడా కొన్ని చోట్ల లెక్క తప్పాడు. ఎక్కడెక్కడ తప్పాడో నేను చెప్తాను. ఎంత తప్పాడో నువ్వేమైనా చెప్తావేమోనని...?"

కనుబొమ్మలు ముడిపడ్డాయి.

"అర్థం కాలేదు కదూ...! చెప్తాను విను. నువ్వు ఈ ఊరొదిలి వెళ్ళిపోయాక నీ బాకీల వాళ్ళందరూ ఈ ఇంటికి వరుస కట్టారు. అందరికీ వడ్డీతో సహా చెల్లించేశాడు మీ బావ. వాళ్ళలో ప్రత్యేకం ఒక రేస్ కోర్స్ బుకీ. అతనైతే ఏకంగా మూడు రెట్లు ఊడ్చుకెళ్ళాడు. నువ్వేం చేశావో నీకే తెలుసు. ఎందుకంత ఇచ్చాడో మీ బావకే తెలుసు. ఇప్పుడు ఆయన చెప్పే స్థితిలో లేడు కాబట్టి నువ్వే తేల్చాలి."

శేషాద్రి బిగుసుకుపోయాడు. నోరు పెగల్లేదు. మళ్ళీ తనే కొనసాగించింది.

"ఇకపోతే, నీ పిల్లల చదువులు. అమెరికా యూనివర్సిటీల్లో సీట్లనీ, స్కాలర్షిప్పులనీ, నీ పిల్లలు నీకు చెవుల్లోకి పూలు పంపితే, వాళ్లకు ఈయన డాలర్లు పంపారు. వాళ్ళ వ్యాపారాలూ... ఈయన చేర్చిన డాలర్ల పుణ్యమే. నీ పిల్లలతో మాట్లాడి ఆ లెక్కలు నువ్వు తేల్చావనుకో... నువ్వు నాకు సాయం చేసినట్లే...!"

శేషాద్రి మొఖం పాలిపోయింది.

"అలవాటు కొద్దీ...లెక్క డాలర్లలో చెప్పేవు...! రూపాయల్లో చెప్తే చాలు." గంపెడు బాధలోనూ ఆఖరి బాణాన్ని బలంగానే వదిలింది మహాలక్ష్మి.

'దెబ్బ తిన్నాడులే పాపం' అని లోకం చూపిన సానుభూతివల్లో... పిల్లల రూపంలో కలిసొచ్చిన అదృష్టంతోనో... నిలిచాననుకున్న శేషాద్రి, భూగోళం ఆవలి వరకూ పరుచుకున్న సుందర్రాజు నీడలోనే సేద తీరానని గ్రహించాక, మనిషిగా మారేందుకు ఇష్టంలేక, వడివడిగా బయటకు నడిచాడు.

అప్పుడే డా. సుధాకర్‌ను వెంటబెట్టుకుని ఇంటికి వస్తున్న సుప్రజ, కారు అద్దం దించి, బయటకు వెళుతున్న శేషాద్రిని తదేకంగా చూస్తూ కారు పోర్టికోలో ఆపింది. ఇద్దరూ దిగారు. వాళ్ళ వద్దకు చేరుకొంది మహాలక్ష్మి.

"బావున్నారా? అమెరికా నుండి ఎప్పుడొచ్చారు?" డా. సుధాకర్‌ను ప్రశ్నించింది.

"నిన్ననే వచ్చాను లక్ష్మీ. ఎలా వున్నాడు మా వాడు?" సుందర్రాజు గదివైపు వెళ్తూ అడిగాడు.

అతని వెనకే వెళ్తూ, కళ తప్పిన తల్లి ముఖం చూసి "ఎవరమ్మా అతను?" అడిగింది సుప్రజ.

"అతనా...! ఓ అసూయ జీవి." ముక్తసరిగా అంది మహాలక్ష్మి.

ముగ్గురూ సుందర్రాజు గదిలోకి ప్రవేశించారు.

"ఏరా వ్యాపార అయస్కాంతం. ఇంకా మంచానికే అతుక్కొని ఉన్నావేంట్రా?" సుందర్రాజు పక్కన కూర్చుంటూ చేయందుకున్నాడు డా. సుధాకర్.

సుందర్రాజులో ఏ కదలికా లేదు. యాక్సిడెంటై హాస్పిటల్లో బెడ్ పైన ఉన్నప్పుడు... అవే మాటలకు, అంత బాధలోనూ నవ్వుతో విచ్చుకున్న సుందర్రాజు రూపం డా.సుధాకర్ కళ్ళ ముందు కదలాడింది. సుప్రజతోనూ, మహాలక్ష్మితోనూ ప్రస్తుతం వాడుతున్న మందులూ, అందిస్తున్న డైట్ గురించీ వాకబు చేశాడు. సుందర్రాజు ప్రవర్తనలో వచ్చిన మార్పుల గురించి ఆరా తీశాడు.

తన సమక్షంలో జరుగుతున్న సంభాషణలేవీ సుందర్రాజును చేరడంలేదు.

ఒకటి.. రెండు.. మూడు.. నాలుగు.. ఐదు.. ఆరు.. ఏడు.. ఎనిమిది.. తొమ్మిది.... తొంభై ఒకటి, తొంభై రెండు...

సుందర్రాజునే చూస్తున్న డా. సుధాకర్ ఒక్కసారిగా ఆశ్చర్యపోయాడు. ఒక సారి వాచ్‌ను చూసి మళ్ళీ సుందర్రాజునే గమనించడం మొదలు పెట్టాడు.

ఒకటి .. రెండు .. మూడు .. నాలుగు .. ఐదు .. ఆరు .. ఏడు ..తొంభై ఒకటి, తొంభై రెండు .. .తొంభై మూడు .. తొంభై నాలుగు...

తల విదిలించాడు డా. సుధాకర్. అతనికి నమ్మశక్యంగా లేదు. ఇద్దరికీ సైగ చేసి హాల్లోకి తీసుకెళ్ళాడు.

"ఇప్పుడు చెప్పండి. మీతో తను మాట్లాడిన చివరి మాటలేంటి?" సోఫాలో కూర్చుంటూ అడిగాడు.

ఇద్దరూ మొఖాలు చూసుకున్నారు. డా. సుధాకర్ వాళ్ళనే గమనిస్తున్నాడు. మెల్లగా మహాలక్ష్మి నోరు విప్పింది.

"తను రాసిన వీలునామా గురించి చెప్పారు!"

"ఇంకా...!"

"సుప్రజకు ఎలాంటి సంబంధాలు చూడాలో, ఏ పనులకు ఎవరి మీద ఆధారపడవచ్చో అన్నీ వివరంగా చెప్పారు."

"బహుశా... తనిక తిరిగి లేవలేనని నిర్ధారించుకున్నప్పుడే అలా చెప్పి ఉండొచ్చు. కానీ నేనడుగుతోంది తను మీతో చివరిసారిగా చేసిన సంభాషణ గురించి...!"

ఏమీ లేదని పైకి చెప్పినా... లోపల జరిగే సంఘర్షణ ఆ ఇద్దరి ముఖాల్లో ప్రస్ఫుటం అవుతోంది.

"ఎందుకలా అడుగుతున్నారు.? ఏమైనా గమనించారా?" అనుమానంగా అడిగింది సుప్రజ.

"అవును. మానవమాత్రులెవరికీ సాధ్యం కాని ఓ పనిని సాధించే పనిలో ఉన్నాడు మీ నాన్న."

"అర్థం కాలేదు."

"మీరు చెప్పవలసింది చెప్తే, నేను జత చేయవలసింది చేస్తాను. అప్పుడు అందరికీ అన్నీ అర్థం అవుతాయి. మీరు మోస్తున్న భారం కొంత తగ్గుతుంది!" భరోసా ఇచ్చాడు..

★★★

లోకం అసూయ పడేలా బతికిన మనిషి సుందర్రాజు. చేసిన ప్రతి వ్యాపారంలోనూ తిరుగు లేదు. చేసిన ఏ పనిలోనూ ఎదురు లేదు. ఇక కార్లూ, బంగారం, బంగళాలు, పొలాలూ సరే సరి. విజయానికి మరో పేరు సుందర్రాజయ్యాడు. సంపదలోనూ, గౌరవంలోనూ లోటులేని సుందర్రాజుకు తన జీవితంలోని ఓ కుదుపు మహాలక్ష్మికి దగ్గరయ్యేలా చేసింది.

వైద్యానికందని రోగంతో భార్య చనిపోయాక, తన దగ్గర లెక్కలు చూసే మహాలక్ష్మిని పెళ్లి చేసుకున్నాడు. అప్పటికి సుప్రజకు పదిహేనేళ్ళు. దేవుడు తన భార్యను తీసుకుపోయినా తన ప్రతినిధులుగా మహాలక్ష్మి, సుప్రజలని పంపాడని ఆనందపడ్డాడు. వాళ్లకు సుందర్రాజు జీవితంలో లభించిన ప్రాముఖ్యతను చూసి శేషాద్రికి కంటగింపు అయింది. చనిపోయిన భార్యపై ఉన్న ప్రేమతో శేషాద్రిని చాలా కాలమే భరించాడు.

వాళ్ళు ఆస్తి కోసమే తగులుకున్నారని శేషాద్రి వాదించాడు. ఆస్తి రాయించుకుని హరీ... అనిపిస్తారని భయపెట్టాడు. శేషాద్రి ఆగడాలు మితిమీరి పోయాయని నిర్ధారించుకున్నాక సుందర్రాజు అతనిని సాగనంపాడు.

సుప్రజ మెడిసిన్ పూర్తయ్యాక, ఆమె కోసం కట్టబోయే హాస్పిటల్కి శంఖుస్థాపన చేసి తిరిగొస్తుండగా యాక్సిడెంట్‌కి గురయ్యాడు సుందర్రాజు. నడుము విరిగింది. చేతులు, కాళ్ళు చచ్చుబడ్డాయి. మంచానికే పరిమితం అయినా హాస్పిటల్

పనులను పరుగులు పెట్టించి ఏడాది తిరక్కుండానే పూర్తి చేయించాడు. యాక్సిడెంట్ అయ్యాక చాలా రోజుల వరకు తను తిరిగి లేచి నడుస్తాననే నమ్మాడు. దేశ విదేశాల వైద్యులు నడక అసాధ్యం అని తేల్చేసాక డీలా పడ్డాడు. కాలం గడవడం కష్టం అయింది. తన ఉనికి తనకే ఓ ప్రశ్నలాగా కనబడుతోంది. అప్పుడే లాయరును పిలిపించి వీలునామా రాశాడు. మహాలక్ష్మితో ఆస్తిపాస్తుల వివరాలన్నీ ఏకరువు పెట్టాడు.

ఓ రోజు మహాలక్ష్మి గుడికెళ్ళొస్తానని వెళ్ళింది. సుందర్రాజు సుప్రజను పిలిచి దగ్గర కూర్చోబెట్టుకున్నాడు.

"సుప్రజా... నాకో సాయం చేస్తావా?"

"ఆజ్ఞాపించాలి గానీ, అడగడం ఏంటి నాన్నా?"

"ప్రకృతి ధర్మానికి వ్యతిరేకమైనా... అడగవలసిన అవసరం ఉంది కాబట్టి...!"

"ధర్మాన్ని వదిలేయండి. మీకేం కావాలో చెప్పండి.?" తండ్రి చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంటూ ప్రేమగా అడిగింది.

"ఒ...క్క...ఇం...జ...క్ష...న్...!"

"దేనికి నాన్నా...!"

"చచ్చిపోవాలనుంది. ...?" దీనంగా అడిగాడు.

ఒక్క క్షణం తనేం విందో అర్థం కాలేదు సుప్రజకు.

"మీరో పోరాట యోధుడిగానే తెలుసు నాకు. ఇంతటి పిరికితనాన్ని ఊహించలేదు." కూడబలుక్కుంటూ పలికింది.

"నిష్ప్రయోజనమైన పోరాటం, ధైర్యం అనిపించుకోదు."

"ప్రాణాలు పోసే వృత్తి అని, నన్ను ప్రోత్సహించి మరీ డాక్టర్ని చేశారు." గొంతు జీరబోయింది.

"నన్ను తండ్రి స్థానం నుండి తప్పించి, ఓ రోగిగా చూడ్డం మొదలుపెట్టు."

"మీరు దైవంతో సమానం. అలాంటిది...మీ ప్రాణాలు తీసి, నన్నో రాక్షసిగా మారమంటున్నారా...?"

"నా ప్రాణాలు తీసి, నా పాలిట దేవతవు కమ్మంటున్నాను." అర్థిస్తున్నాడు

"ఆ పాప భారం నా జీవిత కాలం నన్ను వెంటాడదా?" ప్రతిఘటిస్తోంది.

"బాధల నుండి విముక్తి కల్పించడం పాపమెలా అవుతుంది?"

"ఉసురు తీసి ఉపశమనం కలిగించడం విముక్తి ఎలా అవుతుంది?"

"తత్వ సంవాదం ఎందుకు...? సాధ్యపడుతుందా... లేదా...?" స్వరంలో ఆత్రుత పెరుగుతోంది.

భోరున ఏడ్చేసింది సుప్రజ. తండ్రీ కూతుళ్ళ మధ్య అదే చివరి సంభాషణ. మహాలక్ష్మి గుడి నుండి తిరిగి రాగానే తను హాస్పిటల్కి వెళ్ళిపోయింది. తల్లిని బాధ పెట్టడం ఇష్టంలేక ఈ విషయాన్ని దాచిపెట్టింది. కొద్దిరోజులు తండ్రిని పలకరించే సాహసం

చేయలేదు సుప్రజ. తర్వాత ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. పలకరింపుల పరిధి నుండి సుందర్రాజు ఆలోచనలు ఎప్పుడో దూరంగా జరిగిపోయాయి.

మరుసటి రోజు సుప్రజ హాస్పిటల్‌కి వెళ్ళాక, కంచంలో అన్నం పెట్టుకుని సుందర్రాజు వద్దకు వెళ్ళింది మహాలక్ష్మి.

"ఇలా ఎన్ని రోజులు బతికిస్తావ్ మహాలక్ష్మీ...?"

"అదేం ప్రశ్న?"

"ఎన్ని రోజులు తినాలి. బతికి ఏం చేయాలి?" నిర్వేదం గొంతులో స్పష్టంగా ధ్వనిస్తోంది.

"నేను బదులివ్వగలిగిన ప్రశ్నలా అవి?" సంభాషణను తుంచే ప్రయత్నం చేసింది.

"నువ్వు జవాబిచ్చే వరకు నేను తినేది లేదు." కళ్ళు మూసుకున్నాడు.

"ఏంటి...నిరాహార దీక్షా...? నన్ను సాధించేందుకేనా...?"

"నేననుకున్నది సిద్ధించేందుకు...!"

మహాలక్ష్మి బతిమాలింది. బుజ్జగించింది. ససేమిరా అన్నాడు.

సుందర్రాజు ఉనికి కుటుంబానికి ఎంత అవసరమో చెప్పే ప్రయత్నం చేసింది. అవసరం కాదు... భారమన్నాడు.

లోకం శేషాద్రి గొంతుకను అరువు తెచ్చుకుంటుందేమో అనే సందేహం వ్యక్తం చేసింది. పెడచెవిన పెట్టమన్నాడు.

ఇంకేం చెప్పి వారించాలో తెలియని మహాలక్ష్మి కళ్ళ నిండా నీళ్ళతో ఆ గది నుండి బయటకొచ్చింది. ఆ రోజు నుండి సుందర్రాజు నోరు తెరవలేదు. కూతురికి వివరంగా చెప్పింది మహాలక్ష్మి. సుప్రజ బాధ రెట్టింపైంది.

కొన్ని రోజులు సెలైన్ ద్వారా ద్రవాలు ఎక్కించారు. మనిషి బలహీనమయ్యాడు, కళ్ళలో కాంతి తగ్గిపోయింది. మొఖం వాచిపోయింది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఎదురైంది. సుప్రజకున్న వైద్య పరిజ్ఞానాన్ని భావోద్వేగాల పొరలు బందీ చేశాయి. ఇంటి వైద్యం పనికిరాదులెమ్మని ఆసుపత్రికి తరలించింది సుప్రజ.

ఆసుపత్రిలో డా. సుధాకర్ ఆధ్వర్యంలోని వైద్య బృందం ఎంత ప్రయత్నించినా నోరు తెరవలేదు. సెలైన్ ఫ్లూయిడ్స్ వలన వచ్చిన సైడ్ ఎఫెక్ట్స్ కారణంగా నోటి ద్వారా ఆహారం అసాధ్యం అని నిర్ధారించి పొట్టకు ట్యూబ్ అమర్చారు. రెండు రోజులకు మొఖం వాపు తగ్గి తేటగా మారింది.

ఓ రోజు డా. సుధాకర్ పల్మనాలజిస్ట్‌ను వెంటబెట్టుకుని సుందర్రాజు గదికి వెళ్లాడు. ఆయన రిపోర్ట్స్ అవీ చెక్ చేసి, శ్వాస తీసుకోవడంలో ప్రోగ్రెస్ ఉందని చెప్పి, బ్రీతింగ్‌కి సంబంధించిన ఎక్సర్సైజులేవో చూపించి వెళ్లి పోయాడు. తను అక్కడే ఉండి సుందర్రాజును గమనిస్తున్నాడు.

ఒకటి..రెండు..మూడు..నాలుగు..ఐదు..ఆరు..ఏడు..ఎనిమిది..తొమ్మిది..ముప్పై ఒకటి ముప్పై రెండు....

"అంతసేపు ఊపిరి బిగబట్టవలసిన అవసరం లేదు. నెమ్మదిగా వదులు." చేతిని తట్టాడు

అప్పుడు నోరు చెరిచాడు సుందర్రాజు.

“ఒరేయ్ డాక్టరూ...!” మాట అస్పష్టంగా ఉంది.

“నువ్విప్పుడు మాట్లాడావా...? ఆశ్చర్యపోయాడు.

“నా ఆత్మ అనుకున్నావా...? అంతటి అదృష్టమా...!” నిట్టూర్చాడు సుందర్రాజు.

“నువ్వేం చేస్తున్నావో నీకు అర్థం అవుతోందా?” కోప్పడ్డాడు.

“అర్థం కాకే కదా నిన్ను పిలిచింది.”

“ఏంటో చెప్పు...!” చిరాకో, కోపమో, బాధో, అన్నింటి కలబోతో ... మెల్లగా సుందర్రాజు చేతిని తన చేతిలోకి తీసుకుని స్పృశించాడు.

“ఊపిరిని బలంగా పీల్చి నెమ్మదిగా వదిలితే శ్వాస మెరుగౌతుందని చెప్పాడు మీ డాక్టరు. వదలకుండా అలాగే ఉంటే ఏం జరుగుతుంది. పోనీ... అసలు ఊపిరే పీల్చకుండా అలాగే ఉండిపోతే... చచ్చిపోవచ్చా...?” తెలుసుకోవడానికి అడిగిన ప్రశ్నలా లేదది. చచ్చిపోవడమే తన లక్ష్యమని తేల్చినట్లుగా ఉంది.

“చచ్చిపోవడమేంట్రా...!”

“మరి... ఇదే భంగిమలో, భూమికి సమాంతరంగా, భూమి ఉన్నంతకాలం బతికేయమంటావా...?” ప్రాణంలేని నవ్వు నవ్వాడు సుందర్రాజు

“అది తేల్చాల్సింది దేవుడు...!” విసుక్కున్నాడు.

“వైద్యుడు దేవుడంటారుగా... అందుకే నిన్నడుగుతున్నాను.” స్థిరంగా పలికాడు.

“సరే విను. బాహ్య ప్రమేయం లేకుండా, మనిషి తన ఊపిరి బిగబట్టో, ఊపిరి పీల్చకుండా ఉంటేనో మరణించడం అసాధ్యం. నాకు తెలిసి... గాలి పీల్చుకోవడం ఆపేసి, మనిషి చచ్చిపోయిన దాఖలాలు లేవు. ఇంతకు మించి దీని వెనుక ఉన్న సత్యాన్ని నీకు చెప్పలేను. కాబట్టి పిచ్చి ఆలోచనలు మాని, డాక్టర్ చెప్పిన ఎక్సర్సైజులు చేసి ఇంట్లోవాళ్లకి కొంచెం మనశ్శాంతినివ్వు.” అంటూ బయటకు వెళ్ళాడు.

వెళ్ళాడేగానీ ఆ సంభాషణ మనసును స్థిమితంగా ఉండనీయలేదు. మళ్ళీ కొద్దిసేపటి తర్వాత సుందర్రాజు గదిలోకి వెళ్ళాడు. శబ్దం చేయకుండా నిలబడి తననే గమనిస్తున్నాడు.

ఒకటి..రెండు..మూడు..నాలుగు..ఐదు..ఆరు..ఏడు..ఎనిమిది..తొమ్మిది..ముప్పై ఒకటి ముప్పై రెండు....అన్ని క్షణాల పాటు ఊపిరి పీల్చకుండా ఉండగలిగాడు.

తను అనుకున్నది సాధించినదాకా విశ్రమించని సుందర్రాజు, ఇప్పుడు విజయం సాధ్యం కాదని తెలిసీ ప్రయత్నించడం ఒక పిచ్చి చర్యగా మిగిలిపోతుందని జాలిపడ్డాడు డా. సుధాకర్.

★★★

కూతురితో సుందర్రాజు జరిపిన సంభాషణ తెలుసుకున్న మహాలక్ష్మి బిగుసుకుపోయింది.

డా. సుధాకర్ చెప్పింది విని సుప్రజ పలువిధాలుగా ఆలోచిస్తోంది.

తల్లీ కూతుళ్లిద్దరూ చెప్పిన విషయం విన్నాక, కొద్దిసేపు మౌన ముద్రలోకి జారుకున్నాడు డా. సుధాకర్.

ఎవరు ఏ స్థితిలో ఉన్నా, అందరికీ ఒకటి స్పష్టమైంది. సుందర్రాజు చచ్చిపోదామని బలంగా అనుకుంటున్నాడు.

దాదాపు రెణ్ణెల్ల నుండీ ఒకటే ధ్యాస. ఊపిరి లోపలికి చేరకుండా శాశ్వతంగా ఆపేయాలి...! గాలిని నిరోధించగలిగే సమయాన్ని గణనీయంగా పెంచగలిగాడు కానీ, గాలి అవసరాన్ని చెప్పే మెదడు సంకేతాలను ఆపలేకపోతున్నాడు. ఓటమే ఎరుగని సుందర్రాజు, శరీర ధర్మం ముందు ఓడిపోతూనే ఉన్నాడు. అయినా... తనక్కూడా తెలిసే అవకాశం లేని చివరి విజయం కోసం శ్రమిస్తూనే ఉన్నాడు.

తల విదిలించాడు డా. సుధాకర్. మెల్లగా లేచి సుందర్రాజు గదికి చేరుకున్నాడు. వాళ్ళిద్దరూ ఆయన్ను అనుసరించారు. ముగ్గురూ సుందర్రాజునే తదేకంగా గమనిస్తున్నారు.

ఒకటి .. రెండు .. మూడు .. నాలుగు .. ఐదు .. ఆరు .. ఏడు .. ఎనిమిది .. తొమ్మిది .... తొంభై ఒకటి, తొంభై రెండు తొంభై మూడు, తొంభై నాలుగు, తొంభై ఐదు, తొంభై ఆరు...

"పోవాలనే తపన తప్ప మరోటి లేదు. మనం చేయగలిగిందేమీ లేదు. దైవమే వీడికి దారి చూపాలి!" అంటూ సుప్రజ తల మీద చేయి వేసి నిమురుతూ "అవసరమైతే కాల్ చేయి..." అని వెళ్ళిపోయాడు.

గట్టు తెగిన ప్రవాహమే అయింది సుప్రజ.

తమ జీవితానికి కలలో కూడా ఊహించని ప్రశాంతతను ఇచ్చిన మనిషికి ఇంతటి సంఘర్షణ అవసరం లేదని తీర్మానించుకొంది మహాలక్ష్మి. జీవితపు ఎత్తు పల్లాలెరుగని తన కూతురుకి ఆ పాప భారం అంటకుండా తనే కథ ముగించాలని నిశ్చయించుకొంది.

ఏవిధంగా...? విషప్రయోగం...! ఎలా...? పొట్టకు మార్చిన ట్యూబ్ ద్వారా పంపగలిగితే...? పంపించాలి...అదే సులువైన మార్గం. మరి శేషాద్రి ప్రతినిధిగా ఉన్న లోకం సంగతేంటి...?ఈ లోకం తనకు కలిగిన అదృష్టానికి కుళ్ళుకుందే కానీ... నిబద్ధతకు సత్కారాలేమీ జరపలేదు కదా...! ఆలోచనలనుండి తేరుకుని, ఇప్పుడే వస్తానని సుప్రజకు చెప్పి బయటకు వెళ్ళింది మహాలక్ష్మి.

ఇంట్లో ఉండే మనిషి మనసులో, శరీరంలో ఇంత అలజడి రేగుతున్నా... ఇంకో డాక్టర్ చెప్పేదాకా తెలియలేదంటే తనపై తనకే అసహ్యం వేసింది సుప్రజకు. నాన్నను మామూలు మనిషిగా చేయలేని తన వైద్య పరిజ్ఞానం ఆయన కోరిక తీరేందుకు పనికొచ్చినా చాలు అనుకొంది. లేచి కళ్ళు తుడుచుకుని హడావిడిగా ఇల్లు తాళం వేసి, కారును పరుగులు తీయించింది.

సుందర్రాజు తన పనిలో తాను మునిగిపోయాడు.

ఒకటి .. రెండు .. మూడు .. నాలుగు .. ఐదు .. ఆరు .. ఏడు .. ఎనిమిది .. తొమ్మిది .... తొంభై ఒకటి, తొంభై రెండు తొంభై మూడు, తొంభై నాలుగు, తొంభై ఐదు, తొంభై ఆరు, తొంభై ఏడు, తొంభై ఎనిమిది...

సాయంత్రానికి ఇద్దరూ ఇంటికి చేరుకున్నారు. ఇద్దరి మధ్య పలకరింపులు లేవు.

లోక భయం... పాప భీతి... ఎవరి మథనం వారిదే!

తెగవలసిన బంధం కోసం.... ఒకరి పరోక్షంలో మరొకరు తెగించే అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు.

మానవత్వపు హద్దులు చెరిపే సాహసానికి సిద్ధపడ్డారు.

ఆఖరి అంకానికి తెర లేచింది.

ఒకటి .. రెండు .. మూడు .. నాలుగు .. ఐదు .. ఆరు .. ఏడు .. ఎనిమిది .. తొమ్మిది .... తొంభై ఒకటి, తొంభై రెండు తొంభై మూడు, తొంభై నాలుగు, తొంభై ఐదు, తొంభై ఆరు, తొంభై ఏడు, తొంభై ఎనిమిది, తొంభై తొమ్మిది...

★★★★★

# నీడ

పెమ్మరాజు విజయ రామచంద్ర



✆ 98497 44161

**కథామంజరి నిర్వహించిన దీపావళి కథల పోటీ 2022 లో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ**

***"అంత పెద్దపెద్ద కోరికలు కోరుకుందుకు మనం మాన్యులం కాదు, సామాన్యులం. చదువులు మాత్రం చెప్పించాలి. దొంగలు దోచుకుపోలేని సంపద పంచగలగాలి. ప్రమోషన్ వస్తే జీతం పెరిగి అది సాధ్యమౌతుందని ఆలోచన. పిల్లల చదువులకు ఇబ్బందుండదని, జీతంతో పాటు అప్పుచేసే స్థాయీ పెరుగుతుందని, ప్రమోషనుతో వచ్చే ఆదాయం అదనమవుతుందని ఆశ!"***

"ఫోన్ తీయకుండా కళ్లు మూసుకుని పడుకోండి. పగలు, రాత్రి తేడా లేకుండా ఆఫీసులో పని చేసారు. ప్రమోషన్ రాలేదని బెంగ పెట్టుకుని జ్వరం తెచ్చుకున్నారు." టాబ్లెట్ ఇచ్చి వంటింట్లోకి వెళుతున్న జానకి మాటలకు నవ్వుకున్నాడు రామారావు.

"ఇది ప్రమోషన్ జ్వరం కాదు. గాలిమార్పు వల్ల వచ్చింది!" ప్రమోషన్ రాలేదనే బాధని అణిచిపెట్టుకుని పైకి చెప్పాడు.

"మీ పేరు చెపితే నిజాయితీ లేచి నిలబడుతుందని ఆఫీసువాళ్లు గొప్పగా చెపుతారు. ఆ గొప్పతనానికి గర్వపడాలో, ఉద్యోగంలో ఎదుగు బొదుగు లేనందుకు బాధపడాలో అర్థం కావటంలేదు!" భర్తకి సానుభూతి చూపించింది.

"నిజాయితీ చూసారు కాబట్టి హెడ్ ఆఫీసులో పర్చేజ్ డిపార్ట్మెంట్ లో ఉంచారు. అయినా అమ్మ చెప్పినట్లు మన తలరాత ఎలా రాసుంటే అలాగే జరుగుతుంది." వేదాంత ధోరణిలో చెప్పాడు.

"ఆ సిద్ధాంతం నమ్మినప్పుడు మంచం ఎక్కడమెందుకు? గెడ్డం పెంచడమెందుకు?" ఆ మాటకు ఆలోచనలో పడ్డాడు.

అవును, ఎందుకు ఆలోచించాలి! వేదాంతం వద్దంటే బాధ్యత ఆలోచించమంటోంది. పెరిగిన కుటుంబాన్ని వదులుకుని, పెళ్ళి పేరుతో నమ్ముకుని వచ్చిన భార్యని సంతోష పెట్టాలి. అందుకైనా పదోన్నతి కావాలి. సమాజంలో గౌరవం కోసమైనా మేనేజర్ హోదా పెరగాలి. కడుపున పుట్టిన బిడ్డల బాగుకోసమైనా, వాళ్ళకి మంచి చదువు ఇవ్వడం కోసమైనా ప్రమోషన్ రావాలి. పిల్లల భవిష్యత్ కోసం భవిష్యనిధి వాయిదా పద్ధతిలో వాడేసుకుంటున్నాం. కొన్నాళ్లకి అది కూడా ఖాళీ అవుతుంది. పక్కదారిలో ప్రయత్నం చేసేందుకు మనసు అంగీకరించటం లేదు. ఏం చేయాలి? ఆలోచనల సుడిగుండాలు మెదడులో తిరుగుతున్నాయి.

"ఏమిటి సుదీర్ఘంగా ఆలోచిస్తున్నారు?" భార్య మాటకు వాస్తవంలోకి వచ్చాడు రామారావు.

"చూడు జానకి, మొదట్లో నాకు ప్రమోషన్ తెచ్చుకోవాలని ఆరాటం, పట్టుదల ఉండేవి. ఆఫీసు రాజకీయాలు, వంగివంగి దండాలు పెట్టడం, బంధుప్రీతి మధ్య చెంచాగిరి చేయలేకపోయాను. దాంతో ఎక్కడ వాడ్ని అక్కడే ఉండిపోయాను." గెడ్డం నిమురుకుంటూ చెప్పాడు రామారావు.

"ఇప్పుడు మనకేం లోటు వచ్చింది."

"లోటు కాదు. మనం మధ్యతరగతి బతుకు గడుపుతున్నాం. ఇలాంటి గానుగెద్దు బతుకు పిల్లలకు ఉండకూడదు. ఆస్తులు

ఇవ్వలేకపోవచ్చు... నగలు, నట్రా పెట్టలేకపోవచ్చు... బ్యాంక్ బాలన్సు దాచలేకపోవచ్చు..."

"కనీసం సొంత ఇల్లు..."

"అంత పెద్దపెద్ద కోరికలు కోరుకుందుకు మనం మాన్యులం కాదు, సామాన్యులం. చదువులు మాత్రం చెప్పించాలి. దొంగలు దోచుకుపోలేని సంపద పంచగలగాలి. ప్రమోషన్ వస్తే జీతం పెరిగి అది సాధ్యమౌతుందని ఆలోచన. పిల్లల చదువులకు ఇబ్బందుండదని, జీతంతో పాటు అప్పుచేసే స్థాయీ పెరుగుతుందని, ప్రమోషనుతో వచ్చే ఆదాయం అదనమవుతుందని ఆశ!"

"ఆ దేవుడు కరుణించాలిగా..." గోడకు వేలాడుతున్న దేవుడి పటానికి దండం పెడుతూ చెప్పింది.

'దేవుడు కాదు. బాస్ కరుణించాలి.' మనసులోనే అనుకున్నాడు రామారావు.

"సర్లేండి. ఇవన్నీ ఆలోచిస్తూ బుర్ర పాడుచేసుకోకండి. విశ్రాంతి తీసుకోండి..." జానకి వంటింటి వైపు కదిలింది. ఇంతలో రామారావు ఫోన్ మోగింది.

"సార్, నమస్తే"

"రామారావు, బిల్డింగ్ కాంట్రాక్టు ఫైల్ ఎక్కడ పెట్టావు."

"మూడో భీరువాలో పైన సేఫ్‌లో భద్రంగా పెట్టానండి."




"అది సరేకాని, ఇలా ప్రమోషన్ రాలేదని రోగాలు తెచ్చుకుంటే కాదయ్యా. గడ్డివాము దగ్గర కుక్కలా కాదు, అవకాశమున్నప్పుడే నాలుగురాళ్లు వెనుకేసుకోవాలి. స్మార్టుగా పనిచేసుకోవాలి. ఫైల్సు పేరుకుపోతున్నాయి. త్వరగా రా..." అధికార దర్పం చూపించాడు.

★★★

రెండు రోజుల తర్వాత రామారావు ఆఫీసుకి వెళ్లాడు.

"ఏమయ్యా రామారావు, జ్వరం తగ్గిందా?" మేనేజర్ హనుమంతరావు అడిగాడు.

ఫైల్సు తెచ్చి రామారావు టేబుల్ మీద పెడుతున్నాడు ప్యూన్ అప్పారావు.

"ఏమిటి అప్పారావు! అందరి ఫైల్సు తెచ్చి ఇక్కడే పెడుతున్నావు" రామారావు అడిగాడు.

"బాబు మీరు నేక ఒక్క కాయితం కదలితే ఒట్టు. బిల్లులు అలాగే ఉండిపోయాయి. నన్ను ఎండగట్టేసారు. పార్టీలు పేనం తీసేత్తానారు. మీరు ఫైల్సు పూర్తి సేసే పున్నెం సేత్తే నాకు దసరా, సంకురేతిరి కలసి వచ్చినంత సంబరంగుంటాది!"

"రామారావు జ్వరం తగ్గిందా? నీతో ముఖ్యమైన విషయం చెప్పాలి. కాంటీన్‌లో టీ తాగుతూ మాట్లాడుకుందాం." అప్పుడే ఆఫీసుకి వచ్చిన రాజశేఖరం రామారావుని బలవంతంగా బైటకు తీసుకెళ్లాడు.

"రామారావు, నువ్వు నిజంగా లక్కీ ఫెలోవి. ఎప్పుడూ ఎవరికీ రాని అవకాశం వచ్చింది!"

"ఏమిటి?"

"నిన్న బోర్డు మీటింగ్లో ఒక నిర్ణయం తీసుకున్నారట. మళ్లీ ప్రమోషన్ పోస్టులు పెరిగాయిట. పాతలిస్టులోంచే తీసుకోవాలని నిర్ణయం చేశారని తెలిసింది. ఈసారి ఖచ్చితంగా నీ పేరు లిస్టులో వచ్చేలా నేను చేస్తాను. కాని నువ్వు సహకరించాలి. మిగతాది నేను చూసుకుంటాను. లిస్టు వచ్చేవరకు నా మాట విను చాలు."

"ఖచ్చితంగా వింటాను. ఏం చేయాలి?"

"మనం ఇష్టమైనది కావాలనుకున్నపుడు కష్టమైనా కొన్ని కోల్పోవాలి. ఆ విషయం నువ్వు తెలుసుకోవాలి. నీ మనసాక్షికి వ్యతిరేకంగా నువ్వు పార్టీల దగ్గర డబ్బు తీసుకోకు... తీసుకోమని బలవంతం చేయను. కానీ, తీసుకునే వాడికి మన పనికోసం కావలసిందిస్తే తప్పు లేదంటాను. మనం ఎవర్నీ పాడుచేయడం లేదు. బాగు చేయలేం. ఈ సమాజాన్ని ఉద్ధరించలేం కూడా..."

"నీ ఉద్దేశ్యం అర్థమైంది. కానీ..."

"ఇది కలికాలం. తాతలనాటి రాతికాలం కాదు. మరోమాట చెప్పకు. ఈ సాయింత్రం మాత్రం నువ్వు నాతో ఉండాలి. ఉంటానని మాట ఇవ్వు!" చేయి జాపాడు. రామారావు సంశయిస్తూ వాగ్దానం చేసాడు.

★★★

"రామారావు, త్వరగా రా... సాయింత్రం బైటకెళ్దామని పొద్దుటే చెప్పాను. మర్చిపోయావా?" కంగారు పెట్టాడు రాజశేఖరం.

"ఎక్కడికో, ఎందుకో చెప్పలేదు!" అయిష్టంగానే రాజశేఖరంతో పాటు ఆటో ఎక్కాడు.

ఆటోలోంచే గోల్కొండ బార్ బోర్డు చూసి, "ఏమిటి ఇక్కడికా? నాకు ముందు చెప్పలేదు." అక్కడే ఆగిపోయాడు.

"చెపితే రావుగా... అందుకే చెప్పలేదు. అయినా నాతో వుంటానని మాట ఇచ్చావు. మరో విషయం, లోపల వ్యక్తుల్ని చూసి కంగారుపడకు!" బలవంతంగా లోపలికి తీసుకెళ్లాడు.

లోపల సిగరెట్టు పొగ దట్టంగా అలుముకుంది. రోతపుట్టే భరించలేని వాసనకి రామారావు దగ్గాడు. చేతి రుమాలు తీసి ముక్కుకి అడ్డం పెట్టుకున్నాడు.

"గుడ్ ఈవినింగ్ సార్, పెద్దసార్ టేబుల్ పదమూడు దగ్గర ఉన్నారు!" అక్కడ వెయిటర్ చెప్పాడు.

రాజశేఖరం ఆ బారుకి పెర్మనెంట్ గెస్టని అర్థమైంది రామరావుకి. రాజశేఖరాన్ని అనుసరించాడు. అక్కడున్న హనుమంతరావుని, అప్పారావుని చూసి ఆశ్చర్యపడ్డాడు.

“మందు తాగేటప్పుడు, పేకాట ఆడేటప్పుడు తరతమ బేధాలుండవు. టేబుల్ ముందు అంతా సమానమే!” రామారావు ఆశ్చర్యానికి సమాధానం చెప్పాడు రాజశేఖరం.

“ఏమిటీ .. అయోధ్యా రాముడు గోల్కొండ వచ్చాడు...” మేనేజర్ వేళాకోళం చేసాడు.

“బార్లోంచి బంధిల్నీ విడిపిద్దామని సార్...” అంతే పదునుగా సమాధానం చెప్పాడు రామారావు. రామారావుని చూసి అప్పారావు కంగారు పడుతున్నాడు.

“అప్పారావు, కంగారుపడకు... సార్ తాగడులే. సాధుజంతువు. నువ్వు మాత్రం పడిపోయేదాకా పీపా నింపకు. రామారావు.. నీకు ఈ వాతావరణం కొత్త. మందు ఎక్కువ తాగి పడిపోతే తాగనివాళ్లు ఇంటి దగ్గర దింపాలి. అది ఆనవాయితీ!”

“రామారావు! నీకు తెలియని, నీకే కాదు ఎవరికి తెలియని మరో విషయం చెప్పాలి. మన అప్పారావు మాటంటే మన మేనేజింగ్ డైరెక్టరుకి చాలా గురి. అప్పారావు పలుకుబడితో ఎంతోమందికి ప్రమోషన్ ఇప్పించాడు. నన్ను సాధారణ గుమస్తా నుంచి మేనేజర్ స్థాయికి అప్పారావే తీసుకొచ్చాడు. వచ్చిన ప్రతి బాస్ కూడా అప్పారావుకి క్లోజ్‌గా ఉంటారు. వచ్చేవాడ్ని కూడా బుట్టలో వేసేసుకుంటాడు. అప్పారావు దగ్గర అందర్ని ఆడించే నాగస్వరముంది. ఆ సమ్మోహన మంత్రానికి అందరు ఫిదా అయిపోతారు!” ఆఫీసులో ఉప్పు, నిప్పులా వుండే హనుమంతరావు, అప్పారావు టేబుల్ మీద మాత్రం మంచి మిత్రుల్లా ఉండడం చూసి ఆశ్చర్యపోయాడు రామారావు.

“అంతేకాదు. హెడ్ ఆఫీసు నుంచి ట్రాన్సఫర్ లేకుండా ఊరిమధ్య గంగరావిచెట్టులా సార్ పాతుకుపోవడానికి కూడా అప్పారావే కారణం!” రాజశేఖరం మాట కలిపాడు. హనుమంతరావు పళ్ళు ఇకిలించాడు.

“సిన్న నౌకరోడ్ని. నన్ను మొనగసెట్టు ఎక్కిత్తనారు!” పొగడ్తలకు మెలికలు తిరిగిపోతూ చెప్పాడు అప్పారావు.

“మొనగచెట్టు మేం ఎక్కించక్కర్లేదురా. రెండు పెగ్గులేస్తే నువ్వే ఎక్కుతావు. నేను చెప్పింది అక్షరసత్యం. ఇంతవరకు అప్పారావు చూపు పడిన వాడెవడూ నిరాశ పడలేదు. చాలమందికి సహాయపడ్డాడు. ఈసారి ఆ దృష్టి నీమీద పడిందిలే. నీకు మంచి జరుగుతుందిలే...” హనుమంతరావు భరోసా ఇచ్చాడు.

రామారావు ఇబ్బందిగా కదిలాడు.

“ఇందులో సహాయం ఏటుంది. అందరి ముందు పెద్దసార్ సెయ్యి జాపనేరు. నాను సాపిన సెయ్యిని ఆయ్యగోరు జేబులో ఎట్టుకుంటారు!” లంచం ఎలా తీసుకుంటారో చెప్పాడు.

రామారావుకి హనుమంతరావు మీదున్న అపోహ తొలగిపోయింది. ఆఫీసు ప్యూన్ అధికారం చెలాయిస్తాడని ఊహించలేదు.

ఆఫీసరు, నౌకరు తేడా లేకుండా సాగుతున్న సోషలిజం పార్టీలో అయిష్టంగానే కూర్చున్నాడు. మంచినీళ్లలా మందు తాగి వాంతులు చేసుకున్నాడు అప్పారావు. రామారావుకి గాబరా వచ్చింది. నుదుట మీద పట్టిన చెమట కంగారుగా తుడుచుకున్నాడు.

“రాజశేఖరం, అప్పారావు పడిపోయాడు. నోటిలోంచి నురగ వస్తోంది. డాక్టర్‌కి కాల్ చేద్దామా?”

"నీకు ముందే చెప్పానుగా. వాడు తాగి పడిపోతాడని. ఆ నురగ.. తాగుడు ఎక్కువై కక్కింది. కంగారుపడకు..." రాజశేఖరం నవ్వుతూ చెప్పాడు.

వెయిటర్ ఇచ్చిన బిల్లును రామారావు వైపు జరిపాడు రాజశేఖరం. తప్పు చేస్తున్నట్లు మొహం పెట్టాడు రామారావు. తప్పదన్నట్లు బిల్లు చెల్లించాడు. అంతవరకు అప్పారావుని ఆలింగనం చేసుకున్న హనుమంతరావు ఏమీ పట్టనట్లు 'వస్తానోయ్' అని చెప్పి వెళ్లిపోయాడు. ఇద్దరూ సాయంపట్టి అప్పారావుని బైటకు తీసుకొచ్చి ఆటోలో కూర్చోపెట్టారు. ఆటో రివ్వున దూసుకుపోయింది. పదినిమిషాల్లో అప్పారావు ఇంటికి చేరింది.

కిందకి జారిపోయి కొనఊపిరితో వెళ్లాడుతున్న ఇంటిచూరు, వీధి దీపం వెలుగులో అస్పష్టంగా కనబడుతోంది. ఇంట్లో చిమ్మచీకటి అలుముకుంది. అప్పారావుని ఇద్దరూ చెరోపక్క పట్టుకుని ఆటో దింపారు.

ఏడుస్తున్న పిల్లాడ్ని చంకనేసుకుని సముదాయిస్తూ బైటకొచ్చిన అప్పారావు భార్య, "నమస్కారం బాబు... మళ్ళీ పీకలదాకా తాగినాడా.. తాగుబోతు సచ్చినోడు. సిగ్గు, సెడం నేదు. ఇల్లు, వాకిలి పట్టింపు నేదు. పిల్ల, పీచు ఆలోసన అసలే నేదు. మూడురోజుల సంది జ్వరంతో అల్లాడిపోతున్న పసోడి పేనం మీద దేసనేదు!" కళ్లలోంచి వస్తున్న కన్నీటిని కొంగుతో తుడుచుకుంటూ, చంకలోంచి జారుతున్న పసివాడ్ని సరిచేసుకుంటూ గదిలోపల కెళ్లి మంచం వాల్చింది.

ఆమె నోటినుంచి వచ్చిన ప్రతిమాట బాణంలా వచ్చి రామారావు గుండెల్ని తాకుతోంది. అప్పారావు ఇంటి వాతావరణం చూసి బాధనిపించింది. ప్రతి నెల వచ్చే జీతం, పార్టీలు ఇచ్చే మాముళ్లతో వచ్చే సంపాదన ఏమైపోతోంది. అంత డబ్బు తాగుడుకోసం ఖర్చు చేస్తున్నాడా? వేరే అలవాట్లకి బానిసగా మారాడా?

లోపలకి తీసుకెళ్లి మంచం మీద పడుకోబెట్టారు. మనిషిని మోయడం అలవాటు లేని రామారావు ఇబ్బంది పడ్డాడు. చిన్న ఇరుకుగది మూలలోంచి దగ్గు వినిపించింది. ఇద్దరి దృష్టి అటువైపు మరలింది. చీకటిలో ఏమి కనబడలేదు.

"కరెంట్ బిల్ కట్టమని ఇచ్చిన డబ్బులు కూడా తాగేసాడు. అందుకే చీకటిలో మగ్గుతున్నాం!" మంచం వైపు నుంచి మాటలు వచ్చాయి. చదువుకుంటున్న పిల్లల దగ్గర నుంచి బుడ్డిదీపం తీసుకొచ్చింది అప్పారావు భార్య. అప్పుడు రామారావు దృష్టి పిల్లల వైపు పడింది.

"దీపం అక్కడే ఉంచమ్మా..." రామారావు మొబైల్లో లైట్ ఆన్ చేసాడు. దగ్గు శబ్దం వచ్చిన వైపు చూపించాడు. మూలగా మంచం మీద ముసలావిడ దగ్గుతూ కనిపించింది.

"ఆవిడ మా అత్తమ్మ. అల్లిద్దరు మా పిల్లలు. పెద్దస్కూలుకెళుతున్నారు." వాళ్ళిద్దరి చదువు మీద శ్రద్ధకు రామారావు ముచ్చట పడ్డాడు. పిల్లల్ని పిలిచాడు.

"నీ పేరేమిటి. ఏం చదువుతున్నావు!" అడిగాడు.

"సరస్వతి. తోమ్మిదో తరగతి. బ్లూ స్టార్ స్కూల్. వీడు మా తమ్ముడు సత్తిబాబు!"

"మా అక్క స్కూల్ ఫస్టు"

"వీడు మూడో తరగతి. చదువులోను ఆటలోను ఫస్టే అంకుల్..." ఒక క్షణం ఆగి "సార్" అంది.

"పర్వాలేదు. అంకులని పిలు!" రామారావు ప్రవర్తనకి రాజశేఖరం ఇబ్బంది పడుతున్నాడు.

"ఎన్ని మార్కొలొచ్చిన, రాంకులొచ్చిన ఏటి ఫలితం. ఫీజు కట్టనేదని ఇంటికి పంపేసినారు. గవర్నమెంట్ స్కూల్ లోకి మార్సాలి!" మంచంమీద నుంచి లేచే ప్రయత్నం చేస్తూ ముసలావిడ చెప్పింది.

"ఈ పాపిష్టి సచ్చినోడు మందులు తెత్తనని నా ముసలి పింఛను కూడా తీసుకెళ్లి తాగేత్తాడు. ఈయకపోతే కట్టుకున్నదని కూడా సూడడు. తల్లని జాలి లేదు. నాల్గు తన్ని సొమ్ములు తీసుకుపోతాడు!" కొడుకు మీద ఫిర్యాదు చేసింది.

"ఆరికెందుకు అత్తమ్మా ఆ ఇషయకాలు. కడుపు సించికుంటే కాళ్లమీదే పడతాది." ఆమెలో కుటుంబాన్ని కాపాడే తపన కనిపించింది.

"అప్పారావుకి మజ్జిగ ఇవ్వండి. అమ్మా, మేం వెళతాం..." కదలబోయాడు రాజశేఖరం.

"బాబు, సిన్నమాట. మీకు ఈడితో సెయించుకునే పనులుంటాయి. నాకు తెలుసు. ఈ దొంగసచ్చినోడు పైసా తీసుకోకుండా పని సేయడు. అదీ తెలుసు. మీకు ఆడితో పనిపడితే తాగించే డబ్బులు మా ఇంటికాడ ఇయ్యండి. పిల్లలు ఒకపూటైనా గంజి తాగుతారు. మీ పనికోసం ఆడి ఒళ్ళు గుల్ల సేయకండి. మా ఇల్లు వల్లకాడు సేయకండి!" ఆ మాటకి రామారావుకి చెంపమీద కొట్టినట్లు అనిపించింది.

"అత్తమ్మా, అదేం మాట... తప్పు కదా! అయ్యగోర్ల్ని అడగచ్చా... వద్దు బాబు, మాకు ఎవరి సొమ్ములు వద్దు. మా ఆయన సంపాదన మాకిత్తే సాలు. నా పెనిమిటి తాగకుండా ఇంటికొత్తే సాలు. మేం సుఖంగుంటాం!" ఆమెలోని ఆత్మాభిమానం అర్థమైంది.

"సరస్వతీ" పిలిచాడు. జేబులోంచి ఐదు వందల నోట్లు తీసాడు రామారావు. పిల్ల చేతిలో పెట్టాడు.

"వద్దు సార్" తల్లిలాగే వాళ్ల ఆత్మాభిమానం చూస్తే ముచ్చట వేసింది. చేతిలో బలవంతంగా పెట్టాడు.

ఆ ఇంటి పరిస్థితికి బరువెక్కిన గుండెతో భారంగా బైట పడ్డాడు రామారావు.

★★★

రామారావు ఎన్నాళ్ల నుంచో ఎదురుచూస్తున్న ప్రమోషన్ లెటర్ వచ్చింది. అంగీకారం తెలుపుతూ సమాధానం పంపాలి. ఆ లెటర్ వంక చూశాడు. అప్పారావు తాగి వాంతి చేసుకున్న విస్కీకంపు కొడుతోంది!

★★★★★

# అంతిమం

విజయ కంఠస్ఫూర్తి



✆ 9949487828

**కథామంజరి నిర్వహించిన దీపావళి కథల పోటీ 2022 లో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ**

***మూడవ కొడుకు మనోహర్ టెక్సాస్ నుంచి.. ప్రస్తుతం కంపెనీ తరపున జర్మనీ టూర్లో ఉన్నాడు. తనే టీం లీడర్.. టూర్ క్యాన్సిల్ చేసుకోవడానికి కంపెనీ ఒప్పుకోదు. వచ్చే నెలలో అన్నయ్యతో కలిసి ఇండియా రావడానికి ప్రయత్నిస్తానని.. తండ్రి క్రిమేషన్ తప్పక వీడియో తీయించమని సలహా ఇచ్చాడు.***

కృష్ణమూర్తి కాలం చేశాడు !

రాత్రి ఎప్పుడో నిద్రలోనే ప్రాణం పోయింది .. అతగాడు పడుకున్న మంచానికి మూడు అడుగుల దూరంలో నిద్ర పోయిన అతని భార్య మహాలక్ష్మికి తెలియలేదు..

మూడంతస్తుల మేడ! మూడో అంతస్తులో మంచం మీద కృష్ణమూర్తి శవం.. రాత్రి ఎన్ని గంటలకు ప్రాణం పోయిందో? ఇప్పుడు ఉదయం పది గంటలు! ఇంతవరకు శవాన్ని ముట్టుకున్నవాళ్ళు లేరు.. కదిపి కిందకు దించిన వాళ్ళు లేరు!

అరగంట క్రితం ఎవరో ఫోన్ చేస్తే, హడావుడిగా వచ్చాను !

కృష్ణమూర్తికి నేను చిన్ననాటి మిత్రుడనే.. హైస్కూల్ చదువు మొదలు జీవితంలో.. చాలా సందర్భాల్లో వాడి వెంట ఉన్నవాడినే! ఎందుకో వాడు పోయినందుకు బాధగా.. కనీసం సానుభూతిగా వాడి మొహంలోకి చూడలేకపోతున్నాను.. ఒక్క కన్నీటి బొట్టు రాల్చలేక పోతున్నాను!

“ఎలా జరిగింది అమ్మా?” మనసులో ఘర్షణ అణచుకుంటూ మహాలక్ష్మిని అడిగాను.

“ఏమో అన్నయ్య గారూ! రాత్రి చాలాసేపు టీవి చూశారు. పాలు కాచి త్రాగమని గ్లాసు ముందు పెట్టాను. పాలతో పాటు టాబ్లెట్ వేసుకోమని మరి మరీ చెప్పి నేను నిద్ర కొరిగాను. ఆయన ఎప్పుడు నిద్రపోయారో నాకు తెలియదు! రాత్రి మళ్లీ నన్ను పిలిచినట్టు లేదు. తెల్లవారి మెలకువ వచ్చి చూస్తే పాలు, టాబ్లెట్టు అలాగే ఉన్నాయి. ఆయన పడుకున్న తీరు నాకు అనుమానం వచ్చింది .. కదిపి చూస్తే ఏముంది!”

మహాలక్ష్మి వెక్కివెక్కి ఏడుస్తోంది..


ముగ్గురు కొడుకుల కోసం మూడంతస్తుల మేడ కట్టించాడు. ముగ్గురు కొడుకులు ఒకరి తర్వాత ఒకరు అమెరికా ఎగిరిపోయారు! రెండు అంతస్థులు ఖాళీగా ఉంచలేక అధికారుల స్థాయి వాళ్లకి అద్దెకు ఇస్తూ వచ్చాడు. మూడో అంతస్తులో తను మహాలక్ష్మి ఉంటున్నారు. రెండు అంతస్తుల్లో అద్దెకు ఉన్న వాళ్లు కూడా ఇప్పటి వరకు ఎవరూ తొంగి చూసినట్లు లేదు. వాళ్ళకైనా విషయం తెలిసిందో లేదో..?

కృష్ణమూర్తి ఉద్యోగ విరమణ చేసి సంవత్సరం కూడా తిరగలేదు. నీటిపారుదల శాఖలో ఉన్నత ఉద్యోగం.. మందీ మార్బలం.. అధికారం! మురుగునీరులా పోగయ్యే సంపాదన! కాంట్రాక్టర్లు సమర్పించే భారీ ముడుపులు.. కృష్ణమూర్తి అంటే.. క్రింద

స్థాయి ఉద్యోగులు అందరికీ హడల్! ఎవరూ ఎదురు చెప్పిన.. పెదవి విప్పిన దాఖలాలు లేవు.

అవును, ఆఫీస్ వాళ్లు కూడా ఎవరూ రాలేదు. తెలిసినా.. వాళ్లు రారేమో! వాళ్లందరికీ కడుపుమంట. అతనికి దాహం ఎక్కువ! క్రింద వాళ్లకు కూడా వాటాలు సరిగ్గా అందనిచ్చేవాడు కాదని చెప్పుకునేవారు! ఏమైతేనేం.. అధికార బలంతో బోలెడు డబ్బు, బంగారం సంపాదించాడు. అయిదారు ఫ్లాట్లు కొని అద్దెకి ఇచ్చాడు. వేరే ఊళ్లలో బినామీ భూములు ఉన్నాయి. లాకర్లలో దాచిన నగలు .. ఎన్నో డిపాజిట్లు ఉన్నాయి. వాటి విలువ కొన్ని కోట్లు..!

నాకు తెలుసు.. అదంతా అక్రమార్జనే!



"అక్రమం ఏమిటి? సక్రమం ఏమిటి ? శ్రీలక్ష్మి వచ్చి పడుతుంటే కాదనడం.. వెర్రి కాక మరి ఏమిటి?" అనేవాడు.

తనమీద ఎన్నో ఫిర్యాదులు వెళ్లాయి. ఎవరూ ఏమీ చేయలేకపోయారు. రెండు మూడు సార్లు ఏసీబీ దాడులు జరిగాయి.. ఏం చేశాడో తెలియదు.. వీసమెత్తు దొరక్కుండా జాగ్రత్త పడ్డాడు! ఈ సంపాదన అంతా ఎవరి కోసం చేశాడు? ఎవరి కోసం దాచాడు?

కొడుకులు అనుభవిస్తారా? అమెరికాలో డాలర్ల వేటలో ఉన్నవాళ్లకి తెలీదు కృష్ణమూర్తి ఎంత సంపాదించింది.. ఏది ఎక్కడ ఎలా దాచింది! మహాలక్ష్మికి తెలియదు ఆమె పేరకొన్న జీవిత భీమాపట్టాలు తప్ప..!

ఈ సంపాదన అంతా వదిలేసి అర్ధాంతరంగా పోయాడు కృష్ణమూర్తి!

పిచ్చి మహాలక్ష్మి ఏకధాటిగా ఏడుస్తూనే ఉంది!

పనిమనిషి మంగ పరుగులాంటి నడకతో మెట్లెక్కి పైకి వచ్చింది. అక్కడ దృశ్యం చూసి అమ్మగారు అంటూ ఏడవ బోయి.. కొంగు అడ్డం పెట్టుకుని, శవం ముఖంలోకి చూసి ఆగిపోయింది. మహాలక్ష్మి ఏడుస్తూనే మంగను దగ్గరగా పిలిచి ఏదో చెప్పింది.

మంగ లోపలికి వెళ్లి కృష్ణమూర్తి తల వద్ద చమురు దీపం పెట్టింది!

"ఏమ్మా! పిల్లలకు తెలియపరిచారా? లేకపోతే వాళ్ళ ఫోన్ నంబర్లు ఇవ్వండి!" మహాలక్ష్మిని అడిగాను.

ఆమె జవాబు చెప్పలేదు సరికదా.. దుఃఖస్వరం మరింత పెంచింది. అదే సమయానికి రెండో అంతస్థులో అద్దెకు ఉంటున్న ఎల్ఐసి శర్మ లుంగీ సర్దుకుంటూ పైకి వచ్చాడు. మహాలక్ష్మితో నా మాటలు విన్నట్టున్నాడు .. 'తను ఇంతకు ముందే ముగ్గురు కొడుకులకి ఫోన్లు చేశానని' విషయం వివరించి చెప్పాడు.

ముగ్గురు కొడుకులు తండ్రి అంతిమ సంస్కారానికి రావడం లేదట.. రావడానికి వీలు పడదట.. చికాగోలో ఉన్న పెద్ద కొడుక్కి ప్రాజెక్టు చివరి దశలో ఉంది. దాన్ని వదిలి వచ్చే ప్రసక్తి లేదు.. వచ్చే నెలలో ఇండియా వస్తానని అన్నీ సెటిల్ చేస్తానని, తల్లిని తనతో తీసుకుపోతానని చెప్పాడు.

రెండవ కొడుకు శేఖర్ కాలిఫోర్నియా నుంచి మాట్లాడి తండ్రి ఇంత హఠాత్తుగా పోవడం ఏమిటి? అని ఆశ్చర్యంగా ప్రశ్నించాడు. 'బతికి ఉండగా అంతా తన ఇష్ట ప్రకారమే చేసేవాడు.. పోవడం కూడా తన ఇష్ట ప్రకారమే పోయాడా?' అంటూ చికాకు పడ్డాడు. తన భార్య నిండు గర్భవతి డాక్టర్లు తేదీని కూడా ప్రకటించారు. తను ఎట్టిపరిస్థితుల్లోనూ రాలేనని చెప్పాడు.

మూడవ కొడుకు మనోహర్ టెక్సాస్ నుంచి.. ప్రస్తుతం కంపెనీ తరపున జర్మనీ టూర్లో ఉన్నాడు. తనే టీం లీడర్.. టూర్ క్యాన్సిల్ చేసుకోవడానికి కంపెనీ ఒప్పుకోదు. వచ్చే నెలలో అన్నయ్యతో కలిసి ఇండియా రావడానికి ప్రయత్నిస్తానని.. తండ్రి క్రిమేషన్ తప్పక వీడియో తీయించమని సలహా ఇచ్చాడు.

తండ్రి పోయాడని తెలిసినా ముగ్గురు కొడుకులుకి ఎలాంటి భావాలు.. స్పందనలు లేవు.. మాటల్లో అనుబంధం.. ఆత్మీయతలు లేవు!

ఆహా.. కృష్ణమూర్తి! నీ జీవితమంతా.. ఒకటే పరుగు.. ఆరాటం.. అహం.. సంపాదన.. నీ యాంత్రిక బాటలోనే నీ కొడుకులు కూడా!

"ఇంకా ఎవరికైనా ఫోన్ చేయాలా అమ్మ?" శర్మ మహాలక్ష్మిని బాధ్యతగా అడుగుతున్నాడు. ఆమె దుఖంతో.. టీవీ దగ్గర ఉన్న చిన్న డైరీ చూపించింది. డైరీ పేజీలు తిప్పుతూ నంబర్లను మహాలక్ష్మికి చూపిస్తున్నాడు శర్మ.

కృష్ణమూర్తికి రక్త సంబంధీకులు ఎవరున్నారిక? ఒకే ఒక్క అక్కగారు ఉండేది. ఆవిడకు చిన్నప్పుడే పెళ్లి అయిపోయింది. పెళ్లి అయినప్పటి నుంచి పేదరికమే! చివరకు అంతుపట్టని రోగంతోనే కృంగి కృశించి దయనీయంగా చనిపోయింది. కృష్ణమూర్తి వెళ్లి కనీసం ఆఖరి చూపు చూడలేదు. బతికి ఉన్నప్పుడు ఆవిడ ఒకటి రెండు సార్లు అన్నయ్య ఇంటికి వచ్చింది. ఒకసారి తన భర్తకు ఏదైనా పని చూపించమని ప్రాధేయపడింది. మరోసారి తన కొడుకుని తీసుకొచ్చి చూపించి, ఏదైనా ఉద్యోగం వేయించమని అర్థించింది. రెండు సందర్భాల్లోనూ కృష్ణమూర్తి ఎలా స్పందించాడో.. ఆమె మళ్ళీ ఆ ఇంటి గడప తొక్కలేదు.

అంతెందుకు.. నేను తన చిన్ననాటి మిత్రుణ్ణి.. హైస్కూల్ చదువు నుంచి వాడ్ని అంటిపెట్టుకునే ఉన్నాను. చదువు సరిగ్గా అబ్బక.. ఆర్థికంగా పరిస్థితులు అనుకూలించక.. ఏదైనా శాశ్వత ఉపాధి చూపిస్తాడేమో.. అని వాడి చుట్టూ తిరుగుతూనే ఉన్నాను! జిల్లా ఉన్నత ఇంజనీర్ అధికారస్థాయిలో ఉండికూడా.. నాకు ఏ మాత్రం ఓ దారి చూపించలేక పోయాడు.

అంతేనా.. నా భార్యకు అనారోగ్యంతో ప్రాణం మీదకు వస్తే.. గుండె ఆపరేషన్ కోసం రెండు లక్షలు అప్పు ఇవ్వమని ప్రాధేయపడితే.. ఇంటి కాగితాలు దగ్గర ఉంచుకుని ఏభై వేలుచేతిలో పెట్టాడు! 'నీ ఇల్లు అంత కంటే విలువ చేయదులేరా' అన్నాడు.

వేరే ప్రయత్నాలు చేసుకుంటూ ఉండగానే నా భార్య నిద్రలోనే కన్నుమూసింది.

ఏం పట్టుకు పోయాడు? పిసినిగొట్టు వె.. దౌర్భాగ్యుడు.. డబ్బు పిశాచి!

"ఏమ్మా ఇంకా వచ్చే వాళ్ళు ఎవరైనా ఉన్నారా? అపరాహ్నం వేళ అవుతోంది. ఇప్పుడు కృష్ణమూర్తి గారికి అంతిమ

సంస్కారం చేసే వాళ్ళు ఎవరు? ఎవరూ లేరు కదా! ఒక్కటే మార్గం.. ఆ కైలాస్ మిషన్ వాళ్ళకి ఫోన్ చేస్తే అన్ని బాధ్యతలు వాళ్ళే చూసుకుంటారు. ప్రత్యేక వాహనం ఫ్రీజర్ బాక్స్ ఉన్నాయి. కాకపోతే మనం ఎంతో కొంత డబ్బు చెల్లించాలి!" ఎల్ఐసి శర్మగారు మహాలక్ష్మికి సలహా చెబుతున్నాడు.

మహాలక్ష్మి దుఖోద్వేగంతో మౌనంగా ఏడుస్తోంది !

ఆ కైలాస మిషను వాళ్లకి, ఎలక్ట్రిక్ క్రీమేషను కూడా ఉంది. అనాధ శవాలకు అంత్యక్రియలు చేస్తారు వాళ్ళు.. కొన్ని వేల ఓల్టుల విద్యుత్ ప్రవాహాన్ని పంపి ఏ శవాన్ని అయినా.. క్షణాల్లో బూడిదగా మార్చేస్తారు. దయ దాక్షిణ్యం, మమత మానవత్వం, సహానుభూతులు.. ఏవీ లేకుండా జీవించిన వాడికి ఇలాంటి అంతిమ సంస్కారమే సరిఅయినదేమో!

కృష్ణమూర్తి జీవితానికి ఇదే ముగింపు..

ఎందుకో నాకు సంతృప్తిగా ఉంది!

అందరూ ఉన్నా కృష్ణమూర్తికి అనాధ చావులా అనిపిస్తోంది !

కైలాస్ మిషన్ వాళ్లకోసం శర్మ ఫోన్ అందుకున్నాడు !

ఉన్నట్టుండి బయట ఏదో కలకలం.. ఎవరో మెట్లెక్కి వస్తున్న అలికిడి.. అటువైపుగా చూశాం! ఎదురుగా .. "జీవన సంధ్య" వృద్ధాశ్రమం నుంచి పదిమంది వృద్ధులు గుంపుగా వచ్చారు. వాళ్లంతా భజన చేస్తూ, భజగోవిందం సంకీర్తనలు పాడుతూ కృష్ణమూర్తి శవం చుట్టూ చేరి ప్రదక్షిణాలు చేస్తున్నారు. పాదాలకు మోకరిల్లి ప్రార్థనలు చేస్తున్నారు!

"వీళ్లంతా చేసేది ప్రార్ధనలేనా? అంత్యక్రియల కార్యక్రమం కూడా నిర్వహిస్తారా?"

"బాబూ నేను విశ్వనాధాన్ని! కృష్ణమూర్తి తండ్రిని, నా కొడుకు ఎలాంటి వాడైనా వాడికి తలకొరివి నేను పెడతాను!"

వృద్ధాశ్రమం వృద్ధుల్లో తెల్లటి గుబురు గడ్డంతో ఉన్న ఒక వయోవృద్ధుడు దీనంగా గొంతు విప్పాడు. అక్కడున్న అందరిలో ఆశ్చర్యం.. ముఖాలు తెల్లబోయాయి!

అవును.. విశ్వనాథం.. కృష్ణ మూర్తి తండ్రి!

ఈయన ఒకడు జీవించి ఉన్నాడని నేనూ మర్చిపోయాను.

కృష్ణమూర్తి మర్చిపోయాడు. పెంచి పెద్ద చేసి విద్యాబుద్ధులు నేర్పి సమాజంలో ఒక ఉన్నత స్థానానికి ఊతమిచ్చిన వాడు. వడలిన శరీరంతో వయోభారంతో తన కళ్ళ ముందే కన్ను మూసిన కొడుకును చూసి చలించిపోతున్నాడు. కన్నీళ్ళు కారుస్తున్నాడు. తల్లి పోయిన తర్వాత వద్దు వద్దని ఏడ్చినా మొత్తుకున్నా, ఇంట్లో ఒక మూల పడి ఉంటానురా అని వేడుకున్నా.. నిర్దాక్షిణ్యంగా వృద్ధాశ్రమంలో చేర్పించిన ఘనుడు కృష్ణమూర్తి!

ఏనాడు ఆశ్రమానికి వెళ్లి ఒక ఫలం ఇవ్వలేదు. ప్రేమగా పలకరించలేదు! విశ్వనాథానికి కొడుకు పోయాడని ఎలా తెలిసిందో.. తన మిత్ర బృందంతో అతన్ని సాగనంపడానికి వచ్చాడు! కృష్ణమూర్తి ఎప్పుడైనా ఏదైనా పుణ్యం చేసుకున్నాడేమో? కాకపోతే కన్నతండ్రి చేతుల మీదుగా కర్మకాండ జరగడం ఏవిటి? కన్న కొడుకు చేతుల మీదుగా అంతిమ సంస్కారం పొందాల్సిన వాడికి.. తండ్రి చేతుల మీదుగా సంస్కారం దౌర్భాగ్యం కాదా?

కృష్ణమూర్తికి సద్గతులు దొరుకుతాయా ? పాప ప్రక్షాళన.. నిష్కృతి ఉంటాయా?

నా ఆలోచనల్లో నేనుండగానే విశ్వనాథం.. కొడుకు అంతిమయాత్ర ఏర్పాట్లు మిత్రుల సాయంతో చకచకా చేస్తున్నాడు. నలుగురు మిత్రులు కృష్ణమూర్తిని మోసుకుని మేడపై నుంచి కిందకు తీసుకువచ్చారు. అప్పటికే కృష్ణమూర్తి కోసం ఏడుకట్ల సవారి సిద్ధం చేయబడుతోంది. విశ్వనాథం, మరో ముగ్గురు వృద్ధులతో కలిసి పరిశుద్ధ జలంతో కొడుకు పార్థివ శరీరానికి స్నానాదికాలు నిర్వర్తిస్తున్నాడు!

అదిగో అప్పుడే.. మహాలక్ష్మి ఏడుస్తూ మేడ పైనుంచి వచ్చింది!

“ఆగండి! నా భర్త శరీరానికి అంతిమ సంస్కారం వద్దు.. ఎవరు ఏమీ చేయవద్దు!” ఆమె గొంతు స్ఫుటంగా పలికింది.

అందరం మహాలక్ష్మి ముఖంలోకి అయోమయంగా చూశాం.

ఆమె నన్ను దగ్గరగా పిలిచింది.. ఒక తెల్లటి కాగితం ఒకటి నా చేతిలో పెట్టింది.

అది..కృష్ణమూర్తి గతరాత్రి రాసిన ఉత్తరం!

చాలా వాక్యాల్లో అక్షరాలు అలికినట్లుగా ఉన్నాయి. వాటిని కూడ బలుక్కుంటూ, ఉత్తరంలో ఉన్న విషయాన్ని నేను నెమ్మదిగా పైకి చదివాను!

“నేనిక ఎన్నో రోజులు బతకననిపిస్తోంది! కొన్ని గంటలో, నిమిషాలో, సెకనులో.. ప్రాణ ధాతువులు అన్నీ బిగించుకుపోతున్నట్లు.. ఉన్నట్టుండి ఏదో నొప్పి.. మృత్యువు నా పైకి ముంచుకొస్తోందనిపిస్తోంది. నాలా ఎవరూ జీవించ కూడదు. నిజంగా నేను మూర్ఖుడిని.. అహంభావిని! సాటి మనిషిని మనిషిగా చూడలేని వాణ్ని.. మంచితనాన్ని మరొకరితో పంచుకోలేని నిర్భాగ్యుడిని.. నాకు నిష్కృతి లేదు.. అహంకారం, డబ్బు, మనిషికి సంతృప్తి నివ్వవు! నలుగురితో పంచుకునే ఆత్మీయతలే.. అనుబంధాలే ఆనందాన్నిస్తాయి! ఎంత సంపాదించినా ఏదీ మన వెంట రాదు.. ఒంటరిగా రావడం ఒంటరిగా పోవడమే.. జీవనయానం!

నాకు ఈ జ్ఞానోదయం.. ఒక జీవితకాలం ఆలస్యంగా వచ్చిందేమో?

నేను సంపాదించిన ఆస్తిపాస్తులు.. నా పిల్లలు పంచుకోకూడదు. నా భార్య హక్కుదారురాలు. తన జీవికకు మిగుల్చుకుని, మిగిలినది అంతా నా తండ్రి నివసించే వృద్ధాశ్రమానికి అందచేయగలదనీ ఆశిస్తున్నాను!

నాకు ఇంకా జీవించాలని ఉంది.. కానీ..ప్చ్..! నేను పోయిన తర్వాత నా పార్థివ శరీరాన్ని, ఏదైనా వైద్య కళాశాలకు దానం చేయమని నా భార్యను అర్థిస్తున్నాను!

ఇదేనా అంతిమ.....!

కృష్ణమూర్తి

★★★★★

# కనురెప్పలు

సింగరాజు శ్రీనివాసరావు



✆ 9052048706

**కథామంజరి నిర్వహించిన దీపావళి కథల పోటీ 2022 లో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ**

***కపర్ది మాటలకు ఆవేశం రాలేదు కమలాకర్‌కు. ఏ పని చెప్పినా 'నో' అని చెప్పడానికి ఇష్టపడనివాడు, ఇంత గట్టిగా ఉండలేను అంటున్నాడంటే దానికి ఏదో బలమైన కారణం ఉండి ఉండాలి. ఒకవేళ చెప్పేదయితే ఇప్పుడు చెప్పివుండేవాడు. చెప్పలేదంటే ఆ కారణమేదో తెలుసుకోవాలి అనుకున్నాడు కమలాకర్.***

"వెంకటేశూ, కపర్ది సీటులో ఉన్నాడేమో చూసి, నేను రమ్మన్నానని చెప్పు" తలవంచుకుని ఫైలు చూసుకుంటూ మెసెంజరు వెంకటేశానికి ఆర్డరు వేశాడు మేనేజరు కమలాకర్.

"సరే సర్" అని వెళ్ళి తిరుగు టపాలో తిరిగి వచ్చి, "ఆయన లేరు సర్. ఆరు దాటింది కదా. వెళ్ళిపోయారు!" చెప్పాడు వెంకటేశు.

"ఏమి టైమ్ పంక్చ్యువాలిటినో ఈయన గారికి. ఆరు మీదకు ముల్లు వస్తే చాలు, ఆ తరువాత క్షణం నిలవడు కదా. ఆఫీసన్న తరువాత ఒక గంట అటో యిటో సర్దుకుపోవాలి కదా. వాచీలు చూసుకుని పోతుంటే పనులు ఎలా అవుతాయి!" మనసులో మాట పైకి అనేశాడు కమలాకర్.

"పోనీ సాయిగారు ఉన్నారు. పిలవనా సార్" అడిగాడు వెంకటేశు.

"వద్దులే గానీ, నువ్వు వెళ్ళి ఫ్లాస్కులో టీ పట్టుకురా. ఉన్నవాళ్ళం తాగుదాం!" అని అతనికి డబ్బులిచ్చి పంపేశాడు. పదిమంది స్టాఫ్ ఉన్నా, ఇచ్చిన పనిని వేలెత్తి చూపడానికి వీల్లేకుండా అంత చక్కగా చేసిపెట్టేది కాపార్ది ఒకడే. ఏ పని ఇచ్చినా ఇది నాది కాదు అని అనడు. చెప్పిన సమయాని కంటే ముందే తెచ్చి టేబుల్ మీద పెడతాడు. ఇంజనీరింగులో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసి కూడ ఇంత చిన్న ఉద్యోగానికి ఎందుకు వచ్చాడో అర్థం కాలేదు కమలాకర్‌కు ఎంత వినయంగా ఉండి పనిచేస్తాడో, అంత ఠంచనుగా ఆరు కొట్టేసరికి ఆఫీసు వదిలి వెళ్ళిపోతాడు. ఆఫీసులో ఉన్నంతసేపు పని తప్ప వేరే అదన ప్రసంగాలేవీ చేయడు. అందరూ కాఫీ అనో, టీ అనో ఒక గంటసేపు పనికి దుమ్మాకొడతారు. కానీ కాపార్ది మాత్రం సీటులో కూర్చుంటే కదలడు. లంచ్ కూడ సీటులో కూర్చునే తినేస్తాడు. బ్యాంకుకు వచ్చే కస్టమర్లు కూడ అతని వద్దకే ఎక్కువగా వస్తారు. ప్రైవేటు బ్యాంకు కావడం వల్లను, ప్రమోషన్ తీసుకోక పోవడం వల్లను, కాపార్ది పది సంవత్సరాల నుంచి ఇక్కడే ఉండిపోయాడు. కమలాకర్ మేనేజరుగా వచ్చిన దగ్గర నుంచి కాపార్దిని గమనిస్తూనే ఉన్నాడు. అంత చదువుకుని కూడ ఏమాత్రం భేషజం లేకుండా ఏ పని చెప్పినా చేసే కాపార్ది అంటే అతనికి మంచి సాఫ్ట్ కార్నర్ ఉంది. కానీ, ఈ మధ్య హెడ్ ఆఫీసు నుంచి వత్తిడి పెరిగింది. పదిహేను మందికి గాను ఇప్పుడు పదిమందే ఉన్నారు స్టాఫు. రిటైర్మెంటు అయినవారి ఖాళీలలో కొత్తవారిని తీసుకోవడం లేదు. ఒక వైపు వ్యాపారం పెరగడం, మరోవైపు స్టాఫ్ తగ్గిపోవడంతో పని భారం పెరిగింది. హెడ్ ఆఫీసుకు కరెస్పాండెన్సు అంతా కాపార్దికే అప్పగించాడు అప్పగించాడు కమలాకర్, ఇంకెవరి మీద నమ్మకంలేక. ఈ మధ్య ఆ పనే ఎక్కువయింది. ఎలాగైనా రేపొకసారి కపర్దితో మాట్లాడి ఓ గంట అదనంగా ఉండమని చెప్పి అడగాలని అనుకున్నాడు కమలాకర్.

"నమస్తే సార్.. పిలిచారట" అంటూ వచ్చాడు కపర్ది మేనేజర్ గదిలోకి.


"అవును. రండి..కూర్చోండి"

"చెప్పండి సర్"

"ఏంలేదు కపర్ది. హెడ్డాఫీసు నుంచి వత్తిడి మరీ ఎక్కువగా ఉంది. ఏదో రకరకాల డేటా అడుగుతున్నారు. ఒకటి ఇస్తే మరోటి. దానికి తోడు కస్టమర్ల నుంచి కూడ ఫిర్యాదులు పెరిగాయి. ఆల్టర్నేట్ ఛానల్ సేవలు అర్థంగాక, ఏదో ఒక తప్పు చేసి ఒకటే గోల పెడుతున్నారు. అందుకని ఈ విషయంలో నీ సహాయం కావాలి"
"చెప్పండి సర్.. నన్ను ఏం చెయ్యమంటారు?"

"ఏం లేదయ్యా. సాయంత్రం ఒక గంట అదనంగా ఉన్నావంటే అన్ని పనులు ఇబ్బంది లేకుండా అయిపోతాయి!"
"సాయంత్రం కష్టం సార్. ఉండలేను. నేను రాగానే ఏ పని చెయ్యాలో అప్పుడే చెప్పేయండి. ఆరు లోపలే పూర్తి చేసి వెళ్ళిపోతాను!"

"అలా కుదరదండి. ఎందుకంటే హెడ్డాఫీసు వాళ్ళు ఎప్పుడు ఏమడుగుతారో తెలియదు కదా! అడిగిన వెంటనే గంటలోపే ఇమ్మంటారు. అందుకని కొంచెం వీలుపడేలా చూడండి!"



"సారీ సర్. సాయంత్రం మాత్రం కుదరదు. కావాలంటే ఉదయం ఒక గంట ముందు రాగలను. కానీ సాయంత్రం మాత్రం రాలేను సర్"

"మరీ అంత మొండిగా రానంటారేమిటి" గొంతులో కొంచెం కాఠిన్యత పెంచి అడిగాడు కమలాకర్.

"సర్. మీకు కావలసింది పని. అందుకే ఉదయం వస్తానన్నాను"

"కానీ నాకు కావలసింది సాయంత్రం!"

"క్షమించండి సర్. సాయంత్రం ఆరు దాటి ఒక్క నిముషం కూడ నేను ఉండలేను. మీ మాట కాదన్నందుకు క్షమించండి. మీకు అంగీకారమైతే ఉదయం తొమ్మిదికి వస్తాను!" అని లేచాడు కపర్ది.

"అయితే మీకు సాయంత్రం ఉండడానికి కుదరదంటారు!" నిష్ఠూరంగా అన్నాడు కమలాకర్.

"సార్ మీరేమనుకున్నా సరే. ఆ ఒక్కటి మాత్రం నేను అంగీకరించలేను. దయచేసి అర్థం చేసుకోండి!" అని మేనేజరుకు నమస్కరించి వెళ్ళిపోయాడు కపర్ది.

కపర్ది మాటలకు ఆవేశం రాలేదు కమలాకర్‌కు ఏ పని చెప్పినా 'నో' అని చెప్పడానికి ఇష్టపడనివాడు, ఇంత గట్టిగా ఉండలేను అంటున్నాడంటే దానికి ఏదో బలమైన కారణం ఉండి ఉండాలి. ఒకవేళ చెప్పేదయితే ఇప్పుడు చెప్పివుండేవాడు. చెప్పలేదంటే ఆ కారణమేదో తెలుసుకోవాలి అనుకున్నాడు కమలాకర్.

★★★

కపర్ది వెళ్ళిన అరగంట తరువాత లేచాడు కమలాకర్. వెంకటేశును అడిగి అడ్రసు తీసుకుని కపర్ది ఇంటికి బయలుదేరాడు. ఓ పావుగంట స్కూటర్ మీద ప్రయాణం చేసి కపర్ది ఇంటికి చేరాడు. బాగా పాతబడిన ఇల్లు అది. చుట్టుపక్కల వాళ్ళను అడిగి నిర్ధారించుకుని ఇంటి బయట నిలబడి కాలింగ్‌బెల్ నొక్కాడు. ఒక చిన్న పాప వచ్చి తలుపు తీసి "ఎవరు కావాలండీ" అని అడిగింది. పచ్చని మిసిమి ఛాయతో, చారెడేసి కళ్ళతో పుత్తడిబొమ్మలా ఉంది.

"కపర్ది గారు ఉన్నారా తల్లీ" అడిగాడు కమలాకర్.

"మా నాన్నగారా... ఉన్నారండి. రండి. సోఫాలో కూర్చోండి" అని చెప్పి లోపలికి పరిగెత్తింది "నాన్నా" అంటూ. ఓ రెండు నిముషాలలో తిరిగివచ్చి"నాన్నగారు తాతయ్యకు అన్నం తినిపిస్తున్నారు. ఒక్క అయిదు నిముషాలలో వస్తారు. మంచినీళ్ళు తెస్తానుండండి!" అని తుర్రుమంది.

ఆ పాప రూపమే కాదు, మాటతీరు, సంస్కారం అన్నీ నచ్చాయి కమలాకర్‌కు ఎంత బాగా పెంచుతున్నారు పాపను. మంచి సంస్కారం కల కుటుంబం అనుకుంటూ గది నలువైపులా పరికించి చూశాడు. గోడ మీద ఉన్న ఒక స్త్రీ చిత్రపటానికి పూలమాల వేసివుంది. పోలికలన్నీ కపర్దివే అని అనిపించి, బహుశ కపర్ది తల్లిగారేమో అనుకుంటుండగా మంచినీళ్ళ గ్లాసుతో వచ్చింది ఆ పాప. గ్లాసు తీసుకుని మంచినీళ్ళు తాగి తిరిగి గ్లాసు పాపకిచ్చే సమయంలో "ఎవరండీ" అంటూ బయటకు వచ్చాడు కపర్ది.

"సార్... మీరా. ఏమిటిలా వచ్చారు. ఏమైనా అర్జంటు పనిబడిందా?" ఆతృతగా అడిగాడు కపర్ది.

"పనేమీ లేదు కపర్ది. ఎందుకో మీ ఇల్లు చూడాలనిపించింది, వచ్చాను. నాన్నగారికి భోజనం పెడుతున్నావట. మీ శ్రీమతి గారు ఊరెళ్ళారా?"

"లేదు సర్... ఉన్నది. కానీ మా నాన్న గారికి భోజనం నేనే పెడతాను. అది నాకు ఒక తృప్తి!"

"ఈ వయసులో కూడ కొడుకు చేత అన్నం పెట్టించుకుని తింటున్నారంటే ఆయన చాలా అదృష్టవంతులు. ఆయన్ను ఒకసారి పిలవగలవా?"

"అదీ...సార్..ఆయన" అని ఏదో చెప్పబోతున్నంతలో కాఫీ గ్లాసుతో వచ్చింది కపర్ది భార్య సుకన్య.

"సార్... కాఫీ తీసుకోండి" అని గ్లాసు కమలాకర్‌కు ఇచ్చింది.

"సర్. ఈమె నా భార్య సుకన్య. ఇందాక మిమ్మల్ని కూర్చోమని చెప్పింది నా కూతురు ప్రమిద. మా నాన్నగారు లేచి రాలేరు. ముందు మీరు కాఫీ తీసుకోండి. తరువాత నాన్నగారి దగ్గరకు తీసుకు వెళతాను!" అన్నాడు కపర్ది.

"సుకన్య గారు కూడ ఉద్యోగం చేస్తున్నారా!" కాఫీ సిప్ చేస్తూ అడిగాడు కమలాకర్.

"లేదు సర్. తను సంగీతంలో పోస్టుగ్రాడ్యుయేషను చేసింది. ఇంటి దగ్గరే ఓ పదిమంది విద్యార్థులకు సంగీతం నేర్పుతుంది. నాన్నగారిని ఒంటరిగా వదిలేసే పరిస్థితి కాదు!" చెప్పాడు కపర్ది.

"థాంక్స్ అమ్మా" అంటూ గ్లాసు సుకన్య చేతికిచ్చి లేచాడు కమలాకర్.

"ఫర్వాలేదండీ" అని బదులిచ్చి వెళ్ళిపోయింది సుకన్య.

"రండి సార్" అని కమలాకర్‌ను తండ్రి వున్న గదిలోకి తీసుకువెళ్ళాడు కపర్ది.

మంచంలో వున్న కపర్ది తండ్రి వీళ్ళను చూడగానే లేవడానికి ప్రయత్నించాడు. కానీ సాధ్యపడక మరలా పడుకున్నాడు. కపర్ది కమలాకర్‌ను అక్కడ వున్న కుర్చీలో కూర్చోమని చెప్పి తండ్రిని నెమ్మదిగా లేపి కూర్చోబెట్టాడు. "నాన్న... ఈయన మా మేనేజరు గారు. పేరు కమలాకర్"

"నమస్కారం బాబూ. చాలా సంతోషం. ఈ సమయంలో వచ్చారు. ఏదైనా అర్జంటు పనిబడిందా?" అంటూ కుడిచేతిని మాత్రం పైకిలేపాడు. పక్షవాతానికి గురయిన మనిషని అర్థమయింది కమలాకర్‌కు.

"అబ్బే లేదండీ. ఎందుకో ఒకసారి ఇక్కడికి రావాలనిపించింది. అందుకే వచ్చాను!"

"మీరు చాలా మంచివారని, ఎవరినీ ఇబ్బంది పెట్టరని, పనిమీద ధ్యాస తప్ప వేరేధ్యాస ఉండదని మావాడు చెప్పాడు. మీలాంటి వాళ్ళ వలనే నాయనా వ్యాపారాల వృద్ధి జరిగేది. నావల్ల మావాడు ఎక్కువ సమయం బ్యాంకులో గడపలేక పోతున్నాడు. ఆలస్యమయినా పర్వాలేదురా అంటే వినడు. రేపో, మాపో రాలిపోయేవాడిని నాకోసం వాడి కెరీరంతా పాడుచేసుకుంటున్నాడు. మమ్మల్ని క్షమించండి బాబు!" అని చెబుతున్న తండ్రికి కపర్ది అడ్డుతగిలాడు.

"నాన్నా... అవన్నీ ఇప్పుడెందుకు. ఆయన ఏదో మనల్ని చూడాలని వచ్చారు. ఆయన్నిలా ఇబ్బంది పెట్టడం భావ్యం కాదు. మేమలా హాలులో కూర్చుని మాట్లాడుకుంటాము నాన్నా. ఓ అరగంట మీరు విశ్రాంతి తీసుకోండి" అన్నాడు కపర్ది.

"ఏదో నాయనా! వయసు మీద పడి వచ్చిన వాచాలత్వం. తప్పుగా అనుకోకు. మా ఇల్లు వెతుక్కుంటూ వచ్చి నన్ను పలకరించినందుకు చాలా సంతోషం. చల్లగా ఉండు బాబు!" అని కమలాకర్‌ను చేయెత్తి దీవించాడు. అప్రయత్నంగానే తలవంచి ఆయన పాదాలకు నమస్కరించాడు కమలాకర్.

కపర్ది తండ్రి దగ్గర సెలవు తీసుకుని కపర్దితో కలిసి హాలులోకి వచ్చాడు. అతని మనసంతా కకావికలమై పోయింది. మనసులో ఏవో ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి అతనికి.

"సారీ సర్... నాన్నగారు..."

"మనసులో మాట చెప్పారు. నువ్వే నన్ను క్షమించాలి కపర్ది. రోజూ ఠంచనుగా ఆరు కొట్టేసరికి ఇంటికి వెళుతుంటే ఏమి చెయ్యడానికోనని రకరకాల ఆలోచనలు చేశాను. వచ్చి చూశాక గానీ అర్థంకాలేదు, నీ ఉన్నతమైన మనసు! నీలాంటి కొడుకును కన్న నీ తండ్రి చాలా అదృష్టవంతుడు. నిజం చెప్పు నీ తండ్రిని చూసుకోవడానికేగా నువ్వు ఇంటికి వచ్చేది"

"అవును సర్. ఇది గొప్ప విషయం కాదు సర్ చెప్పడానికి. ఇది నా బాధ్యత. ఉద్యోగిగా సమయానికి ఆఫీసుకు రావడం ఎంత ముఖ్యమో, నాకు ఇది కూడ అంత ముఖ్యం. నాకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు సేవచేయడం ఏదో గొప్ప పనిగా చేసి చెప్పాలనిపించలేదు. చిన్నతనంలో మనం స్కూలుకు వెళితే మనం వచ్చేవరకు ఎదురు చూస్తుంటారు వాళ్ళు. కానీ ఆ వయసులో వాలని ఆ కనురెప్పల విలువ మనకు తెలియదు. మనం ఎదిగి మన పిల్లల కోసం ఎదురుచూస్తున్నపుడు దాని విలువ తెలుస్తుంది. ఇప్పుడు కూడ నాన్నగారు వాలని కనురెప్పలతో ఆరుగంటల నుంచి నాకోసం చూస్తుంటారు సర్. మా తల్లి కాలం చేసిన తరువాత సంవత్సరం లోపే నాన్నగారికి పక్షవాతం వచ్చి ఒక కాలు, ఒక చెయ్యి స్వాధీనం లేకుండా పోయాయి. అప్పటినుంచి ఆయన బాధ్యతను తీసుకున్నాను సర్. ఉదయం బ్యాంకుకు వచ్చేలోపే స్నానం చేయించి, టిఫిన్ తినిపించి

వస్తాను. మధ్యాహ్నం భోజనం సుకన్య పెడుతుంది. సాయంత్రం నేను వచ్చి నాన్నకు భోజనం తినిపించి, ఒక గంటసేపు పురాణమేదైనా చదివి వినిపిస్తాను. ఇది నా దినచర్య! సుకన్య మా నాన్నకు కోడలు కాకముందే మేనకోడలు సర్. నాన్నను తనే చూసుకుంటానంది. కానీ నాకు అది కరెక్టు కాదనిపించింది. నన్ను పెంచిన నాన్నగారికి నేనే సేవ చేయాలనిపించింది. చిన్నతనంలో ఆయనకు నేను పసిబిడ్డ, ఇప్పుడు నాకు ఆయన పసిబిడ్డ. ఆయనకంటే ఏ విదేశీయానాలు, ప్రమోషన్లు నాకు ముఖ్యం కాదు సర్. నా రాకకోసం ఎదురుచూసే వాలని ఆ కనురెప్పలు, నా ఒడిలో సేదదీరుతూ వాలిపోవాలే గానీ, నా కోసం ఎదురుచూస్తూ వాలిపోకూడదు. అదే సర్ నా కోరిక. దానికోసమే నేను బ్రతుకుతున్నాను. బ్రతికినంత కాలం బ్రతకరు కదా సర్ ఆయన. ఆయన మనసుకు తృప్తి కలిగించేలా గడపడమే నా ధ్యేయం!" చెబుతున్నపుడు కపర్ది కళ్ళు చెమర్చాయి.

కమలాకార్‌కు ఏం మాట్లాడో తెలియలేదు. కపర్ది చెప్పినమాట నిజమే. పసితనంలో తల్లిదండ్రులు బిడ్డలను కళ్ళల్లో పెట్టుకుని కనురెప్పలను కాపలా చేసి కాపాడుకుంటారు. పెద్దవయసులో వారిని పిల్లలు కూడ కనురెప్పలై కాపాడుకోవాలి. జీవితసత్యాన్ని ఎంత చక్కగా చెప్పాడు. ఉండబట్టలేక లేచి కపర్దిని ఆలింగనం చేసుకున్నాడు. "కొడుకంటే ఎలా ఉండాలో కళ్ళకు కట్టినట్టు చూపించావు కపర్ది. ఇక ఏ రోజూ నిన్ను సాయంత్రం వేళ ఉండమని అడగను. ఏ ఉద్దేశ్యంతో వచ్చినా, మారిన మనసుతో వెళుతున్నాను. నువ్వు నువ్వులానే ఉండు. నూరేళ్ళ వరకు నీ తండ్రి కనురెప్పలు వాలకూడదు. నువ్వు వాలనివ్వకు కపర్ధీ. ఉంటాను!" అని వెళ్తున్న కమలాకర్‌ను గేటు వరకు వెళ్ళి సాగనంపి వచ్చాడు కపర్ది.

★★★

"హలో సర్.. ఇప్పుడు సమయం ఏడుగంటలయింది. నేను ఇంటికి వెళ్ళాలి. రేపు ఉదయం వచ్చిన తరువాత పంపిస్తాను!" ప్రశాంతంగా హెడ్ ఆఫీసు వాళ్ళకు చెప్పి ఇంటికి బయలుదేరాడు కమలాకర్.

ఎందుకో తెలుసా?

తన పనికి అడ్డమని చెప్పి పల్లెలో ఉంచిన తండ్రిని తన దగ్గరకు తెచ్చుకున్నాడిప్పుడు. ఇప్పుడు వెళుతున్నది తండ్రి సేవ కోసమే. ఈ విషయంలో కపర్దికి ఋణపడి ఉంటానని ప్రతిక్షణం అనుకుంటుంటాడు కమలాకర్.

★★★★★

# ప్రమోషన్

బి. నర్సన్



9440128169

**కథామంజరి నిర్వహించిన దీపావళి కథల పోటీ 2022 లో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ**

***"ఏమిటి! ఎందరోనా.. రోడ్డు, మున్సిపల్ పార్క్ వాళ్ళ కుక్కల దొడ్లా.. ఆ మాత్రం కామన్‌సెన్స్ లేకుంటే ఎట్లా? నేను రేపు మీ వెంట వస్తాను.. వాళ్ళ ఫోటోలు తీసి మునిసిపాలిటి పంపుదాం. మిగితాది వాళ్ళే చూసుకుంటారు!" అంది నీరజ ఆవేశంగా.***

పెంపుడు కుక్కలను మలమూత్ర విసర్జనల కోసం పొద్దుటే ఇంటి నుంచి రోడ్డు మీదికి తేవడం మనలో చాలా మందికి హక్కులాంటి అలవాటు. అలాంటి ఒకాయన మెడకు బెల్టున్న కుక్కను తీసుకొని, తమ ఇంటికి కొద్ది దూరంలో ఉన్న మున్సిపల్ పార్కులోకి వచ్చాడు. పార్కులో ఓ మూలన ఊడ్చి, కుప్ప చేసిన చెత్త దగ్గరికి వెళ్లి, చేతిలో ఉన్న బెల్ట్ కొసను వదిలిపెట్టాడు. కుక్క మెల్లగా కుప్పపైకెళ్ళగానే, ఓ మూలన కాలెత్తి మూత్రం పోసింది. ఆ తర్వాత అది రెండో పని కూడా చేయాలి. ఇలా రావడం అలా పోవడం రోజూ జరిగే జీవక్రియలే. ఆయన చేతిలోని మొబైల్‌ను, మధ్య మధ్యలో కుక్కను చూస్తున్నాడు. కుక్క ముక్కుతో చెత్తను వాసన చూస్తూ అటు ఇటు తిరుగుతుంది కానీ, పొట్టలో చెత్తని ఖాళీ చేసేందుకు వెనుక కాళ్ళు వంచడం లేదు. చూసి చూసి విసుగొచ్చి ఆయన ఇక వెల్దామన్నట్లు బెల్టు కొసను తీసుకొని కుక్కను లాగాడు. యజమాని ఆజ్ఞలా అది ఆయన దగ్గరికొచ్చింది. తిరిగి ఇంటికెళ్లేందుకు ఆయన పార్క్ గేటు వైపు అడుగులు వేస్తున్నాడు. మొబైల్ చూసుకుంటూ ముందు ఆయన, మెడలో బెల్టుతో వెనుకాల శునకం నడుస్తుండగా బెల్టు బిగిగా ఉండేసరికి ఆయన వెనక్కి తిరిగి చూశాడు. కుక్క శరీర వెనుక భాగం వంచి నిలబడిపోయింది. చూస్తుండగానే పార్క్ వాకింగ్ బాటపై మలాన్ని వదిలింది. కింది చూపులతో ఆయన అటు ఇటు చూసి, గబ గబా కుక్కను లాక్కుంటూ ఇంటి దారి పట్టాడు.

సతీష్ అదే పార్కులో మార్నింగ్‌వాక్ చక్కర్లు కొడుతున్నాడు. పార్కుకు నడిచి వచ్చేంత దూరంలో నాలుగు అపార్ట్‌మెంట్‌ల ఆవల వారి ఫ్లాట్ ఉంది. ఉద్యోగపరంగా స్టేట్‌బ్యాంకులో ఆఫీసర్ హోదా ఆయనది. అడగగా అడగగా ఆయనకు హైదరాబాద్‌కు పోస్టింగ్ దొరకగా, రిపోర్ట్ చేసిన వారం రోజులకే బ్రాంచ్ ఆడిట్ మొదలైంది. ఇవ్వాళ్ళ ఫీల్డ్ విజిట్‌కి ఆడిటర్‌ని తీసుకెళ్లి యూనిట్లు చూపించాలి. యూనిట్లు అంటే బ్యాంకు లోన్ పొందిన వ్యాపారాలు, వాహనాలు లాంటివి. వచ్చి వారమే అయినందువల్ల వాటిని తానే చూడలేదు. అది ఆడిటర్‌కు అనవసరం. వేటిని చూపించమంటాడో ఏమిటో.. అని మనసు పరాకుగా ఉంది. పార్కుకు వచ్చి ముప్పావు గంటైంది. శరీరం కన్నా మెదడే బరువనిపించి బయటికెళ్లేందుకు గేటు వైపు వెళుతూ సతీష్ నడిబాటలో ఆ కుక్క వదలిన మలాన్ని తన కాన్వాసు షూతో తొక్కేశాడు. ఆయన మనసు ఆ విషయాన్ని గమనించే స్థితిలో లేదు. నడుస్తుండగా దానికదే కొంత రాలిపోయి షూ అడుగు కోతల్లో కొంత మిగిలిపోయింది. అడుగులు పడి, మట్టితో కలిసి అది గట్టిపడిపోయింది. లిఫ్ట్‌లో తన ఫ్లాట్‌కు వెళ్లిన సతీష్ బాల్కనీలోని రాక్‌లో షూ పెట్టేసి డ్యూటీకి సిద్ధమయ్యే పనిలో పడ్డాడు. 'రాగానే టిఫిన్ చేస్తాను. రెడీగా ఉంచు' అని శ్రీమతి నీరజకి ఆర్డర్ వేస్తూ బాత్రూములోకి దూరాడు. ఊదుకుంటూ సాంబారు ఇడ్లీలు మింగి బయటపడ్డాడు.

నీరజ కూడా ఉద్యోగినే. ప్రయివేటు బ్యాంకులో సీనియర్ అసిస్టెంటు. ఇవాళ ఆమెకు ప్రమోషన్ ఇంటర్వ్యూ ఉంది. తొలిసారిగా


తనకు ఆఫీసర్ అయ్యే అవకాశమది. అరగంట ముందే ఆఫీసులో ఉండాలని కాల్ లెటర్‌లో ఉంది. తొందరగా బయటపడాలని నీరజ వేగిర పడుతోంది. రోజూ డ్యూటీకి వెళ్లే ముందు వయసు పైబడిన అత్తగారికి గదిలో అన్నీ మంచం దగ్గర సర్దిపెట్టాలి. కొద్దిసేపటి క్రితమే ఆమెను కూచోబెట్టి టిఫిన్ అందించింది. ఆ తర్వాత మందు గోళీలు ఇచ్చి వేసుకున్నాక మంచం మీద పడుకోబెట్టింది. ఈపాటికి పెద్దావిడ కునుకులోకి జారుకోవడం పరిపాటి. గోడకున్న గడియారం వంక చూస్తూ బాత్రూమ్‌లోకి వెళుతుండగా అత్తగారు పిలిచినట్లనిపించింది.

"నీరజా!" గదిలోంచి రెండో పిలుపు బయటికి వచ్చింది.

పిలుస్తున్నది నిజమే. "వస్తున్నానండీ!" అంటూ బాత్రూములో టవల్ వేసి, అత్తగారి దగ్గరికెళ్లింది.

ముక్కు ముడుస్తూ పెద్దావిడ "పొద్దటి నుండే ఏదో మా చెడ్డ వాసనొస్తుందే.. ఎలుక గాని చచ్చిపోయిందా!" అంది.

"ఛ.. ఛ.. మనింట్లో ఎలుకలెక్కడివి.." అంటుండగానే తనక్కూడా ఆ వాసన ముక్కుకు తగిలింది. అటాచ్డ్ బాత్రూము తలుపు తెరిచి చూసింది. అదే వాసన వస్తోంది. ఓ సారి ఫ్లష్‌ని ప్రెస్ చేసి నీళ్లు వదిలింది.



"ఇక రాదు. మీరు పడుకోండి!" అంటూ దుప్పటిని ఆమె భుజాల దాకా సర్ది హడావుడిగా బాత్రూములోకి దూరింది.

ఇంటర్వ్యూ లిస్టులో మొదట్లోనే తన పేరుంది. వేళ ప్రకారం లేకపోతే ఆఫీసరు అయ్యే తొలిసారి చాన్సుకు నీళ్లొదులుకున్నట్లే... అనుకుంటూ నోట్లో ఇడ్లీలను కుక్కుకుంటోంది.

"నీరజా.. వాసన పోలేదమ్మా!" అని అత్తగారి మాట వినిపించింది.

ప్లేట్లో చేయి కడిగేసి ఆవిడ దగ్గరికి వెళ్ళింది.

నిజమే, వాసన అలాగే ఉంది. ఇటు వాసన.. అటు ఇంటర్వ్యూ.. ఏం చేసినా తొందరగా చేసెయ్యాలి. బాత్రూములో ఎయిర్ ఫ్రెషనర్ పాకెట్‌ను మార్చేసింది. మంచం కిందా, గది మూలలకి పరీక్షగా చూసి, కప్‌బోర్డు తలుపులు తెరిచి ఫ్యాన్ స్పీడును కొంత పెంచింది.

హ్యాండ్‌బ్యాగులో అన్ని ఉన్నాయా అని ఓసారి తెరిచి చూసుకొని "వస్తానత్తయ్యా!" అంటూ బాల్కనీలోకి వెళ్లి చెప్పులేసుకొని మెయిన్‌డోర్ దగ్గరికి వచ్చింది.

"నీరజా.. వాసన పోలేత్తల్లీ!" అని కాస్త గట్టిగానే అంది పెద్దావిడ భరించలేకపోతున్నానన్నట్లు.

తలుపు దగ్గరే చెప్పులు వదిలేసి నీరజ అత్తగారి దగ్గరికొచ్చింది. నిజమే పెద్దావిడననేదేముంది. వాసన అదరగొడుతోంది. అత్తగారి డైపర్ నుంచేమైన వస్తుందా అన్నట్లు ఆమె నడుం దగ్గర వంగి ముక్కుపై మనసు పెట్టింది.

"ఆ విషయం నాకు తెలియదా.. రోజూ పొద్దుటే ఒక్కసారి దొడ్డికెళ్తా.. అంతే." అని నొచ్చుకుంది పెద్దావిడ.

"అయ్యో అత్తయ్యా.. మీరు తప్పుగా అనుకోకండి!" అంటూ కిటికీకి ఆనుకోని చేతులు పిసుక్కుంటూ నిలబడింది. మంచానికీ బాల్కనికీ మధ్యలో గోడ ఉంటుంది. మంచంపై కూచుంటే గాలి తగిలేలా, బయటకు కనబడేలా గోడ మధ్యన పెద్ద కిటికీ ఎప్పుడూ తెరిచే ఉంటుంది. గాలితో పాటు కిటికీ గుండా వాసన విసిరి కొడుతోంది. అనుమానంగా నీరజ బయటికెళ్లి చెప్పుల దగ్గరికెళ్లింది. తను చెప్పులేసుకున్నా హడావుడిలో గ్రహించలేదు గాని, వాసన ఇక్కడే ఉంది అనుకుంటూ అన్ని చెప్పుల్ని తిరగేసి చూసింది. సతీష్ వాకింగ్ షూ గాట్లనిండా నల్లగా అతుక్కుని కుక్క మలం కనబడి తల తిప్పేస్తోంది. ఎడమ చేత్తో పట్టుకొని వాష్ ఏరియాకి తీసుకెళ్లి నేలకేసి కొడుతూ శుభ్రంగా కడిగింది. అంతా మరిచినట్లు నీరజ తన పనిలో తానుండగా గడియారం పరుగులు పెడుతోంది. ఆఫీసుకు చేరే సరికి అరగంట ఆలస్యమైంది. తన తర్వాత వెళ్లాల్సినాయన ఇంటర్వ్యూ గదిలో ఉన్నాడు.

తల పట్టుకొని కుర్చీలో కూలబడింది నీరజ. ఇంటర్వ్యూకు టీ బ్రేక్ ఇచ్చారు. బ్యాగులోంచి మొబైల్ తీసి తన బాస్ నెంబర్‌కి 'తన ఆలస్యానికి మన్నించి ఇంటర్వ్యూకు అవకాశం ఇవ్వండి.. ప్లీజ్!' అని మెసేజ్ పంపింది. కొద్దిసేపటికి జవాబు వచ్చింది. 'ముంబై నుంచి వచ్చిన ఏ జి ఎం చాలా సీరియస్‌గా ఉన్నాడు. నీ ఆబ్సెంట్‌కు వాట్ నాన్సెన్స్ ఈజ్ దిస్, ప్రమోషన్ అవసరం లేకుంటే ముందే చెప్పాలి అని నా మీద విరుచుక పడ్డాడు. నీవు వచ్చావని చెప్పడానికి ధైర్యం చాలడం లేదు. సారీ'.. అని ఉంది దాంట్లో. ఇంటర్వ్యూ గదిలోకి పోవడానికి ఆమెకు మరే దారి తోచడం లేదు. చివరి దాకా వేచి చూద్దామని అక్కడే కూచుంది. సీనియారిటీ ప్రకారం ఎదురు చూడగా చూడగా వచ్చిన ప్రమోషన్ అవకాశం ఇది. ఇంటికి దగ్గరగా ఉన్న ఆఫీసు. మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళ్లి అత్తగారిని చూసుకొని ఆఫీసుకు వచ్చేస్తుంది. ఈ మధ్యనే ఆఫీసులోకి కొత్తగా ఇద్దరు అసిస్టెంట్లను తీసుకున్నారు. నీకు ప్రమోషన్ వస్తేనే ఈ ఆఫీసులో కొనసాగవచ్చు. సరిపోయే అసిస్టెంట్లు ఉన్నారు కాబట్టి నీకు ట్రాన్స్‌ఫర్ తప్పదు అని ఇప్పటికే బాస్ చెప్పి ఉంచాడు. రాబోయే కష్టాలను తలుచుకుంటే నీరజకు దుఃఖం వస్తోంది. బాధ పంచుకుందామని సతీష్‌కు ఫోన్ చేసింది. ఫీల్డ్ విజిట్‌లో ఆయనెక్కడున్నాడో కవరేజి ఏరియాలో లేడని ఫోను చెబుతోంది. ఇంటర్వ్యూకు హాజరైన చివరి మనిషి బయటకొచ్చాడు. లోపలి నుంచి ఏ అలికిడి వినిపించడం లేదు. బ్యాగులోంచి మొబైల్ తీసుకొని బాస్‌కు రింగ్ చేసింది. ఆయన ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తోంది. తానే వెళ్లి రిక్వెస్ట్ చేద్దామని లేచింది. అప్పుడే బయటికి వచ్చిన ముంబై ఏ జి ఎం ఆమె ముందు నుంచే సరసరా నడుచుకుంటూ వెళ్లి కారులో కూచున్నాడు. కారు వెళ్ళిపోయింది. దాంతో నీరజ ప్రమోషన్ ఆశ కూడా కొట్టుకుపోయింది.

ఇంటికెళ్ళాక ఆక్రోశాన్ని అంతా సతీష్‌పై చూపింది. ఆయన వెళ్ళిపోయాక వచ్చిన వాసన సంగతి, దాన్ని దొరికించుకుని కడిగిన సంగతి చెబుతూ "షూకు గలీజు అంటితే తెలియలేదా.. చక్కగా దాంతోనే ఇంట్లోకి వచ్చావ్.. ఇంత చిక్కు తెచ్చావ్!" అని గట్టిగా అంటూ ఏడ్చింది.

"నీకు రాసుంటే రాకుండా పోయేదా .. అంత బాధ పడకే పిల్లా.." అంటూ మంచం మీది నుంచి ఓదార్చింది అత్తయ్య.

చేసేదేమిలేక తల విదుల్చుకొని స్టవ్‌పై పాలు పెట్టి బాత్‌రూమ్‌లోకి వెళ్ళింది.

ఇంటర్వ్యూ ఫలితాలతో పాటు ట్రాన్స్‌ఫర్ అయిన ఉద్యోగుల లిస్టు కూడా బయటకొచ్చింది. నీరజకు హైదరాబాద్ నుండి రెండు గంటల ప్రయాణం పడే వికారాబాద్‌కు బదిలీ అయ్యింది. నగరంలో రాను పోను నాలుగు గంటలు ప్రయాణించి నీరసపడే కన్నా అక్కడే ఓ గది తీసుకోని ఉంటూ వారాంతాల్లో రావడం మేలని నిర్ణయమైంది. సతీష్ హైదరాబాద్‌కు వచ్చి పది రోజులైనా కాకముందే నీరజ పెట్టా బేడా సర్దుకోవడం ఉద్యోగ దంపతులు తప్పించుకోలేని ఓ విషాద సందర్భం. ఇంతకాలం

అత్తగారిని చూసుకునేందుకు వీలుగా ఉన్న సకల వసతులు చేజారిపోయాయి. నీరజ వికారాబాద్‌లో రిపోర్ట్ చేసే ముందే జాయినింగ్ టైమ్ సమయంలో భూలక్ష్మి అనే ఒక మంచి పనమ్మను వెదికి పట్టుకొని పొద్దుటే వచ్చి రాత్రి దాకా ఇంట్లోనే ఉంటూ, అత్తగారి అవసరాలు తీరుస్తూ ఇంటిపని, వంటపని చేసేలా ట్రైనింగ్ ఇచ్చింది. నెలకు ఇరవై వేల జీతంతో పాటు ఆదివారం సెలవు ఇయ్యడంతో ఆమె సంతృప్తిగా, సక్రమంగా అన్ని పనులూ చేస్తోంది. వికారాబాద్ బ్రాంచిలో కొత్తగా చేరిన ఓ అమ్మాయితో కలిసి ఒక బెడ్‌రూమ్ పోర్షన్‌లో నీరజ కాలం గడుపుతోంది.

సెలవుల్లో ఇంటికెళ్ళినపుడు అత్తగారు నీరజ సేవలను భూలక్ష్మి పనులను పోల్చుకుంటూ మాట్లాడేది. "సతీష్ చేస్తున్నాడు కదా నీవు సెలవు పెట్టరాదా.." అని, "శుభమా అని వాడు ఇంటికొస్తే నీవు మరో చోట ఉండడం అవసరమా" అనేది. కోడలు కడుపులో ఓ కాయ కాస్తే చూసి మురవాలని ఆమె మనసులో ఉంది. పెళ్లయి మూడేళ్లయినా సతీష్ వేరే చోట ఉండడం, ఇద్దరూ ప్రమోషన్ సాధించాలని ప్రెగ్నెన్సీని వాయిదా వేయడంతో కాలమిలా పెద్దావిడకు కాస్తా నిరాశాజనకంగా గడిచిపోతోంది.

"నెల తప్పినవారికి ఆరు నెల్లు సెలవులిస్తారేమో కదరా.. కోడలు ఆ ఊరు వెళ్ళే బదులు సెలవులపైనా ఇక్కడే ఉంటుంది. అలా బాగుంటుంది కదా!" అని తన అంతరంగాన్ని బయటపెట్టేలా కొడుకుతో అంటోంది.

అలా చేస్తే నీరజకు వచ్చే యేడు ప్రమోషన్ సాధ్యం కాదేమో.. ఏది ఏమైనా 'ప్రమోషన్ ముందు.. పిల్లలు ఆ తర్వాత' అనేది వారి నిశ్చయ నిర్ణయం. పెద్దావిడతో ఇదంతా చెప్పకుండా చూద్దాం చేద్దాం అంటూ కాలం గడుపుతున్నారు.

ఆవిడేమో 'భూలక్ష్మి కూరలు బాగా చేయదని, శుభ్రంగా ఉండట్లేదని' తన వైపు నించి పాచికలు వేస్తోంది. ఆమె అలా పనమ్మపై ఎందుకు నెపం మోపుతుందో ఇద్దరికీ అర్థమవుతోంది. ఆవిడ ఆశ తీర్చే బాధ్యత తమదేనని కూడా వారికి పూర్తిగా తెలుసు.

యధావిధిగా కాలచక్రం తిరిగి ఏడాది తర్వాత నీరజకు మళ్ళీ ప్రమోషన్ అవకాశం వచ్చింది. అదే సమయంలో గత సంవత్సరం తనకు ప్రమోషన్ రాకపోవడానికి కారణమైన సంఘటన గుర్తొచ్చి ఆమెకు ఒళ్ళు మండింది. అలాంటి వారి వల్ల పర్యావరణ కాలుష్యమే కాకుండా తనలాంటి వారికి వ్యక్తిగతంగా కూడా జరుగుతున్న నష్టాలని వివరించి వాడిని చెడా మడా తిట్టాలనిపిస్తోంది.

అదే మాట సతీష్‌కు చెబుతూ "స్వామీ! మరిచిపోయాను. అసలు లాస్టియర్ నా ప్రమోషన్ ను దెబ్బ తీసిన ఆ కుక్క ఓనర్‌ను వదిలిపెట్టకూడదు." అంది.

"వాడెవడో నాకేం తెల్సు.. ఆలా కుక్కల్ని వెంటేసుకొని పొద్దున్నేదారెంటా, పార్కు బయటా లోపలా ఎందరో కనబడుతుంటారు. ఆ మనిషి ఎలా గుర్తుంటాడు!" అన్నాడు.

"ఏమిటి! ఎందరోనా.. రోడ్డు, మున్సిపల్ పార్క్ వాళ్ళ కుక్కల దొడ్లా.. ఆ మాత్రం కామన్‌సెన్స్ లేకుంటే ఎట్లా? నేను రేపు మీ వెంట వస్తాను.. వాళ్ళ ఫోటోలు తీసి మునిసిపాలిటి పంపుదాం. మిగితాది వాళ్లే చూసుకుంటారు!" అంది నీరజ ఆవేశంగా .

'ఊ..' అనుకుంటూ సతీష్ నిద్రలోకి జారుకున్నాడు.

పొద్దుటే ఆయన వెంట వాకింగ్‌కు రావడానికన్నట్లు నీరజ సిద్ధమైంది.

"నువ్వెందుకూ .. అయిందేదో అయిపోయింది." అన్నాడు సతీష్.

"లేదు.. నేనొస్తా! ఇది మన ఒక్కరి సమస్య కాదు. జరుగుతున్నదేమిటో చూడనీ.." అంటూ చెప్పులు వేసుకుంది.

దారెంట, పార్కులో పెంపుడు కుక్కల్ని తిప్పుతూ అవి అశుద్ధాన్ని వదిలేలా అలవాటు చేసినవారు తమ పనుల్లో బిజీగా ఉన్నారు. నీరజ తన మొబైల్‌తో మూత్రం, మలం విసర్జిస్తున్న కుక్కల ఫోటోలను యజమానులతో కలిపి దొరికిన మట్టుకు తీసింది.

ఇంటికి రాగానే కాఫీ తాగుతూ నీరజ పేపర్ చదువుతుంటే ఓ పేజీ లో 'మేమున్నాం... మీకు తోడుగా..' మీ ప్రాంతంలోని ఏ సమస్యనైనా పరిష్కరించే క్రమంలో మా పత్రిక మీకు తోడు నిలువనుంది. సమస్యను, చిత్రాలను వాట్సాప్ చేయడానికి ఫోన్ నెంబర్లు ఉన్న వార్త కనిపించింది. మొత్తం చదివితే పత్రిక ద్వారా తమ దృష్టికి తెచ్చిన సమస్యలకు సంబంధిత అధికారుల జవాబులు కూడా ఉన్నాయి. 'ఇదేదో బాగుంది. పంపి చూద్దాం' అని తాను తీసిన అశుద్ధ తతంగపు బొమ్మల్ని పంపింది.

నాల్రోజుల తర్వాత ఆ పత్రికలో నీరజ పంపిన బొమ్మలు, సమస్య దిగువన 'మా సిబ్బందిని పంపి తగిన చర్యలు తీసుకుంటాం' అని సానిటరీ ఇన్స్‌పెక్టర్ జవాబు కూడా ఉంది. దాన్ని చూడగానే ఓ యుద్ధం గెలిచిన ఆనందం కలిగిందామెకు. సతీష్‌కు చూపిస్తే.. "అలా రాగానే అన్నీ చక్కబడతాయా!" అని తేలిగ్గా అనేశాడు.

మర్నాడు వాకింగ్ నుంచి వచ్చిన సతీష్ " ఏమండోయ్ శ్రీమతిగారు.. మీ కృషి ఫలించింది, ఇవ్వాళ్ల నలుగురు మున్సిపల్ సిబ్బంది వచ్చి రోడ్లని పార్కు లోపల ఖరాబు చేస్తున్న కుక్కల్ని, పట్టుకు తిరుగుగుతున్న వారిని కనిపెట్టి ఒక్కొక్కరికి ఐదు వందల రూపాయలు పెనాల్టీ వేశారు. ఎన్ని చెప్పినా వదిలి పెట్టలేదు. అసలు పెట్స్‌ని పట్టుకొని పబ్లిక్ ప్లేసెస్‌లో తిరగడమే నేరమట. దానికి మున్సిపల్ పర్మిషన్ ఉండాలట. కుక్క ఎవరినైనా కరిస్తే యజమానిపై క్రిమినల్ కేసు పెట్టి జరిమానా జైలుశిక్ష కూడా వేస్తారట. ఇవన్నీ ఎవరికి తెలుస్తాయి.. దర్జాగా కుక్కల్ని పట్టుకొని తిరిగే వారంతా షాక్ అయ్యారనుకో!" అంటూ మెచ్చుకున్నాడు.

తెల్లవారితే ఇంటర్వ్యూ ఉండగా రాత్రి వేళ నీరజ తల ఒత్తుకుంటూ "ఇదేమిటి.. ఒంట్లో కొత్తగా నీరసంగా ఉంది" అంది.

"అనవసరంగా టెన్షన్ పడుతున్నట్లున్నావు.. ఈజీగా ఉండు డియర్!: అని సతీష్ తెలిసిన లేడి డాక్టర్‌ను ఇంటికి పిలిచాడు. టెస్ట్ శాంపిల్స్ తీసుకోని విటమిన్ టాబ్లెట్స్ రాసిచ్చింది. దాంతో నీరసం తగ్గి నీరజ ఇంటర్వ్యూను హుషారుగా పూర్తి చేసింది. పోయినేడు తాను సమయానికి రాలేకపోవడానికి కారణం, ఈసారి పెట్ డాగ్స్ ఓనర్స్‌కి పెనాల్టీలు వేయించిన తీరు అంతా వివరించింది. వెరీ గుడ్ అన్నారు. సాయంత్రమే ఫలితాలు పెట్టేశారు. తాను సెలెక్ట్ అయిన విషయం వెంటనే సతీష్‌కు ఫోన్లో చెప్పింది. సతీష్ కూడా రెండో శుభవార్తగా అప్పుడే డాక్టర్ చెప్పిన విషయాన్నీ నీరజకు చెప్పాడు. వారిద్దరి ఆనందం అంబరమైంది.

ఇంటికి చేరుకున్నాక తల్లి నోట్లో స్వీట్ ముక్క పెడుతూ సతీష్ "అమ్మా! ప్రమోషన్ నీ కోడలికే కాదు. నీక్కూడా వచ్చింది!" అన్నాడు.

"నాకెట్ల వస్తుందిరా.." అంది పెద్దావిడ ఏమీ అర్థం కానట్లు.

"నీవు నానమ్మవు కాబోతున్నావ్" అన్నాడు తల్లి పాదాల దగ్గర కూచొని.

ముఖమంతా ఆనందం నిండిన బోసినవ్వుతో "కోడలి నోట్లో రెండు పిడికిళ్లు చక్కెర పోయరా.." అంది కోడలికి వినబడేలా.

తెచ్చిన కాఫీ కప్పు పక్కన బెట్టి అత్తయ్య పాదాలకు దండం పెట్టి, ఆశీర్వాదం తీసుకుంది నీరజ.

★★★★★

# అమ్మ జీతం!

డా. ఎమ్. సుగుణరావు



✆ 9393129945

**కథామంజరి నిర్వహించిన దీపావళి కథల పోటీ 2022 లో ప్రోత్సాహక బహుమతి లభించిన కథ**

***మన అమ్మకు ఇంతకన్నా గొప్ప నిర్వచనం ఉందా? తల్లులంతా ప్రేమతో నిండిన బాధ్యతగా తమ డ్యూటీల్ని ఇళ్ళల్లోనే కొనసాగిస్తున్నారు. అలాంటి అమ్మలకు విలువ లేదనడం అన్యాయమే. శ్రీలత చెప్పిన విషయాల్ని ఆధారంగా చేసుకొని, దానితోపాటు గతంలో సుప్రీంకోర్టు వారిచ్చిన జడ్జిమెంటును అనుసరించి, జానకమ్మగారి క్లైం పెంచడానికి ఆమోద ముద్ర వేస్తున్నాను. అందుకు బీమా అధికారులు కూడా సహకరించాలి!" అన్నారు.***

ఒక ఇల్లాలు వీసా కోసం వెళితే, ఆ వీసా అధికారి ఆమెను 'మీరేం పనిచేస్తారు' అని అడిగాడట. 'నేను తల్లిని' అని అందట.

'మీ వృత్తి ఏమిటి' అని అడిగాడట.

'నేను ఇంట్లో కుటుంబ సభ్యుల బాగోగుల కోసం కృషి చేస్తాను. పిల్లల ఉన్నతి అనే లక్ష్యం దిశగా నా ఉద్యోగం సాగుతుంది. నాకు దీనికి ఇరవై నాలుగు గంటలు టైం పరిపోదు' అందట.

మన అమ్మకు ఇంతకన్నా గొప్ప నిర్వచనం ఉందా? తల్లులంతా ప్రేమతో నిండిన బాధ్యతగా తమ డ్యూటీల్ని ఇళ్ళలోనే కొనసాగిస్తున్నారు. అలాంటి అమ్మలకు విలువ లేదనడం అన్యాయమే.

అది ప్రభుత్వ ఆసుపత్రి. ఫోరెన్సిక్ డిపార్ట్‌మెంట్ ఎదురుగా ఉన్న మార్చురీ. దానికి కొంచెం దూరంలో నిలబడి ఉంది శ్రీలత. ఆ చుట్టుపక్కల ఆమె బంధువులు, ఇంకా అన్నయ్య, అక్క. అందరి మనసులు విషాదభరితంగా ఉన్నాయి. వచ్చిన ఆడవాళ్ళు ఏడుస్తూ ఉంటే, మగవాళ్ళు వారిని ఊరుకోబెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. శ్రీలతలో దుఃఖం కమ్ముకుంటూ వస్తోంది. అయినా అపుకోవడానికి ప్రయత్నం చేస్తోంది. రెండు రోజుల నుంచీ నిద్ర లేదు. కళ్ళు మూసుకుపోతున్నాయి.

'ప్రశాంతంగా, ఆనందంగా సాగిపోతున్న తమ కుటుంబంలో రెండు రోజుల క్రితం జరిగిన విషాదం. ఆగకుండా కన్నీరు, అపుకుందామనుకున్నా గుండుసూదితో గుచ్చితే వచ్చే రక్తంలాగా ధారాపాతంగా కన్నీరు. రెండ్రోజుల క్రితం తమ అందరి నవ్వుల్ని మాయం చేసింది విధి. అది ఒక లారీ రూపంలో తమ జీవితాల్లోకి దూసుకుంటూ వచ్చింది. ఉదయంపూట మార్నింగ్ వాక్‌కి వెళ్ళిన అమ్మను లారీ గుద్దేసింది. అమ్మ రోడ్డుమీద కుప్పలా కూలిపోయింది. తల చిట్లింది. ధారాపాతంగా రక్తం. వెనక వస్తున్న పాదచారులు అమ్మను దగ్గరలో వున్న ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఇరవై నాలుగు గంటలు సేపు పోరాడినా చావు ఆమెను ఓడించింది. రోడ్డు యాక్సిడెంట్ వల్ల అమ్మ మరణం జరిగింది కనుక పోస్ట్ మార్టం చేయాలంటూ పోలీసులు ఆమె నిర్జీవ దేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు. అమ్మ పార్థివ శరీరం మార్చురీ రూమ్‌లో ఉంది. ఇప్పుడు ఆమెకు పోస్ట్‌మార్టం జరుగుతోంది. ఆమె దేహాన్ని తెరిచి చూస్తారేమో. కానీ ఆ మనసును తెరవగలిగేదెవరు? ఆమె మనసు ఎంతమందికో ప్రేమను పంచింది. ఎందరికో సహనాన్ని నేర్పింది. క్షమను పంచింది'.. తల్లి గురించి మధనపడుతోంది శ్రీలత.

తల్లితో పాటు శ్రీలత ఒక్కతే ఆ ఊళ్ళో ఉంటోంది. ఆమె లా చదువు పూర్తి చేసింది. తండ్రి నుంచి వచ్చిన న్యాయవాద వృత్తిని స్వీకరించబోతోంది. సంపాదన కన్నా, పేదసాదలకు న్యాయం జరిగేలా చూసేవాడని తండ్రి గురించి చెప్పుకుంటారు. ఆయన తర్వాత ఆమెను లాయర్‌గా

చూడాలనుకుంది తల్లి. కొద్ది రోజుల్లో ఆమె లాయర్‌గా కోర్టు హాల్లోకి అడుగుపెట్టబోతోంది. అందుకోసం ఎంతో తపన పడింది. ఆమె కల తీరకుండానే ఈ లోకంలో నుంచి వెళ్ళిపోయింది.

ఆ విషయం గుర్తొచ్చి దుఃఖం మరింత ఎక్కువైంది.


కొన్ని నిముషాలు గడిచిన తర్వాత శ్రీలత బంధువు వచ్చి మెల్లగా చెప్పాడు,

‘‘అమ్మను మనకు ఇచ్చేస్తున్నారు, ఇంటికి తీసుకుపోవచ్చు. పోస్ట్‌మార్టం పూర్తయిపోయింది!’’ అన్నాడు మెల్లగా

ఇంకో అరగంట తర్వాత తెల్లటి బట్టల్లో ప్యాక్ చేసిన ఆమె పార్థివ శరీరం అంబులెన్స్‌లోకి ఎక్కించారు.

ఆరోజే కర్మకాండ ముగిసింది. శ్రీలత అన్నయ్య, తల్లికి అంత్యక్రియలు నిర్వహించాడు. శ్మశానంకు వస్తానన్న శ్రీలతను అందరూ బలవంతంగా ఆపారు.

★★★



నెలరోజుల తర్వాత అందరూ ఎవరి ఊళ్ళకు వారు వెళ్ళిపోయారు అన్నయ్య, అక్కలతో సహా! ఆ ఊళ్ళోనే ఉన్న బంధువులు మాత్రమే శ్రీలతను పలకరించడానికి వస్తున్నారు. మరో పదిహేను రోజులు గడిచాయి.

‘‘కోర్టుకు వెళితే అమ్మ జ్ఞాపకాలలోంచి బయట పడగలవు. నువ్వు ఒంటరిగా ఉంటున్నావు. సంసారాన్ని వదిలి రాలేము.’’ అని శ్రీలత అక్క, అన్నయ్య ఆమెను వదిలి తమ వూరు వెళ్లేముందు బలంగా చెప్పారు.

ఒక మంచిరోజు చూసుకుని నల్లకోటు భుజాన వేసుకొంది. తల్లి ఫోటోకి నమస్కారం చేసి ‘అమ్మా నన్ను ఆశీర్వదించు’ అనుకుని కోర్టుకు బయలుదేరింది. అప్పటికే ఆమె బార్ కౌన్సిల్‌లో తన పేరును రిజిష్టర్ చేసుకొంది.

శ్రీలతను కోర్టు హాల్లో చూసిన చాలామంది లాయర్లు అభినందించారు. ఆమె తండ్రి గారి గురించి వారందరికీ తెలుసు.

‘‘మీ అమ్మగారు రోడ్డు యాక్సిడెంట్‌లో చనిపోయారు కనుక, వారి క్లైమ్ కోసం పిటీషన్ వేయండి!’’ అన్నాడు ఒక లాయర్.

శ్రీలత ఒక్కసారి ఆలోచనలో పడింది. తల్లికి యాక్సిడెంటై, హాస్పిటల్‌లో ఐసియులో ఉన్నప్పుడు, డాక్టర్ల అనుమతి తీసుకుని తన తల్లిని చూడడానికి వెళ్లింది. ఆవిడ మెల్లగా మాట్లాడడానికి ప్రయత్నం చేస్తోంది. నూతిలోంచి మాట్లాడుతున్నట్టుగా వస్తున్న స్వరం.

‘‘నన్ను లారీ గుద్దింది కదా! కోర్టు ద్వారా డబ్బులు వస్తాయి. వాటిని వదులుకోకండి. చట్టబద్ధంగా ఎంత రావాలో అంతా నా వారసులకే!’’ అంది అమ్మ.

''అమ్మా అవన్నీ ఇప్పుడెందుకు!'' అంటూ శ్రీలత ఏడ్చింది.

''నిన్ను లాయర్‌గా చూద్దామనుకున్నాను. అది తీరకుండానే వెళ్ళిపోతున్నాను..'' అలా చెబుతున్న అమ్మ కంటి నుంచి ధారగా కన్నీరు.

అదంతా ఇప్పుడు గుర్తుకొచ్చింది.

''అవును సార్ పిటీషన్ వేద్దాం. ఎఫ్ఐఆర్, పోస్ట్‌మార్టం రిపోర్టు, పంచనామా, ఇంకా కావలసినవన్నీ సిద్ధం చేస్తాను!'' అంది.

ఆ మాటలకు ఆ లాయర్ ''ఈ కేసును మీరే వాదించుకోవచ్చు.'' అన్నాడు

''అలా చేయవచ్చా? ఈ కేసులో అక్కా, అన్నయ్యలతో పాటు నేను కూడా ఒక వారసురాలినే. లీగల్ హెయిర్, పిటీషన్ తరపు న్యాయవాది ఒకరై ఉండవచ్చా!'' అంది ఆమె సందేహంగా.

''అలా చేసుకోవచ్చు. అందుకు జడ్జిగారికి అనుమతి కోసం ఉత్తరం వ్రాయండి!'' అంటూ ఆ లాయర్ సలహా ఇచ్చాడు.

''ధన్యవాదాలు సార్.. ఈరోజే అనుమతి కోసం జడ్జిగారికి ఉత్తరం వ్రాస్తాను!'' అంది శ్రీలత.

★★★

ఆరు నెలల తర్వాత లోక్ అదాలత్ నుండి మీటింగ్‌కు రమ్మని ఉత్తరం వచ్చింది. లోక్ అదాలత్ జరిగే కోర్టు హాలుకు చేరుకుంది శ్రీలత.

కొద్దిసేపు తర్వాత తీర్పును చెప్పే జడ్జిగారు వచ్చారు. అంతవరకూ సందడిగా, శబ్దాలతో నిండిన ఆ వాతావరణం నిశ్శబ్దంగా మారిపోయింది. కొన్ని కేసులు చూడడం అయిన తర్వాత శ్రీలత క్లైమ్‌కు సంబంధించిన కాగితాలు ఆ జడ్జిగారి దగ్గరకు వెళ్ళాయి. ఆయన బీమా సంస్థ తరపున వాదించే లాయర్ వంక చూశాడు. ఆ లాయరు చెప్పడం మొదలెట్టాడు..

''చనిపోయిన జానకమ్మగారికి అరవై ఏళ్ళ వయస్సు. ఆవిడ గృహిణి. ఏ ఉద్యోగమూ లేదు. ఏ సంపాదనా లేదు. భర్త లాయర్‌గా పనిచేస్తూ హఠాత్తుగా చనిపోయారు. ఏ ఆదాయమూ లేని ఆమెకు ఉన్న వయసు దృష్ట్యా, వారి వారసులు ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయికి చట్టబద్ధంగా వచ్చే కాంపన్సేషన్ ఇదిగో ఇంత!'' అంటూ ఆ లెక్కలు చెప్పాడు.

''అంతకన్నా ఎక్కువ ఇవ్వడానికి పాలసీ నిబంధనలు ఒప్పుకోవు!'' అంటూ ముగించారు ఆ లోక్ అదాలత్‌కు వచ్చిన బీమా అధికారులు.

ఆ సమయంలో కొన్ని నెలల క్రితం జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది శ్రీలతకు. బంధువుల ఇంటిలో జరిగిన పెళ్లి కోసం వచ్చిన వారు తల్లిని చూడటం కోసం వచ్చారు. ఆ రోజు వచ్చిన వారి మాటల్లో టాపిక్ జీతాల మీదకు మళ్ళింది. విదేశాల్లో వుంటున్నవారు, సాఫ్ట్‌వేర్ వుద్యోగం చేస్తున్నవారు తమకు వచ్చే జీతాల గురించి ఘనంగా చెప్పుకుంటున్నారు. ఇంతలో ఆ సంబాషణ ఆసక్తిగా వింటున్న పదేళ్ళ అమ్మాయి, "అమ్మా నీ జీతం ఎంత" అంటూ తల్లిని ప్రశ్నించింది. ఆవిడకు జీతం ఏమిటి? వుద్యోగం వుందా? అన్నారు ఎవరో...

"ఇన్నేళ్ళుగా ఆవిడ చేస్తున్నది వుద్యోగం కాదా.. భర్త చనిపోతే కొడుకుని, కూతుర్లను వారి కాళ్ళమీద వారు నిలబడేటట్టు చేసిన కృషికి ఆమెకు ఎంత జీతం ఇవ్వాలి. ఇంకా ఈ అరవయ్యేళ్ళ వయస్సులో ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా ఆదుకొంటూ.. తన రెక్కల కష్టంతో కూతుర్ని 'లా' చదివించ లేదా... ఈవిడకు ఈ లెక్కన ఎంత జీతం ఇవ్వాలి. ఈవిడను వెల కట్టగలమా?" అంటూ శ్రీలత ఇచ్చిన ఆ సమాధానంతో అందరు చప్పట్లు కొట్టారు.

అదంతా గుర్తుకొచ్చి ఆమె మనసులో దుఃఖం ఎగదన్నుకొచ్చింది. వెంటనే గతం లోంచి బయటకు వచ్చింది జడ్జి గారి మాటలతో.

ఆయన తన చేతిలో ఉన్న పేపర్లను పరిశీలనగా చూసి, "పిటీషనర్ తరపు లాయర్ ఎవరు?" అన్నారు.

"ఈ క్లైమ్‌లో నష్టపరిహారం పొందే వారసుల్లో ఒకరు, అలాగే ఈ కేసు వాదించే లాయరు, ఇద్దరూ ఒకరే. వారే శ్రీలత!" అన్నాడు అక్కడే ఉన్న లోక్ అదాలత్ ప్రతినిధి.

వెంటనే శ్రీలత జడ్జిగారి ముందుకొచ్చి, ఆయనకు రెండు చేతులు జోడించి "సార్, లీగల్ హెయర్‌గాను, పిటీషనర్ తరపు అడ్వకేట్‌గాను రెండు పాత్రలను నిర్వహిస్తున్నాను. అందుకు తమ అనుమతి తీసుకున్నాను!" అంది.

ఆ మాటలకు జడ్జిగారు నవ్వుతూ "మీ వాదన కొనసాగించండి" అన్నాడు.

శ్రీలత మరోసారి జడ్జిగారికి ధన్యవాదాలు చెప్పి, చెప్పడం మొదలెట్టింది.

"మన బీమా సంస్థ తరపు లాయరుగారు చెప్పినట్టు, మా అమ్మ ఇంట్లో హౌస్‌వైఫ్. ఏ సంపాదనా లేదు అనడం అన్యాయం. దీనికి సంబంధించి గతంలో సుప్రీంకోర్టువారి జడ్జిమెంటు గురించి తమకు మనవి చేసుకుంటున్నాను. ఇంటి ఇల్లాలిని హౌస్‌వైఫ్ అని కాకుండా, హోమ్‌మేకర్‌గా చూడమని గతంలో ఇచ్చిన జడ్జిమెంట్ కాపీ" అంటూ తన సంచిలోని కాగితాలు జడ్జిగారికి అందిస్తూ చెప్పడం మొదలెట్టింది.

సహజంగా నిశ్శబ్దంగా ఉండే కోర్టు హాలు మరింత మౌనరూపం దాల్చింది.

"మహిళలు ప్రమాదవశాత్తూ చనిపోయినప్పుడు, వారికి ఏ ఉద్యోగమూ లేనప్పుడు వారి వారసులకు కోర్టుద్వారా లభించే నష్టపరిహారం, ఆమె ఇంట్లో చేసే అనుపమాన సేవలను బట్టే నిర్ణయించాలి. 2011 లెక్కల ప్రకారం మన దేశంలో 159.85 మిలియన్ల ఆడవాళ్ళు ఇంటికే అంకితమైపోతే, 5.79 మిలియన్ల భర్తలు ఉద్యోగాల కోసం వెళుతున్నారు. సగటున రోజుకి హోమ్‌మేకర్‌గా ఐదు గంటలు ఇంట్లోని సభ్యుల సేవకోసం ఆడవారు సేవ చేస్తుంటే, భర్తలు ఓ గంట సమయాన్ని మాత్రమే ఇంటివారి కోసం కేటాయిస్తున్నారు. సగటున ప్రతి ఇల్లాలు ఇంటి పనుల కోసం, ఇంటివారి క్షేమం కోసం రోజుకు ఇరవై శాతం టైం కేటాయిస్తే, భర్తలు రెండు శాతం మాత్రమే టైం కేటాయిస్తున్నారు. ఆహారం వండడం, పచారీ సామాన్లు, కూరగాయలు తేవడం, షాపింగ్ చేయడం, ఇల్లు శుభ్రపరచడం, ఇల్లు అలంకరించడం, పిల్లల బాగోగులు చూడడం, వయసు మీరిన పెద్దవారికి సాయం చేయడం, ఇంటి బడ్జెట్ చూసుకోవడం.. ఇలా ఇల్లాలు ఒక కుక్‌గా, ఒక సర్వెంట్ మెయిడ్‌గా, ఇంటీరియర్ డెకరేటర్‌గా, డాక్టర్‌గా, కేర్‌టేకర్‌గా ఇన్ని బాధ్యతలు నిర్వర్తిస్తోంది. దీనికి తోడు ఆడవారు పల్లెటూళ్ళో పొలం పనులకు కూడా వెళతారు. మన్యంలో గిరిజన స్త్రీలు బిడ్డని భుజాన వేసుకొని కొండలెక్కుతారు, పశువుల్ని మేపుతారు. ఇక మా అమ్మ విషయానికొస్తే నాకు పదేళ్ళ వయసులోనే అనారోగ్య కారణాల చేత మా నాన్న చనిపోయారు. ఆయన చేసేది లాయర్

ప్రాక్టీస్ కాబట్టి పెన్షన్ లేదు. అన్నయ్యని, అక్కను, నన్ను పెంచింది. మంచి ఉద్యోగ బుద్ధులు నేర్పించింది. నా కన్నా పెద్దవాళ్ళైన ఇద్దరూ పెళ్లిళ్ళై, స్థిరపడ్డారు. ఇంటిపనితో పాటు అమ్మ, కొంతమంది ఇళ్ళల్లో పిండివంటలు చేయడం, తీరిక దొరికినప్పుడు టైలరింగ్ చేయడం వంటివన్నీ చేసింది. మా అమ్మలాగానే ఉద్యోగం చేయకుండా ఇంటికి పరిమితమయ్యే మహిళలను, వారికి సంపాదన లేదని, చట్టం అందుకు సమ్మతించదని, వారి ఆకస్మిక ప్రమాద మరణాలకు మొక్కుబడిగా పాలసీ ప్రకారం నష్టపరిహారం నిర్ధారించడం చట్టానికి అనుకూలమే గాని, ధర్మానికి, న్యాయానికి వ్యతిరేకం. ఈ క్రమంలో చట్టాన్ని సవరించాలి. సామాజిక న్యాయం జరగాలి. ఇంకో ముఖ్య విషయం మా అమ్మ పంచభూతాలను గౌరవించేది. ఉదయం ఐదు గంటలకే లేచి స్నానం చేసి పనులు మొదలుపెట్టేది. అందరూ ఇల్లు ఊడ్చిన తర్వాత స్నానం చేస్తారు. కాని అమ్మ స్నానం చేసిన తర్వాతే ఏ పని అయినా మొదలుపెట్టేది. అంటే ఆమె పనినే పరమావధిగా భావించేది. అదీ ఆమె పనికిచ్చే గౌరవం. జీవితమంతా ఏదో పని చేసుకుంటూనే క్షణం తీరిక లేకుండానే గడిపిన అమ్మకు ఎంత జీతం ఇవ్వాలో మీరే నిర్ణయించండి!'' అంటూ చెప్పడం ముగించి జడ్జిగారికి నమస్కారం చేసింది.

వెంటనే జడ్జిగారు ఆమె వంక అభిమానంగా చూసి ''ఇంతవరకూ శ్రీలత చెప్పింది నిజమే. మన అమ్మల జీవిత పుస్తకాన్ని వారి గంటల బతుకుల జీవితాన్ని చాలా చక్కగా వివరించారు. ఈ సందర్భంగా నాకొక విషయం గుర్తకొచ్చింది. ఒక ఇల్లాలు వీసా కోసం వెళితే ఆ వీసా అధికారి ఆమెను 'మీరేం పనిచేస్తారు' అని అడిగాడట. 'నేను తల్లిని' అని అందట.

'మీ వృత్తి ఏమిటి' అని అడిగాడట.

'నేను ఇంట్లో కుటుంబ సభ్యుల బాగోగుల కోసం కృషి చేస్తాను. పిల్లల ఉన్నతి అనే లక్ష్యం దిశగా నా ఉద్యోగం సాగుతుంది. నాకు దీనికి ఇరవై నాలుగు గంటలు టైం పరిపోదు' అందట.

మన అమ్మకు ఇంతకన్నా గొప్ప నిర్వచనం ఉందా? తల్లులంతా ప్రేమతో నిండిన బాధ్యతగా తమ డ్యూటీల్ని ఇళ్ళల్లోనే కొనసాగిస్తున్నారు. అలాంటి అమ్మలకు విలువ లేదనడం అన్యాయమే. శ్రీలత చెప్పిన విషయాల్ని ఆధారంగా చేసుకొని, దానితోపాటు గతంలో సుప్రీంకోర్టు వారిచ్చిన జడ్జిమెంటును అనుసరించి, జానకమ్మగారి క్లైం పెంచడానికి ఆమోద ముద్ర వేస్తున్నాను. అందుకు బీమా అధికారులు కూడా సహకరించాలి!'' అన్నారు.

ఆ మాటలకు అక్కడున్న బీమా సంస్థ ప్రతినిధి ''అలాగే సార్'' అంటూ తమ ఆమోద ముద్ర తెలిపారు.

శ్రీలత అందరకూ నమస్కారం చేసి ''అమ్మా నీ విలువ తగ్గలేదు'' అంటూ తన తల్లిని గుర్తు చేసుకుంది.

తల్లి అభీష్టం మేరకు తను లాయర్‌గా వాదించిన మొదటి కేసులో గెలుపు లభించినందుకు ఆమె సంతృప్తిగా ఆ ఆవరణ నుంచి కదిలింది.

అలా కదులుతూ 'మా అమ్మే కాదు, ప్రపంచం లోని ప్రతి స్త్రీ మూర్తి హౌస్‌వైఫ్ కాదు, హోమ్‌మేకర్' అంటూ మనసులో అనుకుంది బలంగా.

★★★

వారం రోజుల తర్వాత లాయర్ల చాంబర్‌లో కూర్చుంది శ్రీలత. తను వాదించ బోయే కేసు గురించిన పేపర్లు చదువు కుంటోంది.

''మేడమ్'' అనే పిలుపుతో తలెత్తింది, ఎదురుగా కోర్టు గుమస్తా.

''మీ అమ్మగారి కాంపన్సేషన్ బీమాసంస్థ నుంచి రావలసి వుంది. అది వచ్చిన తర్వాత కోర్టు ఆర్డర్ పాసవుతుంది. ఐతే మీ అమ్మగారి ముగ్గురి వారసులలో ఒకరైన మీరు మీ అమ్మగారి ఆధార్ కార్డులో కుమార్తెగా పేర్కొనబడలేదు. అలాగే ఎమ్ఆర్ఓ గారిచ్చిన ఫేమిలీ మెంబర్ సర్టిఫికెట్‌లోనూ మీ పేరు లేదు. అదే మాకు ఆశ్చర్యం కలిగించింది!'' అన్నాడు.

''ఔను నా పేరు ఉండదు!'' అంది క్లుప్తంగా.

''అలా ఎలా?'' అన్నాడు ఆ కోర్టు గుమాస్తా మరింత ఆశ్చర్యపోతూ.

''నేను ఆమె పేగు తెంచుకొని పుట్టిన కూతుర్ని కాదు. రోడ్డుమీద ఎవరో కని పారేస్తే ఆమె నన్ను కూతురుగా పెంచి పెద్ద చేసింది. ఆమెతో పేగుబంధం లేకపోయినా పెంచిన ప్రేమబంధంతో ఆమెను నా తల్లిగా, నేను ఆమెకు వారసురాలిగా కోర్టులో ప్రకటించాను...'' అంది.

''మీకు ఏ కాంపన్సేషన్ రాదు!'' అన్నాడు గుమాస్తా.

''అమ్మ విలువ పెంచాలనే పోరాడాను అంతే!'' చెప్పి తన పనిలో తను నిమగ్నమైంది శ్రీలత.

ఆమె మాటలు విన్న ఆ కోర్టు గుమాస్తా, ఇంకా అక్కడున్న మిగతా లాయర్లు వయస్సులో చిన్నదైనా, ఆమెకు రెండు చేతులు జోడించారు.

★★★★★

# రైతుబిడ్డ

కె. వి. మేఘనాథ్ రెడ్డి



✆ 6300318230

**కథామంజరి నిర్వహించిన దీపావళి కథల పోటీ 2022 లో ప్రోత్సాహక బహుమతి లభించిన కథ**

***"ఆడబిడ్డ అయితే ఏం నాన్నా! కొడుకైనా కూతురైనా నేనే కదా! నీ కుడిచేయిగా నేనుంటాను. ఏం చేయాలో చెప్పండి చాలు. మీరు చేసే పనులన్నీ చేస్తాను. మీరు దగ్గరుండి అన్ని పనులూ నాకు నేర్పించి చేయించుకోండి!" అని నేననడంతో అమ్మ నాన్న సంతృప్తిగా నావైపు చూసారు.***

***"ఇంకేం!? ముందైతే నాకు రెండు చేతులే ఉండేవి. ఇప్పుడు కుడి చేయి స్థానంలో మరో రెండు చేతులు మొలిచాయి!" అంటూ మనస్ఫూర్తిగా చెప్పారు.***

"మనది రెక్కాడితే గాని డొక్కాడని బతుకు. చెయ్యి విరిగిందని ఇలా నెలల తరబడి ఎక్కిన మంచం దిగకుండా, కాలెత్తి బయట పెట్టకుండా ఇంటికే పరిమితమైతే...! సుఖానికి అలవాటుపడ్డ శరీరం తరువాత కష్టాన్ని చేయగలదోలేదో అనే భయం నన్ను వెంటాడుతోంది. ఉన్న డబ్బు కాస్త హాస్పిటల్‌కే సరిపోయింది. నేనింకా నొప్పి అనో.. బాధ అనో.. ఇలానే కూర్చుని తింటే మనకున్న ఆరో, కోరో కయ్య, అమ్మినా సరిపోదు చేసిన అప్పులు తీర్చటానికి. పైగా ఈడొచ్చిన ఆడపిల్ల పెళ్లి చేయాల్సి ఉంది. రైతుగా భూమిని బీడు పెట్టకుండా చెరకు మొక్కల్ని వేయాల్సిన బాధ్యత అంతే ఉంది! గెనాలు చెక్కి, పెడలు ఎగేసి, కాలువలు కట్టి, మొక్కల చుట్టూ మట్టిని నెట్టి, మునాలు కట్టి, మూడు రోజులకు ఒకసారి ఏడాది పొడవునా నీళ్లు పెడితే చెరుకు ఏపుగా పెరిగి పంట చేతికి వస్తుంది. చుట్టూ పచ్చని పైరు కనబడినప్పుడే జీవితాలు కూడా పచ్చపచ్చగా నవ్వుతుంటాయి! వయసొచ్చిన ఆడపిల్లా అంతే...! పురిటి బిడ్డనుండి కంటికి రెప్పలా కాపాడి వయసొచ్చాక తగిన వాడిని చూసి తగిన సమయంలో పెళ్లిచేసి పంపితేనే తల్లిదండ్రులుగా మన జన్మకు సార్థకత లభిస్తుంది. అదే ఇంట్లో ఆడపిల్లను, కయ్యలో చెరకు మొక్కల్ని సరిగ్గా చూసుకోకపోతే తండ్రిగా, రైతుగా నేనోడిపోయినట్టే కదా! ఇలా ఎన్నో భయాలు నన్ను ప్రతిక్షణం వెంటాడుతున్నాయి!" అని నాన్న అమ్మతో తన ఆవేదనను వెళ్లగక్కారు.


నాన్న మాటలకు అమ్మ దీర్ఘంగా ఆలోచించి "చూడండి ముందు మీ ఆరోగ్యం కుదుటపడనీ. తరువాత వీటన్నింటి గురించి ఆలోచిద్దాం. మలిపంట చెరుకు వేయటానికి ఇంకా మూడు నెలలు సమయం ఉంది కదా, ఆలోపు మీ ఆరోగ్యం కుదుటపడుతుంది. ఇక అమ్మాయి పెళ్లి గురించి అంటారా? కక్కొచ్చినా, కల్యాణమొచ్చినా ఆగదంటారు.. చేద్దాం! దానిదేముంది! ఒకప్పుడు చుక్క చినుకు లేక, పంటలు సరిగ్గా పండక, అప్పుల బాధతో బ్రతకలేక చాలా మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. మరి కొందరైతే.. కన్నవూరిని, ఉన్నవారిని వదిలి వెళ్లిపోయి మనకు చేసిన గాయం, ఇంకా పచ్చి పుండుగానే ఉంది. కానీ అలాంటి రోజుల్లో కూడా మీరు ధైర్యంగా ఉంటూ ఊర్లో మిగిలి ఉన్నవారిలో స్ఫూర్తిని నింపలేదా? ఓ సారి గుర్తు తెచ్చుకోండి!" అంది సాలోచనంగా అమ్మ.

అమ్మ మాటలకు నాన్నలో పెద్దగా చలనం లేదు. మౌనమే సమాధానంగా ఉన్నాడు.

నా మనసు కూడా కుదురుగా లేదు. ఏదో జరగరానిది జరుగుతుందని పదేపదే మనసు కీడు శంకిస్తోంది. ఆ ఆలోచనల పరంపరలో అర్ధరాత్రి దాటుతున్నా కంటిపై కునుకు పట్టలేదు. దేవుడికి కూడా మొరపెట్టుకున్నాను... 'దేవుడా మాకు

ఎటువంటి గడ్డు పరిస్థితులు ఎదురైనా తట్టుకు నిలబడే శక్తిని ప్రసాదించు తండ్రీ! గుండె దిటవు గల నాన్న బేలగా మారి భవిష్యత్తు గురించి ఆలోచించి, బాధ పడటం నేను జీర్ణించుకోలేకపోతున్నాను. మొదటిసారి అర్థిస్తున్నాను. అంతా సజావుగా సవ్యంగా జరిగిపోయేట్లు చూడు స్వామీ!' అని దేవుణ్ణి వేడుకున్నాను కానీ, మునుపు మా జీవితాల్లో చోటుచేసుకున్న దుర్భరమైన పరిస్థితులు మరొక్కసారి నా కళ్ళముందు కదలాడాయి!

అది డిసెంబర్ నెల మొదటి వారం.



సంవత్సరమంతా పంటను కంటికి రెప్పలా కాపాడిన రైతు.. ఆ పంటను ఒడుపుకుని డబ్బును కళ్ళజూసే సమయమది.

కష్టాల కొలిమి నుండి విముక్తి పొందే తరుణమది.

“ఈసారి చెరుకు మన కష్టాల్ని గట్టెక్కించటం ఖాయం. ఎన్నడూ లేనంతగా బలే ఏపుగా పెరిగింది” నాన్నంటే.

“ఏం లాభం బాబయ్యా! దానికి తోడు తగిన గిట్టుబాటు కూడా రావాలిగా?” అంకయ్య అన్నాడు.

“అలా అనుకుంటే ఎలారా? మంచి గిట్టుబాటు వస్తుందని గట్టిగా అనుకో. దేవుడు మన మొర తప్పక ఆలకిస్తాడు. చూస్తూ ఉండురేయ్... అంకయ్యా! యీతూరి నా కూతురు పెండ్లి కూడా ఘనంగా జరిపిస్తా!” అని ఎంతో నమ్మకంగా చెప్పారు నాన్న.

తల స్నానం చేసి మొహానికి పసుపు రాసుకొని మహాలక్ష్మిలా వచ్చి చెరుకు గుమ్మెపై పాలు, పసుపు జల్లి, పువ్వులు అలంకరించి పరమాన్నం నైవేద్యంగా పెట్టి, తాంబూలం పెట్టి, కొబ్బరికాయ కొట్టి, కర్పూరం వెలిగించి పూజచేసి హారతి ఇచ్చి అందరిని దండం పెట్టుకోమని చెప్పి “ఇక మొదలెట్టండి అన్ని సవ్యంగా జరుగుతాయి!” అంది నిండుమనసుతో అమ్మ.

బాలయ్య గొడ్డలి చేతబట్టి చెరుకు గుమ్మెకు మరొక్కసారి దండం పెట్టి, మొదళ్ళు తెగ్గొట్టి గుమ్మెను కిందకు తోసాడు. రాణెమ్మ, యశోద, మునెమ్మ, అమ్మ, నేను చెరకు జవిరి పచ్చని కర్రలు పశువులకని పక్కకు వేసి చెరకును మరో వైపు వేశాము. సుబ్బయ్య, మంగమ్మ జవిరి వేసిన చెరకుని వాదులుగా పేర్చి తాళ్లతో మోపులు కట్టి పెట్టారు. భద్రప్ప, మోగిలప్పకట్టి ఉంచిన చెరకు మోపుల్ని గానుగ ఇంటి వద్దకు మోసే పనిలో మునిగిపోయారు.

సరిగ్గా పదకొండు గంటలకు కరెంటు వచ్చింది.

చెరుకు క్రషర్ ఆన్ చేసే ముందు రెండు చేతులెత్తి క్రషర్‌కి మొక్కి, ఒక్కో చెరకుగడ క్రషర్‌లో పెట్టసాగారు నాన్న.

ముందే సిద్ధం చేసి ఉంచుకున్న గానుగ పెనాల్లోకి క్రషర్ నుండి నేరుగా చెరుకు పాలు వచ్చి చేరాయి. తగినంత మోతాదులో చెరకు పాలను మరో పెనంలో పోసి వేడి చేశారు... పాకం వచ్చే వరకు రామయ్య, వెంకన్న! పాకాన్ని దించి ముందున్న వెడల్పాటి తొట్టెలో పోశారు. కాసేపటికి గాలికి పాకం వేడి తగ్గి బెల్లం రూపం దాల్చి గట్టిబడింది. పొడవాటి పారలతో బెల్లాన్ని పొడిపొడిగా చేసి నలుగురు చేరి బెల్లం ముద్దలు పట్టి వేస్తుంటే మరో ఇద్దరు బెల్లం ముద్దల్ని సంచుల్లో వేసి ఓ మూలగా ఒకదానిపై ఒకటి పెట్టారు.

ఎనిమిది ఎకరాల చెరకు తోట కాబట్టి నెలల తరబడి గానుగ ఆడటం జరుగుతూనే ఉంది. దాదాపు చివరి దశకు చేరుకుంది.

“నాలుగు రోజుల్లో గానుగ ఆడటం అయిపోతుందిరా బాలయ్యా! ఆశించిన దానికంటే ఎక్కువే బెల్లం మూటలు అయ్యాయి. తిరనాళ్లకు మీ అందరికి బట్టలు తీసి ఇస్తాను. అన్నట్టు నా కూతురు పెళ్లి పనులు కూడా త్వరత్వరగా చేయాలి. వెంకట్రామాపురంలో అబ్బాయి ఉన్నాడట. గానుగ అయిపోగానే కబురు పెడదాం అనుకుంటున్నా!” సంబరంగా అన్నారు.

“నీకేంటి శివయ్య! మంచి మనసు.. అంతా మంచే జరుగుతుంది!” అంతే సంబరంగా చెప్పాడు బాలయ్య.

నాన్న నవ్వుకుంటూ సద్దితాగి “పొద్దుపోతుంది, త్వరగా కానివ్వండి. కరెంటు పోయేలోపు చెరకు పాలు పట్టేయాలి.” అంటూ ఆర్భాటంగా వెళ్లి చెరకు క్రషర్ ఆన్ చేసి చెరకు పెట్టటం మొదలు పెట్టారు.

ఎవరెవరి పనుల్లో వారు మునిగిపోయారు.

చెరకును క్రషర్‌లో పెట్టే క్రమంలో దురదృష్టవశాత్తు నాన్న చేయి చెరకుతో పాటు క్రషర్‌లో చిక్కుకొని మోచేయి వరకు నుజ్జునుజ్జు అయిపోయింది.

తరువాత రెండు నెలలపాటు నాన్న హాస్పిటల్ లోనే ఉండాల్సి వచ్చింది. కానీ నలిగిపోయిన నాన్న చేయిని తిరిగి తీసుకొని రాలేకపోయాం!

అనుకున్నదానికంటే ఎక్కువ బెల్లం వచ్చిందని సంబరపడ్డాము కానీ, ఆ ఏడు బెల్లం అమ్మగా వచ్చిన డబ్బంతా నాన్న హాస్పిటల్‌కే సరిపోయింది. దాని కారణంగా ఆ ఏడు కూడా నా పెళ్లి మరో ఏడాదికి వాయిదా పడింది.

అమ్మా, నాన్నలతో మరో ఏడాది గడిపే అదృష్టం దక్కుతున్నందుకు మాత్రం సంతోషం, నాన్నకు చెయ్యి పోయిందనే బాధ మధ్య గడిపాను.

★★★

హాస్పిటల్‌లో రెండు నెలలు, ఇంట్లో రెండు నెలలు గడిచిపోయాయి. నాన్న నాలుగు నెలల్లోనే కోలుకుంటారని మేమసలు ఊహించలేదు.

నిజంగా మాకది శుభతరుణమే! బహుశా ముందున్న బాధ్యతలే ఆయన్ని త్వరగా కోలుకునేలా చేసాయేమో! నాన్న కార్తెల్ని చూసి.. అదే మంచి సమయంగా భావించి ఎలా మొదలెట్టాలో తెలియక తర్జన భర్జన పడుతుంటే “ఏంటో తెగ హైరానా పడుతున్నారు?” అంది అమ్మ.

“విమలా అదీ.. అదీ.. నా ఆరోగ్యం ఇప్పుడు కుదుటపడింది కదా! గతంలో నీవన్నట్టు మలిపంట వేసే సమయం కూడా రానే వచ్చింది కదా!” అన్నారు.. అమ్మ నుండి ఎటువంటి బదులు వస్తుందో అని గాభరా పడుతూ.

అమ్మ మౌనంగా క్రషర్‌లో పోయిన నాన్న చేయి వైపు తీక్షణంగా చూసింది.

గమనించిన నాన్న “ఓహ్! అవిటోణ్ణి కదా.. ఎలా వ్యవసాయం చేయగలడనేగా ఆలోచిస్తున్నావు?” అన్నాడు.

“ఛ ఛ, అదేం మాట! ఆనాడైనా, ఈనాడైనా, కష్టమైన సుఖమైన మీ వెన్నంటే నేను!” అని చెప్పి తిరిగి కొనసాగింపుగా “మనకూ డబ్బు అవసరం చాలానే ఉంది. అమ్మాయికి పెళ్లి చేసి, ఓ అయ్య చేతిలో పెట్టాలి. అమ్మాయికి పెళ్లి చేయాలంటే మళ్ళీ చెరుకు తోట వేయాల్సిందే. మీ ఒంటరి చేయికి నా చేయి తోడు కలసికట్టుగా శ్రమిద్దాం!” ఎప్పటిలాగే అమ్మ భరోసా ఇచ్చింది.

"నాన్న చేయికి, నీ చేత్తో పాటు నా చేయి కూడా తోడుంటుందమ్మా!" కాస్త గట్టిగానే మొదటిసారి ధైర్యం చేసుకొని చెప్పాను.

"ఆడబిడ్డవైనా రైతుబిడ్డవనిపించావు!" గర్వంగా అన్నారు నాన్న.

"ఆడబిడ్డ అయితే ఏం నాన్నా! కొడుకైనా కూతురైనా నేనే కదా! నీ కుడిచేయిగా నేనుంటాను. ఏం చేయాలో చెప్పండి చాలు. మీరు చేసే పనులన్నీ చేస్తాను. మీరు దగ్గరుండి అన్ని పనులూ నాకు నేర్పించి చేయించుకోండి!" అని నేననడంతో అమ్మ నాన్న సంతృప్తిగా నావైపు చూసారు.

"ఇంకేం!? ముందైతే నాకు రెండు చేతులే ఉండేవి. ఇప్పుడు కుడి చేయి స్థానంలో మరో రెండు చేతులు మొలిచాయి!"అంటూ మనస్ఫూర్తిగా చెప్పారు.

చాలా కాలం తరువాత తృప్తిగా నవ్వుకున్నాం.

తిరిగి నాన్న "సరే.. సరే..! ఇక ఆలస్యం ఎందుకు రేపు చెరుకిత్తనం తెమ్మని పక్క ఊరి వీరయ్యకు కబురు పెడతాను!" అన్నారు.

మూడు చేతుల్ని కలిపి అనుకున్నది అనుకున్నట్టుగా వ్యవసాయ పనులు మొదలుపెట్టాము.

మాకు దేవుడు కూడా తోడొచ్చి ఆయేడు వర్షాలు అధికంగా కురిశాయి. చెరుకుపంట ఆశించిన దానికంటే బాగా పండింది. గానుగ ఆడించాము. బెల్లం ధర అధికంగా పలికింది. చేతుల నిండా డబ్బులు వచ్చాయి.

నాన్న కూడా కాలం గడిచే కొద్దీ తనకు వైకల్యం ఉన్న విషయం పూర్తిగా మరచిపోయాడు.

ఇక ఏముంది నా పెళ్లి చేయటానికి సిద్ధమై సిద్ధాంతిగారికి కబురు పెట్టారు.

★★★

మరుసటిరోజు ఇంకా పూర్తిగా పొద్దు పొడవనే లేదు. మాయింటి ముందు కారొచ్చి ఆగింది. అందులోంచి ఒక పెద్దావిడ, ఒక యువకుడు దిగారు.

ఇంటి ముందు చెట్లకు నీళ్లు పెడుతున్న నేను ఆ పని ఆపి వాళ్ళ వైపు వెళ్ళాను.

అంతలో వసారాలో ఉన్న నాన్న కారు ఆగడం చూసి బయటకు వచ్చారు. వాళ్ళను చూడగానే "బాగున్నావా చెల్లెమ్మా!" అని పలుకరించారు.

ఆవిడ కూడా "బాగున్నాను అన్నయ్యా! వీడు మా అబ్బాయి ప్రదీప్!" అని యువకుడి వైపు చూపించింది.

అతడు నాన్నకు నమస్కారం పెట్టాడు.

"ఏడో తరగతి చదివేవాడు అప్పుడు. ఎంత పెద్దవాడయ్యాడో.. బాగున్నావా బాబూ!" అంటూ లోపలికి రమ్మని ఇంట్లో పిలుచుకుని వెళ్ళారు.

నేను పెరటివైపు నుండి ఇంట్లోకి వెళ్ళాను... అమ్మకు వీరెవరో వచ్చిన విషయం చెబుదామని.

ఆపాటికే అమ్మ వాళ్ళకెదురెళ్ళింది.

ఆ తర్వాత వారు స్నానాలు అవీ ముగించుకుని వచ్చినాక, అమ్మ వేడి వేడిగా ఇడ్లీలు వేసిచ్చింది. కాఫీ కలిపిచ్చింది.

ఈలోపు వారి గురించి అమ్మ చెప్పింది.

"వాళ్ళు మనింటి పక్కన ఇంట్లో ఉండేవారు. మీ నాన్న, ఆ అబ్బాయి వాళ్ళ నాన్న సుధాకరన్నయ్య ఇద్దరూ స్నేహితుల్లా మెలిగేవారు. కానీ ఒకసారి వరుసగా మూడేళ్ళు పంట చేతికి రాక అప్పుల్లో కూరుకుపోయి సుధాకరన్నయ్య ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పుడు తల్లీ కొడుకులిద్దరికీ ధైర్యం చెప్పి, అండగా నిలబడి ఉన్న పొలాన్ని, ఇంటిని అమ్మించి అప్పులు తీర్చడంలో సహాయం చేసింది మీ నాన్నే! ఆ తర్వాత మీ నాన్న తన చేతుల్లో ఉన్న పది వేల రూపాయలు వాళ్ళకిచ్చి వాళ్ళ అక్కావాళ్ళ దగ్గరకు పంపించారు!" అని.

కాస్సేపైన తర్వాత వాళ్లు కూర్చుని మాట్లాడుతూ ప్రదీప్ వాళ్ళమ్మ నన్ను కూడా అక్కడ కూర్చోమని పిలిచింది. ఆవిడ మాటను కాదనలేక నేను వెళ్ళి కూర్చున్నాను.

ఆవిడ నాన్నతో "అన్నయ్యా! మేము మా బంధువుల పెళ్ళికి నంద్యాలకు వచ్చాం. అక్కడ మన సిద్ధాంతి గారు కనబడ్డారు. మీ గురించి వివరాలు తెలుసుకుని మీరు అమ్మాయికి పెళ్లి ప్రయత్నాలు చేస్తున్నారని తెలిసి నేరుగా ఇక్కడికి వచ్చాం. అబ్బాయి రాజమండ్రిలో గవర్నమెంట్ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం చేస్తున్నాడు. మీకభ్యంతరం లేకపోతే మీ అమ్మాయిని మా యింటి కోడలిగా చేసుకోవాలనుకుంటున్నాం!" అంది.

అంతలోనే ప్రదీప్ కల్పించుకొని "అంకుల్, మా నాన్న చనిపోయినప్పుడు నేను చిన్నపిల్లవాణ్ణి కాబట్టి అప్పుడు 'నాన్న రైతుగా విఫలమయ్యారు' అని అనుకునే వాణ్ణి. కానీ పెరిగేకొద్దీ 'నాన్న కాదు... పరిస్థితులు నాన్నను విఫలం వైపుకు తోసాయి' అని అనిపించింది. నాన్న ఒకవిధంగా జీవితంలో ముందుకు దారి చూపి తాను కనుమరుగయ్యారని అనిపిస్తుంది. అమ్మ మీ గురించి ఎప్పుడూ చెబుతుండేది. కానీ ఇరవై ఏళ్లకు పైబడిందిగా మీరు ఇక్కడ ఉన్నారో లేదో తెలియదు. నిన్న సిద్ధాంతి గారు కనబడ్డంతో మీ వివరాలు తెలిసాయి. గతేడాది మీకు జరిగిన విషాదం తెలిసిన తర్వాత పరిస్థితులు మా నాన్నను ఓటమివైపుకు నెట్టినట్లు మీకు జరగకూడదని తలంచి వెంటనే మీ అమ్మాయిని పెళ్లి చేసుకోవాలనుకున్నాను. అదే విషయం అమ్మకు చెబితే సంతోషంగా ఒప్పుకుంది. రైతుగా మీరు గెలవాలి. రైతుబిడ్డగా మీ అమ్మాయి కూడా జీవితంలో గెలవాలి. మీరు, మీ అమ్మాయి ఒప్పుకుంటే, ఒక రైతుబిడ్డను మా ఇంటి మహాలక్ష్మిగా ఆహ్వానిస్తున్నామనే సంతోషం మాకుంటుంది. మా నాన్న కూడా ఎక్కడ ఉన్నా సంతృప్తిగా ఆశీర్వదిస్తారన్న నమ్మకం నాకుంది!" అనడంతో అమ్మా నాన్నల కళ్ళల్లో ఆనందం కనిపించింది.

"మాకేం అభ్యంతరం లేదు బాబూ... నీ మాటల్లో నీ వినయవిధేతలు కనపడుతున్నాయి. పైగా మంచి ఉద్యోగం.. అమ్మాయిని పువ్వుల్లో పెట్టి చూసుకుంటావన్న నమ్మకం కలిగింది. పైగా నా స్నేహితుని కొడుకువి!" అని నాన్న నా వైపు చూసారు. నేను కూడా అంగీకారంగా తల ఊపాను.

నాకు నిజంగా గర్వంగా అనిపించింది... రైతుగా నాన్న ఇన్ని రోజులు చూపిన నిబ్బరానికి.

'అవును... నేను రైతుబిడ్డనే' అని అనుకుంటూ ప్రదీప్ వైపు చూసాను.

నాన్న కళ్ళల్లోని ఆనందం అతని కళ్ళల్లో కూడా ప్రతిఫలించింది.

అమ్మ వైపు చూసాను. అమ్మ కనుసైగతో నేను లేచి అత్తగారికి నమస్కరించాను.

"శీఘ్రమేవ కళ్యాణ ప్రాప్తిరస్తు" అని ఆవిడ మనసారా దీవించడంతో మా యింట్లో హర్షాతిశయాల హరివిల్లు విరిసింది.

★★★★★

# అతుకుల బొంత

చాగంటి ప్రసాద్



✆ 90002 06163

**కథామంజరి నిర్వహించిన దీపావళి కథల పోటీ 2022 లో ప్రోత్సాహక బహుమతి లభించిన కథ**

***ఏడుపొచ్చిందతనికి.. ఆక్రోశం వచ్చింది.. విసురుగా ఫ్యాన్సీ షాపతను దగ్గరకు వెళ్ళి "ఛీ ఒక్క నా కొడుక్కి నీతి నియమం లేదు! ఈ ఎదవ నాసిరకం సూదులు అమ్ముతార్రా!" అంటూ సూదులు అతని మొహం మీద పడేశాడు..***
***"నీ యాపారానికి ఇయ్య సాల్లే!" అంటూ అతను ఎగతాళిగా మాట్లాడాడు.***

ఏడుకొండలు పెనుగాలికి వూగిపోయే చెట్టులా వుంటాడు.. తెల్లని లూజు చొక్కా, పైజమా ఆ చెట్టుకి వేస్తాడు. నుదుటి మీద కొబ్బరి ఈనెల్లా గీతలు, లోతుకెళ్ళిన కళ్ళు, ఐదుపైసల నాణెం లాంటి మొహం. నెత్తిమీద కొబ్బరి పీచులాంటి జుట్టు. ఆ వూరికి అతను ఏకైక దర్జీ. కుట్టించుకున్న బట్టలకి జనం తమకు తోచినప్పుడు `కుట్టు కూలి` ఇస్తారు. ఇవ్వకపోయినా నోరు తెరిచి అడగలేని బలహీనత అతడిది. అనుకున్న సమయానికి ఖచ్చితంగా బట్టలు కుట్టి ఇవ్వడం మాత్రం అతని నైజం!

'ఎంత బాగా కుట్టావురా కొండా?' అంటూ ఖద్దరు లాల్చీలు వేసుకున్న కామందుల పొగడ్తలకి ఏడుకొండలు పొంగిపోయేవాడు. పొగడ్డానికి తెరుచుకునే నోళ్ళు, పైసలు అడిగేసరికి మూగవైపోయేవి.

ఏడుకొండలు వడివడిగా నడుస్తున్నాడు, అతని బుర్రలో ఎడతెగని ఆలోచనలు, మనసులో ఆందోళన.. తల్లిని పెద్దాసుపత్రికి తీసికెళ్ళి వెంటనే చూపించాలి.. వారం రోజుల నుండి ఒళ్ళు తెలియని జ్వరం. ఉడుకు చేసింది అనుకుని ఆలస్యం చేసాడు ఇన్ని రోజులు. వారం నుండి పచ్చిగంగైనా ముట్టుకోకుండా ముడుచుకు పడుకుంది. టౌన్లో పెద్దాసుపత్రికి తీసుకెళ్లాలి చేతిలో చిల్లిగవ్వ లేదు. కృష్ణమూర్తి గారింట్లో రెన్నెల్ల క్రితం పెళ్లికి కుట్టిన బట్టలకి డబ్బులు అడిగి తీసుకోవాలి. అపుడు, ఇపుడు అంటూ తిప్పుతున్నారు. 'ఇప్పుడడిగేయాలి। ఆళ్ళిస్తారో ఇవ్వరో...' గొణుక్కుంటుంటే అతని గొంతుమీద నరాలు తేలుతున్నాయి.. ఒంటి నుండి చెమటలు ధారాపాతంగా కారుతున్నాయి! మునసబుగారి వీధి మలుపులోకి తిరిగాడు. ఈ మధ్యే కట్టిన బాబా గుడి దగ్గర జనం హుండీలో పడిన డబ్బులు లెక్క పెడుతున్నారు. దగ్గర వుండి లెక్కలు చూస్తున్న వార్డు కౌన్సిలర్ నానాజీ భార్య ధనలక్ష్మి అతణ్ణి చూసింది.

"కొండా! ఓ పాలి ఇంటికి రా, పనుంది!" పిలిచింది.

"వత్తానమ్మా! కిట్టమూర్తి గారింటికి బేగెల్లాలి. కాంత పనుంది, మళ్ళీ వత్తాను!" అంటూ ఈదురు గాలికి ఎగిరి పడుతున్న ఎండుటాకులా, కృష్ణమూర్తి ఇంటి కాంపౌండ్లోకి రొప్పుతూ అడుగుపెట్టి అరుగుమీద కూలబడ్డాడు.

తెల్లని గ్లాస్కోపంచె.. కాలి పిక్కల పైకి కట్టుకుని, పైన మల్లెపువ్వులాంటి లాల్చీ వేసుకున్నాడు కృష్ణమూర్తి. మెళ్ళో పులిగోరు మెరుస్తోంది.. నవాబ్‌పాలెం అత్తరు ఒళ్ళంతా పూసుకున్నాడు.. గుప్పుమని గాలిలోంచి వచ్చిన ఆ వాసన ఏడుకొండలు ముక్కుకి తాకగానే కృష్ణమూర్తి వస్తున్నాడని గ్రహించి, చేతులు కట్టుకుని నిలబడ్డాడు. కృష్ణమూర్తి పెద్ద పట్నంలో పెద్ద టేబుల్ మీద పేకాట ఆడడానికి బయలుదేరుతున్నాడు. బుల్లెట్ దగ్గరకి వెడుతూ, అప్రయత్నంగా..

"ఏరా! కొండ! ఇలా వచ్చావు?" లంక పుగాకు చుట్ట లాల్చీ జేబులోంచి తీస్తూ అడిగాడు.

"ఏం...లేదండి! అమ్మగోరున్నారాండి?" భయం భయంగా అడిగాడు.

"వున్నట్టుంది! ఏం కావాలేటి?" అడిగాడు.. బుల్లెట్ స్టార్ట్ చేస్తూ!

"డబ్బులు.. డ.. బ్బు .." తడబడుతూ కారుతున్న చెమటని చొక్కతో తుడుచుకుంటూ అడిగాడు.

"గట్టిగా సెప్పరా తత్తు కొడకా!" విసుక్కున్నాడు.


మా యమ్మకి పేనం బాలేదండి.,,అందుకని..." డబ్బుల కోసం.. చెప్పబోతుంటే, కృష్ణ మూర్తి భార్య దుర్గమ్మ బయటకు వచ్చింది.

ఆవిడని చూడగానే, "అమ్మగోరిని అడుగుతానండి.." అంటూ ఆవిడ కేసి తిరిగాడు. భార్య బయటకి రాగానే, ఒక్క క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా, `డుబ్ డుబ్` మంటున్న బుల్లెట్ మీద వెళ్ళిపోయాడు కృష్ణమూర్తి.

"అమ్మగోరు! మా యమ్మకి వొంట్లో శానా నలతగా వుందమ్మ.. సిన్నమ్మాయిగారి పెళ్ళికి కుట్టిన బట్టలకి `కుట్టి కూలి` ఇప్పిత్తే పెద్దాసుపత్రికి తీసుకెడతానండి!" ప్రాధేయపడుతూ అడిగాడు.

"అంత డబ్బులు నా దగ్గర ఎక్కడుంటాయిరా? అయ్యగారిని ఆడగకపోయావూ?" అంటూ అరుగుమీద కూలబడింది దుర్గమ్మ. మొగుడు ఏ తిరుగుళ్ళు తిరిగినా పట్టించుకోదు. అడిగినా.. అతను సమాధానం చెప్పడు. అలాగే ఇంట్లో డబ్బు మీద కూడా ఆమెకి అధికారం లేదు. దుర్గమ్మ కృష్ణమూర్తి భార్య అనే కేరాఫ్ అడ్రసు తప్ప.

"ఏడుకొండల డబ్బులు ఇచ్చెయ్యండి పాపం!" అని చెప్పినా ఇవ్వడు. పేకాటకి మటుకు అతని చేయి ముందుంటుంది. న్యాయంగా డబ్బులడిగే ఏడుకొండల్లాంటి వాళ్ళ దగ్గరకు వచ్చేసరికి అతని చెయ్యి రాదు.




"ఏడుకొండలు! ఈ జాకెట్టు చంకల కింద కొద్దిగా టైటు అయినట్టెంది. సరిచేసి పట్రా!" అంటూ కృష్ణమూర్తి రెండో కూతురు జలజ, రెండేళ్ళ క్రితం కుట్టిన జాకెట్టు తీసుకొచ్చి అతని ముందు పడేసింది. ఆమె మాట వినే స్థితిలో లేని ఏడుకొండలు దుర్గమ్మని బ్రతిమాలి బామాలి.. నిస్సహాయంగా వెళ్ళిపోయాడు. జలజ కోపంగా చూసింది అతని కేసి..!

నిరాశగా వెడుతున్న అతను రోడ్డు మీద కనబడగానే.. ఇంటి బయటే కాపలా కాసిన ధనలక్ష్మి.. "కొండా! ఇలా రా!" అంటూ గట్టిగా పిలిచింది.

"వత్తన్న తల్లి!" అంటూ గుమ్మం ఎక్కాడు..

"అయ్యగారు, నేను, షిరిడీ ఎడతన్నాము, ఈ పొందూరు ఖద్దరుతో అయ్యగారికి లాల్చీ, ఈ గుడ్డతో నాకో జాకెట్ బేగి కుట్టియ్యాలి! అర్జంటు. రేపే మా పయానం!" అంటూ అతని చేతుల్లో పెట్టింది.

"అలాగే అమ్మా! కానీ.. ఇప్పుడు నాకు ఎంటనే ఎయ్యి రూపాయలు కావాలమ్మ! మా యమ్మకి పేణం బాలేదు. పెద్ద డాక్టరుకి ఎంటనే సూపించమని, మన సూది డాౖటుగారు సెప్పారు!" అంటూ ఆవిడ మొహం కేసి చూశాడు... ఏమంటుందా? అని.

అందరికీ వడ్డీలకి అప్పులిచ్చే ఆమె, ఆ మాట వినగానే గతుక్కుమంది. "అంత డబ్బులు ఇప్పుడెక్కడ వుంటాయి ఏడుకొండలు!" అంది ఇబ్బందిగా మొహం పెట్టి.

"అలా అనకండమ్మా! కిట్టమూర్తిగారు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వడం లేదు! తవరైనా కాత్త సాయం సేయండి, పేణావసరం వచ్చింది. మీలాంటోళ్ళని నమ్ముకున్నాను తల్లి !" అంటూ కాళ్లావేళ్ళా పడ్డాడు.

కృష్ణమూర్తి మాట వినగానే ధనలక్ష్మి మొహం జేవురించింది. మొన్నామధ్య జరిగిన వార్డు ఎన్నికల్లో, మొగుడికి పోటీ వచ్చాడు.

"ఛీ.. ఆళ్ళ మాట సెప్పకు.. పైసా పైసాకి కక్కుర్తి పడేవోల్లు....మనం డబ్బులుకి సూసుకోము. మన దేవుడి కొత్త గుడి ఎంత బాగా డెవలప్ సేశామో నువ్వే సూసేవు కదా! ఆ కిట్టమూర్తి ఒక్క పైసా కూడా ఇవ్వలేదు!" అంటూ మూతి మూడు వంకర్లు తిప్పింది.

ముందు వాకిట్లో, గొడ్లకి నీళ్ళు పెడుతున్న ధనలక్ష్మి ఇంటి పాలేరు రాముడు వీళ్ళ మాటలు వింటున్నాడు ఆసక్తిగా.

"అవునమ్మా! తవరు శానా గొప్పోల్లు.. తమరు తలుసుకోకపోతే ఇయ్యన్నిఎవరు సేయిత్తారు? అలాగే నాక్కూడా సాయం చేయండమ్మా!" అంటూ బ్రతిమాలాడు.

"సర్లే అంతగా సెప్తున్నావు గనక, అప్పుగా ఇత్తాను.. నూటికి పది రూపాయల వడ్డీ!" అంది.

"అమ్మనీ! మరో `సేప` ని పట్టింది మహాతల్లి!" అనుకున్నాడు రాముడు.

ఏడు కొండల మీద జాలి వేసి, అప్పు తీసుకోవద్దని సైగ చేయబోయాడు రాముడు. కానీ ఏడుకొండలు అతని వైపుకి చూసే ధ్యాసలో లేడు. డబ్బుల వ్యవహారాలూ, వడ్డీలెక్కలు `టైలర్ బతుకుబడి` లో ఎవ్వరూ నేర్పలేదు... దాని గురించి ఆలోచించే సమయం కూడా అతనికిప్పుడు లేదు! తల్లికి ఏమవుతుందో అనే భయం అతని మస్తిష్కాన్ని మొద్దుబార్చేసింది.

ప్రామిసరీ నోటు మీద `వేలిముద్ర` వేయడానికి తెరిచిన అతని అరచేతిలో సూదుల ఎర్రని నాట్లు, ఉంగరం వేలికి పెట్టుకున్నఇనప చుట్టు,.. కత్తెర భారం మోసే ఎడమ బొటనవేలు, తీసుకోబోతున్న అప్పు భారానికి సాక్షులయ్యాయి. వేలిముద్ర వేసిన మరుక్షణం, ఆమె అతని చేతులో పెట్టిన తొమ్మిది వందలు చూసి తెల్లమోహం వేశాడు. అది గమనించిన ధనలక్ష్మి "వడ్డీ పట్టుకున్నాను లేరా!" అంది.

సగం అర్థం అయ్యి సగం అవక, బుర్ర గోక్కుని, "అలాగే అమ్మగారు!" అంటూ ఆ డబ్బులు జేబులో కుక్కుకొని ఒక్క ఉదుటున బయట పడి ఇంటివైపు కి పరుగెత్తాడు.

★★★

పెద్ద పండగ వచ్చిందంటే, వూరిలో అందరూ ఏడుకొండలకి ఇచ్చిన ప్యాంటు గుడ్డలు, చొక్కా గుడ్డలు, పరికిణి గుడ్డలతో అరుగు మీద కట్టిన దండెం నిండిపోయేది. 'ఏడుకొండలు.. నా బట్టలు ముందు కుట్టియ్యాలి నేను శానా ముందిచ్చాను" అంటూ జనం అతని మీద పడిపోయెవాళ్ళు. అందరికీ ఓపిగ్గా సమాధానం చెప్తూ కొలతలు తీసుకునే వాడు. అరుగు మీద కుట్టు మిషన్ శబ్దం ఆ వీధిలో ఆవిరామంగా వినబడుతూ వుండేది. ఆ రోజులన్నీ ఏకధాటిగా కష్టపడి కుడుతునే వుండేవాడు.

మొగుడి మిషన్ తొక్కుడుకి భార్య అలివేలు తాను ఒక కాలైంది. కాజాలు, బొత్తాలు కుట్టేది.. కూతురు సుబ్బులు తండ్రి చెప్పే కుట్టు కొలతలు జాగ్రత్తగా పెన్సిల్‌తో రాసేది. అతని దృష్టి వచ్చే డబ్బుల మీద కన్నా, దుస్తులు చక్కగా కుట్టడం, నిక్కచ్చిగా సమయానికి ఇవ్వడం మీదే వుండేది. ఇచ్చిన వాళ్ళు ఇచ్చేవాళ్ళు, ఎగ్గొట్టే ఆలోచన వున్నవాళ్ళు ఎగ్గోట్టేవారు. మరి కొంతమంది రేపు, మాపు అని తిప్పేవాళ్ళు. వచ్చిన డబ్బులన్నీ పెట్టుబడికి సరిపోయేవి. ఈరోజు అతనికి, కష్టాల్లో వున్నప్పుడు ఆదుకోని వూరి మీద కోపం వచ్చింది. ఏమి చేయలేని తన అసమర్ధత మీద అసహ్యం వేసింది. ఏనాడూ అప్పు చేయని తను ఈ రోజు చేయి చాచి అప్పు చేయవలసి వచ్చిందని చాలా ఆవేదనపడ్డాడు. బాధగా ఇంటికి వచ్చి మంచానికి అతుక్కుపోయి వున్న తల్లిని, అలివేలు, సుబ్బులు సాయంతో ఆసుపత్రికి తీసుకువెళ్ళాడు.

★★★

రోజులు కొత్త కుట్టు మిషన్ చక్రంలా వేగంగా తిరిగిపోతున్నాయి. తల్లి వైద్యంతో పాటు, కూతురి పెళ్ళికని కట్నం కోసం తీసుకున్న అప్పు పెనుభారం అయ్యింది. `అసలు` అస్సలు తీర్చలేకపోయాడు ఏడుకొండలు. వచ్చిన కొద్ది డబ్బులు వడ్డీకే సరిపోయేవి. దాంతో ఏడుకొండలు కాళ్ళు అవిరామంగా పనిచేసేవి. ఒక `మరాథాన్ రన్నర్` పరుగు పెట్టేంతగా కాళ్ళని కష్టపెట్టినా లాభం లేకపోయింది. గుడ్డి దీపాల్లో పని చేయడం వల్ల, చూపు దెబ్బతింది. `లక్కపిడత`లా అయిపోయిన ముఖానికి కళ్ళజోడు వచ్చింది. మరో పక్క.. కట్నం బాకీ ఇవ్వలేదని సుబ్బులు అత్తింటివాళ్ళు ఇంటికి పంపేయడం వల్ల అతను మరింతగా క్రుంగిపోయాడు. అవిరామ కష్టం అనారోగ్యానికి దారి తీసింది. ప్రజల అభిరుచులు మారాయి. జనం రెడీ మేడ్, బ్రాండెడ్ దుస్తుల మోజులో పడ్డారు. ఎంత రేటైనా పెట్టి కొనడానికి అలవాటుపడ్డారు. కొత్తగా డాబుగా షాప్ పెట్టిన టైలర్ కుట్టే మోడల్ జాకెట్లుకు అలవాటు పడిన ఆడాళ్ళకి, ఏడుకొండలు `ఓల్డ్ మోడల్ టైలర్` అయిపోయాడు. పనిలేక మిషన్ మూల పడింది. క్రమ క్రమంగా ఏడుకొండలు తన వృత్తి పనికి దూరమయ్యాడు.

★★★

ఒక రోజు సాయంత్రం ఏడు కొండలని రమ్మనమని ధనలక్ష్మి కబురు పంపింది.. అప్పు మొత్తం ఇప్పుడే జమ కట్టమంటుందేమోనని భయపడుతూ ఇంటికి వెళ్ళాడు.

"కొండా! మా రెండో మనవరాలు సాయమ్మ బజ్జోడానికి నాలుగు బొంతలు కుట్టియ్యాలి. అమ్మాయి అత్తారింటికి రేపు ఎళ్ళిపోతంది. రేపటికల్లా ఇచ్చేయాలి!" అంటూ పాత చీరలన్నీ అతని ముందు పడేసి.. "పెద్ద మనవరాలికి కూడా నువ్వే కుట్టిచ్చావు. నీ సెయ్యి మంచిదని కవురంపాను" అంది.

'బొంతలు కుడితే, సూదులు విరిగిపోతాయి.. ససేమిరా కుట్టను` అని కరాఖండిగా కొత్త టైలర్ చెప్పిన విషయం గొంతులో నొక్కేసింది.

"కొండా! మనలో మన మాట, నీ దగ్గర నుండి ఈ నెల వడ్డీ రాలేదు!" అని సన్నగా సన్నాయి నొక్కులు నొక్కింది.

"అస్సలు పని దొరక్క చాలా ఇబ్బందిగా వుంది. రెండ్రోజుల్లో సద్దుబాటు సేత్తాను తల్లి!" అంటూ తల దించుకుని సమాధానం చెప్పాడు.

"సర్లే! ఈ బొంతలు బేగి కుట్టియ్యి! దాని కుట్టుకూలి కొంత వడ్డీకి జమ చేసుకుంటాను!" అని హామీ ఇచ్చింది..

ఏడుకొండలి మొహంలో కాస్త వెలుగొచ్చింది. 'హమ్మయ్యా! ఈమెకివ్వాలసిన వడ్డీ కొంతైనా ఈ నెలకి జమ కట్టే అవకాశం వచ్చింది!' అనుకుంటూ ఇంటి దారి పట్టాడు.

ఇంటికొచ్చిన ఏడుకొండలని "ఏం మావా! దనంగారు ఎందుకు పిలిసింది?" భయపడుతూ అడిగింది అలివేలు.

విషయం చెప్పాడు.

"ఇప్పుడసలే నీ వొంట్లో అంతంత మాత్రంగా వుంది. కుట్టగలవరా కొండా!" అంటూ బాధగా అడిగింది తల్లి మీరమ్మ.

"తప్పదే! ఆయమ్మ వడ్డీ సెల్లుబాటు సేయాలి.. ఏడుకొండలు మాట తప్పాడు అనే మాట పడడం నాకిట్టం లేదు!" ఏకాగ్రతగా సూదిలోకి దారం ఎక్కించడానికి ప్రయత్నం చేస్తూ అన్నాడు. చీరలన్నీ వరసలో పేర్చుకుని పని మొదలెట్టాడు. అలివేలు, సుబ్బులు సాయం చేసారు. కుట్టు మిషన్‌కి బొంతలు కుట్టే సూదులు మార్చాడు. మూలుగుతున్న మిషన్ని ఆయిల్ పోసి బుజ్జగించాడు. దారం ఎక్కించడానికి చాలా సేపు విశ్వప్రయత్నం చేశాడు . ఒకప్పుడు `ఏనుగంత` కనపడే `సూది బెజ్జం` `చీమంత` అయినట్టుగా అనిపించింది మబ్బేసిన అతని కళ్ళకి! కళ్ళజోడు అద్దాలు నాలుగైదు సార్లు చొక్కాతో తుడిచాడు... మళ్ళీ ఏకాగ్రతగా చూశాడు. చెమట చుక్క నుదుట మీద నుంచి జారిపడింది మిషన్ `చేతిచక్రం` మీద. అతని దృష్టిరేఖ కాసేపటికి పదును తేలింది. చివరకు `సూది దారాన్నితన గుండెలోకి ` లాక్కుంది. చాల రోజుల తర్వాత కాళ్ళు మిషన్ పెడల్ మీద పెట్టగానే దాని శబ్దానికి అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. వణుకుతున్న అతని చేతివేళ్ళని కత్తెర ఆప్యాయంగా పెనవేసుకుంది. కొంత సేపటికి వేగం అందుకుని, పనిలో నిమగ్నమయ్యాడు. ఇంతలో సూది విరిగిపోయింది. పక్కనున్న డబ్బాలో వెతికి మళ్ళీ కొత్త సూది ఎక్కించాడు.. కొంత సేపటికి అదీ విరిగిపోయింది. ఏడుపొచ్చిందతనికి.. ఆక్రోశం వచ్చింది.. విసురుగా ఫ్యాన్సీ షాపతను దగ్గరకు వెళ్ళి "ఛీ ఒక్క నా కొడుక్కి నీతి నియమం లేదు! ఈ ఎదవ నాసిరకం సూదులు అమ్ముతారా!" అంటూ సూదులు అతని మొహం మీద పడేశాడు..

"నీ యాపారానికి ఇయ్యి సాల్లే!" అంటూ అతను ఎగతాళిగా మాట్లాడాడు.

"ఏంట్రా అంటున్నావు!" అంటూ గట్టిగా అరిచి, అతని కాలరు పట్టుకునాడు. అతను ఒక్క తోపు తోసాడు, షాపతని బలానికి తట్టుకోలేక, వెల్లకిలా పడ్డాడు ఏడుకొండలు. ఒంటికి అంటుకున్న దుమ్ము దులుపుకుని, తిట్టుకుంటూ ఇంటి దారిపట్టాడు.

మొగుడి వాలకం చూసి.. "ఏటయ్యిందయ్యా!" అంటూ కంగారుగా అడిగింది అలివేలు.

"ఏం లేదులే! రోడ్డు మీద కాలి జారీ పడ్డాను!' అని అబద్ధం ఆడాడు.

ఇంతలో ధనలక్ష్మి వడ్డీ జ్ఞాపకం వచ్చి, పనిలో పడ్డాడు. సూదుల కోసం మళ్ళీ అరలో వెతికి తీసి మిషన్‌కి అమర్చాడు.

"కాస్త ఎంగిలి పడరా కొండా!" అంది మీరమ్మ కొడుకు దగ్గరగా వచ్చి తల నిమురుతూ..

"వద్దే! ఆలస్యం అయ్యిపోతుంది. రేపటికల్లా ధనంగారికి అందజేయాలి మాటిచ్చాను!" అంటూ పని చేసుకు పోతున్నాడు. మీరమ్మ, సుబ్బులు నిద్రలోకి జారుకున్నారు.. రాత్రి మూడో ఝాము అయ్యింది. అలివేలు ఆగలేక నిద్రలోకి జారిపోయింది. ఆ వీధిలో అతని మిషన్ శబ్దం ఒక్కటే నిశ్శబ్దాన్ని చీలుస్తోంది. ఏడుకొండలు అవిరామంగా, అవిశ్రాంతగా, మిషన్ తొక్కుతూనే వున్నాడు. కాళ్ళు బరువెక్కిపోయాయి, అయినా బలవంతంగా తొక్కుతున్నాడు. శక్తి కూడదీసుకుని తొక్కుతూనే వున్నాడు. తలలోంచి ధారాపాతంగా కారుతున్న చెమట మిషన్‌కి `కందెన` గా మారింది. ఊపిరి అతి బలవంతంగా తీస్తున్నాడు.

ఆఖరి ఝాము ముగిసింది. మిషన్ మీద నుంచి ఆఖరి బొంత క్రిందకు జారింది. మిషన్ సూదికి వేలాడుతున్న దారం 'పుటుక్కుమని' తెగిపోయింది. అతని మిషన్ ఆగిపోయింది శాశ్వతంగా. పూర్తి అయిన బొంతలు ఏడుకొండలు నిజాయితికి నిక్కచ్చితనానికి నిలువెత్తు సాక్ష్యంగా మిగిలాయి.

★★★★★

# వసంతోపాఖ్యానం

ఉయ్యూరు అనసూయ



✆ 9550506829

**కథామంజరి నిర్వహించిన దీపావళి కథల పోటీ 2022 లో ప్రోత్సాహక బహుమతి లభించిన కథ**

***ప్రతిరోజూ కూలికి పోయి భార్యాభర్తలు వెయ్యిపైనే సంపాదిస్తారు. గౌరి కాకుండా ఇంకో మూడేళ్ళ అమ్మాయి, సంవత్సరం వయస్సున్న అబ్బాయి వున్నారు. ఉచిత పథకాల కింద కొంత.. ఖర్చులు తక్కువే. అయినా రోజుకు ఐదువందల్లో ఖర్చు లెక్క వేసినా ఐదు వందలో కనీసం రెండు వందలన్నా పొదుపు చేయవచ్చు. కానీ వీరికి ఆ జాగ్రత్త లేదు. పైగా తాగుడుకి డబ్బు తగలేస్తాడు. భార్యకేమో బంధువుల ఇళ్ళల్లో ఫంక్షన్లకి పిలిచిందే ఆలస్యం తప్పక వెళ్ళి రావలసిందే. అది ఎంత ఖర్చయినా. ఇలా వీరిద్దరి దూబరాతనంకి పిల్ల చదువుని బలిచేస్తున్నారే అని వసంత బాధ.***

గౌరి ఇంకా రాలేదేమాని మాటిమాటికీ గుమ్మం వైపు చూస్తోంది వసంత.

వసంత ఎదురు చూపులు ఎందుకో పసిగట్టిన భర్త అర్జున్ "ఎవరికోసం చూస్తున్నావు? పోలీస్ స్టేషన్ వరకూ వెళ్ళి వచ్చి అవమానపడ్డా ఇంకా బుద్ది రాలేదా?" అన్నాడు.

"ఇందులో అవమానం ఏం వుందండీ! వాళ్ళకి మనలా సంస్కారం నేర్పిన తల్లిదండ్రులు లేరు. అలాంటి వారి ఆలోచనా ధోరణి అలాగే వుంటుంది. వారికి బుద్ధి లేకపోతేనేం మన బుద్ధి వుంది కదా! మన అంతరాత్మకి తెలుసు కదా మనం చేస్తున్నది మంచని. ఏదో చిన్న అవాంతరం వచ్చింది కదాని ఆ చిన్న పిల్ల భవిష్యత్తు ఎందుకు నాశనం చేయాలి? మనం నాలుగు మంచి మాటలు నేర్పబట్టేగా ఆ పిల్ల వున్నది వున్నట్లు చెప్పి మనల్ని గట్టెక్కించింది. అదే ఇంకొకరైతే వారి తల్లిదండ్రుల మాట విని నిజంగానే మనల్ని ఇంకా ఇరకాటంలో పెట్టేవారు!"

"కానీ అది చిన్న అవాంతరమా? వారి దుష్ట బుద్ధి చూసావుగా! అలాంటి వారి పట్ల అపకారికి నుపకారం అన్నట్లు చేద్దామనుకుంటున్నావేమో అది పాముకి పాలు పోసినట్లే!" అన్నాడు దృఢంగా.


అతను అలా అనటంలో న్యాయం వుంది. ఎందుకంటే వసంత బాంకు ఉద్యోగినిగా ఉన్నప్పటికి తనకి చేతనైన సహాయం ఇతరులకి చేయాలనే తత్వం గలది. తన ఎనిమిదేళ్ళ కూతురిని చదివించేప్పుడు చుట్టు పక్కల పిల్లలను కూడ పోగేసి సాయంత్రంపూట పాఠాలు చెప్తుంటది. అలా చెప్పేటప్పుడు ఎంతో ఆసక్తిగా ఓర్పుగా చెప్పటం పిల్లలకు బాగా నచ్చుతుంది. అందుకే సాయంత్రం అవ్వగానే పిల్లలంతా మంత్రం వేసినట్లుగా వసంత ఇంటికొచ్చేస్తారు.

అలాగే గౌరి అనే పిల్లకూడ వచ్చేది. ఆ పిల్లకి చదువు పట్ల వున్న శ్రద్దని చూసి వసంతకి అందర్లోకి గౌరంటే మరింత ఇష్టం. వాళ్ళ అమ్మనాన్న అచ్చెమ్మ, వీరాయి కూలి పనులకు వెళతారు. పేరుకి గవర్నమెంటు బడికి పంపినా ఆ పిల్లని అప్పుడప్పుడు హోటల్లో పనులకి, విందు భోజనాలప్పుడు ఆకులు ఎత్తటానికి పంపుతుంటారు. సాయంత్రం ఇలా చదువుకోటం వారికి పర్వాలేదు గానీ, టీచరుగా వసంత వాళ్ళని బాగా ప్రోత్సహించటం నచ్చలేదు. పనులు ఉన్నప్పుడు బడి మాననని పేచీ పెట్టటం కారణం. పిల్ల చదువు పేరుతో తమ మాట వినక దక్కకుండా పోతుందేమోని భయం.

అదీగాక ఓసారి హోటల్లో పనిచేయటం చూసి, వసంత ఆ హోటల్ వారితో పిల్లల్ని పనిలో పెట్టుకోటమేంటని మందలించింది. దానితో వారు ఆ పిల్లని పిలవటం మానేసారు. ఇది తెలిసి గౌరి తండ్రి వీరాయి "అమ్మగారు చాల కష్టాల్లో వున్నాం, మా ఇద్దరి సంపాదన రోజు ఖర్చులకు చాలటం లేదు. మొన్న మా ఆడదానికి జబ్బు చేస్తే తెలిసిన షావుకారు దగ్గర అప్పు చేసాను. ఇప్పుడు ఆ అప్పు తీర్చకపోతే వడ్డీ కట్టేందుకే మా రోజువారి కూలీ చాలదు. అందుకే ఓ సంవత్సరంపాటు పిల్లని పనిలో పెడితే పదివేలు ఇస్తానన్నాడు. అందుకే వుంచాను. మీరు కొంచెం కనికరించండి!" అంటూ బ్రతిమాలాడు.

ప్రతిరోజూ కూలికి పోయి భార్యాభర్తలు వెయ్యిపైనే సంపాదిస్తారు. గౌరి కాకుండా ఇంకో మూడేళ్ళ అమ్మాయి, సంవత్సరం వయస్సున్న అబ్బాయి వున్నారు. ఉచిత పథకాల కింద కొంత.. ఖర్చులు తక్కువే. అయినా రోజుకు ఐదువందల్లో ఖర్చు లెక్కవేసినా ఐదు వందలో కనీసం రెండు వందలన్నా పొదుపు చేయవచ్చు. కానీ వీరికి ఆ జాగ్రత్త లేదు. పైగా తాగుడుకి డబ్బు తగలేస్తాడు. భార్యకేమో బంధువుల ఇళ్ళల్లో ఫంక్షన్లకి పిలిచిందే ఆలస్యం తప్పక వెళ్ళి రావలసిందే. అది ఎంత ఖర్చయినా. ఇలా వీరిద్దరి దూబరాతనంకి పిల్ల చదువుని బలిచేస్తున్నారే అని వసంత బాధ.

"అయితే ఓ పని చేయి ఆ డబ్బు నేను సర్దుబాటు చేస్తాను. నీ దగ్గర వున్నప్పుడు నిదానంగా తీర్చుదువు గానీ కానీ గౌరీని మాత్రం బడి మాన్పించకు!" అంది.



"అయ్యో అంత కంటే కావలసిందేం వుంది, అలాగేనమ్మా.. సంతోషంగా మీరు చెప్పినట్లే చేస్తా!" అన్నాడు. తనకు తనకు మాలిన ధర్మం వలదు అని భర్త చెబుతున్నా "పోనీలెండి మనిషిని మనిషి నమ్మకపోతే ఎలా? ఇక ఆ పదివేలతోనే మనకి ఆర్థిక నష్టాలు వస్తాయా? ఒకవేళ వాడు ఇవ్వకపోయినా ఒక పిల్ల చదువుకి ఆర్థిక సహాయం అందించాం అనుకుందాం!" అని నచ్చచెప్పింది.

వసంత ఆ షావుకారుని పిలిపించి అతనికి ఇవ్వవలసిన బాకీ ఇచ్చి, అతని దగ్గర రాసిన ప్రోనోటును తన దగ్గర జాగ్రత్త చేస్తానని తీసుకుంది.

ఇప్పుడు గౌరి చక్కగా స్కూలుకి వెళుతుంది. వీళ్ళకి కూడ వారి అప్పు జ్ఞాపకం చేసేవారు లేరు కాబట్టి రోజులు ఆనందంగా గడిచిపోతున్నాయి.

అయితే ఓ రోజు అచ్చెమ్మ పరుగెత్తుకుంటూ వచ్చి "గౌరి కనబడటంలేదమ్మా!" అని చెప్పింది వసంతకి.

ఆ మాట విని కాస్త షాక్ తిన్న వసంత "కనబడకపోవటమేమిటి ఉదయం నా దగ్గరకి వచ్చిందిగా? అసలేం జరిగింది!" అడిగింది వసంత.

"అదే నమ్మా.. మీ కాడి నుండి వచ్చినాక ఇదో మా ఆయన రేపు బడి మాను మాతోపాటు పనికిరా అని చెప్పాడు. ఎందుకు అస్తమానూ బడి మానేది వసంత మాడమ్‌కి తెలిస్తే ఊరుకోరు!" అంది.

"చదువుకోటం నా కిష్టం లేకనా బిడ్డా! మనకి కాస్త డబ్బు అవసర పడింది నీవు కూడ పనికి వస్తే కాస్త పైసలు వస్తయి కదా అని చెప్పిందు నా పెనిమిటి. దానికే కోపం చేసుకుని ఎటో వెళ్ళింది. మధ్యానం బువ్వ తినేటానికి కూడ రాలే. ఏడ్నో ఓ చోట వుందను కుంటిని కానీ చీకటి పడే వేళయితాంది. నాకేదో భయంగా వుందమ్మా!" అంది కన్నీరు పెట్టుకుంటూ.

వసంతకి వళ్ళు మండిపోయింది. "నీకు ఇదివరకే చెప్పాను. పిల్లలని పనిలో పెట్టటం నేరమని. గౌరి చాల తెలివైంది. ఆపకుండా బడికి పంపితే బాగ చదువుకుంటుందని. పిల్ల పేరుతో బడిలో ఇచ్చే అన్ని వస్తువులు తీసుకుంటూ పిల్లని బడికి పంపవు. నీకొచ్చిన కష్టమేంటి అంటే పదివేల రూపాయలు షావుకారు కొట్లో బాకి వుందంటే దాన్ని తీర్చాను కదా! మళ్ళీ పిల్లని ఇలా హింసించమేమిట? నీ భర్త అలా చెబుతుంటే నీవెందుకుని అడ్డుకోలేదు?" అంటూ గట్టిగా అరిచింది.

అంతలో గౌరి సంగతి గుర్తొచ్చి తమాయించుకుని.. "సరే నీవు వెళ్ళి పోలీస్ కంప్లయింట్ ఇవ్వు. తెలిసిన చోట్ల వెతుకు. నేను కూడ ఎంక్వయిరీ చేయిస్తాను!" అంటూ తనకి తెలిసిన వారికంతా ఫోను చేసి గౌరి వివరాలు చెప్తూ తన దగ్గర వున్న ఫోటో ఒకటి పెట్టి వెతకమని పురమాయించింది.

భర్త ఇంటికి రాగానే విషయం చెప్పింది. అతను 'మనం కూడ ఓ ప్రయత్నం చేద్దాం రా' అని పిలవగా కూతురిని తీసుకుని కారు ఎక్కి కూచుని, అన్ని బజార్లూ వెతుకుతూ వెళ్ళారు. రాత్రి పదకొండయింది ఎక్కడా ఆచూకీ దొరకలేదు. ఇంటికి వచ్చేసారు.

రాను రాను వసంతకి భయం ఎక్కువైంది. మనసు కీడు శంకిస్తుంది. పిల్ల ఏదన్నా ఆత్మహత్య చేసుకుందేమోనని. రాత్రంతా నిద్రపోకుండా ఆలోచిస్తూనే వుంది. వసంత పరిస్థితి చూసి.. 'ఎందుకు అంత టెన్షన్ అవుతావు ఏం కాదులే' అని ధైర్యం చెబుతూనే.. 'మనకి కాని పనుల్లో మనం తల దూర్చకూడదు. చూడు ఇప్పుడు లేని పోని తల నొప్పి, ప్రశాంతంగా వుండక ఇది మనకి అవసరమా?' అంటూ నిదానంగా హెచ్చరించి నిద్రపోమ్మని బలవంత పెట్టాడు.

కళ్ళు మూసుకుంది వసంత.. కాని తల్లి మనస్సు కదా.. నిద్ర ఎలా వస్తుంది! అయ్యో పిల్ల ఎక్కడ ఏ అవస్థ పడుతుందో, ఏ రాక్షసుడి చేతులో పడుతుందో, భగవంతుడా ఏం కాకుండా చూడు అంటూ వేయిసార్లు దేవుళ్ళకి మొక్కుకుంది.

తెల్లవారక ముందే లేచి వీరాయికి కబురు చేసింది గౌరి ఆచూకీ ఏమన్నా తెలిసిందాని. లేదమ్మా అని చాల మామూలుగా చెప్తూ.. "ఈరోజు వరి నూర్పుళ్ళు వున్నాయి. ముఠా వాళ్ళు కబురు చేసారు మేం పోయొస్తాం అమ్మా!" అన్నాడు.

"అదేంటి పిల్ల కనబడటంలేదని తెల్లవార్లూ నాకు నిద్రలేకుండా వుంటే అంత తాపీగా పనికి పోతున్నా అని చెప్తున్నావు?" అంది ఆశ్చర్యం కోపం కలగలిపి.

"పిల్ల దొరికితే ఇంటికి మీరు తెప్పిస్తారు కదమ్మా.. కంగారు ఎందుకు?"

"ఆ మాత్రం భరోసా వుంచావు సంతోషం, కానీ నా మనసెందుకో బాలే. జరగరానిది ఏదైనా జరిగితే ఎలా?" అన్నది అతన్ని మానసికంగా సిద్ధం చేద్దామని. కానీ అతను అన్న మాటలు విని వసంత హతాశురాలు అయ్యింది.

"ఏం జరిగితే ఏమమ్మా.. మీరు పరిహారంగా డబ్బు ఇప్పిస్తారు కదా! ఇంక దిగులు దేనికి?"

"అంటే పిల్ల పోయినా పర్లేదా.. నీకు డబ్బేకావాలా?" అసహ్యం నిండిన గొంతుతో అరిచింది.

ఆ గొంతులోని కాఠిన్యానికి కాస్త తగ్గి, "అది కాదమ్మా మొన్న మా బంధువుల పిల్ల కూడ ఇలా తప్పిపోయిందను కున్నాం,

కానీ ఎవరో దొంగ వెధవలు పాడు చేసి పారేసారు. మా కులపోళ్ళందరూ ధర్నాకి దిగితే ప్రభుత్వం కుటుంబానికి ముందు కొంత డబ్బు ఇచ్చింది. తర్వాత పిల్ల ఆసుపత్రిలో చనిపోతే ఎకరం పొలం ఇచ్చి ఆదుకుంది. ఆ దెబ్బతో వారి కష్టాలు తీరాయి. అందుకే అలా అన్నాను!" అన్నాడు.

ఈసారి మరీ రోత అనిపించి నోట్లో మాట రాలేదు వసంతకి. అలాంటి సంఘటనల్లో ఆ తల్లిదండ్రుల గుండెకోతకి అది ఊరటగా వుండొచ్చేమో. కానీ పిల్ల కనబడటం లేదు అంటే పిల్ల తాలూకు జ్ఞాపకాలు నెమరువేసుకుని బాధపడటంపోయి ప్రభుత్వం నుండి ఏమైనా వస్తుందా అని ఎదురు చూసి మనిషి ప్రాణానికి, పేగు బంధానికి విలువివ్వకుండా మాట్లాడుతున్న తండ్రిని చూసి కొట్టాలనిపించింది.

ఇంతలో "స్టేషను నుండి ఫోను వచ్చింది. అమ్మాయి దొరికిందట. మనల్ని రమ్మంటున్నారు" అంటూ భర్త బైటకి వచ్చి చెప్పేసరికి. వసంతకి చెవుల్లో అమృతం కురిసినంత సంతోషం వేసి, వీరాయి ముఖం వైపు చూసింది. వాడి ముఖం ఒక్కసారిగా వాడిపోయింది. అయోమయంగా ముఖం పెట్టాడు.

"సరే.. త్వరగా స్టేషనుకు వెళ్ళు, పాపం పిల్ల ఎక్కడెక్కడ అవస్థపడిందో!" అని భర్త చెబుతుంటే పరుగులాంటి నడకతో వెళ్ళాడు.

కొద్దిసేపటికి ఎస్సై నుండి మరల ఫోను వచ్చింది. మాడమ్‌ని తీసుకుని మీరు కూడ స్టేషనుకు రండని. పాపని స్కూలుకి పంపించాక ఇద్దరూ వెళ్ళారు. ఏదైనా జాగ్రత్తలు చెప్పి పంపిస్తారేమో అనుకున్నారు. వీరిని చూడగానే ఎస్సై మర్యాదగా రమ్మని కూర్చోబెట్టి చెప్పాడు. నిజానికి గౌరి తప్పిపోలేదని తండ్రే డబ్బు కోసం, ఆ పిల్లని పక్కనే వున్న చింతపాలెం ఊర్లో వుంటున్న ఓ పెద్ద కుటుంబంలో ఇంట్లో పనిమనిషిగా వుంచి ఓ ఇరవై వేలు తెచ్చుకున్నాడని. అది నచ్చక ఈ పిల్లపారిపోయి వచ్చిందని.

అది విని నిర్ఘాంతపోయారు ఇద్దరూ.

“మరలాంటప్పుడు పోలీస్ కేసు ఎందుకు పెట్టినట్లు?” వీరాయి వైపు చూసాడు అర్జున్.

"పోలీసు కంప్లయింటు ఏం ఇచ్చాడు మేడమ్.. చదువుకోమని మీరు వత్తిడి చేస్తుంటే తట్టుకోలేక పిల్ల ఇంటి నుండి వెళ్ళిందని అదిగో వారి కుల పెద్దని తీసుకుని వచ్చి మాకు వచ్చి చెప్పాడు. పైగా వాళ్ళ దగ్గర మీరు నోటు రాయించుకున్నారని చెప్పాడు." అప్పుడు చూసారు వాళ్ళు.. వీరాయి పక్కన వారి కుల పెద్ద నిలబడి వుండటం.

ఎస్సైగారు ఇంకా చెప్తున్నారు నిజానిజాలు తెలుసుకోటాని మేం ఓరోజు ఆగాం. ఇంతలో ఈ గౌరే తప్పించుకుని ఇక్కడికి వచ్చి జరిగింది మొత్తం చెప్పబట్టి విషయం తెలిసింది. అతను ఊహించలేదు ఈ పిల్ల అక్కడ నుండి తప్పించుకు రాగలదని. కానీ ఏ అబద్ధమైతే చెప్పాడో ఆ అబద్ధమే నిజమై, గౌరి అక్కడ నుండి పారిపోయి ఇక్కడకి వచ్చింది. మా కానిస్టేబుల్ చింతపాలెం ఊరి పెద్దమనిషి దగ్గరకు వెళ్ళారు అతన్ని తేవటానికి.

వింటున్న వసంత, అర్జున్ నోర్లు వెళ్ళబెట్టారు. ఎంత కుయుక్తితో ఆలోచించాడు. పేదవాడు ఏం చేసినా మనుషులు నమ్ముతారనేగా. అసలు అంత దుర్మార్గపు ఆలోచనలు ఎలా వస్తాయి. ఈ విషయం బైటకు వెళితే జనం నిజమనే అనుకునేవారు కదా! తర్వాత నిజం తెలిసినా ముందు నగుబాటు అయితే తప్పేది కాదుగదా! మంచి తనానికి విలువ లేకుండా పోయింది. ఆలోచిస్తున్న అర్జున్ ఎస్సై మాటలకి తిరిగి చూసాడు.

"సర్ చెప్పండి వీడ్ని ఏం చేయమంటారు?" ఎప్పుడైతే ఎస్సై అన్నాడో వెంటనే వారి కుల పెద్ద ముందుకు వచ్చి "అమ్మా! వీడి

మాటలు నిజమని నమ్మినమాట నిజమే, కానీ మీరు తమ కూతురితోపాటు సమానంగా ఈ గౌరిని చూసేవారని, ఎంతో మంచివారని గౌరి చెప్పగా ఇప్పుడే తెలిసింది. మా జాతి బాగు పడలేదంటే ఇన్నాళ్ళూ అవతలి వారి మోసం అనుకున్నాను. కానీ మా కున్న అజ్ఞానం దానికితోడు వ్యసనాలు మనిషిని మనిషిగా వుంచవని అర్థమైంది. క్షమించండమ్మా!" అన్నాడు.

ఎప్పుడైతే కుల పెద్ద తప్పు అన్నాడో అప్పుడు వీరాయి వసంత కాళ్ళు పుచ్చుకుని "అమ్మా! తప్పయిపోయింది. క్షమించండి!" అన్నాడు. అది పశ్చాత్తాపంతో కాదని అర్థమౌతుంది. ఓసారి గౌరి వైపు చూసింది వసంత.

"ఆ పిల్ల చూపుల్ని అర్థం చేసుకుని చిన్నపిల్లకున్న జ్ఞానం కూడా లేకపోయింది. ఆ పిల్ల చదువుకి సహకరించమనండి చాలు. అవసరం అయితే ఆ పిల్ల ఇష్టానికి వ్యతారేకంగా ఏం నిర్ణయాలు తీసుకోనని కాయితం రాయించండి!" అని చెప్పి బైటకు వచ్చేసింది ఆరోజు.

ఎస్సై ఏం చెప్పారో తెలియదుగాని మరుసటి రోజు భార్య భర్తలు ఇద్దరూ గౌరిని తీసుకుని వచ్చి.. "మేం కష్టపడి పిల్లల్ని చదివించుకుంటాం. పార్వతి పరమేశ్వరులవంటి వారికి ద్రోహం తల పెట్టాలని చూసాము క్షమించండి!" అన్నారు. ఈసారి చాల సిన్సియర్‌గా చెప్తున్నట్లే అనిపించింది. గౌరిని చదువుకో అన్నట్లు అక్కడ వదిలేసి వెళ్ళారు. గౌరి ఎంతో ఆనందంగా "అమ్మగారు! మీ పుణ్యమాని నేను చదువుకుంటానికి అవకాశం వచ్చింది. ఇంక నేను చూడండి ఎలా చదువుతానో.." అంది.

ఆ పిల్ల సంతోషం చూసి గౌరి కోపం తగ్గిపోయింది. ఎప్పటిలాగే చదువుకోటానికి వస్తుంది.

కానీ భర్త అప్పుడప్పుడు జరిగింది తలుచుకుని 'మన టైం బావుండి గౌరి తప్పించుకురాగలిగింది. కాని పక్షంలో పిల్లని దాచి మనల్ని బదనామ్ చేద్దామనే కదా అనుకున్నాడనే' విషయం సహించుకోలేకుండా వున్నాడు. ఇలాంటివి తగ్గించుకో అని సందర్భం వచ్చినప్పుడల్లా చెప్తూనే వుంటాడు.

కానీ వసంత ఆలోచన ఒక్కటే.. మంచి అలవాట్లు నేర్పటానికి మనుషులకి సహాయపడాలి. లేకుంటే ఈ సమాజం ఎలా ఉన్నతమైన ఆలోచనలతో ఎదుగుతుంది? మనకి తెలిసిన విషయం పది మందికి పంచాలి. మనకెందుకులేమ్మని అనుకుంటే ఇదిగో ఈ వీరాయి లాగానే అంతా ఆలోచిస్తారు?

కొత్త గౌనుతో గుమ్మంలో అడుగు పెడుతున్న గౌరిని చూసి ఊపిరి పీల్చుకుంది. దగ్గరకు రాగానే "సర్ ఈ రోజు నా పుట్టినరోజు అందుకే గుడికెళ్ళి వచ్చేసరికి ఆలస్యమైంది. ఇదిగోండి ప్రసాదం!" అంటూ కొబ్బరి చిప్ప చేతిలో పెట్టి ఇద్దరి కాళ్ళకి నమస్కరించి ఆశీర్వాదం తీసుకుంది. గౌరి విధేయతకి ముచ్చటపడి అర్జున్ "నీవు చెప్పింది నిజమే! మంచి చెడూ నేర్పటానికి ఎవరో ఒకరు తల్లిదండ్రుల స్థానంలో వుండాలి. మంచి జరగదేమోని భయపడి మంచిని పంచటం మానకూడదు!" అన్నాడు.

★★★★★

# ఆ ఇద్దరూ...

శరత్ చంద్ర



✆ 9849241286

**కథామంజరి నిర్వహించిన దీపావళి కథల పోటీ 2022 లో ప్రోత్సాహక బహుమతి లభించిన కథ**

***"యూ.ఎస్‌లో మన పండూ జీతం హీనపక్షం మన కరెన్సీలో నెలకు ఐదు లక్షలు ఉంటుంది. మావాడి శాలరీ యాభై వేలు. జీతానికి తగ్గ పని ఉంటుంది కదా గురూ? మాట్లాడే తీరిక ఎక్కడ ఉంటుంది? అయినా సమయం దొరికినప్పుడు వాళ్ళ మమ్మీ తో ఏలాగూ మాట్లాడుతూనే వుంటాడుగా? నిన్ను చూస్తే మొదటి నుంచి మీ వాడికి భయమే కదా? అందుకే నీ విషయంలో కాస్త చొరవ తక్కువ" అన్నాడు రాఘవ.***

స్నేహితుడి భుజం మీద చేయి వేసాడు రాఘవ ఆప్యాయంగా. పచారి సామాన్లు స్కూటర్ డిక్కీలోకి నెట్టి పార్కులోకి వచ్చారు ఇద్దరూ. ఒక సిమెంట్ బెంచీ మీద కూర్చున్నారు. పార్కులో పిల్లలు అల్లరి అల్లరిగా తిరుగుతూ ఆడుకుంటున్నారు.

"బాల్యం ఒక మధురానుభూతి" అన్నాడు రాఘవ.

"మన పిల్లలకి ఇలాంటి బాల్యం ఇచ్చామా" అన్నాడు సాలోచనగా నారాయణ. "పుస్తకాల వెంట వాళ్ళను పరుగెత్తించడంతోనే సరిపోయింది కదూ" అన్నాడు రాఘవ

"ప్లీజ్ డోంట్ కాల్ మీ రిపీటెడ్లీ మమ్మీ" అన్నాడు అనిరుద్

"అవేం మాటలు రా" అంది సుమతి గాయపడిన హృదయంతో

"నేను ఇక్కడ గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోను మమ్మీ. కంటిన్యూయస్ ప్రాజెక్టు వర్క్స ఉంటాయి. కాన్ఫరెన్స్‌లు సరే సరి" అన్నాడు అసహనంగా

"మా కంటే ఆ మీటింగులే ముఖ్యమా"

అనాలనుకుని గొంతు వరకూ వచ్చి ఆగిపోయింది.

భర్త నిద్రపోతున్న గదిలోకి వచ్చింది. ఆమె కళ్ళల్లో నీళ్లు సుడులు తిరుగుతున్నాయి. భార్య వచ్చిన అలికిడికి కళ్ళు తెరిచాడు నారాయణ.

"ఏంటి అలా ఉన్నావు" అడిగాడు.

"ఏం లేదు..." అంది పొడి... పొడిగా...

"ఏమీ లేకపోతే నీ మొఖం ఎందుకు అలా మారిపోయింది" అడిగాడు. "పండూకి కాల్ చేశాను.." చెప్పింది.

"ఏం మాట్లాడుకున్నారు అమ్మా కొడుకులూ.." అడిగాడు కాస్త నవ్వుతూ.

"బిజీగా ఉన్నాడంట.." అంది ఉడుక్కుంటూ కంప్లైంటుగా. నవ్వొచ్చింది నారాయణకి.

"నువ్వు కాన్వెంట్ కి రెడీ చేసి పంపిన పండూ అనుకున్నావా? వాడు ఇప్పుడు ఒక పెద్ద కంపెనీలో ప్రాజెక్ట్ మేనేజర్" చెప్పాడు.

"అయితే మాత్రం ఫోన్ చేసి మాట్లాడలేనంత బిజీనా" అంది కోపంగా.

"సర్లే వీలు చూసుకుని చేస్తాడు" అని పైకి లేచి, "గ్రాసరీస్ ఏమైనా అవసరమైతే స్లిప్ మీద రాసివ్వు తెచ్చి ఇస్తాను" అన్నాడు.

"ఒంట్లో బాగాలేని మనిషి మీరు ఎలా పోతారు?" అంది. "పర్వాలేదు కాస్త హుషారుగానే ఉందిలే" చెప్పాడు



"నేను వెళ్ళి తెచ్చుకుంటాలెండి." అంది.

"పర్వాలేదులే సుమతి .. రాఘవుల్ని తోడుగా తీసుకెళ్తాను." చెప్పాడు

రాఘవులుకి ఫోన్ చేయగానే స్కూటర్ తీసుకొని వచ్చాడు.

"ఒంట్లో బాగోలేదు కదా రెస్ట్ తీసుకోపోయావా గురూ" అన్నాడు

"పడుకుంటే మరింత నీరసం వచ్చేలా ఉంది రాఘవా" అన్నాడు

నాలుగు రోజుల క్రితం కళ్ళు తిరిగి పడిపోతే భర్తని హాస్పిటల్ తీసుకెళ్ళింది సుమతి.

"షుగర్ లెవెల్స్ కంట్రోల్ లేకపోవడం వల్లే కళ్ళు తిరిగి పడిపోయాడు" అని ఏవో మందులు రాసిచ్చారు.

ఆ రోజు హాస్పిటల్ నుండి ఫోన్ చేయగానే రాఘవ కూడా వచ్చాడు. వెనక అతడి కొడుకు గీతా కృష్ణ కూడా వున్నాడు.

"ఎలా ఉంది అంకుల్ "అడిగాడు నమ్రతగా

"ఇప్పుడు పర్వాలేదు బాబూ" చెప్పాడు

"మీరు హాస్పిటల్ కి వచ్చారు అనగానే నాన్నకి కాళ్లు, చేతులు ఆడలేదు. ఎక్కడ డ్రైవింగ్ కి ఇబ్బంది పడతారోనని నేనే డ్రైవింగ్ చేసుకుని వచ్చాను" చెప్పాడు "అవునా .. ఇద్దర్ని ఇబ్బంది పెట్టానా?" అన్నాడు నారాయణ గిల్టీగా.

"ఇందులో ఇబ్బంది ఏముందిలే అంకుల్" అన్నాడు□మొహమాటంగా గీత కృష్ణ.

టాపిక్ డైవర్ట్ చేస్తూ "డ్యూటీకి వెళ్ళలేదా కృష్ణా" అడిగాడు.

"వర్క్ ఫ్రమ్ హోం చేస్తున్నా అంకుల్" చెప్పాడు.

"విషయం తెలిసి నేను వస్తుంటే తన లాప్టాప్ పక్కన పడేసి వచ్చాడు" చెప్పాడు రాఘవ

"అయ్యో వర్క్ డిస్టర్బ్ అయిఉంటుంది కదా" అది సుమతి జోక్యం చేసుకుంటూ

"కొలీగ్స్‌కి హ్యాండోవర్ చేశాను. అయినా గంటకో .. రెండు గంటలకో ఏమవుతుంది లే ఆంటీ" అన్నాడు గీతా కృష్ణ.

"మా నాయనే నా ఆయుష్షు కూడా పోసుకొని నూరేళ్లు వర్ధిల్లు నాయనా" అనుకుంది స్వగతంలో సుమతి.

★★★

రాఘవ స్కూటర్ వెనక కూర్చున్నాడు నారాయణ. కాస్త దూరంగా ఉన్న షాపింగ్ మాల్‌కి వెళ్లారు ఇద్దరూ.

"నువ్వేం తీసుకోవా రాఘవా" అడిగాడు నారాయణ.

"మా వాడు ఇంట్లో సరుకులు అయిపోతాయనగా రెండు రోజులు ముందే వెళ్లి పచారీ సామాన్లతో ఇల్లు నింపేస్తాడు. ఆఖరికి మెడికల్ షాపుకి కూడా వెళ్లనీయడు. ఆన్‌లైన్లో నే మెడిసిన్స్ నెల ముందుగానే బుక్ చేసి తెప్పిస్తాడు" చెప్పాడు రాఘవ.

"నిన్ను బద్ధకస్తుడ్ని చేస్తున్నాడన్నమాట.." అన్నాడు నవ్వుతూ.

"అంతలేదు. ఉదయాన్నే ఐదు గంటలకే లేపి యోగా ప్రాక్టీస్ చేయిస్తాడు. అందుకు ఒక ట్యూటర్ను కూడా పెట్టాడు. సాయంత్రం ఇన్స్ట్రక్టర్ వచ్చి వాకింగ్ చేయిస్తాడు. మా వాడు ఫోన్లో మానిటరింగ్ చేస్తూనే ఉంటాడు. ఇప్పుడు కూడా నీ పుణ్యాన వాకింగ్ బెడద తప్పింది" చెప్పాడు రాఘవ నవ్వుతూ. భార్య ఫోన్ చేస్తే తాము ఎక్కడ ఉంది చెప్పాడు రాఘవ.

వాళ్లు మాటల్లో ఉండగానే గీత కృష్ణ కాల్ చేశాడు. "చెప్పు కృష్ణా" అన్నాడు రాఘవ.

"నాన్నా మీరు విజయా సూపర్‌మార్కెట్ దగ్గర ఉన్నారట కదా రావడం ఆలస్యం అవుతుందేమో మీరు వెళ్లిన మాల్ పక్కనే పార్క్ వుంది నాలుగు రౌండ్లు వేసి రండి" చెప్పాడు. నారాయణ నవ్వుతూ చూస్తుంటే

"చిన్నప్పుడు డిసిప్లిన్ పేరుతో వీడిని పెట్టిన హింసకు ప్రతీకారం తీర్చుకుంటున్నాడేమో బాసూ" అన్నాడు రాఘవ నవ్వుతూ.

"నాకు నిన్ను చూస్తే జలసిగా ఉందోయ్" అన్నాడు నారాయణ.

"నువ్వు జలసి పడేంత సీన్ ఇప్పుడు ఏం జరిగింది గురూ" అన్నాడు రాఘవ.

"నీ కొడుకు గీతా కృష్ణ అందుకు కారణం" చెప్పాడు నారాయణ నవ్వుతూ. విషయం అర్థమై "నిజమే మావాడు పేరెంట్స్ పట్ల చూపే అఫెక్షన్ చూసి నువ్వు కాస్త జలసీ పడడంలో ఆశ్చర్యం లేదు" అన్నాడు రాఘవ.

"మా వాడు చూడూ వాళ్ళ అమ్మ ఫోన్‌కి కూడా దొరక్కుండా పారిపోతున్నాడు." అన్నాడు నవ్వుతూ.

ఒక్క నిమిషం నారాయణ కళ్ళల్లోకి చూస్తూ "పెద్ద కంపెనీలో పని చేసే పండుకి దానికి తగ్గ బిజీ ఉంటుందిలే గురూ" అన్నాడు రాఘవ.

"ఏం బిజీ నో వాళ్ళమ్మ ఫోన్ చేయడం వాడు రిజెక్ట్ చేయడం రోజూ జరిగే తంతే. ఒకవేళ ఫోన్ లిఫ్ట్ చేస్తే వాళ్ళ అమ్మకే క్లాస్ పీకుతుంటాడు." అన్నాడు నారాయణ. స్నేహితుడి భుజం మీద చేయి వేసాడు రాఘవ ఆప్యాయంగా. పచారి సామాన్లు స్కూటర్ డిక్కీలోకి నెట్టి పార్కులోకి వచ్చారు ఇద్దరూ. ఒక సిమెంట్ బెంచీ మీద కూర్చున్నారు. పార్కులో పిల్లలు అల్లరి

అల్లరిగా తిరుగుతూ ఆడుకుంటున్నారు.

"బాల్యం ఒక మధురానుభూతి" అన్నాడు రాఘవ.

"మన పిల్లలకి ఇలాంటి బాల్యం ఇచ్చామా" అన్నాడు సాలోచనగా నారాయణ. "పుస్తకాల వెంట వాళ్ళను పరుగెత్తించడంతోనే సరిపోయింది కదూ" అన్నాడు రాఘవ.

రెండు ప్రేమ జంటలు ఒక మూలగా కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నారు.

"మన జీవితాల్లో పెళ్లి తర్వాతే ప్రేమ.." అన్నాడు రాఘవ నవ్వుతూ

"ఈ విషయంలో ఇద్దరు అదృష్టవంతులమే" అన్నాడు నారాయణ.

"అవును.." అన్నట్టు తల ఊపాడు రాఘవ.

మళ్లీ ఆలోచనలో పడ్డాడు నారాయణ. కొడుకు గురించే అని అర్థమైంది రాఘవకి. ఒక నిమిషం స్నేహితుడు కళ్లలోకి చూస్తూ..

"ఎంత చెట్టుకు అంత గాలి గురూ" అన్నాడు రాఘవ. అర్థం కానట్టు చూశాడు నారాయణ.

"యూ. ఎస్‌లో మన పండూ జీతం హీనపక్షం మన కరెన్సీలో నెలకు ఐదు లక్షలు ఉంటుంది. మావాడి శాలరీ యాభై వేలు. జీతానికి తగ్గ పని ఉంటుంది కదా గురూ? మాట్లాడే తీరిక ఎక్కడ ఉంటుంది? అయినా సమయం దొరికినప్పుడు వాళ్ళ మమ్మీ తో ఎలాగూ మాట్లాడుతూనే వుంటాడుగా? నిన్ను చూస్తే మొదటి నుంచి మీ వాడికి భయమే కదా? అందుకే నీ విషయంలో కాస్త చొరవ తక్కువ" అన్నాడు రాఘవ

"ఇప్పుడు వాడిలో ఉండేది భయం కాదు నిర్లక్ష్యం అదే చాలా ప్రమాదకరం" అన్నాడు.

ఏం మాట్లాడాలో అర్థం కాలేదు రాఘవకి. వాళ్ల మధ్య కాస్త కాలం కరిగింది.

"వాడి బంగారు భవిష్యత్తు కోసమే నాలుగో తరగతిలోనే టెక్నో స్కూల్‌లో వేశా. ఆ ఏసీ క్యాంపస్లో కోళ్ల ఫామ్‌లో కోడిపెట్టాలా పెరిగాడు. మార్కులు తప్ప వాడికి మరో వ్యాపకం ఉండేది కాదు. ఎప్పుడైనా ఇంటికి వస్తే కార్టూన్ షోలు చూడ్డంలో మునిగి తేలేవాడు. ఐఐటి చదువు, కార్పొరేట్ కంపెనీలో లక్షల్లో జీతం, ఫారిన్‌కి వెళ్లే ఛాన్స్ ఒకదాని వెంట ఒకటి జరిగిపోయాయి.

ఎప్పుడన్నా కాల్ చేస్తే .. "డబ్బు ఏమైనా కావాలా డాడీ?" అని మెసేజ్ పెడతాడు. ఫోన్ లిఫ్ట్ కూడా చేయడు. గారాబం చేయకూడదని అప్పట్లో తెచ్చి పెట్టుకున్న గాంభీర్యమే ఉండేది. ఇప్పుడు వాడితో మనసారా మాట్లాడాలి అనిపిస్తూ ఉంటుంది. వాడి తల నిమురుతూ గుండెలకు హత్తుకోవాలని ఉంటుంది. ప్చ్! ఇక అవేవీ ఈ జీవితంలో జరగవు" అంటూ ఆగాడు. కాసేపు మౌనం తర్వాత ..

"ఎక్కువగా ఆలోచించకు గురూ.. అసలే నీ ఆరోగ్యం బాలేదు" అన్నాడు.

"మా ఆవిడ బాధ అదే. కనీసం నా పార్థివ దేహం చూడడానికైనా వాడు వస్తాడో లేదో అని" అంటూ ఆగాడు

"ఏం మాటలు అవి గురూ" అన్నాడు రాఘవ మందలింపుగా. స్నేహితుడి వైపు చూశాడు. ఇద్దరూ మంచి స్నేహితులు.

ఆఫీసులో ఒకరు గుమస్తాగా ఉంటే మరొకరిది సూపరింటెండెంట్ క్యాడర్. పిల్లాడి చదువు విషయంలో కాంప్రమైజ్ కాకూడదని నారాయణ రెండు చేతులా సంపాదించేవాడు.

"మీ వాడిని కూడా టెక్నో స్కూల్లో వెయ్యి రాఘవా. ఫీజులు నేను అడ్జస్ట్ చేస్తా" అన్నాడు ఒకసారి నారాయణతో.

"వద్దు గురూ. దుప్పటి ఎంత ఉందో అంత కప్పుకోవడమే బెటర్" అని రాఘవ రిజెక్ట్ చేశాడు. ఐదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలోనే గీతాకృష్ణని చదివించాడు రాఘవ. ఇంటర్ కూడా "డే" కాలేజీలో చేర్పించి, తర్వాత బీటెక్ మామూలు ఇంజనీరింగ్ కాలేజీలో చేర్పించాడు. క్యాంపస్ సెలక్షన్ బాంబేలో వచ్చింది. గీత కృష్ణ వెళ్ళలేదు.

"ఏం కృష్ణ ఎందుకు వద్దనుకుంటున్నావు" అడిగాడు రాఘవ

"సిటీలోనే ఏదో కంపెనీలో జాబ్ వస్తుంది డాడీ శాలరీ తక్కువ ఉన్నా పర్వాలేదు" చెప్పాడు.

అన్నట్లుగానే సిటీలోని జాబ్ సాధించుకున్నాడు గీతా కృష్ణ.

పెళ్లి చేయాలనుకుంటే "జాబ్ చేసే అమ్మాయి వద్దు డాడీ" అన్నాడు.

"ఎందుకని రా" అడిగాడు. "అమ్మకు సాయంగా ఉండే అమ్మాయిని చూడండి డాడీ. తనకి కాస్త రెస్ట్ ఇద్దాం" చెప్పాడు.

"ఒక్కరి సంపాదన ఈ రోజుల్లో ఏం సరిపోతుంది రా" అన్నాడు రాఘవ.

"డబ్బుదేముంది డాడీ. ఎంత సంపాదిస్తే మాత్రం ఏం చేసుకుంటాం? బంగారం తినలేము కదా? ఈ పాతికేళ్ళ జీవితంలో అమ్మ కన్నీళ్లు పెట్టగా నేను ఏ రోజూ చూడలేదు. మీది చిన్న ఉద్యోగం అయినా డబ్బు సమస్య ఎప్పుడూ మన ఇంట్లో తలెత్తలేదు. ఉన్నంతలోనే అమ్మ ఇంటిని తీర్చిదిద్దేది. నన్ను అమ్మలా చూసుకునే మామూలు అమ్మాయి చాలు. తనకి ఏ కష్టం రాకుండా చూసుకుంటాను" చెప్పాడు.

"ఏం రాఘవా ఏదో ఫ్లాష్‌బ్యాక్ లోకి వెళ్ళినట్టున్నావ్" కదిపాడు నారాయణ.

"మా వాడి సింప్లిసిటీ గుర్తొచ్చింది బాస్. వాడిని చూస్తే మా నాన్ననే గుర్తుకొస్తాడు. చిన్నప్పుడు మా నాన్న నన్ను ఎంత జాగ్రత్తగా చూసుకున్నాడో ఇప్పుడు వాడు కూడా నన్ను అంతే జాగ్రత్తగా చూసుకుంటున్నాడు" చెప్పాడు.

"నువ్వు అదృష్టవంతుడివి రాఘవా" అని రాఘవ భుజం మీద చెయ్యి వేసాడు నారాయణ.

"ఒకే తల్లి గర్భంలో పుట్టకపోయినా నువ్వు నాకు సోదర సమానుడవే. నా బిడ్డ కృష్ణను కూడా నీ బిడ్డ లానే భావించు గురూ. నీ ఆశీస్సులు వాడికి అందించు. ఇంటిల్లిపాదీ నీ క్షేమం కోసం నిత్యం దేవుడ్ని ప్రార్థిస్తూనే ఉంటాం. నువ్వు దేనికీ కలత పడకు మిత్రమా" అన్నాడు రాఘవ. స్నేహితుడి ఆప్యాయతకు కదిలిపోయాడు నారాయణ.

ఇరవై రోజుల తర్వాత అనిరుద్ అమెరికా అమ్మాయి మార్గరెట్‌ని పెళ్లి చేసుకొని" బ్లెస్ మీ" అంటూ వాట్సప్‌లో ఫోటోలు పెట్టాడు.

మరో నెల తర్వాత శివైక్యం చెందాడు నారాయణ. మిత్రుడి మరణవార్త తెలిసి కదిలిపోయాడు రాఘవ.

"అనిరుద్‌కి చెప్పావా అమ్మా" అడిగాడు.

ఒక ఉత్తరం ఇచ్చింది. ఆతృతగా విప్పాడు.

"నెల ముందే ఆయన ఈ లేఖ ఇచ్చి నేను పోయాకే చూడమన్నాడు" చెప్పింది లేఖను విప్పాడు రాఘవ.

"నా అంతిమ సంస్కారం రాఘవ కొడుకు గీత కృష్ణ చేయాలన్నది నా ఆఖరి కోరిక. మనవాడు బిజీగా ఉండి రాలేకపోతే నువ్వేం బెంగపడకూ .. ప్యునరల్ దృశ్యాలు వాడికి వాట్సప్‌లో పంపితే చాలు"

లేఖ చదివి షాక్ అయ్యాడు రాఘవ.

★★★

"ఇది చాలా దారుణం మమ్మీ. డాడీ పార్థివ దేహాన్ని నేను చూడకుండానే ఖననం చేయడం" అన్నాడు అనిరుద్.

"నీకు వచ్చే తీరిక ఉంటుందో లేదో అని చెప్పలేదు రా.. రాను పోను జర్నీకి కనీసం నీకు వారం పడుతుంది కదా.." అంది సుమతీ.

అవాక్కయ్యాడు అనిరుద్.

"డాడీ మరణ వార్త వేరే వాళ్లు చెప్తే నాకు తెలియాలా? పరాయి వాడు ఖననం చేస్తాడా" అన్నాడు నిస్పృహగా

"కడుపున పుట్టకపోయినా కృష్ణని కొడుకుగా మీ డాడీ భావించాడు. అందుకే తన ఆఖరి కోరిక ఉత్తరంలో రాశాడు" అంది.

"డాడీ పేరుతో రాసిన ఆ లెటర్ ఫేక్. కృష్ణ లెటర్ నాకు వాట్సప్‌లో పంపాడు. అవి నాన్న అక్షరాలు కావు" చెప్పాడు.

సుమతి ఏమి చెప్పలేదు. గతంలో కొడుకుతో మాట్లాడిన మాటలు అమ్మ కళ్ళ ముందు కదలాడాయి.

"మీ డాడీ ని హాస్పిటల్ చేర్చాం నాన్నా. నువ్వు వస్తే బాగుంటుంది. నాన్న ప్రాణం అంతా నీ పైనే.." చెప్పింది.

"నేను వచ్చి చేసేదేముంది మమ్మీ? మంచి హాస్పిటల్ చేర్చి బిల్లు నాకు చేర్చండి. పే చేస్తాను" చెప్పాడు.

కోపంతో ఫోన్ కట్ చేసింది. మళ్ళీ ఫోన్ చేయలేదు.

హాస్పిటల్లో నారాయణ ఉన్న వారం రోజులు కృష్ణే కంటికి రెప్పలా చూసుకున్నాడు. ఆఫీసు కూడా సెలవు పెట్టాడు. "నువ్వు వెళ్ళు బాబు," అంది సుమతి.

"భలేవాళ్ళు ఆంటీ. నేను ఉంటేనే నాన్నను పట్టుకోవడం గగనమవుతోంది" అన్నాడు.

రాఘవ ఎమోషన్ కావడం, కృష్ణ సముదాయించడం గమనిస్తూనే ఉంది. ఒక నిమిషం ఇద్దరం మధ్య నిశ్శబ్దం నాట్యం చేసింది. "నువ్వు నా కడుపు ఎందుకు పుట్టలేదు కృష్ణా" ఆమె స్వగతం రోదించింది. ఆ రోజే ఒక నిర్ణయం తీసుకుంది. "నాకు తెలుసు అవి నీ అక్షరాలే కదమ్మా" అన్నాడు మళ్లీ రెట్టించి.

"ఎస్ .. నావే .. నా తల కొరివి కూడా నువ్వు పెట్టకు" అంది. హతాసుడయ్యాడు అనిరుద్. కృష్ణ పంపిన వాట్సాప్ మెసేజ్ గుర్తుకొచ్చింది.

"అనిరుద్. అంకుల్ ఆఖరి కోరిక అనడంతో అంతిమ సంస్కారం నేనే చేశాను. అది తప్పో ఒప్పో నాకు తెలియదు. ఆంటీ

మానసికంగా చాలా చితికిపోయింది. నువ్వొస్తే బాగుంటుంది. ‘అవి నారాయణ సార్ అక్షరాలు కావవినిపిస్తుందిరా” అన్నాడు డాడీ. అంకుల్‌కి నీ మీద చాలా ప్రేమ ఉంది అనిరుద్. అలాంటి లేఖ ఎప్పుడూ రాయడని నాకూ అనిపిస్తుంది. ఆ లెటర్ వాట్సాప్ చేస్తున్నాను. వెంటనే బయలుదేరి రా..

నీ మిత్రుడు గీతాకృష్ణ.”

విషయం అర్థం కావడానికి ఎక్కువసేపు పట్టలేదు అనిరుద్‌కి. తల్లి కాళ్ళకు చుట్టుకుపోయాడు. అతడు చేసుకున్న అమెరికా అమ్మాయి కూడా తనతో వచ్చింది. ఇదేం అర్థం కాక చూస్తుండిపోయింది. “యూ. ఎస్‌లో జాబ్ నాకొద్దమ్మా .. నేను ఇక్కడే ఉండిపోతాను. నన్ను నీతో ఉండనివ్వమ్మా.”

“మార్గరేట్ .. చెప్పు మార్గరేట్ .. నువ్వు కూడా అమ్మకు చెప్పు” అంటున్నాడు భార్యని చూస్తూ.

సుమతి తల్లి హృదయం ఆ నిమిషం కరగలేదు. ఆమె చూపులు ఎటో చూస్తున్నాయి.

★★★★★

# ధ్వంస రచన

సింహ ప్రసాద్



✆ 9849061668

**కథామంజరి నిర్వహించిన దీపావళి కథల పోటీ 2022 లో ప్రోత్సాహక బహుమతి లభించిన కథ**

***మహా కొండచిలువ ఆకాశమంత నోరు తెరచి కార్మికుల్ని, ఫ్యాక్టరీని, టౌన్షిప్పుని వున్నది వున్నట్టే అమాంతం మింగేయడానికి ఉగ్రంగా వచ్చేస్తున్నట్టు కలగన్నాడు లక్ష్మయ్య! అమాంతం నిద్రలోంచి లేచి బతుకు భయంతో గుండెలు పగిలేలా అరుస్తూ రోడ్డున పడ్డాడు!***
***అతడి గుండె ఘోష నగ్నంగా చేస్తున్న కరాళనృత్యపు హోరు, చెవులు ఉన్న వారికే వినిపిస్తుంది! కళ్ళు ఉన్నవారికే కనిపిస్తుంది! హృదయం ఉన్న వారినే తట్టగలుగుతుంది!***

యంత్రాల చప్పుళ్ళు, గొట్టాలు కక్కే పొగలు, కార్మికుల అరుపులు, ఫ్యాక్టరీలో పని హడావిడి, వివిధ వాహనాల ధ్వనులు, లోడింగ్ అన్లోడింగ్ దగ్గర అరుపులు ఆజ్ఞలు ......!

జీవ చైతన్యంతో కళకళలాడిన ఫ్యాక్టరీ ప్రాంగణమంతా ఇప్పుడు పాడుబడిన దేవాలయంలా ఉంది. జన సంచారం లేక, పిచ్చిగా పెరిగిన మొక్కలు చెట్ల మధ్య, వివిధ రకాల పక్షులు, వన్యమృగాలు తిరుగుతుంటే చిన్నపాటి అడవిలో ఉంది!

ఫ్యాక్టరీ వర్క్ ప్లేస్, గోడౌన్, తుప్పు పట్టిన ట్రాక్టర్, బస్సు సమస్తమూ శిథిలావస్థలో వున్నాయి. కూలడానికి సిద్ధంగా వున్నాయి. సెక్యూరిటీ సిబ్బంది బదులు హోమ్‌గార్డుల నామమాత్రపు కాపలా కాస్తున్నారు.

దూరాన నిలువెత్తు ఆత్మ విశ్వాసంలా ఠీవిగా నిలబడి వున్నాయి రెండు గులాబీ రంగు టవర్లు. ఒకప్పుడవి ఆదిలాబాదుకు గర్వకారణంగా విజయకేతనాల్లా ఉండేవి. ఏ మూల నుంచి చూసినా కనువిందు చేసేవి!

హఠాత్తుగా ఆ దృశ్యం జీవం పోసుకుని, రంగులద్దుకుని కళ్లెదుట ఉరకలేసింది!

గేటుని పట్టుకుని నిలబడి లోపలికి చూస్తున్న లక్ష్మయ్య ఒళ్ళు ఒక్కసారిగా పులకరించింది. ఏదో తెలియని ఉత్సాహం తోసుకొచ్చింది. తన లోలోపలి అజ్ఞాత శక్తి ఏదో అనంత భరోసా ఇచ్చినట్టుగా అనుభూతిస్తూ తలాడించాడు. “అవునవును. అలాగే జరుగుద్ది’ తనలో తను గొణుక్కున్నాడు.

పక్కనే ఉన్న సెక్యూరిటీ రూమ్ మీద రాసి ఉన్న పేరు వంక ఆశగా, ఆనందంగా, కించిత్తు గర్వంగా చూశాడు.

“సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఆదిలాబాద్!”

అక్షరాలు ఎక్కడా చెక్కు చెదరలేదు. మాయ లేదు. మారలేదు. ఒకనాటి రాజసంతోనే వెలుగుతున్నాయి!

అతి త్వరలో అజ్ఞాతంలోంచి, అస్థిరత చెరలోంచి తమ ఫ్యాక్టరీ విముక్తం అవుతుంది! మళ్ళీ తెరుచుకుంటుంది! పొలోమంటూ కార్మికులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కూలీలు లోపలికి సెలయేరులా దుముకుతూ ప్రవహిస్తారు! ఫ్యాక్టరీ చక్రాలు సుమధుర శబ్దం చేస్తూ తిరుగుతాయి. ముడి సరుకు లైమ్ స్టోన్ ట్రక్కుల్లో వచ్చేస్తుంది. క్వింటాళ్ళ కొద్దీ సిమెంటు తయారవుతుంది.

సంచుల్లో ప్యాక్ చేసి రైల్వే వేగన్లో లోడ్ చేస్తారు. మళ్ళీ మునుపట్లా మహారాష్ట్రలోని మరట్వాడ, విదర్భ, ఉత్తర తెలంగాణ ప్రాంతాలకు సిమెంట్ ఎగుమతి అవుతుంది!

ఆదిలాబాద్ .. ప్రగతికి చిరునామాగా, పచ్చ తోరణంగా మారిపోతుంది!

ఆ శుభ ఘడియలు అతి త్వరలో రానున్నాయి!

కళ్ళనుండి జారిన ఆనందభాష్పాలు తుడుచుకున్నాడు. దగ్గర దగ్గర రెండు దశాబ్దాల పాటు బతుకు, భరోసా ఇచ్చిన 'ఫ్యాక్టరీ గుడి' కి దండం పెట్టుకుని రోడ్డు ఎక్కాడు.

ఒకప్పుడు టౌన్షిప్ జనంతో కళకళలాడేది. ఇప్పుడా జనం లేరు. రోడ్లు లేవు. ఆ మధ్య సిసిఐ నీటి సరఫరా ఆపేసింది. వీధి దీపాలకు సైతం విద్యుత్ సరఫరా నిలిపేసింది. చీకటి పడితే చాలు దెయ్యాల టౌన్లా ఉంటోంది టౌన్షిప్! 350 రెగ్యులర్ ఉద్యోగులు, 1000 వర్కర్లు, 250 ఇతరులు, 2000 పరోక్ష కార్మికులు ఫ్యాక్టరీ మీద ఆధారపడి బతికేవారు. ఎందరో ఉద్యోగులు, కార్మికులు స్వచ్ఛంద విరమణ పథకం కింద ఆకు పచ్చని తీరాలు వెదుక్కుంటూ వెళ్ళిపోయారు.

కాంట్రాక్ట్ కూలీలు ఇతర ప్రాంతాలకు తరలిపోయారు. తనలాంటి సుమారు పాతిక కార్మిక కుటుంబాలు మాత్రమే టౌన్షిప్ క్వార్టర్లలో ఉంటున్నాయి. మిగతా 375 క్వార్టర్లు గత వైభవానికి మౌనసాక్షులుగా మిగిలి ఉన్నాయి. క్వార్టర్ల ఆలనా పాలనా చూసేవారు, చేసే వారు, సంరక్షించే వారు లేక రేపో మాపో కూలేట్టుగా తయారయ్యాయి !




అయినా ఏదో రోజున కర్మాగారాన్ని పునరుద్ధరించక పోతారా అని అక్కడ మిగిలివున్న కార్మికులు కళ్ళల్లో వత్తులు వేసుకుని మరీ ఎదురుచూస్తున్నారు!

అక్షరాలా గాలిలో తేలిపోతోన్న లక్ష్మయ్య వంక చిత్రంగా చూసిందతడి భార్య.

"తెరుస్తున్నారా?" మనస్సంతా ఆశ నింపుకుని అడిగింది.

"ఇక తెరిచేస్తారే. ఎంపీ కేశవరావు తదితరులు కేంద్ర ప్రభుత్వం లోని సంబంధిత మంత్రులతో మాట్లాడతారట. ఏదోలా ఒప్పించేస్తార్లే. మనందరికీ మంచిరోజులు వచ్చేసినట్టేనే!"

"ఓట్లప్పుడు అన్ని పార్టీల వాళ్లూ 'మాకు ఓటేయండి, ఫ్యాక్టరీ తెరిపిస్తాం' అన్న వాళ్ళే కదా!"

"ఇది మాత్రం ఎన్నికల స్టంటు కాదులే. కేటీఆర్ సీరియస్‌గా తీసుకున్నాడు. ఉత్త మాటల మనిషి కాదు, గట్టి పనులే చేస్తాడు. చూస్తా ఉండు..."

"వీళ్ళు చెబుతారు సరే, ఢిల్లీలోని బీజేపీ వాళ్ళు వింటారంటావా! నాకైతే నమ్మకం లేదు! వాళ్ళిద్దరి మధ్య పచ్చగడ్డి భగ్గు మంటాదిగా!" అన్నం వడ్డిస్తూ అంది.

ఆ మాటలతడికి రుచించలేదు. "అడ్డదిడ్డంగా మాట్లాడతావేంటి. వాళ్ళకీ వాళ్ళకీ గొడవలున్నాయని చెప్పి మధ్యలో మనల్ని ముంచేత్తారేంటి!" కయ్ మని భార్య మీద పడి నోరు మూయించాడు. "ఫ్యాక్టరీ తిరిగి ఓపెన్ చేస్తే చాలా ప్రోత్సాహకాలు, రాయితీలు ఇస్తామన్నాడు కేటీఆర్. వేలాది మందికి ఉపాధి లభించడమే ముఖ్యమని, ఈ ప్రాంత అభివృద్ధి తమ ధ్యేయమని, అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతైనా చేయడానికి సిద్ధంగా ఉందని బల్లగుద్ది చెప్పాడు. ఈ దెబ్బకి అటో ఇటో – ఏహే – ఇటే తేలిపోద్ది చూడు!"

కాస్సేపు మౌనంగా ఉండిపోయింది. "రాత్రి అడవిలోంచి చిరుత పులి వచ్చిందిట. పాములు సరే సరి. ఇంకా ఇక్కడ ఉండాలంటే ప్రాణాలకు తెగించాల్సిందే. ఎప్పుడైనా ఏమైనా జరగొచ్చు...!"

మిస్త్రి చూసాడు. "ఇన్నేళ్ల నుంచి ఉండటం లేదూ. మనకిది కొత్తా ఏమన్నానా. అయినా ఇంకేన్నాళ్లులే ఈ వనవాసం. వారం పది రోజుల్లో గ్రహణం విడుస్తుంది. మళ్ళీ ఫ్యాక్టరీ సూరీడు ప్రకాశిస్తాడు" ధీమాగా చెప్పాడు.

అతడు భోంచేసి లేచాక మెల్లగా అంది "క్వార్టర్లు ఖాళీ చేయమంటున్నాడంట టౌన్షిప్ ఆఫీసరు. జనం చెప్పుకుంటున్నారు...."

లక్ష్మయ్య గుండెల్లో బండ పడింది.

ఆ గొడవ ఎప్పటినుంచో ఉంది. అందుకనే క్వార్టర్లు కూలిపోతున్నా పట్టించుకోవట్లేదు. ఎలాంటి మరమ్మత్తులూ చేయించటంలేదు. 'కూలిపోతే ఖాళీ చేయక చస్తారా' అని గోతికాడి నక్కలా కాచుక్కూర్చుంది యాజమాన్యం!

ఇప్పుడు బలవంతంగా పంపేస్తే ఎక్కడికి పోవాలి? తల దాచుకోను ఇంటి కప్పు ఎక్కడుంది? ఎప్పుడో నలభై ఏళ్ళ క్రితం ఫ్యాక్టరీ పెట్టినప్పుడు సర్కారు కొలువు అని చంకలు కొట్టుకుంటూ వచ్చారు. అదిగో అప్పట్నుంచే ఇదే తమ ఊరు, ఈ క్వార్టరే తన ఇల్లు అయిపోయాయి!

ఉత్పత్తి నిలిపేసి పాతికేళ్ళు అవుతున్నా, ఇంత పెద్ద ఫ్యాక్టరీని – లాభాల్లో ఉన్న దాన్ని ప్రభుత్వం ఎందుకు మూసేస్తుందనే ధీమాతో ఇక్కడే ఉండిపోయారు. పదిహేనేళ్ళ క్రితం వాలంటరీ సర్వీస్ స్కీమ్ పెట్టి అందర్నీ తొలగించారు. తన లాంటి 50 మంది దానికి ఒప్పుకోకుండా గాలిలో వేలాడుతూ ఉండిపోయారు! ధర్మం గెలవక పోదని ఆశగా చూస్తుంటే, మళ్లీ ఈ కొత్త గొడవ ఏంటో! ఒక్కో రంధ్రాన్నీ మూసేస్తున్నట్టు ఊపిరాడనట్టు విలవిల్లాడాడు.

ఇంట్లోంచి బయటపడి కిరాణా కొట్టు వైపు అడుగులు వేశాడు. దాని ముందరి చెక్క బెంచీయే మాజీ కార్మికుల మీటింగ్ ప్లేస్. కొందరు కార్మికులు, కార్మిక సంఘ నాయకులు అక్కడే కలిసి మంచి చెడు చెప్పుకుంటూ ఉంటారు. ఆశలు నిరాశలు పంచుకుంటూ ఉంటారు. భవిష్యత్తు వైపు మూకుమ్మడిగా ఆశావహంగా చూస్తూంటారు!

"క్వార్టర్లు వదిలి పొమ్మంటున్నారంట, ఈ లొల్లి ఏందన్నా!" జనాంతికంగా అన్నాడు లక్ష్మయ్య.

"మనల్ని అక్రమ ఆక్రమణదార్లు అంటూ ఉండుండి బెదిరిస్తూనే ఉన్నారుగా. మనం బెదురుతామా ఏంది. మనకి గ్రాట్యుటీ ఇవ్వలేదు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేదు. అవి ఏవీ ఇవ్వకుండా పొమ్మంటే ఎలా పోతాం, ఎక్కడికి పోతాం!" కార్మిక సంఘ నాయకుడు జోషి ఆవేశ పడ్డాడు.

'అవునవును' వంత పాడారు కొందరు.

ఎక్కడలేని ధైర్యం రాగా, 'పాయింటే సుమా' అనుకుని చిన్నగా నిట్టూర్చాడు లక్ష్మయ్య.

"ఈసారి కేటీఆర్ ప్రయత్నాలు ఫలించేట్టే ఉన్నాయి" జోషి వంక చూస్తూ అన్నాడు.

"అవన్నీ వట్టి డ్రామాలు. ఎవరి వల్లా ఏం ఒరగదు. అంతా మనల్ని వాడుకోవాలని చూస్తారు తప్ప మనకేం ఒరగబెట్టరు" అన్నాడు రెడ్డి.

"పార్టీలకు కావలసింది రాజకీయ లబ్ధి తప్ప మనం కాదు, మన ప్రాంత అభివృద్ధి కాదు" అన్నారింకొకరు.

"అంతమాట అనేసావేందన్నా!"

"ఉన్న మాట అదే లక్ష్మయ్యా. 1982లో 47 కోట్లతో మన సిమెంట్ ఫ్యాక్టరీ కట్టింది ప్రభుత్వరంగ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా. ఫ్యాక్టరీ కోసం 772 ఎకరాలు, టౌన్షిప్ కోసం మరో 170 ఎకరాలు రైతుల నుంచి ఎకరం మూడు వేలకీ నాలుగు వేలకీ కొన్నది. ఫ్యాక్టరీ స్థాపించిన రెండేళ్లలోనే అంటే 1984 లోనే ఉత్పత్తి ప్రారంభించింది. ఉత్పత్తి సామర్థ్యం ఎంతో తెలుసా? రోజుకి పన్నెండు వందల టన్నులు. సంవత్సర టర్నోవర్ 4 లక్షల టన్నులు. ఇంకో సంగతి చెప్పనా. 1500 ఎకరాల్లో 48 మిలియన్ టన్నుల లైమ్‌స్టోన్ డిపాజిట్ల మైనింగ్ ఉంది. అంటే నూట ఇరవై సంవత్సరాలకు సరిపడా నిల్వలున్నాయన్న మాట. అవసరమైనంత నీటి సామర్థ్యం ఉంది . 32 కేవీ విద్యుత్ సరఫరా ఉంది. ట్రాన్స్‌పోర్ట్ కోసం ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్ర లోని మ[జీ వరకు ఈ ఫ్యాక్టరీ కోసమే వేసిన బ్రాడ్గేజ్ రైల్వే లైన్ ఉంది . ఫ్యాక్టరీ మీద ప్రత్యక్షంగానో పరోక్షంగానో నాలుగు వేల మందికి ఉపాధి లభించేది. ఇక సిమెంటుకి భారీ మార్కెట్ ఎలాగూ ఉంది."

"అలాంటి స్థితిలో లాభసాటిగా ఉన్న ఫ్యాక్టరీని ఎందుకు మూసేశారు? ఎవరు మూసేశారు?" మరో నాయకుడు యాదగిరి ప్రశ్నించాడు.

"ఇంకెవరు, కాంగ్రెస్ వాళ్ల హయాంలోనే కదా జరిగింది! మన పీవీ గారి టైములోనే!"

జోషి కల్పించుకుని అన్నాడు. "1991లో కొత్త ఆర్థిక విధానం మొదలవటంతోనే ప్రభుత్వ రంగ సంస్థలకు ముప్పు వచ్చేసింది. ముఖ్యంగా నూతన పారిశ్రామిక విధానం వల్ల కొత్త సమస్యలు వచ్చి పడ్డాయి. బొగ్గు, జిప్సం, సున్నపు రాయి వంటి ముడి సరుకులపై రాయితీలు ఉపసంహరించేసింది కేంద్ర ప్రభుత్వం. అదీగాక లేవీ ప్రకారం ఉత్పత్తిలో 60% సిమెంటుని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కొనుగోలు చేసేవి. ఆ లేవీనీ ఎత్తేసారు. దాంతో కర్మాగారం నష్టాల బాట పట్టింది. 1996లో సిమెంట్ ఉత్పత్తి నిలిపివేసింది యాజమాన్యం!"

"ఈ ఫ్యాక్టరీకి ఖరీదైన ఆస్తులూ వసతులూ అన్నీ వున్నాయి కదా. పైగా ఇది కేంద్ర ప్రభుత్వానిదాయె. అంచేత కొంచెం ఆలస్యం అయినా తెరవక పోతారా అని ఆశ మిణుకు మిణుకు మంటూ వెలుగుతోందన్నా !"

"ఆ మధ్య 700 మంది కార్మికులున్న ఆదిలాబాద్ కోఆపరేటివ్ స్పిన్నింగ్ మిల్లులో లాకవుట్ ప్రకటించారు. తర్వాతో వ్యాపారవేత్త దాన్ని తీసుకుని అష్టలక్ష్మి స్పిన్నింగ్ మిల్లుగా మార్చాడు. చక్కగా నడవట్లేదూ. వేలాది మందికి ఉపాధి దొరకలేదూ. అలాగే ఎవరో ఒకరొచ్చి దీన్ని పునరుద్ధరించినా బావుణ్ణు!"

"2008 లో ఉద్యోగుల స్వచ్ఛంద విరమణ (వీ ఎస్ ఎస్) పథకం ప్రవేశపెట్టి పరిశ్రమను మూసేస్తున్నట్టు ప్రకటించింది. మనదే కాదు, సిసిఐ ఆధ్వర్యంలో నడుస్తోన్న వివిధ రాష్ట్రాల్లోని మొత్తం పది యూనిట్లలో ఏడు అప్పుడే మూసేసింది. ఆ దెబ్బకి మనలాంటి వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి!" విషాదం ఒలికింది అతడి గొంతులోంచి.

“అదంతా ఎప్పుడో జరిగిపోయింది. అది తవ్వుకుని బాధ పడటం ఎందుగ్గానీ, ఇప్పటి కత చెప్పు. కేంద్రంలో కాంగ్రెస్ పోయి బీజేపీ వచ్చింది. ఇక్కడేమో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నాం. టీఆరెస్ గద్దె నెక్కింది. ఎన్నో కార్యక్రమాలు చేపడుతోంది. అటు బిజెపి, ఇటు టీఆరెస్ ఇద్దరూ చేతులు కలిపితే ఒక్క నిమిషంలో మన ఫ్యాక్టరీ చక్రాలు మళ్ళీ గిరా గిరా తిరగవూ! మనం ఒడ్డున పడిపోమూ!” అన్నాడు లక్ష్మయ్య.

“వాళ్లు కలవనే కలవారు లక్ష్మయ్యా. అలాంటి పిచ్చి భ్రమలు పెట్టుకోకు. ఇద్దరికీ గద్దె కావాలి. దాని కోసం అప్పుడే కొట్లాట మొదలైందిగా! ఒకవేళ ఒకరివల్ల కాస్తోకూస్తో మేలు జరిగేట్టయితే, ఆ క్రెడిట్ వారికి పోకుండా రెండో వారు మోకాళ్ళు ఒడ్డడానికీ రెడీ అయిపోతారు!” వ్యాఖ్యానించారింకొకరు.

“కే టీ ఆర్ కొత్త ప్రతిపాదనలు ఇచ్చి ఎంపీ కేశవరావుని కేంద్ర కమిటీతో మాట్లాడమన్నాడుగా. పని జరగదంటావా!” నీరసంగానే అయినా గొంతు నిండా ఆశ నింపుకుని అడిగాడు లక్ష్మయ్య .

“ఆమధ్య మంత్రి నగేష్, ఎమ్మెల్యే జోగు రామన్న బృందం ఢిల్లీ వెళ్లిందిగా. ఏం ఒరిగింది మనలో ఆశలు రేపడం తప్ప!” అన్నారొకరు.

“ఇన్ని కబుర్లు చెప్పే బదులు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుని నడిపించొచ్చు. కాని ఆ పని చేయమని ఖరాఖండీగా చెప్పేసారు!” బాధగా చెప్పారొకరు.

“ఒక్కసారి గతంలోకి తొంగి చూడు. మాజీ కేంద్రమంత్రి హన్సరాజ్ గంగారాంను బిజెపి నాయకులు మన జిల్లాకు ఆహ్వానించారు, గుర్తుందిగా. అప్పుడిక్కడి పరిస్థితి వివరించగా ఆయన అంతా పరిశీలించాడు. త్వరలోనే ఫ్యాక్టరీని తెరుస్తామని, కార్మిక కుటుంబాలను ఆదుకుంటామని ఇంత పొడుగు హామీ ఇచ్చి వెళ్లాడు. మనం మిఠాయిలు పంచుకున్నాం . తర్వాత, ఒక్కటంటే ఒక్క అంగుళం అయినా ముందుకు కదిలిందా చెప్పు!” యాదగిరి ప్రశ్నించాడు.

“మరీ దారుణంగా మాట్లాడొద్దన్నా. అప్పుడు అలా అయిందని ఇప్పుడూ అలాగే జరుగుద్దనుకోకు. కేసీఆర్, కేటీఆర్ గట్టి పట్టుదల మీద ఉన్నారు. అదీగాక ఇప్పుడు సిమెంటుకి డిమాండు భారీగా పెరిగింది. నిర్మాణరంగం గొప్ప ఊపు మీద ఉంది. హైదరాబాద్ రోజురోజుకీ ఎలా మారిపోతోందో నీకు తెలుసుగా. ఇప్పుడు తెరిస్తే లాభాలే లాభాలని ఓపెన్ చేయొచ్చుగా!” తన ఆకాంక్షని అభిప్రాయంగా చెప్పాడు లక్ష్మయ్య.

పెదవి విరిచాడు జోషి. “కేంద్ర ప్రభుత్వపు ప్రతి అడుగూ ప్రైవేటీకరణ దిశగానే పడుతోంది. ఎల్లైసీని ఏం చేసారు? సింగరేణిలోని కొన్ని బొగ్గు బ్లాకుల్ని ప్రైవేటు పరం చేసారా లేదా? విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమ్మేస్తానన్నారుగా. విద్యుత్ పంపిణీ రంగాన్ని ప్రైవేటు వాళ్లకు కట్టబెడుతున్నారు. ఇక రేపో మాపో రైల్వేని, ప్రభుత్వ రంగ బ్యాంకుల్ని ప్రైవేట్ చేసేయొచ్చు. అగ్నిపథ్ గురించి విన్నావుగా. పెన్షన్ బరువు తగ్గించుకోడానికంటూ సైన్యంలోనూ కాంట్రాక్ట్ పద్ధతి ప్రవేశపెట్టేసారు!”

“ఇంకో తమాషా చూసావా. దోపిడీ దొంగలూ మాయగాళ్ళూ విదేశాల్లో దాచిన డబ్బు ఒక్క రూపాయీ తేలేదు సరికదా, ఇక్కడి బ్యాంకుల మీద భస్మాసుర హస్తం పెట్టి విదేశాల్లో విలాసాల్లో మునిగితేలుతున్న వారి ఆస్తులు వేలం వేయనేలేదు. కార్పొరేట్ల 12 లక్షల కోట్ల అప్పు మాఫీ చేసేసింది. మనకింకేదో చేసేస్తుందని ఆశ పడటం మన అవగాహనా రాహిత్యమే అవుతుంది”

మనసు చేదుగా అయింది. అక్కడ మరి కూర్చోలేక లేచాడు లక్ష్మయ్య.

కొంచెం ముందుకెళ్ళి ఆగాడు. ఫ్యాక్టరీ నడుస్తున్న రోజుల్లో ఇదిగో ఇక్కడి నుంచే ప్రతి శనివారం బస్సు ఆదిలాబాద్ వెళ్ళేది. దానిలో టౌన్షిప్పులోని కుటుంబాల వారంతా కిక్కిరిసి కూర్చుని వెళ్లేవారు. వారానికి సరిపడా సమస్తమూ కొనితెచ్చుకునేవారు.

ఆ ఒక్క రోజునే, ఆ రోజుల్లోనే, 15 లక్షల విలువచేసే సరుకు అమ్ముడయ్యేది! వారానికి 6 కోట్లు టర్నోవర్ ఉండేది. అదంతా ఫ్యాక్టరీ ఉద్యోగులూ, కార్మికుల వల్లనే! ఫ్యాక్టరీ గురించి వేసిన బ్రాడ్‌గేజ్ వల్లనే ఆదిలాబాద్ – నాగపూర్ మధ్య పాసెంజర్లు తిరిగాయి. గాఢంగా నిట్టూర్చాడు.

ఫ్యాక్టరీ తెరిస్తే తామే కాదు, ఆదిలాబాద్ వ్యాపారులే కాదు, ఈ ప్రాంతం మొత్తం ఎంతో అభివృద్ధి చెందుతుంది. ఉద్యోగాల కోసం పొట్ట చేత పట్టుకొని హైదరాబాద్ వలస పోవాల్సిన దుస్థితి రానే రాదు. కర్మాగారంలో పనిచేసే వారి పిల్లలకోసమే కేంద్రీయ విద్యాలయం ఆదిలాబాద్‌లో ప్రారంభించారు. అర్ధాంతరంగా ఫ్యాక్టరీని మూసి వేయకుండా ఉంటే, ఈ ప్రాంతపు పిల్లలంతా ఉన్నత విద్య అభ్యసించే వాళ్లు. అన్ని విధాలా ఎంతో పైకి వచ్చే వారు. ఇప్పుడు చూడు, ఆదిలాబాదులో ఒక్క పీజీ కాలేజీ గాని, ఇంజనీరింగ్ కాలేజీ గాని లేకుండా పోయింది. ముందే వెనుకబడిన జిల్లా మరింత వెనకబాటుకు గురయ్యింది!

గుండె లోతుల్లోంచి ఆవేదన తన్నుకొస్తోంటే, ఇంటికెళ్ళి ముసుగుతన్ని పడుకున్నాడు లక్ష్మయ్య. అతన్ని చూసి అతడి భార్య ఆశ్చర్యపోలేదు, సానుభూతిగా చూసింది.

రోజులు అతి భారంగా గడుస్తున్నాయి. పునరుద్ధరణ ఆశ పూర్తిగా చచ్చిపోయింది. భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది.

హఠాత్తుగా కేంద్ర ప్రభుత్వ ప్రకటన దావానలంలా టౌన్‌షిప్ లోనే కాదు, ఆదిలాబాద్ జిల్లాలోనే కాదు, మొత్తం రాష్ట్రాన్నీ చుట్టేసింది. ప్రతి గుండెనూ భగ భగ మండించింది. మూతపడిన ఆదిలాబాద్ సిమెంట్ ఫ్యాక్టరీని శాశ్వతంగా తొలగించడానికి రంగం సిద్ధమైంది!

67 కోట్ల ఆస్తులు, 2074 ఎకరాల మైనింగ్ ఏరియా గల ఆదిలాబాద్ సిమెంట్ కర్మాగారంలోని ఫ్యాక్టరీని, అందులోని యంత్రాలను, వాహనాలను, క్వార్టర్లతో సహా అన్నీ – ఎందుకూ పనికిరాని తుక్కు కింద జమ కట్టి అమ్మేయడానికి ఇ–టెండర్లు ఆహ్వానించారు! కార్మికుల భవితకే కాదు యువత ఉపాధి అవకాశాలకు, ఆ ప్రాంత పారిశ్రామిక అభివృద్ధికి సైతం మరణ శాసనం రాసినట్టు విలవిల్లాడాడు లక్ష్మయ్య!

"నేను చెప్పలేదూ, ప్రభుత్వ బ్యాంకుల్లోని 14 లక్షల కోట్ల కార్పొరేట్ రుణాలను కేంద్ర ప్రభుత్వం మాఫీ చేసింది. ఇప్పుడిహ వాటిని అమ్మేస్తారు . అలాగే దీన్ని ఏ అంబానీకో ఆదానీకో అణాకీ కానీకీ అప్పనంగా కట్టబెట్టేస్తారు చూడు! పంచేవాడు మనవాడైతే పిలిచి మరీ చేతిలో పెట్టడూ!" బాధ, వేదన, ఉక్రోషం ముప్పేటగా దాడి చేస్తోంటే అన్నాడో కార్మిక నేత.

మహా కొండచిలువ ఆకాశమంత నోరు తెరచి కార్మికుల్ని, ఫ్యాక్టరీని, టౌన్షిప్పుని వున్నది వున్నట్టే అమాంతం మింగేయడానికి ఉగ్రంగా వచ్చేస్తున్నట్టు కలగన్నాడు లక్ష్మయ్య! అమాంతం నిద్రలోంచి లేచి బతుకు భయంతో గుండెలు పగిలేలా అరుస్తూ రోడ్డున పడ్డాడు!

అతడి గుండె ఘోష నగ్నంగా చేస్తున్న కరాళనృత్యపు హోరు, చెవులు ఉన్న వారికే వినిపిస్తుంది! కళ్ళు ఉన్నవారికే కనిపిస్తుంది! హృదయం ఉన్న వారినే తట్టగలుగుతుంది!

స్పందించగల మనుషులు ఎక్కడున్నారో! అసలు ఉన్నారా?!

★★★★★

# తొంభై తొమ్మిది చుక్కలు

గంటి రమాదేవి



✆ 9490190908

**కథామంజరి నిర్వహించిన దీపావళి కథల పోటీ 2022 లో ప్రోత్సాహక బహుమతి లభించిన కథ**

*దైవదర్శనం అయింది. ఏ ప్రార్థనా చేయలేదు. నాకు "దీర్ఘకాల నిష్ప్రయోజన జీవితం" మీద ఆసక్తి లేదు! ఈ పెద్ద గుడి ఆవరణలో ఓ పెద్ద నుయ్యి.. గుడికి కొంత దూరంలో పెద్ద చెరువు! చెరువు గట్టు మీద కూర్చున్నాను. చల్లని గాలి పలకరించింది. చెరువులో శ్వేత పద్మాలతోపాటు, నీలోత్పలాలు, నీటిలో ఈదే నీటి కొంగలు కనిపిస్తున్నాయి. దూరంగా పచ్చటి అడవి. ఈ వూరి బదిలీ.. నాకు "పనిష్మెంట్" కాదు! అదృష్టమే అనిపించింది. గగనవిహార దేవతల పూజా పుష్పాలలా శివుడి గుడి శిఖరం పైన చుక్కలు మెరుస్తున్నాయి*

'లౌక్యంతో సర్దుకుపోయే వారు సౌఖ్యంగా వుంటారు! మీకు లౌక్యం లేదు. అందుకే ఇలా! ఎవరికీ లేని ఈ బదిలీలు మీకే ఎందుకు? ఇది ఎన్నో బదిలీ?' అర్థాంగి మృణాలిని తెంపు, కంటగింపు మాటలు! 'నాకు లౌక్యం తెలియదు. మీకు ఆ 'లౌక్యం' వున్నా దానిలో మొదటి అక్షరం విలువ మీకు తెలియదు' అని మనసులో అనుకుని.. 'నా బదిలీల సంఖ్య మరచిపోయాను!' అన్నాను. 'ఈ సారి ఎక్కడికి?' .. 'పూండి పల్లెట!' 'అది ఎక్కడ వుంది?' 'రాష్ట్రం మారు మూల ప్రాంతంట!' అన్నాను. మా "శిథిల జర్జరిత బంధం" లో వివరాలకు తావులేదు. 'ఏదో ఏడవండి! మీ ఖర్మకి మీరే బాధ్యులు!' అని విసురుగా వెళ్ళిపోయింది.

'నా కర్మకి నేనే బాధ్యుడిని అన్న 'విశ్వజనీన సత్యం' చెప్పిన ఆమెకు మనసులో జోహార్లు ప్రకటించాను. మన జీవితంలో కొన్ని ముఖ్య సంఘటనలు 'ప్రమాదవశాత్తు' జరిగి పోతాయి! అలాగే నా పెళ్లి! మాది 'యాక్సిడెంటల్ మ్యారేజ్!'.. నేను రెవెన్యూ డిపార్టుమెంటులో పని చేస్తానని మా మామగారు ఎంతో వెతికి నన్ను పట్టుకుని, ఎంతో "ఆశ"తో మృణాలినితో నా వివాహం జరిపించారు! తర్వాత పశ్చాత్తాపపడి ఉంటారని నా నమ్మకం! భౌతిక రూపానికి విలువ ఇచ్చే లోకంలో ఆమె సహజ సిద్ధమైన మల్లెపూవు! నేను వెలిసిపోయిన కాగితం పువ్వుని! ఆమె నీహారికా బిందు సించితమైన అరవిరిసిన అరుణవర్ణ గులాబి! గ్రీష్మంలో నీరు లేక ఎండిపోయిన గడ్డి పువ్వును నేను!

రెవెన్యూ డిపార్టుమెంటులో పని చేస్తానంటే..నా అధీనంలో 'పెద్ద రెవెన్యూ' వుంటుందని ఆశపడ్డ మృణాలినికి ఆ కనీస ఆశ కూడా తీరలేదు! జీతం తప్ప "నాతార్జన" చేతకాని దద్దమ్మనని, రెవెన్యూ అనే "తులసి వనంలో గంజాయి" మొక్కలాంటి వాడినని నాకు కీర్తి కిరీటం తగిలించింది.

'వీడ్కోలుకి' కూడా నోచుకోని 'మురికి చుట్టంలా' ఒక్కడినే ఆ పూండి పల్లెకి ప్రయాణమయ్యా. నా కొడుకు, కూతురు 'హాయ్' అని చెయ్యి ఊపి, వాళ్ళ చేతుల్లో వున్న 'సెల్ డెవిల్' మాయాలోకంలో పడిపోయారు. అందరినీ ఒక్కసారి కళ్ళారా చూసుకున్నాను. మళ్ళీ ఎప్పుడు చూస్తానో తెలియదు. కన్నీటి పొరల మధ్య నా అనుకున్న వారిని, ఊరిని చూసుకుని ముందుకు కదిలి పోయాను! 'నేను లేకపోవడం' అనే వెలితి వాళ్లకి వుండదు. నేను ఈ కుటుంబానికి అవసరం లేదు, అని మున్నెన్నడో తెలిసిపోయింది!

పూండి పల్లెలో నాకు మంచి స్వాగతమే లభించింది. 'జూనియర్ క్లార్క్' పాండి నన్ను ఎంతో ఆరాధనతో చూడడం నాకు

కొత్తగా అనిపించింది. 'సార్! ఇక్కడ "క్షిప్ర ప్రసాదాన త్రినయన" దేవాలయం వుంది! దీని క్షేత్ర పాలకుడు కాలభైరవుడు. మహా శక్తివంతమైన దేవాలయం. మృత్యు ముఖంలో వున్న వాళ్ళు ఇక్కడ వంద రోజుల నిద్ర చేస్తే నిండు నూరేళ్ళు బతుకుతారు సార్! అంత మహిమ! అది మా వూరి ప్రత్యేకత!' అన్నాడు. మా శాఖలో.. నాకున్న "నిక్‌నేమ్"! 'ఫేవరేట్ విప్పింగ్ బాయ్' అంటే.. దాని తెలుగు అర్థం ఇప్పుడు తెలిసింది. కాలభైరవుడిలా ధ్వనించే.. 'పాపాల భైరవుడు!'

ఓ రైతు పట్టా పుస్తకం కోసం తిరిగి తిరిగి, ఓ రోజు మా ఆఫీసు ముందు వున్న మర్రిచెట్టు కింద పురుగుల మందు తాగి చనిపోయాడు! అంతకు ముందు రెండు రోజుల క్రితమే నేను 'చార్జ్' తీసుకున్నాను. ఆ రైతు చావుకి నేనే కారణం అని 'ప్రెస్' చావచితక కొట్టింది. 'సాయి ప్రసాద్' కాదు 'కసాయి ప్రసాద్' అని మరో నామకరణం చేసింది! 'నేను ఆ రైతును చూడను కూడా లేదు!' అన్న నా మాట పాతాళం నుంచి కూడా వినబడనంత బలహీనమైన శబ్దంగా బయటకు వచ్చింది. నా మాట ఎవరూ వినలేదు. ఫలితం .. బదిలీ!... ఇంకో చోట.. "హరిత హారం" మొక్కలు ఎండిపోయాయి! మేకలు తినేశాయి! దానికీ "హరిత హార సంహారి" అని మరో బిరుదు వచ్చింది. 'మొక్కలకి నీళ్ళు పోయాలి!.. మేకలు తినకుండా 'గ్రిల్' పెట్టాలి! అన్న నా మాటలు బయటకు రాలేదు! ఆఫీసులో వుండే నేను అవి ఎలా చెయ్యగలను? మరో బదిలీ..



పాండి మంచి కుర్రాడు. మంచి మాట, దానిలో నిబద్ధతా నన్ను ఆకట్టుకున్నాయి.

నాకు వసతి ఏర్పాటు చేశాడు. పెద్ద ఇల్లు! ఈ చిన్న వూర్లో నా ఉద్యోగం "సాపేక్ష సిద్ధాంత" పరంగా పెద్దదే! 'సార్! మీ ఫ్యామిలీ?' అని అడిగాడు. 'వుంది!' అన్నాను ముభావంగా! 'వాళ్ళు రారు' అని పాండి కి అర్థమై వుంటుంది.

ఆ సాయంత్రం.. పాండి ఒక ఆడ మనిషిని తోడుకు వచ్చాడు. 'ఈమె పేరు చుక్కమ్మ సార్! మీ ఇంటి పనులు చేస్తుంది. ఇక్కడ భోజన హోటల్స్ లేవు! ఈమె వంట చేస్తుంది! ఎక్కువ జీతం అడగదు. గుడి దగ్గర చిన్న గుడిసెలో వుంటుంది!' అన్నాడు.

ఈ కుగ్రామానికి ఎవరూ రారు! మళ్ళీ బదిలీ అనే 'అసంకల్పిత ప్రతీకార చర్య' నా పై అధికారులు చేసే వరకూ ఇక్కడే వుండాలి! అది ఎన్నాళ్ళో? బదిలీల 'వైకుంఠ పాళీ' లో చివరి దశ! పెద్దపాము మింగితే సరాసరి ఇక్కడికే వచ్చి పడే నాలాటి 'బాధా సర్పద్రష్టులు' తక్కువ! 'లౌక్య లేమి' ఆసామీలు అరుదుగా వుంటారు! ఇక నా బతుకు ఇక్కడే తెల్లవారిపోతుంది!, అని నాకు అర్థమై పోయింది. అంతవరకూ బతకాలంటే 'ఏదో' తినాలి కదా! ఈ వంటమనిషి దేముడే పంపాడు అనుకున్నాను.

ఆ ఆడమనిషిని చూశాను. పసిమి రంగులో వుంది. జరీ అంచు వున్న ఆకుపచ్చ నూలు చీరె కట్టుకుంది. ఆమెను పని మనిషిలా అనుకోవడానికి నా మనసు అంగీకరించలేదు. 'వద్దు! ఇంకా ఎవరినైనా చూసుకుందాం!' అన్నాను. దానికి చుక్కమ్మ ముఖం వాడిపోయింది. 'నేనో దౌర్భాగ్యురాలను .. గతిలేక వచ్చాను సామీ! నాది చావు బతుకుల సమస్య!' అంది దీనంగా! ఆమె కళ్ళలో కన్నీటి చారలు కనబడి నేను విచలితుడిని అయ్యాను! 'నాలాటి' మరో విధి వంచిత?

'జీతం మీ ఇష్టం సార్! పొద్దునే ఇల్లు వూడ్చి, మీకు వేడి నీళ్ళు పెట్టి వెళుతుంది. కాఫీ, టీ, కలిపి ఇస్తుంది. మీకు టిఫిన్ చేస్తుంది!

మీకు భోజనం వండుతుంది. దగ్గరలో గుడిలోనే వుంటుంది. మీరు ఎప్పుడు పిలిచినా వస్తుంది! మీ బట్టలు ఉతికి విస్త్రీ చేయించి ఇస్తుంది!' పాండీ చెప్పాడు.

ఇక్కడికి వచ్చిన తర్వాత మృణాలినికి ఫోన్ చేశాను. పిల్లలికీ ఫోన్ చేశాను. 'మీరు 'కాల్' చేసిన వ్యక్తి ఏ 'కాల్' నూ స్వీకరించుట లేదు!' అన్న సమాధానం 'పదేపదే' వచ్చింది. వందల కిలో మీటర్ల దూరం వున్న నన్ను ఏ మాత్రం గొప్పగా చూడకపోవడం వారి 'సమతా దృష్టి' కి నిదర్శనం!

పాండి చెప్పినది నిజమే. చుక్కమ్మ మంచి పనిమంతురాలు! నా ప్రమేయం లేకుండా .. నాకు కావలసినవి అమర్చిపెడుతోంది. చుక్కమ్మ చేతి భోజనం రుచిగా వుంది. నాకు బాగా అలవాటైన 'ఇంటి భోజనం' కి "నిర్వచనం" మార్చి వేసింది! ఇన్నాళ్ళూ .. లేని సౌకర్యాలు! చుక్కమ్మకి నా కృతజ్ఞతలు ఎలా చెప్పాలి? అడిగిన జీతం కన్నా ఎక్కువ ఇచ్చి! ఈమె సేవకు ఎంత ఇచ్చినా తక్కువే!

నెల తర్వాత,,, నేను ఇచ్చిన జీతం చూసి.. 'బాబుగారు! ఇంత డబ్బు వద్దు! నేను ఒక్క మనిషిని! ఇది చాలు.. అని నేను ఇచ్చిన దానిలో మూడు వంతులు నాకిచ్చేసింది! డబ్బు చుట్టూ లోకం తిరుగుతోంది. కానీ.. ఈమె లోకం వేరు అనుకుంటా.. సాయంత్రాలు ఖాళీగా వుంటే.. "క్షిప్రప్రసాదన త్రినయన" దేవాలయానికి వెళ్లాను! దైవ దర్శనం అయింది. ఏ ప్రార్థనా చేయలేదు. నాకు "దీర్ఘకాల నిష్ప్రయోజన జీవితం" మీద ఆసక్తి లేదు! ఈ పెద్ద గుడి ఆవరణలో ఓ పెద్ద నుయ్యి.. గుడికి కొంత దూరంలో పెద్ద చెరువు! చెరువు గట్టు మీద కూర్చున్నాను. చల్లని గాలి పలకరించింది. చెరువులో శ్వేత పద్మాలతోపాటు, నీలోత్పలాలు, నీటిలో ఈదే నీటి కొంగలు కనిపిస్తున్నాయి. దూరంగా పచ్చటి అడవి. ఈ వూరి బదిలీ.. నాకు "పనిష్మెంట్" కాదు! అదృష్టమే అనిపించింది. గగనవిహార దేవతల పూజా పుష్పాలలా శివుడి గుడి శిఖరం పైన చుక్కలు మెరుస్తున్నాయి. అప్పుడు.. ఓ పాట విన్నాను. 'క్షిప్రప్రసాదనా! త్రినయనా! సుప్రసన్నా, సుఖ శాంతి వివర్ధనా! అప్రమేయా! త్రిశూలధారా, సుప్రభాత కమల పద్మపీఠా! త్రిలోక రూపా, స్వయం సూర్యచంద్రా! అనంతా!..'

మృదు మధురమైన కంఠంతో తాళ భరితంగా అమృత వాహినిలా సాగుతోంది గానం. ఆ పాటలో కొన్ని పదాలకు నాకు అర్థాలు తెలియవు. కానీ .. ఆ పదాలలో "అలౌకిక మధురిమ" నన్ను కట్టిపడేసింది. తొలికిరణాల స్పర్శతో పులకించిన పూబాల విడిచిన నీహారికా బిందు సంచయం నా కంటి నుంచి వెలువడింది. మనసు నిండిపోయింది! ఎవరిదీ గానం? ఎవరిదీ అమేయ భక్తి తత్పరత!..తెలిసిన స్వరమే!

రాత్రి ఇంటికి ఫోన్ చేశాను. ఎవరూ పలకలేదు. 'When your absence is not felt by your kith, take it that your presence is not needed by them.' అన్న సామెత గుర్తుకు వచ్చింది. నీ వారికి .. నీ అస్తిత్వం గుర్తు రానప్పుడు, నీ "నిష్క్రమణ" కూడా వారు గుర్తించరు!' తెల్లవారు జామున.. గుడి వైపు చూశాను. చుక్కమ్మ గుడి నూతిలో నుంచి నీరు తీసుకు పోతోంది. తలుపు దగ్గరా వేసి, నేను గుడికి వెళ్లాను. గుడి అంతా తుడిచి, కడిగి ముగ్గులు వేస్తోంది! అభిషేకానికి వెండి బిందెలో నీరు పెట్టింది.

నాకు కాఫీ ఇచ్చి చప్పుడు కాకుండా వెళ్లిపోతుంటే అడిగాను. 'అమ్మా! మీరు ఎవరు?' నా ప్రశ్నకు ఆమె బిత్తరపోయింది. 'నాకు తెలుసు .. మీరు పని మనిషి కాదు! నిజం చెప్పండి!'

ఆ మాటకు ఆమె క్రింద కూచుండిపోయింది. ఆమె ముఖంలో నీలి నీడలు కమ్ముకున్నాయి. 'అయ్యా! 'జవాన్' అంటే అర్థం ఏమిటి?' అంది. 'సిపాయి! సోల్జర్! సైనికుడు!' అన్నాను. 'కాదు బాబూ! జవాన్ అంటే యువకుడు. అంటే ముసలితనం

రానివాడు!' ఆ మాటలు అన్నప్పుడు ఆమె గొంతు వణికింది!

కొన్ని క్షణాలు ఆగి అన్నాను. 'మీరు పనిమనిషి కాదు. మీరు పాడిన ఆ పాట.. ఆ ఉచ్చారణ.. బ్రాహ్మీ ముహూర్తంలో స్నానం చేసి, గుడి కడిగి, ముగ్గులు పెట్టి, అలంకరించి, వెండి బిందెలో ఆ మహేశ్వరుడికి అభిషేకం చేయడానికి నీరు తేవడం ఇవన్నీ... ఓ సామాన్యమైన పని మనిషి చేయదు! సరే.. ఈ జవాన్ మాట ఏమిటి?'

చుక్కమ్మ చేతులలో ముఖం పెట్టుకుని గాద్గదికంగా అంది. 'అవును.. నేను చుక్కమ్మను కాను. నా పేరు దమయంతి. నాది కలిగిన కుటుంబం. నాది ఈ వూరు కాదు. ఈ మహేశ్వరుడి గుడిలో 'వంద రోజుల వ్రతం' కోసం వచ్చాను! మృత్యుంజయుని పూజ చేస్తే యమలోకంలో వున్న మనిషి కూడా బతుకుతాడని విని ఇక్కడికి వచ్చాను. 'ఆమె కంటిలో ధారాపాతంగా వస్తున్న కవోష్ణ భాష్పాలు ఆమె గొంతు నొక్కేసాయి. కొంతసేపటికి తేరుకుని 'నా కొడుకు అవినాష్! ఆర్మీ ఆఫీసరు!.. కొన్ని వారాల క్రితం వాడికి మంచు కొండల్లో పోస్టింగ్ ఇచ్చారు! అక్కడ అనుక్షణం మృత్యువు కరాళనృత్యం చేస్తూ వుంటుంది. అక్కడికి వెళ్ళిన వారు, మంచులో సమాధి అయిపోతారని తెలిసింది! నా కొడుకు అక్కడ వున్నాడు!'

అప్రయత్నంగా నేను లేచి నిలబడ్డాను. "సైనికుడు' లేకపోతే మన స్వేచ్ఛా, స్వాతంత్రయాలకి రక్షణ లేదు.

'నా కొడుకు క్షేమంగా తిరిగి వస్తాడని ఆశ. ఆ ఆశ తోనే ఈ "క్షిప్రప్రసాదన త్రినయన" శివాలయంలో నూరు రోజుల వ్రతం! సమస్తమూ మరచి ఆ మహాదేవుని అర్చించాలి! అది ఈ వ్రతనియమం!'

దేశ సరిహద్దుల్లో మంచు శిఖరాలపై నిత్య మరణ మృదంగమే! ఆమె పనిమనిషి కాదు! దేశ రక్షణలో వున్న కొడుకు కోసం ఈ "అసిధారా వ్రతం" చేస్తున్న మహా మాత! ఈమె చేత సేవలు చేయించుకోవడం పాపం! కానీ ఎలా ఆపాలో తెలియదు!

ఆ రాత్రి నాకు వళ్లు పేలిపోయే జ్వరం వచ్చింది. కన్ను తెరిస్తే చీకటి.. కన్ను మూస్తే చీకటి. సుదూరంగా మాటలు! నా వాళ్ళా? ఆ ఆశ 'శిరీష కుసుమం! వాళ్ళు రారు! ఎన్ని రోజులు మగతలో వున్నానో తెలియదు. ఓ చల్లని చేతి స్పర్శ ఒకటే లీలగా తెలుస్తోంది.

'బ్రహ్మ మురారి సురార్చిత లింగం! నిర్మల భాసిత శోభిత లింగం! జన్మజ దుఃఖ వినాశక లింగం! తత్ ప్రణమామి సదాశివ లింగం!' అన్న లలిత లాలిత్య స్వరం వినపడింది. కళ్ళు తెరిచాను.

సూర్యోదయం.. తడారిపోయిన గొంతులో అమృత బిందువుల్లా జీవామృతం నా గొంతులో పడుతోంది! కూర్చోవడానికి లేవబోయి పడిపోయాను. 'బాబు గారూ! నెమ్మదిగా..' అని చుక్కమ్మ (తమస్సుతో పోరాడి నన్ను బతికించిన దమయంతి!) ఆమె చేయి అందించింది. నేను చూసిన సూర్యోదయం ఆమె నుదుటన వున్న కుంకుమరేఖ.

నాకు నెమ్మదిగా విషయాలు తెలిసాయి! నన్ను విషం జ్వరం కమ్మేసిందిట. 'మీకు వారం పాటు స్పృహలో లేరు సార్! చుక్కమ్మే ఇన్నాళ్ళూ మీ దగ్గరే వుంది! ఆమె చల్లని చేతి చలవ! మీకు నయం అయింది.' పాండీ అన్నాడు.

శక్తి వచ్చిన తర్వాత నేను అన్నాను. 'నాకు ప్రాణదానం చేశావు! ఈ ప్రదేశంలో నాకు పెద్ద దిక్కువి అయ్యావు. తెలుగు అక్షరాలలో మొదటి అక్షరం 'అ'... హల్లులో మొదటి అక్షరం 'క' .. రెండు కలిపితే 'అక్క'.. నాకు తెలిసినదీ, ఇప్పుడు లేనిదీ మా అక్క!.. అమ్మ స్పర్శ నాకు తెలీదు! నాకు క్షిప్రప్రసాదన త్రినయనుడు ఇచ్చిన అక్కవి నువ్వు!' అన్నాను. అక్కను తలచుకోగానే నాకు దుఃఖం ఆగలేదు.

ఆమె కొడుకు ఏ మంచు భూమిలో వున్నాడో? కైలాసవాసా మహేశ్వరా! ఈమె పూజ నన్ను బతికించింది. నన్ను కరుణించావు. మా ఈ "అక్క"ని కూడా కరుణించు!' అని మనసులో వేడుకున్నాను!

'బాబూ! ఏమిటి మీరంటున్నది?' 'నాకు తెలుసు అక్కా! నీ చేతి చలవ వల్లా, సేవ వల్లా నేను బతికాను. లేకపోతే నా బతుకు తెల్లారి పోయేది! నా అనుకున్న వారు నాకు ఎవరూ లేరు!'

ఒక రోజు దమయంతి ఇంటికి వెళ్లాను. ఆమె గోడ పై చుక్కలు లెక్క పెడుతోంది! 'అక్కా! ఏమిటి?' అని అడిగాను.

'వంద రోజుల లెక్క! ఇంకా తొమ్మిది రోజులుంది ఈ వ్రతం తమ్ముడూ!' అంది.

ఆ తర్వాత కొన్ని రోజులు నేను వూరిలో లేను. రైతు ఆత్మహత్య విచారణ కోసం పిలిచారు. తిరిగి వచ్చాను. దమయంతి కొరకు వెతికాను. 'సార్! దమయంతి గారు ఎక్కడికో వెళ్లిపోయారు!' అన్నాడు పాండి. నాలుగు రోజులయినా ఆమె జాడ లేదు. ఆమె ఇంటికి వెళ్లి చుక్కలు చూశాను. లెక్క పెట్టాను. తొంభై తొమ్మిది! ఇంకా ఒకే ఒక్క చుక్క.. అది లేదు.

రోజులు గడుస్తున్నాయి. దమయంతి జాడ లేదు. ఆమె కుమారుడు తిరిగి వచ్చాడా?..

నా ఇంటి అరుగు మీద కూర్చుని గుడివైపు, నూతి వైపు, చెరువు వైపు చూస్తూ వున్నాను!

దమయంతి వ్రతం ఫలించిందా?.. చిమ్మ చీకటిలాటి నా మనసులో ప్రభాత సూర్యుని కిరణం ఉదయిస్తుందని ప్రతీ రోజూ ఎదురు చూస్తున్నాను!

★★★★★

# మూడో కోరిక

కొయిలాడ రామ్మోహన రావు



✆ 9849345060

**కథామంజరి నిర్వహించిన దీపావళి కథల పోటీ 2022 లో ప్రోత్సాహక బహుమతి లభించిన కథ**

***ప్రతి ఏటా జరిగే ఆలయ ఉత్సవానికి అమ్మగారు ఎప్పుడూ పదివేలకు తక్కువ కాకుండా విరాళం ఇచ్చేవారు. ఈసారి కూడా సొమ్ము నా చేతిలో పెడుతూ, 'నేనెంత కాలం బతుకుతానో తెలియదు. బ్యాంకులో పది లక్షలు డిపాజిట్ చేస్తున్నాను. దాని మీద వచ్చే వడ్డీతో ప్రతి ఏటా ఉత్సవం జరిపించండి. నేనున్నా లేకపోయినా, ఉత్సవం మాత్రం ఆగకూడదు' అన్నారు. అదేమిటమ్మా? మీకేమంత వయసు మీరిపోయిందని? మొన్ననేగా అరవై నిండింది? మీ నోట ఆ మాట ఏనాడూ రానీయకండి.***

అమ్మ చనిపోయిందని తెలిసిన వెంటనే నేను, నా భార్య శాలిని, పిల్లలు కీర్తన్, మేఘన సిరిపల్లి వచ్చాం. నన్ను కలవడానికి వచ్చిన పూజారి గారు,

"మీ అమ్మగారు త్వరలోనే చనిపోతారని ముందే ఊహించినట్లున్నారు బాబూ" అని చెపుతుంటే నా బుర్ర గిర్రున తిరిగింది.

"నిజమా!!! మీరెందుకలా అనుకున్నారు?" అని ప్రశ్నించాను ఉత్సుకతతో.

"నేనే కాదు బాబూ, ఊర్లో చాలామందికి ఆ సందేహం ఉంది. ప్రతి ఏటా జరిగే ఆలయ ఉత్సవానికి అమ్మగారు ఎప్పుడూ పదివేలకు తక్కువ కాకుండా విరాళం ఇచ్చేవారు. ఈసారి కూడా సొమ్ము నా చేతిలో పెడుతూ, 'నేనెంత కాలం బతుకుతానో తెలియదు. బ్యాంకులో పది లక్షలు డిపాజిట్ చేస్తున్నాను. దాని మీద వచ్చే వడ్డీతో ప్రతి ఏటా ఉత్సవం జరిపించండి. నేనున్నా లేకపోయినా, ఉత్సవం మాత్రం ఆగకూడదు' అన్నారు. అదేమిటమ్మా? మీకేమంత వయసు మీరిపోయిందని? మొన్ననేగా అరవై నిండింది? మీ నోట ఆ మాట ఏనాడూ రానీయకండి. నేను చెపుతున్నాను. మీరు నూరేళ్లు ఆరోగ్యంగా జీవిస్తారు అని ధైర్యం నూరిపోసినా, పట్టించుకోకుండా మాట దాటవేసిన అమ్మగారి మాటల్లో తొంగి చూసిన విషాదం నాకింకా గుర్తుంది బాబూ" అంటున్న పూజారి గారి గొంతు బాధతో పూడుకుపోయింది. కాస్త తేరుకున్న తర్వాత,

"అంతే కాదు. ఆ మర్నాడే ఆ డబ్బు డిపాజిట్ చేయడం కూడా జరిగిపోయింది. 'ఎంతో సమయం లేదు. చేయవలసిన పనులు చాలా ఉన్నాయి' అని ఒకటి, రెండుసార్లు, ఆవిడ గొణుక్కోవడం నేను గమనించాను గానీ, పరిస్థితి ఇంతవరకు వస్తుందని ఊహించలేకపోయాను. చాకలి సుబ్బులు, పాలేరు గంగన్న, పనిమనిషి కావేరి ...ఇలా చాలామంది, అమ్మగారి దగ్గర అలాంటి మాటలే విన్నారు. అప్పటినుంచీ వాళ్ళు కూడా అమ్మగారి గురించి బెంగపడడం మొదలుపెట్టారు" అని పూజారి గారు చెపుతుంటే, నా కళ్ళు చెమర్చాయి. 'అందరికీ అర్థమయ్యేలా చెప్పావు. నాకెందుకు చిన్న హింట్ అయినా ఇవ్వలేదమ్మా?' అనుకుంటూ కుమిలిపోయాను.

★★★


మా అమ్మ కూడా స్వంత ఊరిని వదిలిరావడానికి ఇష్టపడేది కాదు. వైజాగ్ వచ్చేసి, నా ఇంట్లో ఉండిపొమ్మని నేను, శాలిని ఎన్నిసార్లు పోరినా పట్టించుకొనేది కాదు. ఎప్పుడయినా వచ్చినా, చుట్టం చూపులా మూడు నాలుగు రోజులకన్నా మించి

ఉండేది కాదు. ప్రభుత్వ ఉద్యోగినయిన నేను, ఒక కార్పోరేట్ స్కూల్లో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న శాలిని, బిటెక్ మూడో సంవత్సరం చదువుతున్న కీర్తన్, ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న మేఘన ఎవరి పనుల్లో వారు ఉండడం వల్ల, ఆమెకు ఏమీ తోచకపోవడంతో వైజాగ్‌లో ఉండడానికి ఇష్టపడేది కాదని, మేము అనుకునే వాళ్ళం.

పరీక్షలు దగ్గరపడడం వల్ల, మళ్ళీ పెదకర్మకు వస్తామని చెప్పి శాలిని, కీర్తన్, మేఘన వైజాగ్ వెళ్ళిపోయారు. నిజానికి నాక్కూడా తీవ్రమయిన పని ఒత్తిడి ఉంది. కానీ నేను సిరిపల్లి నుంచి కదిలే పరిస్థితి లేదు.

★★★

మా వాళ్ళు వెళ్ళిపోయినా, మా ఇల్లంతా బంధువులతో సందడిగానే ఉంది. వంటలు చేసుకుంటూ, ఇల్లు శుభ్రం చేసుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్న ఆడవాళ్ళు, సినిమాల గురించి మాట్లాడుకున్నా, భక్తి గురించి మాట్లాడుకున్నా, పోలిటిక్స్ గురించి మాట్లాడుకున్నా, అమ్మ ప్రస్తావన తప్పక వచ్చేది. వాళ్ళేమి మాట్లాడుకుంటున్నారో వినాలని ఆసక్తి ప్రదర్శించేవాడిని. అమ్మది



ఒక గొప్ప కేరక్టర్. ఆ విషయమే వాళ్ళ మాటల్లో స్పష్టమయ్యేది. ఆ మాటలు వింటుంటే నాకెంతో సంతోషం కలిగేది. ఆ సమయంలో నా భార్యా, పిల్లలు ఉండి ఉంటే, ఎంత బాగుండేది? అని అనుకునేవాడిని.

ఒకరోజు, ఏమీ తోచక అమ్మ బెడ్‌రూములో ఉన్న బీరువా తెరిచి చూసాను. లాకర్‌లో ఉన్న ఆస్తి పత్రాలు, ఇతర పత్రాలు, పాస్‌బుక్కులు, సర్టిఫికెట్లు మొదలయిన వాటిని పరిశీలిస్తుంటే, నా పేరున రాసి ఉన్న కవరొకటి నా కంట పడింది. నాకోసం అటువంటిదేదో అమ్మ వదిలి ఉంటుందని ముందే ఊహించడం వల్ల, నేను పెద్దగా ఆశ్చర్యపడలేదు. ఆత్రుతగా కవర్ తెరిచి, అందులో రాసి ఉన్న ఉత్తరాన్ని చదవడం మొదలుపెట్టాను.

"చిన్నోడా…" అన్న సంబోధన చూడగానే నా కళ్ళమ్మట నీళ్ళు సుడులు తిరిగాయి. మా పెళ్ళయిన కొత్తలో శాలిని అడిగిన ప్రశ్న గుర్తొచ్చింది.

"మీ అమ్మగారికి మీరొక్కరే కొడుకు కదా? మరి చిన్నోడా అని ఎందుకు పిలుస్తారు?" అన్న ఆమె ప్రశ్నకు అమ్మే సమాధానం చెప్పింది,

"వాడెప్పటికీ నాకు చిన్న…బాబేనమ్మా. అందుకే చిన్నోడా అని పిలుస్తాను. వాడు ఎంత పెద్దవాడయినా, తండ్రి అయినా, తాత అయినా నా దృష్టిలో చిన్నోడే" అంటూ. ఆ మాటలు నాకింకా గుర్తే. కళ్ళు తుడుచుకొని ఉత్తరం చదవడం మొదలుపెట్టాను.

"నేనెంతో కాలం బతకనని నాకు అనిపిస్తుందిరా. నా ఆలోచన తప్పు అవ్వాలని మనసారా కోరుకుంటున్నా, నా అంతరాత్మ

మాత్రం అదే నిజమని పోరుపెడుతోంది. 'అటువంటిది ఏమీ లేదు. మీరు ఆరోగ్యంగా ఉన్నారు' అని డాక్టర్ చెపుతున్నా, నా మనసు ఒప్పుకోవడం లేదు. అందుకే చేయవలసిన ఏర్పాట్లు అన్నీ చేసేసాను. ఆస్తులన్నీ నీ పేరున బదిలీ చేసేసాను. మీరందరూ ఏ చీకూ చింతా లేకుండా హాయిగా ఉండాలి. అన్నట్లు నాకు కొన్ని కోరికలు ఉన్నాయి. తప్పక తీరుస్తావు కదూ?

మొదటిది, ఏడాదికి ఒకసారయినా మీ కుటుంబం అంతా మన ఊరు వచ్చి, కనీసం వారం రోజులయినా గడపాలి. రెండవది, ఎన్నాళ్ళనుంచో మనకు సేవలు చేస్తున్న వారందరికీ ఏ కష్టం రాకుండా చూసుకోవాలి. ఇక మూడోది చెపితే నీకు తప్పకుండా ఆశ్చర్యం వేస్తుంది. ఇలాంటి పిచ్చి కోరిక కోరిందేమిటి? అని నవ్వు కూడా వస్తుంది. కానీ నువ్వు తప్పక నా కోరిక తీర్చాలి. అదేమిటంటే, వీలయినంత త్వరగా నీ కుటుంబంతో సహా సుభద్ర అత్త ఇంటికి వెళ్లి, కనీసం పదిరోజులయినా గడపాలి. ఎందుకు అని అడిగితే, సమాధానం చెప్పడానికి నేను ఉండను. నా కోరిక తీర్చాలి. అంతే. ఇట్లు ప్రేమతో నీ అమ్మ".

చదవడం ముగించి, భోరున ఏడ్చాను. అమ్మ నా ఎదురుగా నిలబడి మాట్లాడినట్లే అనిపించింది. కాస్త తేరుకున్నాక ఆలోచనలో పడ్డాను. అమ్మెందుకు ఇలాంటి విచిత్రమయిన కోరిక కోరింది? అనుకుంటూ మథన పడ్డాను. ఎంతగా ఆలోచించినా దాని ఆంతర్యమేమిటో నాకు అర్థం కాలేదు.

సుభద్ర అత్త మాకు బంధువేమీ కాదు. అమ్మకు చిన్ననాటి ప్రాణస్నేహితురాలు. చిన్నప్పటి నుంచి ఆమెను అత్తా అని పిలవడం నాకు అలవాటు. నేను పుట్టిన కొన్నాళ్ళకే నాన్న చనిపోయినపుడు, అమ్మకు ఆసరాగా నిలబడింది, మానసిక స్థైర్యాన్ని ఇచ్చింది అత్తే. ఆవిడ అమ్మకు చాలా దూరంగా, 'వెదురు పల్లి' అనే ఒక గిరిజన ప్రాంతంలో ఉంటున్నా, అమ్మ, అత్త భౌతికంగానే దూరమయ్యారు తప్ప, మానసికంగా వాళ్ళిద్దరూ చేరువగానే ఉండేవారు. అంత గొప్ప అనుబంధం వారిద్దరిదీ. ఏది ఏమయినా ఏడాదికి కనీసం రెండు సార్లయినా వాళ్ళిద్దరూ కలిసేవారు. అత్త ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. అయినా ఏనాడూ నోరు తెరిచి అమ్మను సహాయం అడిగేది కాదట. అమ్మే తన ఇబ్బందులు గ్రహించి, తగిన సాయం చేసేదట.

"ఒరేయ్ ...నీ ఆస్తంతా మీ అమ్మ, ఆ సుభద్రకు దోచి పెడుతుందిరా. నువ్వు జాగ్రత్త పడకపోతే నీకేమీ మిగలదు' అని నాకు బోధన చేసే బంధువుల వద్ద ఈ మూడో కోరిక గురించి చర్చించ దలుచుకోలేదు. తీర్థ యాత్రలకు వెళ్ళిన అత్త, రావడానికి వీలుపడలేదు. కబురు తెలిసిన ఆమె పెద్ద కొడుకు, మల్లయ్య దొర వచ్చినా అతని దగ్గర కూడా ఆ ప్రస్తావన తీసుకురావడానికి నా మనసు అంగీకరించలేదు. ఇక నా సందేహం ఎలా తీరుతుంది? అనుకుంటూ బుర్ర బద్దలు కొట్టుకున్నాను.

శాలినితో విషయమంతా వివరంగా చెప్పాను. తను కూడా ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టింది.

"నాకు రెండు ఆలోచనలు తడుతున్నాయి" అనగానే కుతూహలంగా చూసింది శాలిని.

"మొదటిది, అత్త ఉన్న ఊర్లో మనమొక ఫార్మ్ హౌస్ కట్టి, వీలున్నప్పుడల్లా ఆ అందమయిన ప్రాంతంలో గడిపి రావాలని, మన దైనందిక జీవితంలోని ఒత్తిళ్ళు తగ్గించుకొని రిలాక్స్ అవ్వాలని అమ్మ కోరిక అయిఉంటుంది. మనం అక్కడ కొన్ని రోజులు ఉంటే, అదే ఆలోచన మనకు వస్తుందని అమ్మ ఉద్దేశ్యం అయిఉంటుంది" అనగానే అడ్డుతగిలింది శాలిని,

"అదెలా సాధ్యం? గిరిజన ప్రాంతంలో మనం స్థలం కొనకూడదని, ఏ ఇల్లూ కట్టకూడదని రూలుంది కదా?" అంటూ.

"నిజమే. ఆ విషయం అమ్మకు తెలియదు కదా? సరే రెండవది విను. నీకు తెలుసుకదా? అత్త ఏనాడూ అమ్మతోనే తన కష్టం చెప్పుకొనేది కాదు. ఏ రోజునా ఎవరి సాయమూ అడగదు. మనం వాళ్లింట్లో కొన్ని రోజులు ఉంటే, వాళ్ళ ఇబ్బందులేమిటో,

వాళ్లకు మనం చేయాల్సిన సహాయం ఏమిటో తెలుస్తుంది అని అమ్మ ఉద్దేశ్యం కావచ్చు. నువ్వేమంటావు?" అని అడిగాను. ఏ విషయమూ చెప్పలేనట్లు భుజాలు ఎగరేసింది.

★★★

తీర్థయాత్రల నుంచి తిరిగి వచ్చిన అత్త, ఇంటికయినా వెళ్ళకుండా నేరుగా వైజాగ్ వచ్చి మమ్మల్ని కలిసింది. ఆఖరి చూపుకు కూడా నోచుకోనందుకు ఎంతో కుమిలిపోయింది. అమ్మ రాసిన ఉత్తరం ఆమె చేతిలో పెడుతూ విషయం చూచాయగా చెప్పాను. ఉత్తరం చదివి, తిరిగి ఇచ్చేస్తూ,

"నాక్కూడా ఏమీ అర్థం కావడం లేదురా. పోన్లే ...మంచి కోరికే కోరింది. పది రోజులేమిటి? నెల రోజులు ఉండిపోండి. ఇప్పుడున్న కొత్త ఇంట్లో చాలా గదులున్నాయి. పైగా తగాదాల్లో ఉన్న మా ఆస్తి మా చేతికి వచ్చేసింది. ఇప్పుడు ఏ ఇబ్బందులూ లేవు" అంది ఆప్యాయంగా. ఆమె వెళ్ళిన వెంటనే శాలిని అడిగింది,

"అయితే మీ రెండో ఆలోచన కూడా తప్పేమో? వారికి ఏ ఇబ్బందులూ లేరంటున్నారు కదా?" అని.

"ఏమో? వీళ్ళ ఆర్థిక పరిస్థితి మెరుగయినట్లు అమ్మకు తెలియదేమో?" అన్నాను గానీ నా మాటల మీద నాకే నమ్మకం లేదు. ఆలోచనలతో బుర్ర పగిలిపోతుంటే, తల పట్టుకొని కూర్చున్నాను.

"మీరంతగా ఆలోచించకండి. పరీక్షలు అయిపోగానే మీ అత్త ఇంటికి వెళ్లి పదిరోజులుందాం. అప్పుడే తెలుస్తుంది అసలు విషయం" అని శాలిని అనగానే, 'నిజమే కదా?' అనుకుంటూ స్థిమితపడ్డాను.

★★★

వీలు చూసుకొని అందరం అత్త ఇంటికి వెళ్లాం. అత్త, ఆమె కొడుకు మల్లయ్య దొర, కోడలు లక్ష్మి, వాళ్ళ పిల్లలు రాంబాబు, సుజాతలు మమ్మల్ని ఎంతో బాగా చూసుకున్నారు. మల్లయ్య, లక్ష్మీ ఉద్యోగాలకు వెళ్ళడం తప్పక పోవడంతో, వాళ్ళు చాలా బాధపడ్డారు. అత్త, రాంబాబు, సుజాతలతోనే మా కాలక్షేపం.

ఆ ఇంట్లో వారం రోజులు గడపగానే, అమ్మ ఉద్దేశ్యం మాకందరికీ అర్థమయింది. ఆ విషయం ముందుగా మా అబ్బాయే ప్రస్తావించాడు.

"నానమ్మ ఇంత తెలివైనదని నేనెప్పుడూ అనుకోలేదు. చూసి నేర్చుకోవాలని, అనుభవపూర్వకంగా కొన్ని విషయాలు తెలుసుకోవాలని, పరోక్షంగా ఎంత బాగా చెప్పింది! మీరు కూడా, అంతా గమనించే ఉంటారు. రాంబాబు సుజాతల దగ్గరినుంచి నేను, చెల్లి చాలా నేర్చుకోవాలి. వాళ్ళ తల్లిదండ్రులకు నిత్యం సహాయపడుతూ ఉంటారు. మాలాగ అన్నిటికీ మమ్మీ మీద ఆధారపడరు. చదువు సంధ్యల్లో కూడా మాకన్నా బెటర్‌గా ఉన్నారు. మాకు అన్ని సదుపాయాలు ఇచ్చినా మేము వాళ్ళని అందుకునే స్థితిలో లేము. ఇప్పుడయితే వాళ్ళు మంచి ఇంట్లో ఉంటున్నారుగానీ, ఇంతకుముందు ఇరుకుగా ఉండే పాత ఇంట్లో ఉండి, చాలా గొప్పగా చదివారని తెలుసుకున్న నేను చాలా సిగ్గుపడ్డాను. ఇంజినీరింగ్ చదివే స్తోమత లేకపోవడం వల్ల రాంబాబు బిఎస్సీయే చదివినా, యూనివర్సిటీ ర్యాంక్‌తో పాస్ అయి, గ్రూప్ 1 కి ప్రిపేర్ అవుతున్నాడు. ఇక సుజాతకి కూడా ఇంటర్లో మంచి మార్కులు వస్తున్నాయి. ఇప్పుడు వాళ్ళ ఆర్థిక పరిస్థితి మెరుగయింది కాబట్టి, సుజాతని మెడిసిన్ చదివించమని రాంబాబు పట్టుపడుతున్నాడు. అదే నేనయితే, నాకు దక్కనిదేదయినా చెల్లికి దక్కితే గొడవ చేసే వాడిని.

నానమ్మను మేమెప్పుడూ పట్టించుకునే వాళ్ళం కాదు. వాళ్ళు ఖాళీ దొరికితే చాలు, వాళ్ళ నానమ్మ చుట్టూనే తిరుగుతుంటారు. ఆవిడ చెప్పే కబుర్లు కొట్టిపారేయకుండా శ్రద్ధగా వింటారు. తమకు తెలిసిన విషయాలు చెపుతూ ఉంటారు" అని ఆగాడు. వెంటనే మేఘన అందుకుంది,

"నిజమే డాడీ. నేనూ గమనించాను చాలా విషయాలు. మనకందరికీ బ్రేక్‌ఫాస్ట్ రెడీ చేయడానికి, లంచ్‌కి ఏదయినా తయారుచేసి ఉద్యోగానికి వెళ్ళిపోవడానికి, ఆంటీ ఉదయాన్నే లేచి గాభరా పడుతుంటే, తనని ఎందుకు లేపలేదంటూ సుజాత చేసిన గొడవ చూస్తే, నాకు చాలా సిగ్గేసింది. నాకన్నా చిన్నది, అంత బాధ్యతగా తల్లికి సాయం చేయాలని ఆరాటపడుతుంటే, నేనెంత బాధ్యతారహితంగా ప్రవర్తించానోనని తలుచుకుంటేనే చాలా సిగ్గుగా ఉంది. ఇకపైన మమ్మీకి సాయం చేసినా, చేయకపోయినా, నా పక్కబట్టలు నేనే సర్దుకుంటాను. నా బట్టలు ఇస్త్రీ చేసుకోవడంతో సహా నా పనులన్నీ నేనే చేసుకుంటాను. మమ్మీని కష్టపెట్టను" అంటూ కన్నీళ్లు పెట్టుకుంటున్న మేఘనను దగ్గరకు తీసుకొని, తన తల నిమిరి, చెప్పడం మొదలుపెట్టింది శాలిని.

"ఇందులో నా తప్పు కూడా ఉంది. పిల్లల్ని బాగా గారాబం చేసి, వాళ్ళు అలా తయారు కావడానికి నేనే కారణం అయ్యాను. మరో విషయం లో కూడా, నేను సిగ్గు పడుతున్నాను" అని శాలిని అనగానే, అందరం ఆశ్చర్యంగా చూసాం. దానికి కారణం, మా కుటుంబంలో పెర్‌ఫెక్ట్ ఎవరంటే, మేము ముగ్గురం తన పేరే చెప్తాం. అందరం ఆమె ఏమి చెపుతుందా? అని ఆసక్తిగా ఎదురుచూసాం.

"నిన్ననే సుజాత, స్వంతంగా రాసిన ఇంగ్లీష్ వ్యాసం, పొయెట్రీ చదివాను. ఒక్క గ్రామరు మిస్టేక్ లేకుండా అంత అద్భుతంగా ఎలా రాసిందో నాకు అర్థం కాలేదు. 'ఇక్కడ అంత మంచి టీచర్లు ఉన్నారా?' అని అడిగితే, తనకు ఇంగ్లీష్ బోధించినది, వాళ్ళ అమ్మేనని, చిన్నప్పుడు వాళ్ళ అమ్మా నాన్నా ఇంటి దగ్గర చదువు చెప్పేవారని చెపితే, నేను ఏనాడూ ఆ శ్రద్ధ తీసుకోలేదని, పేరుకు మాత్రమే పెద్ద ప్రిన్సిపాల్‌ని అని, పెరటి చెట్టు ఇంటి వైద్యానికి పనికిరాకుండా పోయిందని సిగ్గుపడ్డాను" అనగానే నాక్కూడా బాణం తగిలినట్లు అయింది. నేను కూడా పిల్లలు ఎలా చదువుతున్నారని పట్టించుకోలేదు. ఇక నా వంతు వచ్చిందని భావించి,

"నేను కూడా నా తప్పులు తెలుసుకున్నానర్రా. ఈ వారం రోజులూ ఎక్కువగా మల్లయ్యనే గమనించాను. అతన్ని చూస్తే నిరంతరం శ్రమించే చీమ గుర్తొస్తుంది. అందరికన్నా ముందుగా లేచిపోతాడు. స్నానాలకోసం బాయిలర్ రెడీ చేస్తాడు. పశువులకు దాణా వేస్తాడు. మొక్కలకి నీళ్ళు పోస్తాడు. వద్దన్నా భార్యకు వంటలో సాయం చేస్తాడు. బయటనుంచి ఏవయినా పచారీ సామాన్లు తెస్తే, వాటిని సీసాల్లో వేసి, అల్మారాలో సర్దుతాడు. వాటర్ మెలన్, పైనాపిల్ లాంటి పళ్ళు తనే కోస్తాడు. మిక్సీ పట్టడం, తల్లికి మందులు వేయడం.... ఇలా చాలా పనులు చేస్తూ భార్యకి సాయపడతాడు. నేను ఏనాడూ, నిరంతరం కష్టపడుతున్న మీ మమ్మీ మీద జాలి పడడం తప్ప, నా వంతు సాయం ఏమి చేయాలా? అని ఆలోచించలేదు. మనమందరం మన తప్పులు తెలుసుకోవాలనే అమ్మ ఇలా కోరింది. 'తను ఎందుకిలాంటి కోరిక కోరింది?' అనే ఆలోచన మనందరిలోనూ ఉండడం వల్ల కాబోలు, మన తప్పులు మనం తొందరగా తెలుసుకున్నాం. ఏది ఏమయితేనేం అమ్మ కోరిక నెరవేరింది. మనం మంచి దారిలో పడ్డాం. అమ్మ ఏ లోకాన ఉన్నా ఆనందపడుతుంది" అంటూ దీర్ఘంగా నిట్టూరుస్తుంటే నా కళ్ళు చెమర్చాయి. అమ్మ గుర్తొచ్చి, కన్నీళ్లు పైకి ఉబికాయి. అది గమనించిన నా భార్యా, పిల్లలు నన్ను చుట్టేసారు ఆర్తిగా.

★★★★★

# సత్తెమ్మ చల్లకుండ

జాస్తి రమాదేవి

✆ 9391555364



**కథామంజరి నిర్వహించిన దీపావళి కథల పోటీ 2022 లో ప్రోత్సాహక బహుమతి లభించిన కథ**

***సత్తెమ్మ మజ్జిగ కోసం డబ్బులు అడగదు. చల్లకుండ ముందు ఓ డబ్బా పెడుతుంది. దేవుడి గుడిలో హుండీలా ... మన ఇష్టం. మీ దయ ఎంతుంటే అంత ఆ డబ్బాలో వేయమంటుంది. కొంతమంది సత్తెమ్మ చాలా తెలివైంది. రేటు చెప్పకుండా డబ్బాలో వేయమంటుంది. ఇదో రకం దోపిడీ అంటారు. ఏది ఏమైనా, ఎవరు ఏమన్నా సత్తెమ్మ తన అలవాటు మార్చుకోదు. మధ్యాహ్నానికి ఇంటికి వెళ్ళిపోతుంది.***

సత్తెమ్మ ఇంకా రాలేదేమిటి ?

కళ్ళు సిస్టం వైపు చూస్తున్నా, చేతివేళ్ళు మౌస్‌ని కదిలిస్తున్నా, అందరి ఆలోచనలు ఆఫీసు బైట చెట్టు కింద బల్ల మీదే ఉన్నాయి. ఉండబట్టలేక ఆఫీసు క్లర్క్ రామనాధం ఆత్రం కొద్దీ పైకే అనేసాడు.

“ఎప్పుడూ ఠంచనుగా తొమ్మిదిన్నరకల్లా వచ్చేసే సత్తెమ్మ ఈ రోజు ఇంకా రాలేదేమిటీ?!” అని.

ఉదయం తొమ్మిది ముప్పై నిముషాలకి సత్తెమ్మ చల్లకుండ నెత్తిమీద పెట్టుకుని వస్తుంది. మున్సిపల్ ఆఫీసు ముందున్న గానుగ చెట్టు కింద ఉన్న సిమెంటు బల్ల మీద, చుట్ట కుదురు పెట్టి, చల్లకుండ దానిమీద కుదురుగా కూర్చోబెడుతుంది. నాలుగు చిన్నచిన్న మట్టి పిడతలు శుభ్రంగా కడిగి వరుసగా పెడుతుంది. ఆ పక్కగా కొన్ని డిస్పోజబుల్ గ్లాసులు కట్టలా ఉంటాయి.

కుండకి శుభ్రమైన తెల్లని తడిగుడ్డ చుడుతుంది. కుండ అంచుకు పుదీనా దండ కడుతుంది. అది మంచి సువాసన వస్తుంటుంది. ఈగలు రాకుండా తగిన జాగ్రత్త తీసుకుంటుంది. కుండమీద మట్టి మూకుడు బోర్లిస్తుంది. పక్కనే మూత పెట్టిన గిన్నెలో పొడుగాటి గరిటె ఉంటుంది.

ఆ శుభ్రమైన చల్లని మజ్జిగ తాగడానికి అందరూ బాగా అలవాటు పడిపోయారు. వర్షాకాలంలో ఆఫీసు వరండాలో ఓ చివరగా పెట్టుకుంటుంది. అడిగినా అడగక పోయినా “అయ్యా ! సల్ల తాగండయ్యా” అంటూ వెంట పడుతుంది. తాగిన వాళ్ళు తాగుతారు. వద్దనుకుంటే తప్పించుకు పోతుంటారు.

సత్తెమ్మ మజ్జిగ భలే ఉంటుంది. కరివేపాకు, అల్లం, సొంటి పొడి, పుదీనా రెబ్బలు కలగలిసి ఓ గ్లాసు తాగిన వాళ్ళకు మరో గ్లాసు తాగాలన్న కోరిక పుడుతుంది.

సత్తెమ్మ మజ్జిగ కోసం డబ్బులు అడగదు. చల్లకుండ ముందు ఓ డబ్బా పెడుతుంది. దేవుడి గుడిలో హుండీలా ... మన ఇష్టం. మీ దయ ఎంతుంటే అంత ఆ డబ్బాలో వేయమంటుంది. కొంతమంది సత్తెమ్మ చాలా తెలివైంది. రేటు చెప్పకుండా డబ్బాలో వేయమంటుంది. ఇదో రకం దోపిడీ అంటారు. ఏది ఏమైనా, ఎవరు ఏమన్నా సత్తెమ్మ తన అలవాటు మార్చుకోదు. మధ్యాహ్నానికి ఇంటికి వెళ్ళిపోతుంది.

ఉదయం ఆఫీసుకు వస్తూ ఆదరా బాదరాగా కాస్త ఫలహారం పొట్టలో పడేసుకుని, ఆఘమేఘాల మీద ఆఫీసుకు పరుగులు పెట్టే తమకు సత్తెమ్మ మజ్జిగ తాగితే గాని, కడుపు చల్లబడదు.

ఎంత పని ఉన్నా సత్తెమ్మ టైముకి చల్లకుండ తో ప్రత్యక్షమవుతుంది. ఈ రోజు పదకొండు కావస్తున్నా ఆమె జాడ లేదు. ఏమై ఉంటుంది? అనే క్యూరియాసిటీ ఎక్కువైపోయింది.

ఒక వేళ సత్తెమ్మకి ఆరోగ్యం బాగోలేదా? ఈ మధ్యన రకరకాల వైరస్‌లు తెలియకుండానే చుట్టుకుంటున్నాయి. అలా సత్తెమ్మకి కూడా ... అతని ఆలోచన అతనికే నచ్చలేదు.

అతని దగ్గర సత్తెమ్మ ఫోన్ నెంబర్ ఉంది. ఫోన్ చేసి చూద్దాం అనుకుంటూ, నెంబర్ డయల్ చేసాడు సురేంద్ర. రింగవుతోంది కానీ ఫోన్ లిఫ్ట్ చెయ్యడం లేదు.

సాయంత్రం ఆఫీసునుండి ఇంటికి వెళుతూ మరోసారి ఫోన్ ట్రై చేసాడు. సత్తెమ్మ ఫోన్ రెస్పాన్స్ లేదు.

ఆ రాత్రి ఎందుకో పదే పదే సత్తెమ్మ గురించే ఆలోచించాడు. ఆ రాత్రి భార్య సుమిత్ర నసుగుతూ చెప్పింది. "సమీక్ష ఇంటికి వస్తానంటోందండీ" అని.


"అస్తమానూ ఇంటికి రావడం ఏంటసలు? బుద్ధిగా అక్కడే ఉండమను" అన్నాడు విసుగ్గా.

"అది కాదండీ ... పాపం అది ... చాలా ఇబ్బంది పడుతోందిట ... అల్లుడు ..." అంటూ ఏదో చెప్పబోయింది.

"నాకు నిద్ర వస్తోంది. నీకూ నీ కూతురికి ఏం పనిలేదు" అంటూ అటు తిరిగి పడుకున్నాడు సురేంద్ర.

★★★

మర్నాడు ఆఫీసుకు వెళ్ళి పనిలో పడ్డాడు సురేంద్ర. తొమ్మిదిన్నరకల్లా ఠంచనుగా సత్తెమ్మ చల్లకుండ తో ప్రత్యక్షమైంది. ఎప్పటిలాగే అన్నీ సర్దుకుంది. ఆమెను చూడగానే ప్రాణం లేచి వచ్చినట్టు, ఒకరి తర్వాత ఒకరు సత్తెమ్మ దగ్గరకు వెళ్ళి, మజ్జిగ తాగి వస్తున్నారు. సురేంద్ర ఖాళీ చేసుకుని సత్తెమ్మ దగ్గరకు వెళ్ళి మజ్జిగ గ్లాసు తీసుకుని, చెట్టుకు జారబడి, కొంచెం మజ్జిగ తాగి తృప్తిగా త్రేన్చాడు .



"ఏంటి సత్తెమ్మా! నిన్న రాలేదు. ఎన్ని సార్లు ఫోన్ చేసినా ఎత్తలేదు?" నిష్టూరంగా అడిగాడు .

"ఓ అదా బాబుగారూ! నిన్న సిన్న పనుండి రాలేదయ్యా!" అంది సత్తెమ్మ.

సత్తెమ్మ చెప్పడానికి ఇబ్బంది పడుతున్నట్టుగా అనిపించింది.

"పర్లేదు చెప్పు" అనడిగాడు.

"నా పెనిమిటిని చూడ్డానికి వెళ్ళానయ్యా" చెప్పింది.

"ఎక్కడుంటాడు అతను?" అడిగాడు సురేంద్ర.

"జైల్లో ఉంటాడు బాబూ ! " చాలా మామూలుగా చెప్పిందామె.

తుళ్ళిపడ్డాడు సురేంద్ర. తాగిన మజ్జిగ పైకి వచ్చేస్తున్నట్టు కడుపులో ఇబ్బందిగా అనిపించింది. ఈ విషయం ఇప్పటి వరకూ తెలీదు. సత్తెమ్మ ఎవరికీ చెప్పలేదు. అతను గబగబా ఇరవై రూపాయల కాగితం డబ్బాలో వేసి ఆఫీసులోకి నడిచాడు. తన సీట్లో కూర్చుని కర్చీప్‌తో ముఖం తుడుచుకున్నాడు.

పని చేస్తున్నా అతనిలో ఏదో భయం. ఇన్నాళ్ళూ తెలియని నిజం సత్తెమ్మ నోటివెంట వినగానే ఏదోలా ఉంది. ఏదో నేరం చేస్తేనే జైల్లో ఉండేది. ఎవరినైనా చంపేడేమో ? అలాంటి నేరస్తుడి భార్య సత్తెమ్మ నిన్న రాలేదని తెగ ఆలోచించేశాడు. ఫోన్లు చేసాడు. ఏమైంది ఏమైంది అని రాత్రంతా ఆలోచించాడు. ఈ విషయం ఎవరికైనా తెలుసో లేదో ?

సురేంద్ర ఇంటికి వెళ్ళేసరికి సుమిత్ర లేదు. పక్కింట్లో వాళ్ళు వచ్చి తాళాలు ఇచ్చారు. అతను లోపలికి వెళ్ళి ఫోన్ చేసాడు. " హలో ! ఎక్కడున్నావు?" విసుగ్గా అడిగాడు సురేంద్ర.

"సమీక్ష ఫోన్ చేస్తే వచ్చానండీ ...దానికి వొంట్లో బాగాలేదు. హాస్పిటల్‌కి తీసుకెళ్ళాను" అంటూ ఆమె ఏదో చెప్పబోతుంటే విసురుగా ఫోన్ పెట్టేసాడు.

సమీక్ష కు పెళ్ళి చేసి అత్తగారింటికి పంపినప్పటి నుండీ ఏదో గొడవ వినాల్సి వస్తోంది. వాళ్ళు అడిగినవన్నీ ఇచ్చాడు. అల్లుడు కిరణ్ తనకు ఎంతో మర్యాద ఇస్తాడు. మంచి సాఫ్ట్‌వేర్ కంపెనీలో జాబు. లక్షల్లో జీతం. డూప్లెక్స్ హౌస్. తిరగడానికి పడవలాంటి కారు. దేనికీ లోటు లేదు. పెళ్ళయ్యి నాలుగేళ్ళయ్యిందని, పిల్లలు అంటూ అత్తమామల కంప్లైంట్స్. కొన్నాళ్ళు ఎంజాయ్ చేస్తాము అంటాడు అల్లుడు. అత్తమామలు కింద, వీళ్ళు పైన వేరుగా ఉంటున్నారు. ఇంతకంటే అదృష్టం, ఇలాంటి అన్నీ అమరిన జీవితం ఎంత మందికి దక్కుతుంది. తన కూతురు ఎప్పుడూ అల్లుడి మీద కంప్లైంట్స్ చేస్తూనే ఉంటుంది. సుమిత్ర దానికి వత్తాసు పలుకుతుంది.

ఈ కాలం పిల్లలు నెయిల్‌పాలిష్ కొనివ్వకపోయినా భర్త పైన కంప్లైంట్స్ చేస్తుంటారు. వినీ విననట్టు ఒదిలెయ్యాలని సుమిత్ర కి ఎన్నిసార్లు చెప్పినా వినదు. అక్కడ తన కూతురు ఎన్నో కష్టాలు పడుతున్నట్టు రాత్రుళ్ళు నిద్రపోదు. ఒక్కోసారి ఏడుస్తూ ఉంటుంది.

ఫ్రిజ్‌లోంచి పాలు తీసుకుని కాఫీ చేసుకుని తాగాడు. తల భారంగా ఉంది. టేబ్లెట్ కోసం వెతుకుతుంటే, ఎవరో తలుపు చప్పుడు చేసినట్టు అనిపించింది. సురేంద్ర తలుపు తీసాడు. ఎదురుగా సత్తెమ్మ నిలబడి ఉంది. అతను లోపలికి ఓ అడుగేసాడు. ఇదివరకటిలా అనిపించలేదు సత్తెమ్మని చూస్తుంటే ... భయంగా ఏదో తెలియని అసహ్యంగా ఉంది.

"బాబుగారూ! మీరే నాకు సాయం సెయ్యాలి" గుమ్మం లోపలికి వచ్చి అడిగింది సత్తెమ్మ.

ఉలిక్కిపడ్డాడు. ఏం చెయ్యాలి ? డబ్బులు అడగడానికి వచ్చిందా ? ఆఫీసులో వాళ్ళు అన్నట్టు సత్తెమ్మ తమని దోచుకునే రకమేనేమో ?

“బాబుగారూ ! మీకు సాలా మంది లాయర్లు తెలుసుంటారు కదండీ ...కూసింత నా పెనిమిటిని బైటికి తీసుకొచ్చేందుకు సాయం సెయ్యండి బాబూ ! సచ్చి మీ కడుపున బుడతాను ...” అంటూ గబుక్కున సురేంద్ర కాళ్ళు తాకింది సత్తెమ్మ. అతను కాళ్ళు వెనక్కి లాక్కున్నాడు.

ఓ ఖూనీ కోరుని విడిపించడానికి సాయం చేయాలంట ...ఇంకా నయం చుట్టూ ఉన్నోళ్ళు, ఆఫీసులో వాళ్ళు తన గురించి ఎంత చెండాలంగా చెప్పుకుంటారు.

“బాబుగారూ! ఈ పైసలు సరిపోతాయాండి?” అంటూ బొడ్లో దోపుకున్న సంచిలోంచి రూపాయల నోట్లు, పైసలూ గుమ్మరించింది.

“నాకు ఏ లాయరూ తెలీదు సత్తెమ్మా! నేనీ ఊరొచ్చి మూడేళ్ళే కదా అయ్యింది. ఎవరినైనా తెల్సిన వాళ్ళనడుగు“ గబగబా అన్నాడు.

“సానా ఆసతో వచ్చాను బాబుగారూ!” దిగులుగా అంది సత్తెమ్మ.

ఆమె దిగులు చూస్తే జాలేసినా ఇంకా ఆమె అక్కడుండటం ఇబ్బందిగా ఉందతనికి. వెళ్ళమన్నట్టు చూసాడు. సత్తమ్మ పైసలు సంచిలో కుక్కుకుని నిరాశతో వెళ్ళిపోయింది. సత్తెమ్మ భర్త ఏం నేరం చేసాడో తెలుసుకోలేదు తను.

ఆ రాత్రి ఎందుకో పదేపదే సత్తెమ్మ గుర్తొచ్చింది. ఏదో నేరం ఆమే చేసినట్టు ఫీలవుతున్నాడు. కలత నిద్రతో తెల్లారింది.

మర్నాడు ఆఫీసులో పని చేసుకుంటున్నా అతని మనసు సత్తెమ్మ గురించే ఆలోచించింది. ఆఫ్ డే సెలవు పెట్టి సత్తెమ్మ ఇంటి అడ్రస్ వెతుక్కుంటూ వెళ్ళాడు. ఆ ఇంటి వాతావరణం చూడగానే అతనికి సత్తెమ్మ ఆర్థిక పరిస్థితి ఏంటో తెలిసింది.

ఆ సమయంలో సత్తెమ్మ కుమ్మరి కాము దగ్గర కూర్చుని, మట్టి ముద్దని ఏొడుపుగా కుండ ఆకారంలోకి తీసుకొచ్చి, జాగ్రత్తగా పక్కన పెడుతోంది. కుండ తీసిన తర్వాత రెండు చేతులతో కర్రని గబగబా గుండ్రంగా తిప్పుతూ కాము మీద మట్టిని ముద్దలా పెట్టి చేత్తో నీళ్ళు చల్లుతూ, ఒత్తి, నగిషీలు దిద్దుతోంది.

వాళ్ళది కుండలు చేసి జీవించే వృత్తి అని అర్థమయ్యింది సురేంద్ర కి. కుండలు చేసేవాడు ఎవర్నో చంపాల్సిన అవసరం ఉంటుందా ? ఆలోచిస్తున్నాడు. సత్తెమ్మ సురేంద్ర ని చూడగానే, మట్టి చేతులు కడుక్కుని వచ్చి, అక్కడున్న మంచం వాల్చి “కూర్చోండి బాబుగారూ!” అంటూ కంగారు పడిపోయింది.

ఎవర్నో పంపి కూల్ డ్రింక్ తెప్పించి ఇచ్చి మర్యాద చేసింది. తనొచ్చిన విషయం చెప్పాడు సురేంద్ర.

“పొట్ట గడవని పరిస్థితిలో కూడా పెల్లి బాగానే సేసేమయ్యా ! ఆడు కోరిన గొంతెమ్మ కోరికలన్నీ తీర్సేడు నా పెనిమిటి. ఇరవై ఏల్లు పేమగా పెంచుకున్న బిడ్డని కసాయోడి సేతికిచ్చేము. దీపాలామాసకి బిడ్డని పంపమంటే పంపనన్నాడు. నా పెనిమిటెల్లాడు. అప్పటికి ఆడు నా బిడ్డ పీక నొక్కుతున్నాడంట. ఓర్సుకోలేక కర్రతో ఆడి బుర్ర బద్దలేసేడు బాబూ! ఆడు సచ్చేడు. నా పెనిమిటి జైలు కెళ్ళేడు. బిడ్డని ఇంటికి తీసుకొచ్చేను. పేమగా పెంచుకునేది అల్లుడి సేతిలో సంపుకునేందుకా అయ్యా?” అడుగుతోంది సత్తెమ్మ.

సురేంద్ర మనస్సు తల్లడిల్లిపోయింది. చాలా రోజులుగా సమీక్ష తన భర్త ప్రవర్తన గురించి చెబుతోంది. తను నమ్మడం లేదని

తల్లితో చెప్పుకుంటోంది. తనని దాటి నిర్ణయం తీసుకోలేక సుమిత్ర కుమిలిపోతోంది. సమీక్ష తెలివి లేనిదీ, చదువు లేనిదీ కాదు. సమస్యను ఎందుకు చక్కదిద్దుకో లేకపోతోంది? ఇప్పుడు తనేం చేయాలి?

అతను ఇంటికొచ్చేడు. ప్రేమగా పెంచుకున్నది అల్లుడి సేతిలో సంపుకునేందుకా? ఆలోచిస్తున్నాడు. కూతురు ఇది వరకు పెట్టిన మెసేజ్‌లు గుర్తొచ్చాయి. నాన్నా ! నిన్ను అమ్మనీ చూడకుండానే చచ్చిపోతానేమోనని భయంగా ఉంది. నన్ను తీసుకెళ్ళు నాన్నా! అతనో శాడిస్టు. నన్ను చంపేస్తాడు." అంటూ చాలా సార్లు వీడియోలు పంపేది .

తనెప్పుడూ అవి పట్టించుకోలేదు. తను అల్లుడు చెప్పేది నమ్మేడు గానీ, కూతురు చెప్పేది ఎందుకో నమ్మలేకపోయాడు. కూతురు వచ్చేస్తే లోకం ఏమంటుందోనని భయపడ్డాడా తను ? సత్తెమ్మ, సత్తెమ్మ భర్త చదువుకోలేదు. అయినా కూతురు బతికుంటే చాలనుకున్నారు.

★★★

లాయర్ నోటీసులు చూడగానే కిరణ్, అతని ఫేమ్లీ కంగారు పడ్డారు. మావగారి కాళ్ళు పట్టుకున్నాడు కిరణ్. మళ్ళీ ఇలా జరగదని చెప్పాడు. సురేంద్ర కూతుర్ని ఇంటికి తీసుకొచ్చేడు. మనసుమీద పడ్డ ఎన్నో గాయాల గురించి సమీక్ష చెబుతుంటే మొదటిసారిగా కూతుర్ని కౌగిలించుకుని ఏడ్చాడు.

సత్తెమ్మ భర్తకి బెయిల్ వచ్చింది. ఆ కేసు కూడా సురేంద్ర తన లాయర్‌కి అప్పగించేడు.

కుండలు ఈ రోజుల్లో ఎవరూ కొనడం లేదని కుమ్మరి సత్తెమ్మ చల్లకుండని నమ్ముకుంది. ఆదివారం సంతల్లో కుండలన్నీ మోసుకెళ్ళి అమ్మినకాడికి అమ్మి, మిగిలినవి మళ్ళీ ఇంటికి మోసుకొస్తున్నారు ముగ్గురూ ... సోమవారం యథాప్రకారం సత్తెమ్మ చల్లకుండతో మున్సిపల్ ఆఫీసు ముందు ప్రత్యక్షమవుతుంది.

సమీక్ష వదిలేసిన జాబ్ కోసం మళ్ళీ ప్రయత్నం మొదలు పెట్టింది.

★★★★★

ఈ పత్రిక నిర్వహణకు ప్రతి నెలా ఒకరు ఆర్థికంగా సహాయపడుతున్నారు. ఆసక్తితో పాటు అవకాశం ఉన్నవారిని కథామంజరి కథాయజ్ఞంలో పాలుపంచుకోవలసినదిగా సవినయంగా కోరుతున్నాం. వివరాల కోసం సంప్రదించండి.


అవసరాల వెంకటరావు
*9989976688*

జయంతి ప్రకాశ శర్మ
*9848629151*


*

సద్విమర్శ ఒక రచన ఆరోగ్యాన్ని పరిరక్షించే ఔషధం. కథకులకి మార్గదర్శి వంటిది.
కథామంజరి కథల పైన మీ అభిప్రాయాలను, విశ్లేషణలను, విమర్శలను ఆహ్వానిస్తున్నాం.

మీ అభిప్రాయాలను పంపవలసిన చిరునామా
*submit@kathamanjari.in*

మంచి రచనలతో కూడిన సంచికను రూపొందించే కార్యక్రమానికి చేయూతనివ్వండి.

*

కథామంజరి పాఠకులను పెంచండి. కథామంజరిని కథాభిమానులకు చేరువ చేయండి.
వారి ఇమెయిల్ లను నమోదు చేసుకొనడానికి..
*www.kathamanjari.in*

*

కొత్త, పాత రచయితలు, రచయిత్రుల నుండి కథలను ఆహ్వానిస్తున్నాం.
మీ రచనలను పంపవలసిన చిరునామా
*submit@kathamanjari.in*